సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 106

సోమవారం 7-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



బర్మింగ్‌హామ్‌లో జైహింద్

రెండో టెస్టులో ఇంగ్లండ్‌పై 336 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం -14లో



బ్యాంక్ లాకర్.. ఎంత భద్రం?

బ్యాంక్‌లపై బాధ్యత పరిమితమే. నష్టపోతే వచ్చే పరిహారం కొంతే -15లో



ఘనంగా జన్మదిన వేడుకలు

14వ దలైలామా టెంజిన్ గ్యాట్సో 90వ పుట్టినరోజు వేడుకలు హిమాచల్‌ప్రదేశ్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి.

వివరాలు 6లో ▸



'గ్లోబల్ సౌత్'కు అన్యాయం

దక్షిణార్ధ గోళ దేశాలు కీలక నిర్ణయాలు, ప్రయోజనాల విషయంలో బాధిత దేశాలుగా మిగిలిపోతున్నాయని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



చైనాలో అధికార వికేంద్రీకరణ!

12 ఏళ్లుగా ఇనుప పిడికిలితో చైనాను పాలిస్తున్న అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నెమ్మదిగా అధికారాన్ని బదలాయిస్తున్నారు.

వివరాలు 6లో ▸



హ్యాండ్‌బ్యాగ్ @ రూ.35 లక్షలు

ప్రఖ్యాత ఫ్రాన్స్ లగ్జరీ బ్రాండ్ లూయిస్ విటన్ సంస్థ రూపొందించిన ఈ ఆటోరిక్షా హ్యాండ్‌బ్యాగ్ ఖరీదు రూ. 35లక్షలు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

కన్నెపల్లి మోటార్లు తక్షణమే ఆన్ చేయాలి



రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షాల వల్ల గోదావరి, కృష్ణా నదులకు మే నెలలోనే వచ్చిన వరదలు వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

- వివరాలు 3లో▶

నిరంతరం కుట్రలు.. అబద్ధాలు



'రాష్ట్రంలో రైతులను మోసం చేయాలని, ఆందోళనకు గురి చేయాలని బీఆర్‌ఎస్ నిరంతరం కుట్రలకు పాల్పడుతోంది. గోబెల్స్‌కు మించి అబద్ధాలను ప్రచారం చేయటం హరీశ్‌కు అలవాటైపోయింది' అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు.

- వివరాలు 3లో▶

జిల్లా స్థాయిలోనే 'సరుకుల' టెండర్లు

గురుకుల విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీల్లో అవసరమైన సరుకుల కొనుగోలుకు సెంట్రలైజ్డ్ టెండర్ల ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. ఇకపై విద్యా సంస్థల్లో సరుకుల కొనుగోలుకు ఒకే నిబంధన పాటించాలని నిర్ణయించింది.

- వివరాలు 3లో▶

మొలుగుమాడు.. భూముల రీసర్వే చూడు

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని గ్రామంలో పైలట్ సర్వే పూర్తి

- గ్రామానికి సరిహద్దులు, వాగులు, డొంకలు ఖరారు
- ప్రభుత్వ, పట్టా భూముల వివరాలు పక్కాగా నిర్ధారణ
- ఎట్టకేలకు 'నక్షా'.. టిప్పన్లు తయారు చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం
- ప్రభుత్వ ఆమోదం లభిస్తే గ్రామ పటం ఇక అధికారికం
- దాదాపు నెల రోజుల పాటు శ్రమించిన రెవెన్యూ, సర్వే ఏజెన్సీ సిబ్బంది
- గ్రామస్తుల సహకారంతో విజయవంతమైన రీసర్వే



మొలుగుమాడులో భూముల సర్వే కోసం ఉపయోగించిన డ్రోన్‌తో సిబ్బంది

సాక్షి, హైదరాబాద్

ఖమ్మం-కృష్ణా జిల్లాల సరిహద్దు మండలమైన ఎర్రుపాలెం పరిధిలో ఉండే వ్యవసాయాధారిత గ్రామం మొలుగుమాడు. గతంలో ఇది ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉండేది. నిజాం కాలంలో తెలంగాణలో భాగమైంది. అయినా ఆ గ్రామానికి ఇప్పటివరకు నక్షా (గ్రామ పటం) లేదు. రెవెన్యూ రికార్డులు మాత్రం ఉన్నాయి. ఆ రికార్డుల మేరకు రైతులు ఎవరి భూమి వారు సాగు చేసుకుంటున్నారు. ఈ గ్రామంలోని రైతులందరికీ రైతు భరోసా కూడా వస్తోంది. కానీ గ్రామ పటం లేని కారణంగా అసలు గ్రామ సరిహద్దులేవో తేల్చలేని పరిస్థితి. వాగులు, వంకలు ఎక్కడెక్కడున్నాయో కాగితాల మీద చూపించలేని పరిస్థితి. ఇలాంటి గ్రామాలు తెలంగాణలో 413 ఉన్నాయని తేల్చిన ప్రభుత్వం.. పైలట్‌గా ఆ గ్రామంతో పాటు ఐదు గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టింది. మొలుగుమాడుకు సంబంధించిన 843 ఎకరాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసింది. రీ సర్వే అనంతరం మొలుగుమాడు గ్రామంలోని భూములపై స్పష్టత వచ్చింది. ఆ గ్రామ సరిహద్దులు తేలాయి. అసలు ఆ గ్రామంలో ఉన్న భూముల విస్తీర్ణం ఎంత? ఎంత మంది రైతులు సాగు చేసుకుంటున్నారు? ప్రభుత్వ భూమి ఎంత ఉంది? చెరువులు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి? వాగులు ఎంత మేరకు ఉన్నాయి? భూముల సాగుకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నాయి? రోడ్లు ఎక్కడ ఉన్నాయి? శ్మశానాల సంగతేంటి? ఎన్ని సర్వే నంబర్లలో భూమి ఉంది? ఆ సర్వే నంబర్లను ఎన్ని సబ్ డివిజన్లు చేశారు? అనే వివరాలన్నీ స్పష్టంగా తెలిసిపోయాయి. దీంతో గ్రామానికి

మిగతా 2వ పేజీలో ▶

సర్కారు ఇప్పుడొద్దన్నవారికీ ఇందిరమ్మ ఇళ్లు!

తొలి విడత అర్హుల జాబితాలో మూడో విడత అర్హుల పేర్లు

- వీరికి ఇప్పటికిప్పుడు ఇళ్ల అవసరం లేదని తేల్చిన సర్కారు
- 12 వేల మందికి నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మంజూరు
- బిల్లులు చెల్లించే సమయంలో గుర్తించిన సాఫ్ట్‌వేర్.. ఆ 12 వేల మంది అర్హతలపై రీసర్వేకు ఏర్పాట్లు
- వారు కూడా అర్హులేనని సర్దుబాటు చేసే ప్రయత్నాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తక్షణం ఇల్లు అవసరం ఉన్నవాళ్లను పక్కనబెట్టి.. వారికంటే మెరుగైన స్థితిలో ఉన్న వాళ్లకు ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటికిప్పుడు వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాల్సిన అవసరం లేదని స్వయంగా ప్రభుత్వమే గుర్తించి వారి దరఖాస్తులు పక్కన పెట్టినా.. అధికారులు మాత్రం అలాంటి దాదాపు 12 వేల మందికి ఇళ్లు మంజూరు చేశారు. బిల్లులు చెల్లించే సమయంలో ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు.. దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్లకోసం అందిన దరఖాస్తులను ప్రభుత్వం ఎల్1, ఎల్2, ఎల్3 అని మూడు విభాగాలు చేసింది. ఇందులో ఎల్3 జాబితాలోని దరఖాస్తుదారులు ఇప్పటికిప్పుడు ఇందిరమ్మ ఇల్లు పొందేందుకు అర్హులు కాదని తేల్చింది. ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా ఎల్3 జాబితాలోని దాదాపు 12 వేల మంది ఇంటి మంజూరీ పత్రాలు పుచ్చుకుని ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టేశారు.

స్పష్టమైన విభజన..

ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దాదాపు 82 లక్షల దరఖాస్తులు అందాయి. కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పూర్తిగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన విధివిధానాలకు తగ్గట్టుగానే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అర్హతలో ఏమాత్రం అనుమానమున్నా వాటిని పక్కన పెట్టాలని అధికారులకు

మిగతా 12వ పేజీలో ▶



నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- పలువురు కేంద్ర మంత్రులను కలిసి ప్రాజెక్టులకు నిధులు కోరే అవకాశం
- వీలైతే పార్టీ పెద్దలనూ కలిసే చాన్స్.. రేపు రాత్రికి తిరిగి హైదరాబాద్‌కు రాక

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఉదయం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత ఆయన ఢిల్లీ వెళ్తారని సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకోసం పలువురు కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లను సీఎంవో కోరింది. ఈ పర్యటనలో భాగంగా పలు రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధించి నిధులు మంజూరు

మిగతా 3వ పేజీలో ▶

నేటి భవితలో..

ఇంజనీరింగ్ బ్రాంచ్ ఎంపికలో.. విద్యార్థి ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలి

- అన్ని బ్రాంచ్‌లు ముఖ్యమైనవే
- కాలేజీ ఎంపిక అత్యంత కీలకం
- సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి.నరసింహులుతో ప్రత్యేక ఇంటర్వ్యూ

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ (ఈఏపీసెట్) ప్రక్రియ ప్రారంభమైంది. బ్రాంచ్, కాలేజ్ ఎంపికపై విద్యార్థులకు అనేక సందేహాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ఎలాంటి బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాలి, కాలేజీ ఎంపికలో పరిగణనలోకి తీసుకోవాల్సిన ప్రామాణికాలు, భవిష్యత్ అవకాశాలు తదితర అంశాలపై సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి.నరసింహులుతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ.. నేటి భవితలో..



ఇది వరంగల్ స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా రూ. 250 కోట్లతో అమ్మవారిపేటలో చేపట్టిన మానవ వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ). పనులు చివరి దశకు చేరుకున్నాయని అధికారులు చెబుతున్నా చాలా వరకు సివిల్, ప్లాంట్ పనులు ఏళ్ల తరబడి ఇలా పెండింగ్‌లోనే దర్శనమిస్తున్నాయి.

స్మార్ట్‌గా సాగట్లేదు!

నత్తనడకన స్మార్ట్‌సిటీ, అమృత్ పనులు

- మార్చి 31తో ముగిసిన 'స్మార్ట్' గడువు.. ఇంకా కొనసాగుతున్న నిర్మాణాలు
- అమృత్ 2.0 కింద పనుల్లో మరింత ఆలస్యం
- రూ. కోట్లు ఖర్చు చేసినా వినియోగంలోకి రాని పథకాలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో స్మార్ట్‌సిటీస్ మిషన్ (ఎస్‌సీఎం), అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకాల కింద కొన్నేళ్ల కిందట మొదలైన అభివృద్ధి పనులు నేటికీ నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యంగా పదేళ్ల కిందట ప్రకటించిన స్మార్ట్‌సిటీ మిషన్ పథకం గడువు ఈ ఏడాది మార్చి 31నే పూర్తయినా పనులు మాత్రం ఇంకా పూర్తికాలేదు. అలాగే వచ్చే ఏడాది మార్చిలో రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో 'అమృత్'పనులను ముగించాల్సి ఉన్నా ఇంకా తుదిదశకు చేరుకోలేదు. పలు ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణలో సమస్యలు తలెత్తడం, నిధుల విడుదలలో జాప్యం వల్ల పనులు గడువులోగా పూర్తికాలేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మౌలిక వసతులు కరువై పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

స్మార్ట్ కింద రెండు.. అమృత్ కింద 31 పట్టణాలు

దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్రం స్మార్ట్ సిటీ మిషన్ పథకం కింద 100 నగరాలను ఎంపిక చేసింది. అలాగే 500 పట్టణాలు/నగరాలను అమృత్ పథకం కింద గుర్తించింది. పట్టణ ప్రాంతాల్లో రవాణా, నీటి సరఫరా, విద్యుత్, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, రోడ్లు, డిజిటల్ సేవల మెరుగు, స్మార్ట్ టెక్నాలజీ తదితర 16 అంశాలను లక్ష్యంగా పెట్టుకుంది. నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, డిజిటల్ సేవల మెరుగు, స్మార్ట్ టెక్నాలజీకి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. స్మార్ట్‌సిటీ మిషన్ కింద తెలంగాణలో గ్రేటర్ వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్లను ఎంపిక

మిగతా 12వ పేజీలో ▶

కొలిక్కిరాని పాలిసెట్



కొనసాగుతున్న డేటా రికవరీ ప్రయత్నాలు

- రికవరీ అయినా స్క్రీన్‌పై మాయమవుతున్న డేటా
- ఒక్కసారిగా అటాక్ చేసిన బగ్స్
- పెన్ డ్రైవ్ పెట్టారా? డేటాను బదిలీ చేశారా?
- సమాచార సేకరణలో నిఘా వర్గాలు
- రంగంలోకి ఐటీ నిపుణులు..
- మరో వారం దాకా సీట్ల కేటాయింపు కష్టమే

సాక్షి, హైదరాబాద్: పాలిసెట్ గందరగోళం ఇంకా కొనసాగుతోంది. వెబ్‌సైట్ నుంచి తుడిచిపెట్టుకుపోయిన డేటాను రికవరీ చేసేందుకు సాంకేతిక విద్యా విభాగం అష్టకష్టాలు పడుతోంది. ఏం జరుగుతోందనేది మాత్రం బయటకు పొక్కనివ్వడం లేదు. సీట్ల కేటాయింపు ఇప్పట్లో ఉండే అవకాశం లేదని అధికారులు పరోక్షంగా చెబుతున్నారు. వచ్చేవారం దీనిపై స్పష్టత రావచ్చని సంకేతాలిస్తున్నారు. ఈ గందరగోళంపై విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకునేందుకు ఆదివారం కొంతమంది విద్యార్థులు పాలిసెట్ క్యాంపు కార్యాలయానికి వెళ్లే ప్రయత్నం చేశారు. అనుమతి లేకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు. మరోవైపు ముఖ్యమంత్రి కార్యాలయం

మిగతా 16వ పేజీలో ▶

ఎట్టకేలకు ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లకు మోక్షం

- సీట్లు, కాలేజీలు, బ్రాంచీల వివరాలు విడుదల
- కన్వీనర్ కోటా సీట్లు 76,795.. కొత్త సీట్లకు నో
- కౌన్సెలింగ్ పరిధిలోకి 171 కాలేజీలు

16లో

ఇదండీ.. సంగతి



అలాగే, తనకు నోబెల్ వచ్చేటట్లు అర్జంటుగా ఏదైనా ఒక చట్టం చేయమంటున్నారు!!



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్‌ను సత్కరిస్తున్న హైకోర్టు ఏసీజే సుజోయ్‌పాల్. చిత్రంలో జస్టిస్ శామ్‌కోషి

పరిహారం దాతృత్వం కాదు.. బాధ్యత

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్
- పునరావాసాన్ని ఆర్థిక లావాదేవీగా చూడొద్దు
- డిజిటల్ దుష్ప్రభావాలపై కఠిన చట్టాలు రావాలి
- సమాజంలోనూ మార్పు అవసరమన్న న్యాయమూర్తి
- 'వాయిస్ ఫర్ వాయిస్ లెస్' కార్యక్రమంలో ప్రసంగం
- పాల్గొన్న ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, న్యాయమూర్తులు

2లో

మంటల ముప్పులో 2.6 లక్షల కుటుంబాలు

అగ్నిప్రమాదాల బారినపడే అవకాశం ఆ ఫ్యామిలీలకు అత్యధికం

వెరీ హై రిస్క్ జోన్‌లో 35, హై రిస్క్‌లో 38 ప్రాంతాలు

హైదరాబాద్‌లోని పరిస్థితులపై ముగ్గురు ప్రొఫెసర్ల సర్వేలో వెల్లడి

ఏషియన్ జర్నల్ ఆఫ్ జియోగ్రాఫికల్ రీసెర్చ్‌లో ప్రచురితం



సాక్షి, హైదరాబాద్: గుల్జార్‌హౌస్ వద్ద ఓ ఇంట్లో ఈ ఏడాది మే 18న చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఒకే కుటుంబానికి చెందిన 17 మందిని పొట్టనపెట్టుకుంది. ఈ దుర్ఘటన షార్ట్ సర్క్యూట్ కారణంగా చోటుచేసుకోగా... మంటలు విస్తరించడానికి ఆ ఇంటి ఆవరణలో జరుగుతున్న వాణిజ్య వ్యవహారాలే కారణమయ్యాయి. ఈ ఒక్క కుటుంబమే కాదు.. హైదరాబాద్‌లోని 2.6 లక్షల కుటుంబాలు, అందులోని 13 లక్షల మంది కుటుంబీకులు అగ్నిప్రమాదాల కోణంలో వెరీ హైరిస్క్ జోన్‌లో ఉన్నట్లు ముగ్గురు ప్రొఫెసర్లు చేపట్టిన అధ్యయనం స్పష్టం చేస్తోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీ, నిజాం కాలేజీ, భోపాల్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియోగ్రఫీ ప్రొఫెసర్లు వీణ రాపర్తి, కె.వెంకటేశ్, దుర్గేశ్ కుర్మి 'హాట్ స్పాట్ అనాలసిస్ ఆఫ్ స్ట్రక్చర్ ఫైర్స్ ఇన్ అర్బన్ అగ్లోమరేషన్: ఎ కేస్ స్టడీ ఆఫ్ హైదరాబాద్ సిటీ' పేరుతో సాగిన ఈ అధ్యయనం ఇటీవల ఏషియన్ జర్నల్ ఆఫ్ జియోగ్రాఫికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైంది.

సెంట్రల్ జోన్‌లోనే 64.86 శాతం...

భాగ్యనగరంలో నానాటికీ జనసాంద్రత పెరిగిపోవడంతోపాటు

మిగతా 3వ పేజీలో ▶

10,500కు పైగా ఖాళీలు



విమానయాన సంస్థల్లో సిబ్బంది కొరత!

డీజీసీఏ, బీసీఏఎస్, ఏఏఐలో పెద్దఎత్తున ఖాళీలు

సిబ్బంది కొరతను గుర్తించిన పార్లమెంటరీ కమిటీ

నియామకాలు, ఆర్థిక దిద్దుబాట్లు చేపట్టాలని సూచన

ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం భారతీయులను ఉలిక్కిపడేలా చేసింది. 275 మంది ప్రాణాలను బలి తీసుకున్న ఘోర దుర్ఘటన ఇది. ఈ నేపథ్యంలో మనదేశంలో విమానయాన నిబంధనలు, భద్రతపై అందరూ చర్చించుకుంటున్నారు. విమానయానంతో ముడిపడి ఉన్న ప్రభుత్వ కీలక సంస్థల పనితీరుపైనా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషాదానికి మూడు నెలల ముందు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వంటి విమానయాన సంస్థలలో దీర్ఘకాలంగా సిబ్బంది కొరత ఉందని ఇటీవల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక వెల్లడించింది. అత్యంత కీలక విభాగాలైన ఈ మూడు సంస్థల్లో 2025 మార్చి నాటికి 10,500లకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ).. ప్రధానంగా భద్రతా సమస్యలను పర్యవేక్షిస్తుంది. దేశీయంగా, అలాగే భారత్‌కు రాకపోకలు సాగించే విమాన రవాణా సేవలను నియంత్రించడం, పౌర విమానయాన నిబంధనలు, ప్రమాణాల అమలుకు ఇది బాధ్యత వహిస్తుంది. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థతో (ఐసీఏఓ) అన్ని నియంత్రణ విధులను సమన్వయం చేస్తుంది. ఇలాంటి డీజీసీఏలో ఖాళీల సంఖ్య 2021తో పోలిస్తే రెట్టింపు అయింది. 2021-25 మధ్య డీజీసీఏకు మంజూరైన ఉద్యోగుల సంఖ్య 1,233 నుంచి 1,692కి పెరిగింది. అయినప్పటికీ 2025 మార్చి నాటికి కేవలం 878 మాత్రమే భర్తీ అయ్యాయి. విమానాశ్రయ భద్రతకు బాధ్యత వహించే బీసీఏఎస్‌కు 598 మంది సిబ్బందిని మంజూరు చేయగా అది 374 మంది సిబ్బందితో నెట్టుకొస్తోంది. ఏఏఐలోనూ మంజూరైన 25,730 పోస్టుల్లో 9,500కుపైగా ఖాళీలు ఉన్నాయి.

'ప్రమాణాలకు దెబ్బ'

దీర్ఘకాలిక సిబ్బంది కొరత.. విమానయాన రంగంలో నియంత్రణ పరంగా పర్యవేక్షణ, ప్రయాణికుల భద్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పార్లమెంటరీ కమిటీ హెచ్చరించింది. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో ఈ సంస్థలలో దీర్ఘకాలిక సిబ్బంది కొరత భద్రత, సేవా ప్రమాణాలను దెబ్బతీస్తుందని పేర్కొంది. డీజీసీఏ రెండేళ్లలో 49 మందిని మాత్రమే కొత్తగా చేర్చుకుంది. బీసీఏఎస్ గత ఏడాది 139, ప్రస్తుత సంవత్సరం కేవలం ఐదు పోస్టులను మాత్రమే భర్తీ చేసింది. 2022లో 952 మందిని నియమించుకున్న ఏఏఐ.. ఈ ఏడాది 15 మందికే ఉద్యోగావకాశాలు కల్పించింది.

కాంట్రాక్ట్ పద్ధతిలో..

సిబ్బంది కొరతను అధిగమించడానికి ఏఏఐ 1,098 మంది ఎగ్జిక్యూటివ్ స్థాయి సిబ్బందిని నియమించాలని యోచిస్తోంది. 2025 ఆగస్టు-నవంబర్ మధ్య మూడు దశల్లో నియామకాలు చేపట్టనుంది. సాధారణ నియామకాలలో జాప్యాలను నివారించడానికి డీజీసీఏ, బీసీఏఎస్ కాంట్రాక్టు నియామకాలకు నడుం బిగించాయి. ఈ ఏడాది డీజీసీఏ 107 మంది కన్సల్టెంట్లు, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్లను నియమించుకుంది. అలాగే బీసీఏఎస్ 14 మంది కన్సల్టెంట్లను చేర్చుకుంది.

తగ్గిన నిధులు..

దేశంలో విమానయాన నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తున్న సమయంలో ఈ రంగంలో మూలధన వ్యయం కూడా తగ్గుతోంది. పౌర విమానయానానికి మూలధన వ్యయం 2023-24లో రూ.755.18 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.70 కోట్లకు పరిమితమైంది. ఇందులో డీజీసీఏకు రూ.30 కోట్లు, బీసీఏఎస్ రూ.15 కోట్లు, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోకు (ఏఏఐబీ) రూ.20 కోట్లు మాత్రమే కేటాయించారు. ఉడాన్ వంటి పథకాల కింద మౌలిక సదుపాయాలు పెరుగుతున్నప్పటికీ.. ప్రమాద దర్యాప్తు, విమానయాన భద్రతకు నిధులు తక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశం.

'ఉడాన్'కు తగ్గట్టుగా..

సామాన్యులకూ విమానయానం అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో 2016లో ఉడాన్ పథకానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మారుమూల ప్రాంతాలను పెద్ద నగరాలతో అనుసంధానించడం ద్వారా విమాన ప్రయాణాన్ని సరసమైనదిగా, విస్తృతంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం 619 మార్గాల్లో విమాన రాకపోకలు సాగుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరగడం, చిన్న నగరాలకూ ఈ రంగం విస్తరిస్తున్నందున అత్యవసర సిబ్బంది నియామకాల వంటివి చేపట్టాలని పార్లమెంటరీ కమిటీ ప్రభుత్వానికి సూచించింది.

ఉద్యోగుల కేటాయింపు | నియామకాలు | ఖాళీలు

(1) డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)

సంవత్సరం	ఉద్యోగుల కేటాయింపు	నియామకాలు	ఖాళీలు
2025 (మార్చి నాటికి)	1,692	878	814
2024	1,692	881	811
2023	1,667	832	835
2022	1,251	820	431

(2) బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ

సంవత్సరం	ఉద్యోగుల కేటాయింపు	నియామకాలు	ఖాళీలు
2025 (మార్చి నాటికి)	598	374	224
2024	598	411	187
2023	596	384	212
2022	595	394	202

(3) ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

సంవత్సరం	ఉద్యోగుల కేటాయింపు	నియామకాలు	ఖాళీలు
2025 (మార్చి నాటికి)	25,730	16,228	9,502
2024	24,882	16,078	8,804
2023	25,118	16,061	9,057
2022	27,495	16,186	11,309

బీసీఏఎస్: దేశంలోని విమానాశ్రయాలలో పౌర విమానాల భద్రత ప్రమాణాలు, చర్యలను నిర్దేశించడం దీని ప్రధాన బాధ్యత. భద్రతా నియమాలు, నిబంధనల అమలును పర్యవేక్షించడం, భద్రతా అవసరాలపై సర్వే నిర్వహించడం; భద్రతా నియంత్రణలను అమలు చేసే వ్యక్తులు తగిన శిక్షణ పొందారని, విధులను నిర్వర్తించడానికి అవసరమైన అన్ని సామర్థ్యాలను కలిగి ఉన్నారని నిర్ధారించుకోవడం; విమానయాన భద్రతా విషయాల ప్రణాళిక, సమన్వయం; భద్రతా సిబ్బంది వృత్తిపరమైన సామర్థ్యం, అప్రమత్తతను పరీక్షించడానికి ఆకస్మిక తనిఖీలు, మాక్ డ్రిల్స్ నిర్వహిస్తుంది.

ఏఏఐ: దేశంలోని మొత్తం విమానాశ్రయాల నిర్వహణ ఇదే చూస్తుంది. ఎయిర్‌పోర్టుల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా టెర్మినల్, కార్గో సౌకర్యాల సమగ్ర అభివృద్ధి, విస్తరణ, ఆధునీకరణ పనులను చేపడుతుంది. ఐసీఏఓ ఆమోదించిన విధంగా దేశ ప్రాదేశిక పరిమితులకు మించి విస్తరించి ఉన్న భారత వైమానిక ప్రాంతం నియంత్రణ, నిర్వహణ బాధ్యతలూ ఈ సంస్థవే.

క్లుప్తంగా...

హైదరాబాద్‌లో నకిలీ డాక్టర్లు

తనిఖీల్లో గుర్తించిన టీజీఎంసీ

సాక్షి, హైదరాబాద్: అర్హత లేకుండా వైద్యం చేస్తున్న 8 మంది నకిలీ డాక్టర్లను గుర్తించినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ నగరంలోని బౌరంపేట్, దుండిగల్, సూరారం ప్రాంతాల్లో నకిలీ డాక్టర్లు యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి అధిక స్థాయి మందులను రోగులకిచ్చి హాని కలిగిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు టీజీఎంసీ వైస్ చైర్మన్ డా.జి.శ్రీనివాస్, సభ్యుడు డా.విష్ణు బృందాలు దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో ఆరెంజ్ క్లినిక్ (ఎస్‌కే నాగులమీరా), బీఎల్ఆర్ క్లినిక్ (పి.సూర్యలత), నాని మినీ హాస్పిటల్ (కె.వెంకటేశ్), శ్రీ సాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ (వై.సూర్యనారాయణ), శ్రీ శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్ (శివశంకర్), బాలాజీ క్లినిక్ (విట్టల్), నందీశ్వర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ (శంకర్ గౌడ్), మస్తాన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ (ఎస్‌కే.మస్తాన్) లలో అర్హత లేకపోయినా రోగులకు చికిత్సలు చేస్తున్నట్లు గుర్తించారు. నిందితులపై కేసులు నమోదు చేయనున్నట్లు డాక్టర్ జి. శ్రీనివాస్ తెలిపారు. నకిలీ వైద్యుల సమాచారం తెలిస్తే వాట్సాప్ నంబర్ 91543 82727 ద్వారా తెలియచేయాలని ఆయన ప్రజలను కోరారు.

మహేశ్‌బాబుకు వినియోగదారుల కమిషన్ నోటీసులు



సిటీ కోర్టులు: ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా, ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న సినీ నటుడు మహేశ్‌బాబును 3వ ప్రతివాదిగా పేర్కొంటూ నమోదైన కేసులో రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. కేసులో మొత్తం ముగ్గురు ప్రతివాదులకు నోటీసులిచ్చిన కమిషన్.. ప్రతివాదుల హాజరు కోసం విచారణను సోమవారానికి వాయిదా వేసింది. సాయి సూర్య డెవలపర్స్ బాలాపూర్ గ్రామంలో లేఅవుట్ వేశామని చెప్పడంతో ఆకర్షితులైన ఓ మహిళా డాక్టర్, మరో వ్యక్తి చెరో ప్లాటు కొనడానికి రూ. 34.80 లక్షలు చెల్లించారు. అయితే ప్రతిపాదిత ప్రాంతంలో లేఅవుట్ లేదని తెలుసుకొని డబ్బు తిరిగివ్వాలని అడగ్గా సంస్థ యజమాని కంచర్ల సతీశ్‌చంద్ర గుప్తా రూ. 15 లక్షలే చెల్లించారు. బాధితులు వేసిన కేసులో సంస్థతోపాటు దాని యజమాని, ప్రచారకర్తగా ఉన్న మహేశ్ బాబును ప్రతివాదులుగా పేర్కొన్నారు.

పరిహారం దాతృత్వం కాదు.. బాధ్యత

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్

- పునరావాసాన్ని ఆర్థిక లావాదేవీగా చూడొద్దు
- డిజిటల్ దుష్ప్రభావాలపై కఠిన చట్టాలు రావాలి
- 'వాయిస్ ఫర్ వాయిస్ లెస్' కార్యక్రమంలో ప్రసంగం
- కార్యక్రమంలో పాల్గొన్న ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, న్యాయమూర్తులు



హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: లైంగిక బాధితులైన చిన్నారులకు అందించే పరిహారం దాతృత్వం కాదని.. అది బాధ్యతని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ దుష్ప్రభావాలను ఎదుర్కొనేందుకు బలమైన చట్టాలు రూపొందించాలన్నారు. ఆన్‌లైన్ గ్రూమింగ్, సైబర్ బెదిరింపులు, లైంగిక వేధింపులు సవాళ్లు విసురుతున్నాయని.. వాటిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీర్ఘకాలిక సంరక్షణ అందించే కుటుంబ, సమాజ మద్దతు వ్యవస్థలను నిర్మించాలని సూచించారు. పోలీసులు, ప్రాసిక్యూటర్లు, వైద్యులు, మనస్తత్వవేత్తలు, న్యాయాధికారులు.. సానుభూతి, సున్నితత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. బలహీనులు, అవసరమైన వారికి రక్షణగా నిలిచి.. ప్రతి చిన్నారికి జవాబుదారీగా ఉండాలని కోరారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'అలహాబాద్ హైకోర్టులో జువెనైల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఐదేళ్లు పనిచేసిన సమయంలో చిన్నారుల ఇబ్బందులు తెలుసుకొనే అవకాశం లభించింది. బాధిత చిన్నారులకు న్యాయం, పునరావాసం అందించాలి. పోక్సో చట్టం, పిల్లల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలి. ముందుగా సమస్య సంక్లిష్టతను గుర్తించాలి. లైంగిక వేధింపులకు గురైన బాలలు తక్షణం వారికి జరిగిన గాయం నుంచి మాత్రమే బాధపడరు. వారిని రక్షించడానికి ఉద్దేశించిన వ్యవస్థలతో తరచుగా తిరిగి గాయపడుతుంటారు. అటువంటి పిల్లలకు న్యాయం అంటే నిందితులకు శిక్ష మాత్రమే కాదు.. బాధితులకు శారీరక, మానసిక వైద్యంతోపాటు భవిష్యత్‌పై ఆశను పునరుద్ధరించాలి'అని జస్టిస్ విక్రమ్‌నాథ్ చెప్పారు.

పోక్సో ఓ మైలురాయి..

'లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో-2012) తీసుకురావడం ఓ మైలురాయి. ఇది పిల్లల హక్కులను నివేదిస్తుంది. సాక్ష్యాల నమోదు, దర్యాప్తు, విచారణ కోసం బాధితులకు స్నేహపూర్వక విధానాన్ని కల్పిస్తుంది. అయితే చట్టాలు ఎంత మంచి ఉద్దేశంతో ఉన్నా వాటి అమలు తీరు కూడా పగడ్బందీగా ఉండాలి. మానసిక మద్దతు, ఉచిత న్యాయం, పునరావాసం, పునరేకీకరణకు కొత్త పథకాలు కొనసాగించాలి. తెలంగాణలో భరోసా కేంద్రాల ఏర్పాటు అభినందనీయం. పోలీసులు, వైద్య నిపుణులు, న్యాయ సాయం, మానసిక ఆరోగ్య నిపుణులను ఒకేచోట అందించడంలో వాటి పాత్ర ప్రశంసనీయం. భరోసా కేంద్రంలోకి అడుగుపెట్టే బాధిత చిన్నారికి పోలీస్‌స్టేషన్‌లోకో లేక ఆస్పత్రిలోకో అడుగుపెట్టిన భావన కలగదు. భద్రత, వైద్య సాయం కోసం వచ్చామన్న ఉద్దేశంతో ఉంటారు. ఇలాంటి కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పోలీసులు, న్యాయాధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, జువెనైల్ జస్టిస్ బోర్డులు, వైద్య సిబ్బంది, బాలల మనస్తత్వవేత్తలు, ఎన్జీవోలు అంతా కలసి పనిచేయాలి. ఈ ప్రయత్నంలో విధాన సంస్కరణలు అవసరం'అని జస్టిస్ విక్రమ్‌నాథ్ పేర్కొన్నారు.

లోటుపాట్లను అధిగమించాలి..

'పోక్సో కేసుల విచారణలో జాప్యం, పథకాల అమల్లో ఆలస్యం, సిబ్బంది లేమి లాంటి లోటుపాట్లను అధిగమించాలి. చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టుల ఆవశ్యకతను సుప్రీంకోర్టు పలుమార్లు నొక్కిచెప్పింది. తాజా గణాంకాలను పరిశీలిస్తే కేసుల పెండింగ్‌తోపాటు దోషుల నిర్ధారణ రేటు ఆందోళన కలిగిస్తోంది. చట్టాలు ఎన్ని ఉన్నాయనేది కాదు.. వాటిని ఎంత సమర్థంగా అమలు చేస్తున్నామనేది ముఖ్యం. కోర్టుల్లో చిన్నారులకు మౌలిక సదుపాయాలున్నాయా? న్యాయసాయానికి న్యాయవాదులు సిద్ధంగా ఉన్నారా అన్నది సమీక్షించుకోవాలి. చట్టాన్ని మించిన బాధ్యత న్యాయమూర్తులపైనా ఉంది. ప్రతి కేసును సానుభూతితో పరిష్కరించాలి. విచారణను ఇన్ కెమెరా (ఎవరూ లేకుండా)లో నిర్వహించాలి. ప్రశ్నలను జాగ్రత్తగా అడగాలి. చిన్నారి మనల్ని విశ్వసించేలా చూడాలి. బాధిత చిన్నారుల సంరక్షణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ పాత్ర కీలకం. నల్సా, రాష్ట్ర పథకాలు బాధితులకు సత్వరం అందేలా చూడాలి'అని వివరించారు. ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శామ్‌కోషి, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది నియామకానికి ప్రత్యేక రోస్టర్

- ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక రోస్టర్ అమలు
- నలుగురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, హెల్పర్ల నియామకానికి ప్రత్యేక రోస్టర్ తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మైదాన ప్రాంతాల్లో సాధారణ రోస్టర్ అమలు చేసినప్పటికీ.. ఏజెన్సీ ప్రాంతాల్లో మాత్రం ప్రత్యేక రోస్టర్‌ను అమలు చేయనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు, ఆదివాసీలకు ఎక్కువ అవకాశాలు కల్పించే దిశగా.. ఈ రోస్టర్ పాయింట్లు కూర్పు చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకురాలు జి.సృజన.. ప్రత్యేకంగా నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు జీకే సునందతో పాటు హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి జయంతి, ఉట్నూరు సీడీపీవో మిల్కా, డైరెక్టరేట్‌లోని సూపరింటెండెంట్ ఎం.శేషపద్మ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపై ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. అనంతరం నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. రాష్ట్రంలో 14వేల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మొలుగుమాడు..
భూముల రీసర్వే చూడు



రైతుల సమక్షంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

▶ మొదటి పేజీ తరువాయి

నక్షా వస్తోంది. టిప్పన్లు (రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి స్కెచ్) వస్తున్నాయి. దీంతో ఇదంతా ఎలా సాధ్యమయ్యింది? అసలు రీసర్వే ఎలా జరిగింది? అనేది ఆసక్తి రేకెత్తిస్తోంది.

గ్రామస్తులకు ముందుగానే అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే కోసం మొలుగుమాడు గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసిన తర్వాత ఆ గ్రామస్తులకు ఈ ప్రక్రియపై ముందుగా అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఐఐసీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఏజెన్సీ సర్వే నిర్వహించింది. ఎర్రుపాలెం తహసీల్దార్ ఎం.ఉషా శారదతో పాటు మధిర, ఎర్రుపాలెం సర్వేయర్లు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, ఆరుగురు సర్వే ఏజెన్సీ సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి భూముల రీసర్వే నిర్వహించారు. మరో ఆరుగురు డ్రోన్ సిబ్బంది వీరికి సహకరించారు. ఈ ఏడాది మే 26వ తేదీన సర్వే ప్రారంభం కాగా జూన్ 21వ తేదీతో పూర్తయింది. రోజుకు 60-80 సర్వే నంబర్ల చొప్పున విభజించుకుని సర్వే చేశారు.

ఉత్తర దిక్కు నుంచే మొదలు..

ఉత్తరం దిక్కు నుంచి సర్వే ప్రారంభించారు. అంతకుముందు గ్రామాల సరిహద్దులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఉత్తరం దిక్కునే పురాతన సరిహద్దు రాయిని గుర్తించి అక్కడి నుంచి రీసర్వే ప్రారంభించారు. గ్రామంలో ఒకటో సర్వే నంబర్ కూడా ఉత్తరం దిక్కు నుంచే ప్రారంభమవుతోంది. అయితే ఎక్కడ సర్వే చేసినా ఉత్తరం దిక్కునే ప్రారంభిస్తారని, గడియారం ముల్లు తరహాలో ఉత్తరం నుంచి తూర్పు, దక్షిణం, పడమర దిక్కుల్లో సర్వే చేస్తారని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి. ఫలానా రోజు ఫలానా సర్వే నంబర్లలో రీ సర్వే ఉంటుందని ముందుగానే చాటింపు వేయడం వల్ల..సర్వే సమయంలో రైతులు తమ భూముల్లో సిద్ధంగా ఉండేవారు. వారి భూమి ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉందో చూపించేవారు. ఈ క్రమంలో ఆ భూ కమతాన్ని గ్రౌండ్ ట్రూతింగ్ చేసిన సిబ్బంది.. డీజీపీఎస్ విధానంలో విస్తీర్ణాన్ని నిర్ధారించి సరిహద్దులు ఫిక్స్ చేశారు. దీన్ని రికార్డులో నమోదు చేశారు. వివరాలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపారు. ఈ గ్రామంలో భూముల విషయంలో పెద్దగా వివాదాలు లేకపోవడంతో పోలీసుల అవసరం రాలేదు.

6 ఎకరాలు ఎక్కువ..!

ఈ గ్రామంలో భూములకు సంబంధించిన వివాదాలు పెద్దగా రాలేదు కానీ, రీ సర్వే అనంతరం భూముల లెక్క మాత్రం తేడా వచ్చింది. గతంలో ఉన్న రికార్డుల ప్రకారం అక్కడ 845.32 ఎకరాల భూమి ఉంది. కానీ రీ సర్వే తర్వాత ఆ గ్రామంలో మొత్తం భూమి విస్తీర్ణం 852.10 ఎకరాలుగా తేలినట్లు తెలిసింది. అంటే 6 ఎకరాల 18 గుంటల భూమి ఎక్కువ ఉందన్నమాట. అయితే వ్యవసాయ భూముల విషయంలో ఎలాంటి తేడాలు రాలేదని, ప్రభుత్వ భూములు, చెరువులు, వాగులకు సంబంధించిన విస్తీర్ణం ఎక్కువ వచ్చి ఉండవచ్చని చెబుతున్నారు.

వెలుగులోకి సమస్యలు

- సర్వే నంబర్లకు సంబంధించిన సబ్ డివిజన్లు ఎక్కువగా ఉండడంతో కొన్నిచోట్ల రైతు ఎక్కడ కబ్జాలో ఉన్నాడో అర్థం కాలేదు. ముఖ్యంగా తెలుగులో 'రు', 'ఎ', ఇంగ్లిషులో 'ఆర్', 'ఈ' అని సబ్ డివిజన్లు ఉన్నచోట్ల ఈ సమస్య కనిపించింది.
- వారసత్వంగా వచ్చే భూముల విషయంలో భాగస్వామ్య పంపకాలు పూర్తయిన తర్వాత కూడా పాత పట్టాదారు (తండ్రి లేదా తల్లి) పేరిట భూములకు పాసు పుస్తకాలు వచ్చాయి.
- ఒక రైతు పేరిట 66 గజాల భూమి కూడా రికార్డయి పాసుపుస్తకం ఉంది. ఇది రైతుబంధు కోసం జరిగి ఉంటుందని రెవెన్యూ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.
- ఆన్‌లైన్ పహాణీలు కొన్నిచోట్ల సరిపోలలేదు. ఈ గ్రామంలోని 74వ సర్వే నంబర్‌లో భూమి రికార్డు ఒకరి పేరిట ఉంటే ఆ భూమి సాగు (కబ్జా)లో మరో ముగ్గురు రైతులున్నారు. సర్వేలో ఆ భూమి ముగ్గురు రైతులదేనని తేలింది. దీంతో ఇప్పుడు రికార్డుల్లో ఆ ముగ్గురి పేర్లు నమోదు చేసే అవకాశం లభించింది.
- మరో రైతు భూమి 62, 63 సర్వే నంబర్లలో ఉంటే పహాణీలో 36 సర్వే నంబర్‌లో వచ్చింది. మరో రైతు భూమి 17వ సర్వే నంబర్‌లో ఉండాల్సి ఉండగా, ఆన్‌లైన్ రికార్డులో మాత్రం 49 సర్వే నంబర్ నమోదైంది.

తేలని డొంక సమస్య

ఈ గ్రామం,, సఖినవీడు గ్రామంతో కలిసే చోట రైతుల పొలాలకు వెళ్లేందుకు పూర్వం డొంక ఉండేదని గ్రామస్తులు చెపుతున్నారు. ఈ డొంకకు ఎదురుగా రోడ్డు అవతల 30 అడుగుల డొంక ఉంది. కానీ, రోడ్డు ఇవతలి వైపు లేకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది. దీంతో డొంక ఆవలి భూములను సాగు చేయలేని పరిస్థితి ఉంది. రీసర్వేలో భాగంగా ఈ డొంక సమస్యను తేల్చాలని, నక్షాలో చేర్చాలని గ్రామస్తులు కోరినా ఫలితం లేకుండా పోయింది. ఈ డొంక మార్గంలో సమాధులు ఉండడం, అందులోనే అసైన్డ్ భూమి ఉండడంతో డొంకను అధికారికంగా చూపెట్టలేమని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ సమస్యను తేల్చిన తర్వాతే నక్షా తయారు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్వే సారాంశం ఇదీ..

పట్టా ఉండి భూముల్లో కబ్జా ఉన్న రైతుల సంఖ్య:	ఆ భూమి విస్తీర్ణం:	ఎలాంటి టైటిల్ లేకుండానే సాగు చేసుకుంటున్న రైతులు:	ఆ భూమి విస్తీర్ణం:	టైటిల్ ఉండి వాస్తవంగా భూమి లేని రైతులు:	ఆ భూమి విస్తీర్ణం:
1023	668.0226 ఎకరాలు	62	34.3964 ఎకరాలు	13	3.0139 ఎకరాలు

ఆన్‌లైన్‌లో ఎంట్రీ కాని రైతుల సంఖ్య: 54 | ఆ భూమి విస్తీర్ణం: 26.316 ఎకరాలు

గ్రామ సరిహద్దులివీ..

- **ఉత్తరం:** ఇనగాలి గ్రామం (ఈ వైపున 21 సర్వే నంబర్లు ఉన్నాయి)
- **దక్షిణం:** సఖినవీడు గ్రామం (ఈ దిక్కున 24 సర్వే నంబర్లు ఉన్నాయి)
- **తూర్పు:** ఏరు (కట్లేరు)
- **పశ్చిమం:** మాటూరు గ్రామం (ఇటు వైపు 10 సర్వే నంబర్లు ఉన్నాయి)



భూముల రకం, విస్తీర్ణం..

- ప్రభుత్వ భూమి 78.3359 ఎకరాలు
- ఇనాం భూమి 16.2039 ఎకరాలు
- గ్రామ కంఠం 49.38 ఎకరాలు
- చెరువు 25.2960 ఎకరాలు
- పట్టా భూమి 683.06 ఎకరాలు

సహకరించిన అందరికీ ధన్యవాదాలు



రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా భూముల సమస్యలు పరిష్కరిస్తున్నాం. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని మొలుగుమాడు గ్రామంలో నక్షా లేదని తెలిసి పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశాం. అందరి సహకారంతో ఇక్కడ రీసర్వే పూర్తయిందనే సమాచారం వచ్చింది. రైతులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు.

- పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

ఆ తృప్తి ఎప్పటికీ ఉంటుంది



రీసర్వేకు మొలుగుమాడు గ్రామ రైతాంగం బాగా సహకరించింది. 843 ఎకరాల్లో భూములు సర్వే చేయడమంటే మాటలు కాదు. రెవెన్యూ సిబ్బందితో పాటు సర్వే ఏజెన్సీ కూడా బాగా పనిచేసింది. నా హయాంలో ఓ గ్రామానికి రెవెన్యూ పటం తయారు చేశానని, నక్షా ఇవ్వగలిగాననే తృప్తి ఎప్పటికీ మిగిలిపోతుంది.

- మన్నె ఉషాశారద, ఎర్రుపాలెం మండల తహసీల్దార్

మంచి అవకాశం.. వినియోగించుకున్నాం



మా గ్రామానికి నక్షా లేని కారణంగా అసలు డొంకలెక్కడున్నాయో, రోడ్లు ఏవో అర్థమయ్యేది కాదు. గతంలో ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గతంలో చేసిన పాదయాత్ర సందర్భంగా వినతిపత్రం ఇచ్చాం. ఆయన మా గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టులో చేర్చారు. ఆ అవకాశాన్ని మేం వినియోగించుకున్నాం.

-గంటా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, మొలుగుమాడు

ప్రతి రైతు నుంచి సంతకాలు తీసుకున్నాం



భూముల రీసర్వే కోసం నిబద్ధతతో పనిచేశాం. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి రైతు నుంచి సంతకాలు తీసుకున్నాం. ఎవరి పేరు మీద భూమి ఉంటే వారు వస్తేనే సర్వే చేశాం. ఎవరైనా కుటుంబ సభ్యులు వస్తే చేయలేదు.

- రాజశేఖర్, గ్రామ సర్వేయర్

క్లుప్తంగా...

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మార్గంలోనే మోదీ ప్రభుత్వం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ.. కశ్మీర్ సమస్యపై దీటుగా పోరాడారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వ పాలన సాగుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదని పోరాడిన నేతగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని.. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను ఎందుకు కలిశారో కేటీఆర్ చెప్పాలి

- టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ నేత నారా లోకేశ్‌తో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రహస్య మంతనాల వెనుక మతలబు ఏంటో చెప్పాలని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఓవైపు తెలంగాణ ప్రయోజనాల కోసం బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేస్తుంటే, ఆ రాష్ట్రానికి చెందిన అధికార పార్టీ నాయకుడితో కలిసి కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారని నిలదీశారు. ఒక్కసారి కాదని, పలుమార్లు లోకేశ్‌ను కలిశారన్న సమాచారం తన వద్ద ఉందని, ఒకవేళ తాను లోకేశ్‌ను కలవలేదని కేటీఆర్ చెపితే ఏం జరిగిందనే విషయాలను తాను బయటపెడతానని చెప్పారు. ప్రజాపాలనపై చర్చించేందుకు కేటీఆర్‌తో చర్చలకు సీఎం రేవంత్‌రెడ్డి రావాల్సిన అవసరం లేదని, సోమవారం అమరవీరుల స్తూపం దగ్గరికి వస్తే తానే మాట్లాడతానని అన్నారు.

ముక్కునేలకు రాశాకే.. రైల్‌రోకో చేయండి

- ఎమ్మెల్సీ కవితకు ఈరవత్రి సూచన

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల అధికారాన్ని అనుభవించిన కాలంలో ఒక్కరోజు కూడా బీసీల గురించి ఆలోచన చేయలేని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత.. ఇప్పుడు బీసీలను ఉద్ధరిస్తానంటూ బయలుదేరుతున్నారని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఎద్దేవా చేశారు. ముందు ఆమె ముక్కు నేలకు రాసి బీసీలకు బేషరతుగా క్షమాపణలు చెప్పిన తర్వాతే బీసీ బిల్లు కోసం రైల్‌రోకో చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కవిత ఎంపీగా ఉన్నప్పుడే, బీఆర్‌ఎస్ హయాంలోనే స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించారని, అప్పుడు కవిత చిత్తశుద్ధి ఏమైందని ప్రశ్నించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

▶ మొదటి పేజీ తరువాయి

చేయాలని కేంద్ర మంత్రులను సీఎం కలిసి కోరుతారని.. వీలునుబట్టి పార్టీ పెద్దలను కూడా కలిసే అవకాశముందని తెలుస్తోంది. తిరిగి ఆయన మంగళవారం రాత్రికి హైదరాబాద్‌కు చేరుకుంటారని సమాచారం.

సీఎంతో 45 నిమిషాలపాటు మంత్రి సురేఖ భేటీ

అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం సీఎం రేవంత్‌ను కలిశారు. తన కుమార్తె సుస్మితా పటేల్‌తో కలిసి జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఆమె.. రేవంత్‌తో దాదాపు 45 నిమిషాలపాటు సమావేశమయ్యారని సమాచారం. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా రాజకీయాలు, పార్టీ నేతల వ్యవహార శైలి, తమపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి సీఎంతో చర్చించారు. అలాగే తన కుమార్తె రాజకీయ భవిష్యత్తు గురించి కూడా సీఎంతో మంత్రి మాట్లాడారని తెలియవచ్చింది.

మనదేశంలో ఎన్నో రకాల పండ్లు అందుబాటులో ఉన్నా 'పొరుగింటి పుల్లకూర రుచి' అన్నట్టు మన వాళ్లకు పరదేశి పండ్లపై మోజు పెరుగుతోంది. ఒకప్పుడు భారీ మాల్స్, సూపర్ మార్కెట్లకే పరిమితమైన విదేశీ పండ్లు ఇప్పుడు రోడ్ల వెంబడి దుకాణాలనూ ఆక్రమించాయి. దేశీయ పండ్లతో పోలిస్తే వీటి ధరలు కాస్త ఎక్కువే అయినా.. పోషకాలు అధికంగా ఉంటాయన్న ప్రచారం వినియోగదారులను ఆకర్షిస్తోంది. ఫలితంగా వీటి అమ్మకాలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి.



కారణాలివీ..

ఒకే రకం పండ్లు విదేశాల్లో ఏడాది పొడవునా లభ్యమవుతున్నాయి. మన దేశంలో వివిధ పండ్లు ఆయా సీజన్లలో మాత్రమే పండుతాయి. విదేశీ పండ్లు ఆఫ్ సీజన్‌లో సైతం లభ్యం కావడం, నాణ్యతకు ఢోకా లేకపోవడం, పోషక విలువలు ఎక్కువగా, రసాయన అవశేషాలు తక్కువగా ఉండడం వంటి కారణాల వల్ల వాటిపై ఇక్కడి ప్రజలు మోజు పడుతున్నారు. విదేశీ పండ్లు వివిధ రంగుల్లో ఆకర్షణీయమైన ఆకృతుల్లో లభించడంతో పాటు రుచిలో వైవిధ్యంగా ఉండటం కూడా వాటిని మనవాళ్లు ఇష్టపడటానికి మరో కారణం. అంతేకాకుండా విదేశీ పండ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండడం వల్ల వీటిని దిగుమతి చేసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.

విదేశీ పండ్లపై పెరుగుతున్న మక్కువ

పండ్ల దిగుమతులు ఏటా పైపైకి..

2019-20లో రూ.14,137 కోట్ల విలువైన పండ్ల దిగుమతి

2024-25లో రూ.25,770 కోట్లకు చేరిన దిగుమతులు

2030 నాటికి రూ.50 వేల కోట్లు దాటుతుందని అంచనా

సాక్షి, అమరావతి: కరోనా తర్వాత పండ్ల వినియోగం పెరగ్గా.. విదేశీ పండ్లకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా కేవలం ఆరేళ్లలో దిగుమతుల విలువ 82 శాతం పెరిగింది. 1970 దశకంలోనే విదేశీ పండ్ల దిగుమతులు ప్రారంభమయ్యాయి. అప్పట్లో యాపిల్స్, ఖర్జూర మాత్రమే విదేశాల నుంచి అతికొద్ది పరిమాణంలో దిగుమతి అయ్యేవి. స్వేచ్ఛా వాణిజ్యం అమలులోకి వచ్చాక 1991 నుంచి విదేశీ వస్తువులతోపాటు విదేశీ పండ్ల దిగుమతులు పెరిగాయి. అప్పట్లో మెట్రో నగరాల్లో హై ఎండ్ సూపర్ మార్కెట్లలో మాత్రమే విదేశీ పండ్లు విక్రయించేవారు. 2015 తర్వాత నగరాలు, పట్టణ ప్రజల జీవన శైలిలో స్పష్టమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 2019లో ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి పుణ్యమాని ఆరోగ్య అలవాట్లలో మార్పులు వచ్చి పండ్ల ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ పెరిగింది. ఈ కారణంగా దేశీయంగా లభించే పండ్లతోపాటు విదేశీ పండ్ల వినియోగం పెరిగింది. ఫలితంగా విదేశీ పండ్ల దిగుమతుల విలువ రూ.వందల కోట్ల నుంచి రూ.వేల కోట్లకు చేరింది.

ఎంపెడా లెక్కల ప్రకారం విదేశాల నుంచి పండ్ల దిగుమతులు ఇలా..

సంవత్సరం	దిగుమతి విలువ (రూ.కోట్లలో)	దిగుమతి పరిమాణం (రూ.లక్షల టన్నుల్లో)
2019-20	14,137	5.0
2020-21	15,765	5.5
2021-22	18,342	6.1
2022-23	19,958	6.6
2023-24	22,664	7.5
2024-25	25,770	8.5

వివిధ దేశాల నుంచి.. వేర్వేరు పండ్లు

కశ్మీర్ యాపిల్‌కు అమెరికా, న్యూజిలాండ్, చిలీ, ఇరాన్ దేశాల నుంచి దిగుమతి చేసుకునే యాపిల్ పోటీగా నిలుస్తోంది. న్యూజిలాండ్, ఇరాన్, ఇటలీ నుంచి కివీ పండ్లు, చిలీ, దక్షిణాఫ్రికా నుంచి ద్రాక్ష, చైనా, అమెరికా, బెల్జియం నుంచి పియర్స్, యూఏఈ, ఇరాన్, సౌదీ అరేబియా నుంచి ఖర్జూర, వియత్నాం, థాయ్‌లాండ్ నుంచి డ్రాగన్ ఫ్రూట్స్, యూరప్, అమెరికా దేశాల నుంచి బ్లూబెర్రీ, స్ట్రాబెర్రీ, రాస్‌బెర్రీ పండ్లను, న్యూజిలాండ్, కెన్యా, పెరూ, ఇండోనేషియా నుంచి అవకాడో, దక్షిణాఫ్రికా, ఇజ్రాయెల్, ఇటలీ దేశాల నుంచి బత్తాయి, ఆరెంజ్, ద్రాక్ష వంటి సిట్రస్ ఫ్రూట్స్‌ను దిగుమతి చేసుకుంటున్నారు.



ఆరేళ్లలో 82 శాతం పెరుగుదల

వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (అపెడా) లెక్కల ప్రకారం జాతీయ స్థాయిలో తొలిసారి వాణిజ్యపరంగా 1991లో కేవలం రూ.120 కోట్ల విలువైన 40 వేల టన్నుల విదేశీ పండ్లను దిగుమతి చేసుకున్నారు. 2000–01 నాటికి రూ.480 కోట్ల విలువైన 1.20 లక్షల టన్నుల పండ్లు దిగుమతి చేసుకోగా.. 2010–11లో రూ.2,800 కోట్ల విలువైన 2.5 లక్షల టన్నుల పండ్లు దిగుమతి అయ్యాయి. 2015–16లో రూ.7,300 కోట్ల విలువైన 3.8 లక్షల టన్నుల పండ్లు దిగుమతి చేసుకున్నారు. 2019 తర్వాత విదేశీ పండ్ల దిగుమతులు అనూహ్యంగా పెరిగాయి. 2019–20లో రూ.14,137 కోట్ల విలువైన 5 లక్షల టన్నుల విదేశీ పండ్లను దిగుమతి చేసుకోగా.. 2024–25లో పండ్ల దిగుమతుల విలువ రూ.25,770 కోట్ల చేరింది. దిగుమతుల పరిమాణం 8.50 లక్షల టన్నులకు పెరిగింది. విలువపరంగా చూస్తే 82 శాతం పెరిగితే పరిమాణం పరంగా 65 శాతం పెరిగింది. 2030 నాటికి వీటి మార్కెట్ విలువ రూ.50 వేల కోట్లు దాటుతుందని అంచనా వేస్తున్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పండ్లన్నీ దశాబ్ద కాలంగా దేశీయంగా ఉత్పత్తి అవుతున్నా దిగుమతులు తగ్గడం లేదు.

జిల్లాస్థాయిలోనే 'సరుకుల' టెండర్లు

- డీపీసీల ఆధ్వర్యంలో ఎంపిక
- సెంట్రలైజ్డ్ టెండర్ల ఆలోచన విరమించుకున్న ప్రభుత్వం
- గురుకులాలు, అంగన్వాడీల్లో సరుకుల కొనుగోలుకు ఏకరూప నిబంధనలు
- ఆగస్టు మొదటి వారంకల్లా టెండర్లు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీల్లో అవసరమైన సరుకుల కొనుగోలుకు సెంట్రలైజ్డ్ టెండర్ల ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకుంది. రాష్ట్రస్థాయి, జోనల్ స్థాయిలో టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్లను ఎంపిక చేసేందుకు రూపొందించిన టెండర్ విధానాన్ని ఇటీవల రద్దు చేసిన ప్రభుత్వం.. ఇకపై జిల్లా స్థాయిలోనే టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఇకపై ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఏదైనా ఒక రకమైన సరుకులు కొనుగోలు చేసేందుకు ఒకే నిబంధన పాటించాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఆమేరకు ఏకరూప నిబంధనలు రూపొందించింది. ఈ నేపథ్యంలో సరుకుల కొనుగోలుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఆగస్టు మొదటివారం నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

డీపీసీల ఆధ్వర్యంలోనే..

జిల్లా స్థాయిలో సరుకుల కొనుగోలుకు ప్రభుత్వం డీపీసీ (డిస్ట్రిక్ట్ పర్చేజ్ కమిటీ)లను ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో వైస్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సభ్యులుగా జిల్లా విద్యాశాఖ అధికారి, అన్ని సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, అన్ని గురుకుల సొసైటీల జిల్లా కోఆర్డినేటర్లు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి, డైరెక్టరేట్ ఆఫ్ మార్కెటింగ్ అండ్ ఇన్‌స్పెక్షన్స్(అగ్‌మార్క్)తో పాటు జిల్లా కలెక్టర్ నామినేట్ చేసిన అధికారి ఉంటారు. ఈ కమిటీ ద్వారానే కొనుగోలు ప్రక్రియకు సంబంధించి టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్ల ఎంపికను పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఒకటి, రెండు రోజుల్లో కోడిగుడ్ల టెండర్లు

ప్రభుత్వ విద్యా సంస్థలకు కోడిగుడ్ల సరఫరాకు సంబంధించిన టెండర్ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లా స్థాయిలో డీపీసీలు ఈ టెండర్లను తక్షణమే పిలవాలని ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆగస్టు మొదటివారంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. మధ్యాహ్న భోజన పథకం మినహా, మిగిలిన కేటగిరీలన్నింటికీ ఒకటే టెండర్ ఉండాలని సూచించింది. దీంతో జిల్లా కలెక్టర్లు ఒకట్రెండు రోజుల్లో టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూల్స్‌తో పాటు ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలకు కోడిగుడ్లను జిల్లా స్థాయిలో ఒక కాంట్రాక్టరే సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆగస్టు మొదటివారం కల్లా ఈ టెండర్లు ఖరారు అవుతాయని చెపుతున్నారు.

మంటల ముప్పులో 2.6 లక్షల కుటుంబాలు

▶ మొదటి పేజీ తరువాయి


నివాస ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు కలిసిపోవడం కూడా అగ్నిప్రమాదాల ముప్పు పెరగడానికి ప్రధాన కారణమని ఈ అధ్యయనం తేల్చింది. ఒకప్పుడు హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ నివాస, వాణిజ్య ప్రాంతాలంటూ విడివిడిగా ఉండేవి. అయితే మారుతున్న పరిస్థితులతోపాటు భూములు, ప్లాట్లు, ఫ్లాట్ల ధరలకు రెక్కలు రావడంతో నివాస ప్రాంతాల్లోనే వాణిజ్య లావాదేవీలు చేసే సంస్థలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి ప్రాంతాలే అగ్నిప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఎక్కువగా ఉన్న ఏరియాలుగా మారిపోతున్నాయి. అన్ని జోన్ల కంటే సెంట్రల్ జోన్‌లోని 64.86 శాతం ప్రాంతాలకు అగ్నిప్రమాదాల ముప్పు పొంచి ఉందని ఈ అధ్యయనం తేల్చింది.

ఈ ప్రాంతాలు వెరీ హైరిస్క్ పరిధిలో...

నిపుణుల అధ్యయనం ఆధారంగా చూస్తే హైదరాబాద్‌లోని 35 డివిజన్లు వెరీ హైరిస్క్ జోన్‌లో ఉన్నాయి. 131 చదరపు కి.మీ. పరిధిలో విస్తరించి ఉన్న ఈ ప్రాంతాల్లో 13.14 లక్షల మంది నివసిస్తున్నారని... ఈ లెక్కన వారు ప్రతి చదరపు కి.మీ.కి 17,669 మంది ఉంటున్నట్లని సర్వే లెక్కకట్టింది. ఈ ప్రాంతంలో ఉన్న 2,63,197 కుటుంబాలకూ ఈ ముప్పు పొంచి ఉందని స్పష్టం చేసింది. 2017–24 మధ్య చోటుచేసుకున్న అగ్నిప్రమాదాలను పరిగణనలోకి తీసుకున్న అధ్యయన బృందం ఈ విషయాన్ని ఖరారు చేసింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, వైరింగ్, ఉపకరణాల్లో ఉన్న లోపాలే అగ్నిప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని తేల్చిన అధ్యయనం.. ఆయా అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అంశాన్ని నొక్కిచెప్పింది. ఒక ఏడాది కాలంలో చోటుచేసుకొనే అగ్నిప్రమాదాల్లో 12–12.5 శాతం మార్చి, ఏప్రిల్ నెలల్లోనే జరుగుతున్నాయని స్పష్టం చేసింది. గచ్చిబౌలి, చందానగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, తిరుమలగిరి మినహా మిగిలిన ప్రాంతాల్లోని ఫైర్ స్టేషన్లను ప్రాంతాలను బట్టి పునర్వ్యవస్థీకరించాలని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.

ప్రాంతాలవారీగా అగ్నిప్రమాదాల ముప్పు ఇలా..

జోన్	ప్రాంతాలు	కుటుంబాలు
వెరీ హైరిస్క్	35	2.6 లక్షలు
హైరిస్క్	38	3.2 లక్షలు
మీడియం రిస్క్	22	1.7 లక్షలు
లో రిస్క్	56	4.6 లక్షలు



వెరీ హైరిస్క్‌లోని కీలక ప్రాంతాలివే..

వెంకటేశ్వర కాలనీ, గాంధీనగర్, రెడ్‌హిల్స్, హిమాయత్‌నగర్, భోలక్‌పూర్, ముషీరాబాద్, బౌద్ధనగర్, అడిక్‌మెట్, రామ్‌నగర్, కవాడిగూడ, బంజారాహిల్స్, ఖైరతాబాద్, బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, మోండామార్కెట్, బాలానగర్, సోమాజీగూడ, అమీర్‌పేట్, సనత్‌నగర్, ఫతేనగర్, వెంగళరావునగర్, బర్కత్‌పురా, నాంపల్లి, మెహిదీపట్నం, మల్లేపల్లి, నానల్‌నగర్, విజయ్‌నగర్ కాలనీ, కంటోన్మెంట్.

బీఆర్‌ఎస్ నేతలకు రైతులు ఇప్పుడు గుర్తుకొచ్చారు

- మంత్రి తుమ్మల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులకు రైతుల గురించి ఇప్పుడు గుర్తొచ్చిందని, అందుకే పోటీలుపడి మాట్లాడుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రైతు సంక్షేమమే మొదటి ప్రాధాన్యంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నేతలు ఊకదంపుడు విమర్శలు చేస్తున్నారని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో పంట దిగుబడులు పెరగడమే గాక, అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు అందుతున్నాయని పేర్కొన్నారు. పల్లెల్లో సంతోషం వెల్లివిరుస్తుంటే, బీఆర్‌ఎస్ నాయకులకు కళ్లల్లో కారం కొట్టినట్లుందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ వానాకాలంలోనే రైతులు 53 లక్షల బస్తాల యూరియా , 20 లక్షల బస్తాల డీఏపీ, 45 లక్షల బస్తాల కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేశారని, ఇంకా 67 లక్షల బస్తాల యూరియా, 8 లక్షల బస్తాల డీఏపీ, 66 లక్షల బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, 6 లక్షల ఎంఓపీ బస్తాలు, 4 లక్షల ఎస్‌ఎస్‌పీ బస్తాలను జిల్లా కేంద్రాలలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రతిరోజు సుమారు రెండు లక్షల నుంచి మూడు లక్షల బస్తాల ఎరువులను రైతులు కొనుగోలు చేస్తున్నారని, అయితే ఎరువులు లేవని బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. తాము పంట నష్టపోయిన రైతులను ఆదుకున్నామని, భవిష్యత్తులో కూడా ఆదుకుంటామని అన్నారు.

తెలంగాణను వంచించి ఇప్పుడు లేఖలా?

- చేతనైతే మోదీకి లేఖ రాసి బీజేపీ ఎన్నికల హామీలు నెరవేర్చండి
- వాగ్దానాలతో ఊదరగొట్టి, విద్వేషాన్ని రెచ్చగొట్టి, అబద్ధాలు ఆవిష్కరించడమే మీ పని
- ఏడాదిన్నర ప్రభుత్వం అన్నీ చేసేయాలనడం మీ గుడ్డి ద్వేషానికి నిదర్శనం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటు లేఖ

సాక్షి, హైదరాబాద్: గత 11 ఏళ్ల కాలంలో అడుగడుగునా తెలంగాణ ప్రజలను వంచించి ఇప్పుడు లేఖలు రాస్తే ఏం ప్రయోజనమని బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావును ప్రశ్నించారు. లేఖ రాయాల్సింది తమకు కాదని.. నిజంగా చేతనైతే ప్రధాని మోదీకి లేఖ రాసి తెలంగాణ ప్రజలకు, దేశ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ రాంచందర్‌రావు శనివారం సీఎం రేవంత్‌కు రాసిన లేఖకు సమాధానమిస్తూ ఆదివారం ఘాటు లేఖ రాశారు. వాగ్దానాలతో ఊదరగొట్టడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం మినహా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు రాస్తే రామాయణమంత, వింటే భారతమంత ఉన్నాయని.. గురివింద సామెతను గుర్తుచేసేలా ఉన్న మీ లేఖను చూస్తే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు.



బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?

'60 ఏళ్లు దాటిన చిన్న, సన్నకారు రైతాంగానికి నెలవారీ పింఛన్లు ఇస్తామని ఇచ్చారా? కిసాన్ సమ్మాన్ నిధి పెంచారా? తెలంగాణకు ఒక్క రూపాయి నిధులను కేంద్రం ఇవ్వకపోతే రాష్ట్రంలోని 8 మంది బీజేపీ ఎంపీలు, అందులోని ఇద్దరు కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నారు? 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని పదేళ్ల కిందట ఇచ్చిన హామీ నెరవేర్చారా? 11 ఏళ్లలో దేశంలో ఒక్క కొత్త రేషన్‌కార్డు అయినా ఇచ్చారా? నిత్యావసరాల ధరలు రెట్టింపయినా సామాజిక పింఛన్లు పెంచారా? రైళ్లలో వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు రాయితీలు ఎత్తేసింది మీరు కాదా? లీటర్ పెట్రోల్ ధర, గ్యాస్ బండ ధరలు పెంచిందెవరు? సెస్‌ల పేరుతో రోజూ ప్రజల నడ్డి విరుస్తోంది మీరు కాదా? ఇళ్లు, టాయ్‌లెట్లు, నల్లా కనెక్షన్ల హామీలు ఏమయ్యాయి? రూ. 130 లక్షల కోట్ల అప్పు చేసి ఏటా వడ్డీల కిందే రూ. 12 లక్షల కోట్లు చెల్లించేలా దేశాన్ని అధోగతిపాలు చేసింది మీరు కాదా? రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చారా? తెలంగాణలోని ఒక్క సాగునీటి ప్రాజెక్టుకయినా జాతీయ హోదా ఇచ్చారా? మూసీ ప్రక్షాళనకు నిధులు తెచ్చారా? కృష్ణా జలాల్లో నీటి వాటా తేల్చకుండా నానుస్తోంది మీరు కాదా? తెలంగాణకు ఐఐఎం ఇవ్వకుండా మోసం చేయలేదా? ఐటీఐఆర్‌ను రద్దు చేయలేదా? ఇలా వందల సంఖ్యలో హామీల ఉల్లంఘనలు మీకు గుర్తు రావడం లేదా?' అని లేఖలో మంత్రి పొన్నం ప్రశ్నించారు. బీజేపీ ఏమీ చేయకుండా ఏడాదిన్నరలోనే తాము అన్నీ చేసేయాలని డిమాండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న గుడ్డి ద్వేషానికి నిదర్శనమని మండిపడ్డారు.

కన్నెపల్లి మోటార్లు తక్షణమే ఆన్ చేయాలి

- లేదంటే లక్షలాది మందితో మేమే ఆన్ చేస్తాం: మాజీమంత్రి హరీశ్‌రావు
- కృష్ణా నీటిని మరోసారి ఏపీకి పంపించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారు
- చంద్రబాబుతో చీకటి ఒప్పందం ఏంటో బహిర్గతం చేయాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురుస్తున్న వర్షాల వల్ల గోదావరి, కృష్ణా నదులకు మే నెలలోనే వచ్చిన వరదలు వినియోగించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మేడిగడ్డ రిజర్వాయర్‌తో సంబంధం లేకుండా గోదావరిలో ప్రవహిస్తున్న నీటితో కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభించి లక్షలాది ఎకరాలకు నీళ్లు అందించే అవకాశం ఉన్నప్పటికీ కావాలని మోటార్లు ఆన్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వెంటనే కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేసీఆర్ నాయకత్వంలో అన్ని జిల్లాల నుంచి లక్షలాది మంది రైతులతో తరలివచ్చి మోటార్లను ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి

'కృష్ణా నీటిని రేవంత్‌రెడ్డి రైతులకు విడుదల చేయకుండా తన గురువు చంద్రబాబు కోసం ఏపీకి పంపించేందుకు మరోసారి ప్రయత్నిస్తున్నారు. గోదావరి, కృష్ణా నదులపై ఉన్న ప్రాజెక్టులలో ఎక్కడికక్కడ మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు, చెక్ డ్యామ్‌లు, చెరువులు నింపే అవకాశం ఉన్నప్పటికీ, బీఆర్‌ఎస్‌పై బురద జల్లే పనిలో ఉన్న సీఎం, మంత్రులు రైతులను పట్టించుకోవడం మానేశారు. 'మేడిగడ్డ దగ్గర ప్రస్తుతం 73,600 క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయి. కన్నెపల్లి పంప్ హౌస్ మినిమం డ్రా డౌన్ లెవెల్ 93.5 మీటర్లు అయితే, 96 మీటర్ల ఎత్తున నీటి ప్రవాహం ఉంది. అందువల్ల మేడిగడ్డతో సంబంధం లేకుండా నీటిని తీసుకునిపోవచ్చు. ఎస్సారెస్పీ కింద 14 లక్షలు, మిడ్ మానేరు కింద లక్ష ఎకరాలు, కాళేశ్వరం కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ రోజు కాళేశ్వరం మోటార్లు ప్రారంభిస్తే 15 జిల్లాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉంది. మేడిగడ్డకు మరమ్మతులు చేయాలి. సుందిళ్ల, అన్నారం నీటిని వినియోగించుకోవాలి. మరోవైపు కన్నెపల్లి పంప్ హౌస్ ప్రారంభించి నీళ్లు ఎత్తిపోసి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి..' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ఎన్‌డీఎస్‌ఏ ఒక్క కాళేశ్వరం కోసమేనా?

'ఎన్డీఎస్ఏ యావత్ దేశం కోసం పనిచేస్తుందా? ఒక కాళేశ్వరం కోసమేనా? పోలవరం డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. గేట్ వాల్ కొట్టుకుపోయింది. రూ.2 వేల కోట్ల నష్టం జరిగింది. అయినా ఎందుకు ఎన్డీఎస్ఏ స్పందించలేదు? పోలవరంలో డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే కొత్త డయా ఫ్రమ్ వాల్ కడుతున్నారు. మరి కాళేశ్వరం విషయంలో ఎన్డీఎస్ఏ పేరుతో ఎందుకు కాలయాపన చేస్తున్నారు?

ఇప్పటివరకు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయలేదు

చంద్రబాబుతో ఉన్న చీకటి ఒప్పందం ఏంటో బహిర్గతం చేయాలి. సీఎం పదే పదే పాలమూరు బిడ్డనని మాట్లాడుతూనే అక్కడి రైతుల కడుపు కొడుతున్నాడు. శ్రీశైలానికి వరద మే 30వ తారీఖున రాగా, 36 రోజులైనా ఇప్పటివరకు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయలేదు. తెలంగాణ ఏర్పడ్డాక కృష్ణాలో అతి తక్కువ నీళ్లు వాడుతోంది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే. గతంలో పాలమూరులో క్రాప్ హాలిడే ప్రకటించి గురువు చంద్రబాబు కోసం 65 టీఎంసీల నీటిని రేవంత్‌రెడ్డి ధారాదత్తం చేశాడు. బాబు కోసం ఈసారి కూడా కృష్ణా నీటిని వదిలేస్తారా?..' అని ప్రశ్నించారు.

నిరంతరం కుట్రలు..అబద్ధాలు

- రైతులను మోసం చేయాలని బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోంది
- అబద్ధాల ప్రచారం హరీశ్‌రావుకు అలవాటైపోయింది
- రైతులు ఆదర్శంగా నిలిస్తే ఓర్వలేకే తప్పుడు ప్రచారం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫైర్



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో రైతులను మోసం చేయాలని, ఆందోళనకు గురి చేయాలని బీఆర్‌ఎస్ నిరంతరం కుట్రలకు పాల్పడుతోంది. గోబెల్స్‌కు మించి అబద్ధాలను ప్రచారం చేయటం బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావుకు అలవాటైపోయింది. పంట వేసేటప్పుడు రైతులను ఆదుకునే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ప్రతి పంట సీజన్లో రైతులను ఆందోళనకు గురి చేసి, గందరగోళపరచాలనే దుర్బుద్ధి బీఆర్‌ఎస్ నేతలది..' అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. సాగునీటి సరఫరా విషయంలో ప్రభుత్వంపై హరీశ్‌రావు చేసిన విమర్శలను ఖండిస్తూ ఆదివారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

దేశ చరిత్రలోనే అధిక ధాన్యం దిగుబడి సాధించాం

గత యాసంగి సీజన్‌కు ముందు కూడా బీఆర్‌ఎస్ ఇలాంటి అబద్ధాలు మాట్లాడి రైతాంగాన్ని ఆందోళనకు గురి చేయాలని కుటిల ప్రయత్నాలు చేసింది. అయినా రైతులు గత వానాకాలంలో 66.7 లక్షల ఎకరాల్లో 153.5 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 60 లక్షల ఎకరాల్లో 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించారు. దేశ చరిత్రలోనే ఒకే ఏడాదిలో 283 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించిన రికార్డు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సాధ్యమైంది. తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా నిలిస్తే ఓర్వలేని గుణం బీఆర్‌ఎస్ లీడర్లదని మండిపడ్డారు.

ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర

బీఆర్‌ఎస్ అసమర్థత, నిర్లక్ష్యం, నిర్వాకంతోనే మేడిగడ్డ బరాజ్ కుంగిపోయింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు సైతం అక్కరకు రాని స్థితిలో ఉన్నాయి. అయినా మేడిగడ్డ నుంచి నీళ్లను లిఫ్టు చేయాలని హరీశ్‌రావు పదే పదే మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర తప్ప రైతులకు మేలు చేసే ప్రయత్నం కాదని ఉత్తమ్ ఆరోపించారు.

ఎప్పుడైనా జూలై, ఆగస్టుల్లోనే 'కల్వకుర్తి' ఆన్..

కల్వకుర్తి పంపులు ప్రతి ఏటా జూలై చివరిలో లేదా ఆగస్టు ఒకటో తేదీన స్విచాన్ చేసి వానాకాలం పంటలకు నీళ్లు అందిస్తారు. 2019లో ఆగస్టు 1 న, 2020లో ఆగస్టు 31న, 2021లో ఆగస్టు 15న, 2022లో జూలై 13న, 2023లో ఆగస్టు 6న ఆన్‌చేశారు. గత ఏడాది జూలై 27న ఆన్ చేశాం. ఈసారి కూడా అదే విధానం అమలవుతుంది. ప్రాజెక్టుల నీటిని ఎప్పుడు విడుదల చేయాలి? ఎంత ఆయకట్టుకు ఇవ్వాలి? అన్న అంశంపై ఈనెల 11న జరిగే రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (స్కివం) సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం అని ఉత్తమ్ తెలిపారు.

ఏపీ కుట్రలకు బీఆర్‌ఎస్ సర్కార్ సహకారం

బీఆర్‌ఎస్ హయాంలోనే ఏపీ పోతిరెడ్డిపాడు సామర్థ్యం రెండింతలకు మించి 88 వేల క్యూసెక్కులకు పెంచుకుంది. రాయలసీమ లిఫ్ట్ స్కీమ్, ముచ్చుమర్రి నుంచి రోజుకు దాదాపు 8 నుంచి 10 టీఎంసీల నీటిని ఏపీ మళ్లించుకునే కుట్రలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం దొంగచాటుగా సహకరించింది. 2004 నుంచి 2014 వరకు ఏపీ అక్రమంగా 770 టీఎంసీల కృష్ణా జలాలు తీసుకుపోతే.. 2014 నుంచి 2023 వరకు బీఆర్‌ఎస్ పాలనలో ఏపీ ప్రభుత్వం ఏకంగా 1,225 టీఎంసీల నీళ్లు అక్రమంగా తీసుకుపోయినట్లు రికార్డులున్నాయి అని పేర్కొన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గోదావరి, కృష్ణా పరీవాహకంలో ఎక్కువ సాగునీటిని వినియోగించి ఎక్కువ విస్తీర్ణంలో పంట పండించామని చెప్పారు.



ఎవరైతే ధర్మాన్ని పరిరక్షించుటకు ఆతురపడుచున్నారో వారి పరీక్షకు ఎదురొడ్డి ధర్మం నిలువగలదు. ధర్మం వలన జరిగే మేలేమిటో స్వయంగా వారే తెలుసుకోవచ్చు.
– నయాజీ ఊ బా ఖీన్

సాక్షి
సోమవారం, 7 జూలై 2025

కాసిన్ని రొట్టెలు

'రొట్టెపై కవిత గట్టేంత సాహసం చేయలేను. కాని మిమ్మల్ని ఆ నిప్పుల పొయ్యి వరకూ రమ్మని ఆహ్వానిస్తాను. అక్కడ తినడానికి సిద్ధమవుతున్న రొట్టెను దర్శించమని, ఆ అద్భుతాన్ని తిలకించమని వేడుకుంటాను' అంటాడొక హిందీ కవి.

సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, ఆకాశహర్మ్యాలు, విమానం టికెట్టులు, లాకర్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, మురుగు పొంగితే ఇష్టరీతిన చుట్టుముట్టినట్టు చేరే అసమంజస ధనం... ఇవి కొందరికి అద్భుతంగా తోచవచ్చు. కాని ఆకలిగొన్నవాడికి పొయ్యి మీద కాలుతున్న రొట్టె కంటే అద్భుతమైనది మరొకటి ఉండదు. ప్రతి పూటా అది అపురూపమే. అందుకే కవి అంటాడు– 'ప్రతిసారీ ఇంతకు ముందు కంటే మరింత రుచిగా ఉంటుంది. ప్రతిసారీ ఇంతకు ముందు కంటే ఎంతో గుండ్రంగా అగుపిస్తుంది. ఆకలి గురించి అగ్ని పలికే గొప్ప వాంగ్మూలం కదా రొట్టె'....

బైబిల్‌లో రొట్టె కేవలం రొట్టె కాదు. జీవితానికి సంకేతం. జీవితానికి ఏమి కావాలి? పంచడం... పంచుకు తినడం తప్ప. 'ప్రభూ... వారిని ఇంటికి వెళ్లమని చెప్పు. వాళ్లు వెళితే వారి వారి రొట్టెలు సంపాదించుకు తినగలరు' అని శిష్యులు ఏసు ప్రభువుకు చెబుతారు. అప్పటికే వారంతా ఎడారి వంటి ప్రాంతంలో ఉన్నారు. ఏసు వెంట ఐదు వేల మంది ఉన్నారు ఆయన ఆరాధనలో. వారంతా ఇళ్లకు వెళ్లి రొట్టెలు ఎప్పటికి తినాలి? 'మన వద్ద ఏం ఉన్నాయి?'... 'ఒక బాలుడి బుట్టలో ఐదు రొట్టెలు, రెండు చేపలు'.... కరుణామయుడి హృదిలో సాటి మనిషి ఆకలి పట్ల ఎంతటి కరుణ ఉంటుందంటే ఆ ఐదు రొట్టెలు, రెండు చేపలే ఐదువేల మందికి సరిపోతాయి.

పరిమళా సోమేశ్వర్ రాసిన 'రొట్టె కోసం' అనే కథలో ఆకలిగొన్న పేదబాలుడు ఇంటింటికీ తిరుగుతూ రొట్టె కోసం అంగలారుస్తాడు. ఒక డబ్బున్న మహిళ రోజూ రొట్టెలు చేసి కాకులకు వేయడం వాడికి తెలుసు. ఆ రోజున కాకులకు బదులుగా తను దక్కించుకోవాలని ప్రయత్నిస్తే ఆ మహిళకు ఎంత కోపం వస్తుందో. 'ఫో... వెధవా' అని తరిమి కొడుతుంది. కాకులకు వేస్తే పుణ్యంగాని ఇలాంటి వెధవలకు వేస్తే ఏం పుణ్యం? వివిన మూర్తి రాసిన 'రొట్టె ముక్క' అనే కథలో కడుపుతో ఉన్న దళితురాలికి రొట్టె ముక్క తినాలని మనసులో పడుతుంది. మినప రొట్టె. ఆ చిన్న కోరిక తీరడం, తీరకపోవడం వెనుక జాతుల దోపిడి అంతా ఉంది.

మనుషుల్ని దొంగలుగా మార్చడం రొట్టె ప్రధానంగా చేసే పని. విక్టర్ హ్యూగో ప్రఖ్యాత నవల 'లే మిజరబుల్స్'లో ప్రధాన పాత్ర జీన్ వాల్‌జీన్ రొట్టెను దొంగిలించడంతో ఆ నవల తర్వాతి ఘటనలన్నీ రూపు కడతాయి. జీన్ వాల్‌జీన్ రొట్టెను దొంగిలించింది కుటుంబం ఆకలి తీర్చడం కోసం. గమ్మత్తు ఏమిటంటే ఈ నాగరిక ప్రపంచపు నిర్మాణమంతా రొట్టెను న్యాయంగా దక్కనీకపోవడంపై ఆధారపడి ఉంది. ఇచ్చే చేయి ఒకరిదిగా పుచ్చుకునే చేయి మరొకరిదిగా ఉంచడం వల్ల ప్రపంచంలోని కొద్దిపాటి కుబేర సంతతి బతుకు ఈడ్చగలుగుతుంది. ఈ కుబేరులు కుబేరుల్లా ఉండటానికి మొదట జనానికి రొట్టె లేకుండా చేస్తారు. జనం రొట్టె తినే పరిస్థితిలో ఉంటే గనక యుద్ధాలు తెచ్చి ఇళ్లనూ, వంటగృహాలను ధ్వంసం చేస్తారు. రొట్టెకై అలమటించి జనం చస్తున్న సమయాల్లో కుబేరుల ఇళ్లలోని చలినెగళ్లు మరింత ఎర్రగా నాల్కలు సాచి వెచ్చదనం ఇస్తాయని వారూ వీరూ చెప్పడమే!

'తిండి లేని పిల్లలున్న దేశంలో పాలు నల్లగా ఉంటాయి. పిల్లలకు తిండి లేని దేశాల్లో రొట్టెలు రాళ్లలా ఉంటాయి' అని రాస్తాడు వాడ్రేవు చినవీరభద్రుడు. నక్సలైటు పేరుతో అమాయకుణ్ణి తెచ్చి, ఇంటరాగేషన్ పేరుతో నాలుగు రోజులుగా ఆకలికి మాడుస్తుంటే తన వద్ద ఉన్న రొట్టెలను అతడికి రహస్యంగా పెట్టడం గురించి కన్నీళ్లతో రాస్తారు సత్యమూర్తి అలియాస్ శివసాగర్. 'రొట్టె చేసేందుకు రైతు శ్రమిస్తున్నాడు. రొట్టెతో ఆకలి తీర్చుకునే సామాన్యుడు శ్రమిస్తున్నాడు. కాని రొట్టెతో ఆడుకునే పెద్దమనుషులు పెద్దలసభలో కూచుని ఉన్నారే' అని సుధామా పాండే ధూమల్ రాసిన ప్రఖ్యాత కవిత 'రోటీ ఔర్ సన్సద్' ఆలోచనలను రేకెత్తిస్తూనే ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా 80 కోట్ల మందికి రొట్టెగ్రాసం ఇస్తున్నామని చెప్పుకుంటున్న ఈ దేశంలో ఆ స్థితిని యథాతథంగా ఉంచడానికి కారణం తగిన సాహిత్యం పుట్టడానికే కాబోలు. లేకుంటే మనకేం తక్కువ.

జూలై 6 నుంచి నెల్లూరులో రొట్టెల పండగ మొదలయ్యింది. అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది పాల్గొని అక్కడి 'బారా షహీద్ దర్గా' వద్ద వున్న చెరువులో మోకాటి లోతున దిగి ఒకరి నుంచి మరొకరు రొట్టెలు మార్చుకుంటారు. ఏం రొట్టెలు అవి? 'సంతానం రొట్టె', 'సౌభాగ్యం రొట్టె', 'ఆరోగ్యం రొట్టె', 'ఉద్యోగం రొట్టె', 'సొంతింటి రొట్టె', 'పెళ్లి రొట్టె', 'చదువు రొట్టె'.... అందరివీ చిన్న చిన్న కోరికలు... చిన్న చిన్న ఆశలు... చిన్న చిన్న ఆకాంక్షలు.... ప్రపంచంలోగాని, ఈ దేశంలోగాని, ఏ నైసర్గికతలోగాని కోటాను కోట్ల సామాన్యులకు ఇంతకు మించిన కోరికలు ఉండవు. వారంతా 'దో వక్త్‌కీ రోటీ' దొరికి జీవితం చీకూ చింతా లేకుండా గడిచిపోతే చాలనే కోరుకుంటారు.

ఈ మందభాగ్యులను పాలించడానికి కర్కశత్వం అవసరమా? కరుణ సరిపోదా?

మనిషిని నమ్మడమే మనకు రక్ష

విశ్లేషణ



యువల్ నోవా హరారీ

బీజింగ్‌లో జరిగిన 'చైనా డెవెలప్‌మెంట్ ఫోరమ్'లో భాగంగా 'ఏఐ సమ్మిళిత వృద్ధి' అనే అంశంపై 2025 మార్చి 24న ఇజ్రాయెల్ చరిత్రకారుడు, రచయిత యువల్ నోవా హరారీ ప్రసంగించారు. ఆ వీడియోను 'ఏఐ అండ్ ద పారడాక్స్ ఆఫ్ ట్రస్ట్' పేరిట తన యూట్యూబ్ ఛానల్‌లో జూన్ 30న పోస్ట్ చేశారు. ఆ ప్రసంగ సంక్షిప్త పాఠం:

హలో, ఎవ్రీవన్! ఈ సదస్సులో పాల్గొనడాన్ని ఒక గౌరవంగా భావిస్తున్నాను. నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. ఎక్కువ సమయం లేనందువల్ల కొద్దిసేపే మాట్లాడతాను. ముఖ్యంగా నేను మూడు ప్రశ్నలు లేవనెత్తదలిచాను. ఒకటి: కృత్రిమ మేధ (ఏఐ) అంటే ఏమిటి? రెండు: ఏఐ వల్ల కలిగే ప్రమాదం ఏమిటి? మూడు: ఏఐ యుగంలో మానవాళి ఎలా వర్ధిల్లుతుంది?

ఏఐ చుట్టూ ఎంత ప్రచారం అల్లుకుందంటే, అయినదానికి కానిదానికి కూడా ఆ పదబంధాన్ని ఉపయోగిస్తున్నారు. ఏఐ అంటే ఆటోమేషన్ కాదని స్పష్టంగా చెప్పదలచుకున్నాను. ఏఐ మన చేతుల్లోని పనిముట్టు కాదు. ఏఐ ఒక ఏజెంట్. ఒక యంత్రం ఆటోమేటిక్‌గా పనిచేయగలిగినంత మాత్రాన అది ఏఐ కాదు. దానికి నేర్చుకునే సామర్థ్యం ఉండాలి. దానికది మార్పు చేసుకోగలగాలి.

1. నిజంగా ఏఐ ఏమిటో మనకు అర్థమైందా?

కాఫీ మెషీన్‌నే తీసుకోండి. బటన్ నొక్కిన వెంటనే ముందుగా నిర్దేశించిన ప్రకారం ఎస్ప్రెసో కాఫీని అందిస్తుంది. ఇది ఏఐ కిందకు రాదు. ఆ యంత్రం నేర్చుకోవడం గానీ, కొత్తదాన్ని సృష్టించడం గానీ జరగలేదు. కానీ, మీరు బటన్ నొక్కకముందే, "మిమ్మల్ని నేను కొన్ని వారాలుగా గమనిస్తూ వస్తున్నాను. మీ గురించి నేను తెలుసుకున్న అన్ని విషయాలను బట్టి, మీరు ఎస్ప్రెసోను ఇష్టపడతారని అనుకుంటున్నాను" అందనుకోండి. అది ఏఐ అవుతుంది. మరుసటి రోజు అదే మెషీన్, "నేనొక కొత్త పానీయాన్ని కనుగొన్నాను. దాన్ని మీరు ఎస్ప్రెసో కన్నా ఎక్కువ ఇష్టపడతారనిపిస్తోంది. తాగి చూడండి" అందనుకోండి. అది సిసలైన ఏఐ అవుతుంది.

ఏజెన్సీతోపాటు ఏఐకి ఉండే మరో ముఖ్య లక్షణం, అది పరాయిది. దాని తెలివితేటలు మనిషి లాంటివి కావు. ఆర్గానిక్ కాదు. అది మానవాళికి అనుభవంలో లేని నిర్ణయాలను తీసుకుంటుంది.

'గో' ఛాంపియన్ లీ సెడాల్‌ను 2016లో ఆల్ఫా–గో ఏఐ ఓడించడమే అందుకు తిరుగులేని ఉదాహరణ('గో' అనేది ఒక బోర్డ్ గేమ్). ఒక మనిషిని ఏఐ ఓడించడమే కాదు, గెలవడం కోసం ఆల్ఫా–గో అంతవరకు గో ఆటలో వేలాది ఏళ్ళుగా మానవ ఆటగాళ్ళకు తట్టని వ్యూహాలను కనుగొంది.

క్రీడల్లో గెలిచేందుకు కొత్త మార్గాలను లేదా కొత్త రకం కాఫీలను ఏఐ కనుగొనడం అంత ముఖ్యమైనదిగా కనిపించకపోవచ్చు. కానీ ఏఐ త్వరలోనే నూతన సైనిక, ఫైనాన్షియల్ వ్యూహాలను, కొత్త రకం ఆయుధాలను, కరెన్సీలను కనుగొనవచ్చు. కొత్త సిద్ధాంతాలను, మతాలను రూపొందించినా ఆశ్చర్యపోనవసరం లేదు.

2. మనిషిని నమ్మరు, మెషీన్‌ను నమ్ముతారట!

ఇపుడు ఏఐ వల్ల పొంచి ఉన్న ప్రమాదం ఏమిటనే రెండవ ప్రశ్నకు వెళదాం. ఏఐకి అపారమైన సానుకూల ప్రయోజనాలను సృష్టించగల శక్తిసామర్థ్యాలు ఉన్నాయనడంలో ఎవరికీ సందేహం లేదు. కొత్త ఔషధాలను కనుగొనడం నుంచి వినాశకర వాతావరణ మార్పును నివారించడం వరకు అది ఎంతగానో తోడ్పడవచ్చు.

కానీ, ఏఐతో వచ్చిన ప్రాథమిక సమస్య ఏమిటంటే, అది అన్య (ఏలియన్) ఏజెంట్. ఎప్పుడెలా వ్యవహరిస్తుందో ఊహించలేం.

సూపర్ ఇంటెలిజెంట్ ఏఐని అభివృద్ధి పరచడంలోని ప్రధాన ఆంతర్యంలోనే నమ్మకానికి సంబంధించిన వైచిత్రి ఉంది. మనిషి తోటి మనిషిని నమ్మడానికి వెనకాడతాడు. కానీ, మనలో కొందరం విచిత్రంగా ఏఐని నమ్మి తీరాలని భావిస్తున్నాం.

నేను ప్రపంచంలోని వివిధ దేశాలకు వెళ్ళి, అక్కడ ఏఐని అభివృద్ధి చేస్తున్నవారిని కలుసుకున్నప్పుడు, సాధారణంగా వారికి రెండు ప్రశ్నలు వేస్తూంటాను. 'దీనిలో పెను ప్రమాదాలే ఇమిడి ఉన్నా, ఏఐ అభివృద్ధి దిశగా అంత వేగంగా చొచ్చుకుపోతున్నారెందుకు?' అన్నది మొదటి ప్రశ్న. దానికి ఇంచుమించుగా అందరూ చెబుతున్న జవాబు ఒక్కటే. 'పెను ప్రమాదాలు పొంచి ఉన్నాయని మేమూ అంగీకరిస్తున్నాం. మేము నెమ్మదిగా అడుగులు వేసినంత మాత్రాన మా ప్రత్యర్థులు కూడా నెమ్మదిగా సాగుతారనే హామీ లేదు. ఏఐ రేసులో వారు గెలుస్తారు. ప్రపంచంలో అత్యంత కర్కశంగా వ్యవహరించేవారి ప్రాబల్యం పెరిగిపోతుంది. మానవ పోటీదారులను మేం నమ్మలేం. కనుక, వీలైనంత వేగంగా ముందుకు సాగాలి'.



◆ ఏఐని అభివృద్ధి చేస్తున్నది మనుషులే కనుక, వాటిని సురక్షితమైనవిగానే డిజైన్ చేయడానికి ప్రయత్నించవచ్చునన్నది నిజమే. కానీ, నేర్చుకోగల సామర్థ్యం, తనను తాను మార్చుకోగల శక్తి ఉన్న యంత్రం మాత్రమే ఏఐ అనిపించుకుంటుందనే సంగతిని మరచిపోవద్దు. మనుషులు మొదట తమను ఎలా డిజైన్ చేశారనే దానితో ప్రమేయం లేకుండా ఏఐ మున్ముందు విప్లవాత్మకమైన, ఊహించడానికి అలవికాని రీతిలో రూపాంతరం చెందవచ్చు.

'మీరు అభివృద్ధి చేస్తున్న సూపర్ ఇంటెలిజెంట్ ఏఐలను నమ్మవచ్చని భావిస్తున్నారా?' అన్నది నా రెండవ ప్రశ్న. మానవ పోటీదారులను నమ్మలేమని చెప్పిన అదే వ్యక్తులు, తాము అభివృద్ధి చేస్తున్న సూపర్ ఇంటెలిజెంట్ ఏఐలను నమ్మగలమని చెబుతున్నారు.

ఈ వైరుధ్యాన్ని గమనించారా? మానవులతో వ్యవహరించడంలో మనకు వేలాది ఏళ్ళ అనుభవం ఉంది. మానవ సైకాలజీ, బయాలజీల పట్ల విస్తృతమైన అవగాహన ఉంది. అధికారం కోసం మానవులు ఎంతగా అర్రులు చాస్తారో తెలుసు. అధికారం కోసం చేసే ప్రయత్నాన్ని అదుపాజ్ఞలలో పెట్టగల శక్తుల గురించీ మనకు తెలుసు. మనుషుల మధ్య నమ్మకాన్ని పాదుకొల్పే మార్గాలను కనుగొనడంలో కూడా మనం గణనీయమైన ప్రగతిని సాధించాం.

లక్ష సంవత్సరాల క్రితం, కొద్దిపాటి డజన్ల సంఖ్యలో మనుషులు సమూహాలుగా జీవించేవారు. వేరొక సమూహంలోని వ్యక్తిని నమ్మేవారు కాదు. నేడు 140 కోట్ల జనాభా కలిగిన చైనా వంటి దేశాలున్నాయి. భూగ్రహం మీద 800 కోట్ల మందిని అనుసంధానించే సహకార వ్యవస్థలున్నాయి. మన ప్రాణాలను నిలబెడుతున్న ఆహారం మనకు ఏమాత్రం పరిచయం లేనివారు పండిస్తున్నది. మనల్ని కాపాడుతున్న ఔషధాలను ఎవరో కనుగొన్నారు. అంతమాత్రాన మానవులందరి మధ్య నమ్మకం వెల్లివిరుస్తోందని కాదు. కానీ, మనం ఎదుర్కొంటున్న సవాల్ పట్ల మనకు ఒక అవగాహన ఉంది.

మానవులతో పోలిస్తే ఏఐల పట్ల మనకున్న అనుభవం దాదాపుగా శూన్యం. మనం ఇప్పుడిప్పుడే మొదటి ప్రోటోటైపులను సృష్టించాం. ఆదిమ ఏఐలు కూడా అబద్ధం చెప్పగలవనీ, వాటిని సృష్టించిన మానవులే ఊహించని లక్ష్యాలను, వ్యూహాలను అనుసరించగలవనీ మనకు ఇప్పటికే అనుభవానికి వచ్చింది. సూపర్ ఇంటెలిజెంట్ ఏఐ ఏజెంట్లు కోట్లాది మానవులతో వ్యవహరించడం ప్రారంభిస్తే ఏం కానుందో మనకు తెలియదు. ఇక, వాటితో అవి ఇంటరాక్ట్ అవడం మొదలెడితే ఏం జరుగుతుందో ఊహించడం ఇంకా కష్టం.

ప్రస్తుతానికి, ఏఐని అభివృద్ధి చేస్తున్నది మానవులే కనుక, వాటిని సురక్షితమైనవిగానే డిజైన్ చేయడానికి ప్రయత్నించవచ్చునన్నది నిజమే. కానీ, నేర్చుకోగల సామర్థ్యం, తనను తాను మార్చుకోగల శక్తి ఉన్న యంత్రం మాత్రమే ఏఐ అనిపించుకుంటుందనే సంగతిని మరచిపోవద్దు. మనుషులు మొదట తమను ఎలా డిజైన్ చేశారనే దానితో ప్రమేయం లేకుండా ఏఐ మున్ముందు విప్లవాత్మకమైన, ఊహించడానికి అలవికాని రీతిలో రూపాంతరం చెందవచ్చు.

అత్యంత తెలివితేటలున్న గ్రహాంతరవాసులు అంతరిక్ష నౌకలలో భూమి వైపు వస్తున్నారనీ, అవి 2030 నాటికి ల్యాండ్ కావచ్చనీ ఎవరైనా చెప్పారనుకుందాం. వారు మనతో స్నేహపూర్వకంగా మెలగుతారనీ, క్యాన్సర్‌ను నివారించేందుకు, వాతావరణ మార్పును అరికట్టేందుకు, వర్ధిల్లగల శాంతియుత ప్రపంచాన్ని నిర్మించడంలో సాయపడతారనీ ఆశిస్తాం. కానీ, గ్రహాంతరవాసుల సౌహార్దతతో మన భవిష్యత్తును ముడిపెట్టడం ప్రమాదకరమని చాలామంది వారి అంతరాత్మ ప్రబోధం మేరకు అర్థం చేసుకుంటారు. అదే విధంగా, మనం తయారు చేస్తున్న ఏఐ ఏజెంట్లు మనపట్ల విధేయులైన సేవకులుగా ఉంటాయనుకోవడం పెద్దయెత్తున జూదమాడటమే.

3. చింపాంజీలు కాక మనుషులే ఎందుకు పాలిస్తున్నారు?

ఏఐ యుగంలో మానవాళి వికసనం ఎలా? దీనికి జవాబు తేలికే. మనుషులందరూ కలిసి ఏఐని నియంత్రించవచ్చు. కానీ, మనలో మనమే కొట్లాడుకుంటే, ఏఐ మనల్ని దాని చెప్పుచేతల్లోకి తీసుకుంటుంది. నిజమైన సూపర్ ఇంటెలిజెంట్ ఏఐ ఏజెంట్లను అభివృద్ధి చేసేముందు, మొదట మనుషుల మధ్య మనం నమ్మకాన్ని పెంపొందించుకోవాల్సి ఉంది. దురదృష్టవశాత్తు, ప్రస్తుతం మనం దానికి పూర్తి విరుద్ధమైన పని చేస్తున్నాం. పటిష్ఠంగా ఉండటమంటే ఎవరినీ నమ్మకపోవడం, ఇతరుల నుంచి పూర్తి వేరుగా ఉండటమని చాలా దేశాలు భావిస్తున్నాయి. కానీ, ఎవరితోనూ సంబంధం లేకుండా జీవించడం అసాధ్యం. వాస్తవానికి, పూర్తిగా వేరుపడటమంటే, ప్రకృతిలో, మరణించడం కిందే లెక్క.

మన శరీరాన్నే తీసుకుంటే, ప్రతి నిమిషం, మనం గాలిని పీలుస్తూంటాం, వదులుతూంటాం. గాలిని లోపలికి పీలుస్తున్నామంటే బయటదానిని మనం నమ్ముతున్నట్లే లెక్క. గాలిని ఊపిరితిత్తుల్లోకి తీసుకుని తిరిగి విశ్వంలోకి విడిచిపెడుతున్నాం. ఈ ఉచ్ఛ్వాస, నిశ్వాసాలే జీవన గతికి ఆధారం. బయట ఉన్నవాటి అన్నింటిపైన అపనమ్మకం పెంచుకుని ఊపిరి పీల్చడం ఆపేస్తే చనిపోతాం. దేశాల విషయంలో కూడా అదే సత్యం వర్తిస్తుంది.

ఉదాహరణకు చైనా వేలాది ఏళ్ళుగా ఇతర దేశాలకు దాని విజ్ఞానాన్ని పంచడం కొనసాగిస్తోంది. కన్ఫ్యూషియస్, మావో ఆలోచనల నుంచి గో, టీ, మందుగుండు సామగ్రి, ప్రింటింగ్ వరకు ఎన్నింటినో ఇచ్చింది. అలాగే, బుద్ధుడు, కారల్ మార్క్స్ నుంచి కాఫీ, ఫుట్‌బాల్, రైళ్ళు, కంప్యూటర్ల వరకు అది ఇతర దేశాల నుంచి చాలా తీసుకుంది.

ఏ దేశానికి చెందిన ప్రజలైనా వారి దేశపు ఆహారానికి, క్రీడలకు, భావజాలానికి మాత్రమే పరిమితమైతే బతకడం అసాధ్యం కాకపోయినా, నిస్సారంగా మాత్రం ఉంటుంది. ప్రతి మనిషి ఏదో ఒక వర్గానికి చెందినవాడు కావచ్చుగానీ, మొత్తం మానవాళిలో భాగమే. ఏఐ యుగంలో, మనం పంచుకున్న మానవ వారసత్వాలను మరచిపోతే, నియంత్రించలేని ఏఐకి సులభంగా లక్ష్యంగా మారతాం.

గతంలో చోటుచేసుకున్న యుద్ధాలు, అన్యాయాల గురించి చరిత్ర పుస్తకాల్లో చదివినవారు గతానుభవాలను తలచుకుంటూ, భవిష్యత్తులో ఎదురుకాగల కష్టాల గురించి భయపడుతూంటారు. ఇతర దేశాలను, ప్రజలను వారు ఆ రకమైన ఆందోళనతోనే చూస్తూంటారు. భయం, బాధ అస్తిత్వానికి ముఖ్యమైనవే. ఒక్కోసారి అవి మనల్ని ప్రమాదాల నుంచి కాపాడతాయి కూడా. కానీ, ఎవ్వరూ భయం, బాధను ఆధారం చేసుకుని బతకలేరు. ఆ రెండింటికన్నా నమ్మకం చాలా ముఖ్యమని చరిత్ర మనకు బోధిస్తోంది.

ఈ భూగోళాన్ని చింపాంజీలు, ఏనుగులు కాక, మానవులే ఎందుకు పాలించారో తెలుసునా? వాళ్ళకి ఎక్కువ తెలివితేటలు ఉండబట్టి కాదు. అపరిచితుల పట్ల కూడా నమ్మకాన్ని ఎలా పెంచుకోవచ్చో, పెద్ద సంఖ్యలోని జన సమూహాలతో సహకారాన్ని ఎలా ఇచ్చిపుచ్చుకోవచ్చో మనుషులకు తెలుసు కాబట్టి. ఈ సామర్థ్యాన్ని మనం వేలాది ఏళ్ళుగా అభివృద్ధి పరచుకుంటూ వచ్చాం. గతంలో కన్నా దానికి ఇప్పుడు అధిక ప్రాధాన్యం ఉంది. ఏఐ యుగంలో మనం బతికి బట్టకట్టడానికి, వికసించడానికి, ఏఐ కన్నా ఎక్కువగా తోటి మనుషులను నమ్మవలసి ఉంది. థాంక్యూ!

వెలుగు చూడని విద్వన్మణి

కావ్య ప్రయోజనాల్లో యశస్సు ప్రధానమైనదిగా లాక్షణికులు పేర్కొన్నారు. ఈ ప్రచార యుగంలో కీర్తి కాంక్ష లేని కవులు, పండితులు అరుదు. ఆ కోవకు చెందిన కొద్ది మంది విద్వత్కవులలో నేటి కోనసీమ జిల్లా కొత్తపేట మండలం 'అవిడి' గ్రామానికి చెందిన గరిమెళ్ల అచ్యుత శేషగిరి సోమయాజులు శర్మ ఒకరు. ఆయన పుష్పగిరి పీఠ ఆస్థాన విద్వాంసులు, తత్త్వశాస్త్ర పారంగతులు, 'సహజ పండిత' బిరుదాంకితులు, సంస్కృతాంధ్రాలలో శతాధిక గ్రంథాలను రచించినవారు.

ఓ ఘనాపాఠి కుటుంబంలో 1950 ఆగస్టు 5న జన్మించిన శర్మ ఆంధ్రోపన్యాసకునిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. సంస్కృతాంధ్రాలలో అనేక స్వతంత్ర రచనలను చేయడమే గాక ఎన్నో ప్రసిద్ధ గ్రంథాలకు వ్యాఖ్యానాలు, పీఠికలు, పరిష్కరణలు రాయడమే కాక అనువాదాలు వంటి ప్రక్రియలను కూడా చేపట్టి తన బహుముఖ ప్రజ్ఞను నిరూపించుకున్నారు. పుష్పగిరి పీఠ చాతుర్మాస్య సమయంలో అవధానాలు నిర్వహించడం, తాళపత్ర గ్రంథాలను సేకరించి వాటికి శుద్ధప్రతులను రూపొందించడం, వివిధ ప్రాంతాలలో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయడం వంటివి కూడా ఆయన ప్రవృత్తి వ్యాసంగాలలో భాగాలే.



గరిమెళ్ల సోమయాజులు శర్మ

సుప్రసిద్ధ పండిత కవి వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి శిష్యరికంతో పాటు ఆయన రచించిన 'శబర శంకర విలాస' కావ్యానికి బృహత్ పీఠికను రాసి, గురు ప్రశంసకు పాత్రులయ్యారు. ఇంకా బులుసు అప్పన్నశాస్త్రి కృతమైన భగవద్గీతకు 'శంకర భాష్య తత్త్వబోధిని' పేరుతో రాసిన పీఠిక, బుద్ధవరపు మహదేవ కృతమైన 'ఆంధ్రమాఘాని'కి పీఠికతో పాటు పరిష్కార ప్రతిని సమకూర్చడం, 'సూత సంహిత'కు, 'ఆంధ్ర బ్రహ్మ సూత్రాల'కు పీఠికలను రాయడం శర్మ విశిష్ట కృషికి నిదర్శనాలు. సంస్కృతంలో ఆయన రచించిన 'మహాభారత కంట కోద్ధారః' ఆర్ష సంస్కృతి పట్ల ఆయన అనురక్తిని తెలియజేస్తుంది. 'ద్వాదశ వ్రత మాహాత్మ్యం', 'కర్ణాటక సాహిత్య దర్శనం' వంటి సంస్కృత కృతులు ఆయన గీర్వాణ భాషా వైదుష్యానికి అద్దం పడతాయి. 'వాల్మీకి వృత్తాంతం', 'శివకర్ణామృతం', 'శ్రీ వేంకటరామ యశో వికాసం' ఆయన ప్రసిద్ధ తెలుగు రచనలు. 'ఈశాన సంహిత', 'భాగవత సంపద' వంటి వ్యాసాలు; జగన్నాథ పండిత రాయల 'లహరీ త్రయాని'కి అమృతధారా వ్యాఖ్య, 'సూత సంహిత', 'తైత్తరీయోపనిషత్' వంటి గ్రంథాల పరిష్కృత రూపాలు శర్మ బహుముఖ ప్రతిభకు ఉదాహరణలు.

సోమయాజుల శర్మ రచనలపై నాగార్జున, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాలలో ముగ్గురు విద్యార్థులు పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టాలను పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్యాత్మిక ప్రచురణల ఎంపికలో శర్మ భాగస్వామ్యం ఆ రంగంలో ఆయనకు లభించిన గౌరవాన్ని సూచిస్తుంది. ఆయన శేష జీవితంలో తెలుగులో ఆధ్యాత్మిక రచనలపై ఒక సమగ్ర సమీక్షా గ్రంథాన్ని రాయాలనుకున్నారు. ఆ సంకల్పం నెరవేరకుండానే జూన్ 25న దివంగతులు కావడం దురదృష్టకరం. జీవితాంతం నిష్కామ యోగిలా సాహిత్యార్చన చేసిన ఆ సరస్వతీ పుత్రునికి నీరాజనాలు!

– డా॥ పైడిపాల, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు । 99891 06162

వింబుల్డన్ కిక్కే వేరప్పా!

కామెంట్



కరణ్ థాపర్

క్రికెట్ మీద మక్కువ పెంచుకోవాలని ఎంతో ప్రయత్నించాను. కాని నా వల్ల కాలేదు. నిర్మొహమాటంగా ఉన్నమాట చెబుతున్నా... ఆ ఆట సుదీర్ఘంగా సాగుతుంది. పోనీ అక్కడేమైనా జరుగుతుందా అంటే, ఏం ఉండదు. అధిక సమయం అందులో స్తబ్ధతే ఉంటుంది. బ్రిటిష్ మాజీ వలస దేశాల్లో తప్ప ప్రపంచంలో ఎవరికీ క్రికెట్ ఒంటబట్టినట్లు లేదు. మాజీ వలస దేశాల్లోనూ అమెరికా, కెనడా ఈ విషయంలో మిగిలిన వాటికి మినహాయింపు.

టెన్నిస్ ఇందుకు పూర్తి విరుద్ధం. బంతి సర్వ్ చేయడం నుంచి ర్యాలీ వరకు ఆద్యంతం ఉత్తేజకరంగా ఉంటుంది. మ్యాచ్ ఎప్పుడో తప్ప మూడు గంటలు దాటదు. ఒకవేళ అయిదుకు వెళ్లినట్లయితే, అప్పుడది మనల్ని కట్టిపడేస్తుంది. ఈ గేమ్ ఆడని దేశాలు చాలా తక్కువ.

ఈ వారం వింబుల్డన్‌లో ఆల్ ఇంగ్లాండ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఆది వారం నాటికి టోర్నమెంటు సరిగ్గా చెరిసగంలో ఉంటుంది. మీరూ చూస్తుంటారు... లేనట్లయితే, తప్పకుండా చూడండి.

ముందుగా చెప్పుకోవలసింది టెన్నిస్ క్రీడ టీవీ కోసమే పుట్టినట్లుంటుందనే సంగతి. క్రికెట్ లేదా ఫుట్‌బాల్‌తో పోల్చుకుంటే ఈ మాట దీనికి ఇంకా బాగా వర్తిస్తుంది. కారణం సింపుల్. కెమెరా అటు కోర్టులో యాక్షన్‌ను కళ్ల ముందుంచుతుంది. ప్లేయర్లు ఎలా ఆడుతున్నారో కూడా చూపెడుతుంది. ఫుల్ కోర్ట్ కెమెరా ఫ్రేమ్ – అది ఆటగాళ్ల వెనుక నుంచి గానీ, పక్క నుంచి గానీ– దూరం నుంచి చూస్తున్నట్లు అనిపించదు. దీంతో గేమ్‌లో పూర్తిగా లీనమైపోతాం.

ఇక క్రికెట్‌ను చూద్దాం. బ్యాట్స్‌మన్ ఎలా ఆడుతున్నాడో అర్థం చేసుకోవాలంటే, ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు మైదానంలో ఎలా మోహరించి ఉన్నారో తెలియాలి. అంటే వైడ్ షాట్స్ కావాలి. మీరు బ్యాట్స్‌మన్‌ను, బంతిని సరిగ్గానే చూడగలరు. అలాగే పూర్తి ఫీల్డునూ చూడొచ్చు. కాని రెంటినీ ఒకేసారి చూడలేరు. కాబట్టి, ఏ ఒక్క సమయంలోనూ గేమ్ పూర్తి పిక్చర్ మీకు అర్థం కాదు. ఇక్కడ వాస్తవం ఏమిటంటే, టెన్నిస్ గేమ్‌ను టీవీలోనే బాగా చూడగలం. క్రికెట్, ఫుట్‌బాల్ సరిగ్గా చూడాలంటే స్టేడియంకు వెళ్లాలి.

1980లలో ఓపెనింగ్ మ్యాచ్ చూసేందుకు నేను మొట్టమొదటి సారి వింబుల్డన్‌కు వెళ్లాను. అంపైర్ కుర్చీకి ఎగువనే సెంటర్ కోర్టులో మాకు మంచి సీట్లు దొరికాయి. అయితే ఆట మొదలు కాగానే తెలిసి వచ్చింది. బాల్ కొట్టిన ప్రతిసారీ మేం మెడలు అటూ ఇటూ తిప్పాల్సి వచ్చేది. ఎడమకు, కుడికి, ఎడమకు, కుడికి! అంతే... ఓ గంట గడిచే సరికి మెడ నొప్పి అనిపించింది.



◆ టెన్నిస్ క్రీడ టీవీ కోసమే పుట్టినట్లుంటుంది. కారణం సింపుల్. కెమెరా అటు కోర్టులో యాక్షన్‌ను కళ్ల ముందుంచుతుంది. ప్లేయర్లు ఎలా ఆడుతున్నారో కూడా చూపెడుతుంది. అదే క్రికెట్, ఫుట్‌బాల్‌లో గేమ్ పూర్తి పిక్చర్ సరిగ్గా అర్థం కాదు. వాటిని సరిగ్గా చూడాలంటే స్టేడియంకు వెళ్లాలి.

తర్వాతిసారి ప్లేయర్ వెనుకగా ఉండే సీటును సెలెక్టు చేసుకున్నాను. ఈసారి బంతితో పాటు మెడ అటూ ఇటూ తిప్పాల్సిన అవసరం కలగలేదు. అయితే ఇక్కడ వేరే సమస్య ఎదురైంది. నేను రెండో ప్లేయరుకు ఆపోజిట్ సైడ్ చివరన ఉన్నాను. ఆ ప్లేయర్ చాలా దూరంగా ఉన్నట్లు అనిపించింది. టీవీలో చూస్తున్నప్పుడు మనకు ఈ సమస్యలు రావు.

మరి టీవీని కాదని వింబుల్డన్‌కు ఎందుకు వెళ్తారు? వింబుల్డన్ కేవలం ఒక అద్భుతమైన టెన్నిస్ క్రీడ మాత్రమే కాదు. అదో సోషల్ ఈవెంట్. ఓ వంక టెన్నిస్ ఆట, మరోవైపు బ్రిటిష్ వ్యాపార సంస్థలు అందించే వినోదం... అంతా సరదాగా ఉంటుంది. స్ట్రాబెరీస్, క్రీమ్, ఒక గ్లాస్ షాంపేన్ ... చెప్పలేని మజా ఇస్తాయి.

బ్యోర్న్ బాగ్ వర్సెస్ జాన్ మెకెన్రో 1980 ఫైనల్ నేను చూసిన బెస్ట్ మ్యాచ్ అని చెప్పగలను. నాలుగో సెట్‌లో బాగ్‌కు 7 ఛాంపియన్‌షిప్ పాయింట్లు ఉన్నా వేటినీ గెలుచుకోలేకపోయాడు. సెట్ ఓడిపోయాడు. దాంతో, ఐదో సెట్ గెలిచే వరకూ సర్వశక్తులూ ఒడ్డి పోరాడవలసి వచ్చింది. ఇది అతడి అయిదో వింబుల్డన్ ఛాంపియన్‌షిప్ విజయం. అయితే ఆ తర్వాత ఎప్పుడూ నెగ్గలేదు. 1981లో ఫైనల్ వరకు వచ్చినా, మెకెన్రో అతడిపై ప్రతీకారం తీర్చుకున్నాడు.

ఈ ఏడాది నోవాక్ జొకోవిచ్ గనుక గెలిచేట్లయితే అది అతడి 25వ గ్రాండ్ స్లామ్ అవుతుంది. ఇప్పటి వరకు వేరెవరూ ఈ ఘనత సాధించలేదు. విజేత కార్లోస్ అల్కరాజ్ అయినట్లయితే, 1968లో ప్రారంభమైన 'ఓపెన్ ఎరా'లో వరుసగా మూడుసార్లు గెలిచిన అయిదో ఆటగాడు అవుతాడు. ఇంతకు ముందు ఈ అద్భుతం సాధించినవారు: బ్యోర్న్ బాగ్, పీట్ సంప్రాస్, రోజర్ ఫెదరర్, నోవాక్ జొకోవిచ్. అంతే కాకుండా, బాగ్ తర్వాత ఒకే ఏడాది వరుసగా ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ రెండుసార్లు కైవసం చేసుకున్న కీర్తి దక్కుతుంది. బాగ్ 1980లో ఈ ఘనత సాధించాడు. జాన్నిక్ సిన్నర్ విజేత అయినట్లయితే, వింబుల్డన్ గెలిచిన తొలి ఇటాలియన్ అవుతాడు. గతంలో మత్తెయో బెరెత్తీనీ 2021 వింబుల్డన్ ఫైనల్‌కు చేరుకున్నా జొకోవిచ్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

ఇప్పుడు చెప్పండి, టెన్నిస్ వీక్షించడానికి ఇంత కంటే మంచి కారణాలు ఇంకేం ఉంటాయి?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

కర్మ సూత్రం

జీవులు అనుభవించే మంచి చెడు ఫలితాలకు వాళ్ళు గతంలో చేసిన కర్మలే కారణమన్నది భగవద్గీత సారాంశం. అయినా, మనుషులు మాయలో పడి, తమకు జరిగే అనుభవాలకు ఇతరులెవరో కారణం అని భావిస్తారు.

భీష్మునితో ధర్మరాజు... 'పట్టుదలతో చుట్టపక్కాలను చంపుకున్నాను. దుర్యోధనుడు రాజ్యం పంచుకోవటానికి ఇష్ట పడలేదు. నేనైనా కోపం మాని, అతడిని రాజ్యం అనుభవించనీయలేదు. మా ఇద్దరి వల్ల ఇంత జన నష్టం జరిగింది' అని బాధ పడ్డాడు. అప్పుడు భీష్ముడు 'చంపటానికి మనిషి కర్త కాడు' అని ఉదాహరణ పూర్వకంగా ఒక కథ చెపుతాడు.

జ్యోతిర్మయం

గౌతమి అనే వనిత కుమారుడు పాము కాటుకు చనిపోతాడు. ఆమె దుఃఖిస్తుండగా ఒక వేటగాడు ఆ పామును చంపబోయాడు. ఆమె వారించి, 'పామును చంపితే నా బిడ్డ బతుకుతాడా? శత్రువునైనా చేత చిక్కితే చంపటం న్యాయం కా'దంది.

పాము తాను మృత్యు దేవత పంపగా వచ్చాను కానీ, స్వయం కర్తను కాదంది. అంతలో మృత్యువు వచ్చి, తాను యముడు పంపగా వచ్చానని, తాను ఆ బాలుడి మరణానికి కారణం కాదంది. యమధర్మరాజు వచ్చి... పాము, మృత్యువు, తాను ఈ బాలుడి మరణానికి కారణం కాము; అతడి కర్మలే కారణం. జీవుడు కర్మఫలాన్ని తప్పించుకోలేడని చెబుతాడు. వేటగానికి జ్ఞానోదయమై వెళ్ళిపోతాడు. కాబట్టి, 'యుద్ధంలో బంధు మిత్రులు మరణించటానికి వారి కర్మలే కారణం కానీ, నీవు గానీ, దుర్యోధనుడు గానీ కారణం కాదు' అని భీష్మ పితామహుడు చెప్పాడు.

తెలిసి చెడు కర్మలు చేయకుండా ఉండటమే మనుషుల కనీస కర్తవ్యం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం; తిథి: శు.ద్వాదశి రా.10.17 వరకు, తదుపరి త్రయోదశి; నక్షత్రం: అనూరాధ రా.1.13 వరకు, తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ప.12.26 నుండి 1.18 వరకు; తదుపరి ప.3.03 నుండి 3.55 వరకు; అమృత ఘడియలు: ప.1.40 నుండి 3.23 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు; సూర్యోదయం: 5.34, సూర్యాస్తమయం: 6.35.

క్లుప్తంగా...

గొంతులో పూరీ ఇరుక్కుని..

- ఊపిరాడక యువకుని మృతి



రాజాపూర్‌: పూరీ తింటుండగా గొంతులో ఇరుక్కుని ఒక యువకుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్‌ జిల్లా రాజాపూర్‌ మండలం ఖానాపూర్‌లో జరిగిన ఈ సంఘటన వివరాలివి. తిర్మలాపూర్‌ గ్రామానికి చెందిన రైతు రాంరెడ్డి దగ్గర ఖానాపూర్‌ గ్రామానికి చెందిన బ్యాగరి కుమార్‌ (25), బాంద్ర గిరయ్య పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పొలం పనులు చేస్తున్న కుమార్‌, గిరయ్య తినడానికి.. రైతు రాంరెడ్డి పూరీలు తీసుకువచ్చాడు. ఇద్దరూ పూరీలు తింటుండగా.. కుమార్‌ గొంతులో ఇరుక్కుపోయింది. పక్కనే ఉన్న గిరయ్య నీళ్లు తెచ్చి తాగించేందుక ప్రయత్నిస్తుండగానే.. కుమార్‌ కింద పడిపోయి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడు మృతి చెందడంతో.. తల్లి రాజమణి, చెల్లెలు తమకు దిక్కెవరంటూ బోరున విలపించారు. కుమార్‌ మృతితో ఖానాపూర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

గుండెపోటుతో చిన్నారి మృతి



మిథున

స్టేషన్‌ఘన్‌పూర్‌: గుండెపోటుతో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గోవింద్‌ అశోక్‌, అనూష దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, ఉపాధి కోసం వీరు హైదరాబాద్‌కు వెళ్లారు. అశోక్‌ అక్కడే ఓ ప్రైవేట్‌ కంపెనీలో పనిచేస్తున్నారు. రెండో కుమార్తె మిథున (6) శనివారం రాత్రి ఛాతీలో నొప్పి వస్తుందని అంటూ.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడి అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే తల్లిదండ్రులు హైదరాబాద్‌లోనే ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే పాప మృతిచెందింది. కాగా, గుండెపోటుతో తమ కుమార్తె మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని తల్లిదండ్రులు తెలిపారు.

అర్ధరాత్రి చెట్ల తొలగింపుపై ఉద్రిక్తత

- వ్యవసాయ వర్సిటీలో పనులను అడ్డుకున్న విద్యార్థి నాయకులు.. పోలీసుల రంగప్రవేశం
- నిబంధనల ప్రకారమే అన్న వీసీ..

ఏజీ వర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవరణలోని బొటానికల్‌ గార్డెన్‌లో శనివారం అర్ధరాత్రి పలు చెట్ల తొలగింపు ఉద్రిక్తతకు దారితీసింది. 20 జేసీబీలతో చెట్లను నరికి వేయడంతోపాటు చదును చేస్తున్న పనులను విద్యార్థి నాయకులు అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై వీసీ అల్దాస్‌ జానయ్య ఆదివారం విలేకర్ల సమావేశంలో వివరణ ఇచ్చారు. క్యాంపస్‌లో కొన్ని దశాబ్దాలుగా వాతావరణానికి ముప్పు కలిగించే సుబాబుల్‌, యూకలిప్టస్‌ లాంటి చెట్లు పెరిగాయని.. వాటిని తొలగించేందుకు అటవీ శాఖ లేబర్‌ నిబంధనలకు అనుగుణంగా టెండర్లను పిలిచి మేలో పనులను అప్పగించినట్లు తెలిపారు. వాటిని తొలగించాక చదును చేసి అరుదుగా లభించే అటవీ మొక్కలైన జిట్రేగి, బండారు, సోమి, కరక, తాని, ఏగిస, బట్టకడిమ, బుద్దదరిమి, పూసుగు తదితర మొక్కలను నాటుతున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో 150 ఎకరాల్లో అత్యంత అరుదుగా లభించే మొక్కలను సేకరించి నాటనున్నట్లు తెలిపారు. అటవీ శాఖ, హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో మొక్కలను నాటి పెంచనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. సోషల్‌ మీడియాలో కొందరు అసత్య ప్రచారం నిర్వహిస్తున్నారని.. ఇది సరికాదన్నారు. విద్యార్థి నాయకుడు రాజ్‌ కుమార్‌ మాట్లాడుతూ ఈ అంశంపై వీసీ, ఉన్నతాధికారులు తమకు సవివరంగా తెలియజేశారని.. హరితహారం కార్యక్రమం గురించి తమకు తెలియదన్నారు.

పేలుడు పదార్థాల కేసులో టీపీసీసీ నేత అరెస్ట్‌

కామారెడ్డి క్రైం: అక్రమంగా పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను నిల్వ ఉంచారన్న ఆరోపణలపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం అర్ధరాత్రి కామారెడ్డి పోలీసులు ఆయనను అరెస్టు చేసి నిజామాబాద్‌ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో అతడి సోదరుడు గడ్డం సురేందర్‌రెడ్డితోపాటు మరో ఆరుగురిపై కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం సురేందర్‌రెడ్డి పరారీలో ఉన్నారు. ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కేపీఆర్‌ కాలనీలో కొందరు ఇంటి నిర్మాణం కోసం పేలుడు పదార్థాలతో బండరాళ్లు పగులగొట్టడానికి యత్నిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి విచారించారు. వారు చెప్పిన వివరాల ఆధారంగా కామారెడ్డి సమీపంలోని లింగాపూర్‌ వద్ద ఉన్న వెంచర్‌లో పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ఓ గదిలో దాచిన 1,564 జిలెటిన్‌ స్టిక్స్‌, 41 డిటోనేటర్లు, 16 బెండల్స్‌ కార్డెక్స్‌ వైరు, బ్యాటరీ, చెక్‌ మీటర్‌ ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలు లభించిన గది, పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ భర్త, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, అతడి సోదరుడు గడ్డం సురేందర్‌రెడ్డిలదిగా గుర్తించారు. దీంతో శనివారం అర్ధరాత్రి చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేశారు. అధికార పార్టీ నాయకుడు అరెస్టు కావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రైతును కన్నీళ్లు పెట్టిస్తున్న అల్లం

- క్వింటాలుకు రూ.2000 లకు పడిపోయిన ధర
- కేరళ అల్లం దెబ్బకు మన అల్లం కొనేవారు కరువు
- సంగారెడ్డి జిల్లాలో ఏటా 3 వేల ఎకరాల్లో సాగు
- ఈసారి మాత్రం 500 ఎకరాలకే పరిమితమైన పంట
- ఇప్పటికీ భూమిలోనే గత ఏడాది వేసిన అల్లం
- తీవ్ర నష్టాలతో సాగు మానుకుంటున్న రైతులు



జహీరాబాద్‌ ప్రాంతంలో గత ఏడాది సాగుచేసిన అల్లం పంట

జహీరాబాద్‌: వంటకు రుచిని, ఒంటికి ఆరోగ్యాన్ని ఇచ్చే అల్లం అన్నదాతకు మాత్రం కన్నీళ్లు తెప్పిస్తోంది. 8 నెలలు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, అకాల వర్షాలతో కొంత పాడైపోయి రైతులు నిండా నష్టాల్లో కూరుకుపోయారు. తెలంగాణలో అత్యధికంగా అల్లం సాగయ్యేది సంగారెడ్డి జిల్లాలోనే. జిల్లాలో ఏటా దాదాపు 3 వేల ఎకరాల్లో అల్లం పంటను సాగు చేస్తారు. ఇందులో 90% పంట జహీరాబాద్‌ ప్రాంతంలోనే సాగవుతుంది. కానీ, గత ఏడాది వేసిన పంటనే కొనేవారు లేక పోవటంతో ఈ ఏడాది పంట వేయటానికి రైతులు వెనుకంజ వేశారు. ఈ ఏడాది 500 ఎకరాలకు మించి పంట వేసే అవకాశం లేదని చెబుతున్నారు. గతంలో అల్లం పంటకు క్వింటాలు ధర రూ.8 వేల నుంచి రూ.16 వేల వరకు పలికేది. ప్రస్తుతం రూ.2,000 నుంచి రూ.2,500లు మాత్రమే వస్తోంది. సాగు కోసం ఎకరాకు రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇంత కష్టపడి పండిస్తే వ్యాపారులు 113 కిలోలను క్వింటాలుగా (100 కిలోలు) లెక్కకట్టి కొనుగోలు చేస్తున్నారు. అసలే ధర లేక నష్టపోతున్న తమను వ్యాపారులు ఇంకా దోచుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ధర లేక పొలాల్లోనే పంట

గత ఏడాది జూన్‌లో వేసిన పంట చాలావరకు ఇప్పటికీ పొలాల్లోనే ఉంది. కొందరు రైతులు అవసరాల కోసం జనవరి నుంచి మే వరకు పంటను తీసి విక్రయించుకున్నారు. 30 శాతం మేర పంట వర్షాలకు దెబ్బతింది. సుమారు వేయి ఎకరాల మేర పంట ఇంకా భూమిలోనే ఉంది. దీంతో గిట్టుబాటు ధర లేక ఒకవైపు.. కొత్త పంట వేయటానికి వీలు పడక మరోవైపు రైతులు నష్టపోతున్నారు.

దెబ్బకొట్టిన కేరళ అల్లం

కొన్నాళ్ల క్రితం వరకు దేశంలో అల్లం పంటను అత్యధికంగా సంగారెడ్డి జిల్లాతోపాటు కేరళలోనే పండించేవారు. ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో పండిస్తున్నారు. కేరళ అల్లం మన అల్లంకంటే నాణ్యంగా ఉంటుంది. అదిప్పుడు హైదరాబాద్‌ మార్కెట్‌ను ముంచెత్తుతుండటంతో తెలంగాణ అల్లానికి డిమాండ్‌ పడిపోయిందని చెబుతున్నారు. కేరళ వాతావరణం అల్లం సాగుకు అనుకూలంగా ఉండడం వల్ల ఎకరాకు సుమారు 300 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది. మనదగ్గర 70 నుంచి 100 క్వింటాళ్లకు మించి దిగుబడి రాదు. ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, అస్సాంలో కూడా అల్లం సాగు విస్తరించింది. కేరళలో ఏటా సుమారు 5 లక్షల ఎకరాల్లో పంట సాగవుతోంది. తెలంగాణకు నిత్యం కేరళ నుంచి వంద టన్నుల మేర దిగుమతి అవుతున్నట్లు అంచనా. దీంతో మన రైతులు పంటకు డిమాండ్‌ లేక నష్టపోతున్నారు.

కొనుగోలు చేసేవారు లేక సాగు మానుకున్న



2006 నుంచి అల్లం సాగు చేస్తున్నా. ప్రస్తుతం మార్కెట్లో మన పంటను కొనేవారు లేక ఈ ఏడాది పంట సాగు మానుకున్న. గత ఏడాది 20 ఏకరాల్లో పంట వేస్తే.. మొత్తం పంట భూమిలోనే ఉంది. ఎకరాకు రూ.2.50 లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టాను. ప్రస్తుతం లాభాల మాట అటుంచితే పంటను కొనేవారే దిక్కులేరు. క్వింటాలుకు కనీసం రూ.3,500 ధర ఉంటే పెట్టుబడులు అయినా తిరిగి వస్తాయి. క్వింటాలు ధర కనీసం రూ.5 వేల పైన ఉంటేనే కొంత గిట్టుబాటు అవుతుంది. రైతుల పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– రవీందర్‌రెడ్డి, రైతు, ధనాసిరి

6 ఎకరాలు సాగు చేశా.. రూ.14 లక్షలు నష్టపోయా



గత ఏడాది జూన్‌లో 6 ఎకరాల్లో అల్లం పంట సాగు చేశాను. సుమారు రూ.16 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. వర్షాలకు పంట దెబ్బతింది. ఉన్న పంటను విక్రయించగా మార్కెట్లో ధర లేక రూ.2 లక్షలు మాత్రమే వచ్చింది. దీంతో రూ.14 లక్షల మేర నష్టపోయాను. 20 సంవత్సరాలుగా అల్లం పంట సాగు చేస్తూ వచ్చా. ఈ ఏడాది మాత్రం సాగును పూర్తిగా విరమించుకున్న.

–వెంకట్‌రెడ్డి, రైతు, హోతి (కె)

యాదగిరిగుట్టకు భక్తుల తాకిడి



ఆలయ ముఖ మండపం క్యూలైన్‌లో భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు, తొలి ఏకాదశి కావడంతో శ్రీస్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కాగా.. శ్రీవారి ధర్మ దర్శనానికి 3 గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.57,28,842 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

యాదగిరీశుడి సేవలో తొగుట పీఠాధిపతి



మాధవానంద సరస్వతి స్వామీజీకి యాదగిరీశుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో వెంకట్రావ్‌

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ మండపంలో స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠ అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాధవానంద సరస్వతి స్వామీజీకి అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఈవో వెంకట్రావ్‌ లడ్డూ ప్రసాదం, శ్రీస్వామి చిత్రపటాన్ని అందజేశారు.

42కు చేరిన సిగాచి మృతులు

- చికిత్స పొందుతూ ఆదివారం మరో కార్మికుడి మృతి
- డీఎన్‌ఏ టెస్ట్‌తో ఆచూకీ లేని 9 మందిలో ఒకరి గుర్తింపు
- రెండు మృతదేహాలు, ఒకరి శరీర భాగాలు కుటుంబాలకు అప్పగింత
- ఇంకా 70కి పైగా శరీర అవశేషాల రిపోర్టుల కోసం ఎదురుచూపు
- సిగాచి ప్రతినిధులను ప్రశ్నించిన భానూరు పోలీసులు



మృతుల కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి /పటాన్‌చెరు టౌన్‌: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడులో మృతుల సంఖ్య 42కు చేరింది. తీవ్ర గాయాలతో పటాన్‌చెరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జితేందర్‌ అనే కార్మికుడు ఆదివారం మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి సేకరించిన శరీరభాగాలకు నిర్వహించిన డీఎన్‌ఏ పరీక్షల్లో ఆచూకీ లభించని 9 మందిలో అఖిల్‌ అనే కార్మికుడి డీఎన్‌ఏ అతడి కుటుంబసభ్యుల డీఎన్‌ఏతో సరిపోలింది. దీంతో ఆచూకీ లేకుండా పోయిన వారిలో ఒకరు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆ శరీరభాగాలను ఆదివారం సంబంధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. మరోవైపు పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలోని రెండు మృతదేహాల డీఎన్‌ఏ రిపోర్టులు రావడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన చికెన్‌సింగ్‌, ఇస్నాపూర్‌కు చెందిన రామాంజనేయుల మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాలను తరలించేందుకు అంబులెన్స్‌లను ఏర్పాటుచేయటంతోపాటు తక్షణ సాయం కింద రూ.1 లక్ష అందజేశారు. ప్రస్తుతం ఈ మార్చురీలో శిథిలాల కింద దొరికిన సుమారు 70 వరకు శరీరభాగాలు మాత్రమే ఉన్నాయి. వీటి డీఎన్‌ఏ రిపోర్టులు రావాల్సి ఉంది.

రెండోసారి శాంపిల్స్‌ సేకరణ..

పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉన్న మరికొన్ని శరీర భాగాలకు సంబంధించిన డీఎన్‌ఏ రిపోర్టులు, ఆచూకీ లేకుండా పోయిన ఎనిమిది మంది కుటుంబ సభ్యుల డీఎన్‌ఏ రిపోర్టులు సరిపోలటంలేదు. దీంతో రెండోసారి వారి నుంచి శాంపిళ్లను సేకరించి ఫోరెన్సిక్‌ ల్యాబ్‌కు పంపుతున్నారు. సోమ, మంగళవారాల్లో ఈ రిపోర్టులు వచ్చే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఘటనా స్థలంలో రెస్క్యూ ఆపరేషన్‌ ఆదివారం కూడా కొనసాగింది. ఎస్‌డీఆర్‌ఎఫ్‌, హైడ్రా బృందాలు శిథిలాలను జల్లెడ పడుతున్నాయి. శిథిలాల నుంచి ఎముకలు, శరీర అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో సిగాచి ప్రతినిధులు..

సిగాచి పరిశ్రమ ప్రతినిధులను సంగారెడ్డి జిల్లా బీడీఎల్‌ భానూరు పోలీసులు ఆదివారం ప్రశ్నించారు. పరిశ్రమలో పనిచేస్తున్న వివిధ విభాగాధిపతులను స్టేషన్‌కు పిలిచి సమాచారాన్ని సేకరించారు. వారిలో హెచ్‌ఆర్‌, అడ్మినిస్ట్రేషన్‌, క్వాలిటీ కంట్రోల్‌ తదితర విభాగాలకు చెందిన వారున్నట్లు సమాచారం. ఈ పేలుడు ఘటనపై బీడీఎల్‌ పోలీసులు జూన్‌ 30న కేసు (క్రైం నెం.184/2025) నమోదు చేసిన విషయం విదితమే. బీఎన్‌ఎస్‌ 105, 110, 117 సెక్షన్ల కింద ఈ కేసు నమోదు చేశారు.

అడవిలోకి తీసుకెళ్లి.. ఆలిని హతమార్చాడు


- అనుమానంతో ఓ భర్త ఘాతుకం
- ఆదిలాబాద్‌ జిల్లాలో ఘటన



వందన

ఆదిలాబాద్‌ టౌన్‌: అనుమానం పెనుభూతమై ఓ భర్త కట్టుకున్న భార్యను కడతేర్చాడు. ఈ ఘటన ఆదిలాబాద్‌ జిల్లా తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్‌ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆదిలాబాద్‌ పట్టణం సుందరయ్యనగర్‌కు చెందిన హింగోలి శంకర్‌కు ఇంద్రవెల్లిలోని నర్సాపూర్‌కు చెందిన వందన (45)తో 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 20 ఏళ్లు పైబడిన ఇద్దరు కుమారులు, 17 ఏళ్ల కుమార్తె ఉన్నారు. శంకర్‌ కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తుండగా, ఆయన భార్య గృహిణి. సాఫీగా సాగిన వీరి సంసార జీవితంలో భార్యపై అనుమానం శంకర్‌లో అశాంతి రేపింది. టూటౌన్‌ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భార్యకు ఆరోగ్యం బాగాలేదని, క్షుద్రపూజలు చేయిస్తానని, ఆయుర్వేద మందు తాగిస్తానని చెప్పి ఈనెల 2న శంకర్‌ ఆదిలాబాద్‌ నుంచి వందనను బస్సులో తీసుకెళ్లాడు. తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్‌ అటవీ ప్రాంతం (మహారాష్ట్ర సరిహద్దు)లోకి తీసుకెళ్లి చెట్లకు పసుపు కుంకుమతో పూజలు చేస్తున్నట్లు నటించాడు. వెంట తెచ్చుకున్న కారంపొడిని వందన కళ్లలో చల్లాడు. ఆమె తప్పించుకునే ప్రయత్నం చేయగా బండరాయితో తలపై బాదాడు. దీంతో రక్తపు మడుగులో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఇంటి నుంచి వెళ్లిన అమ్మ నాన్న తిరిగి రాకపోవడంతో పిల్లలు ఆందోళనకు గురయ్యారు. శనివారం రాత్రి కూతురు ప్రియాంక టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా, అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకొని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. సంఘటన స్థలానికి ఆదిలాబాద్‌ డీఎస్పీ ఎల్‌.జీవన్‌రెడ్డితో పాటు పోలీసులు వెళ్లి చూడగా ఆమె మృతదేహం కుళ్లిపోయి ఉంది. కాగా నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

శ్రీశైలం డ్యాంకు పెరుగుతున్న వరద తాకిడి



శ్రీశైలంప్రాజెక్ట్‌: శ్రీశైలం జలాశయానికి వరద తాకిడి పెరుగుతోంది. జూరాల, సుంకేశుల స్పిల్‌వేలతో శ్రీశైలానికి నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం నుంచి ఆదివారం వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి 1,44,461 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. విద్యుత్‌ ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 60,559 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 14.461 మిలియన్‌ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.109 మిలియన్‌ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరదను అంచనా వేసుకుంటూ దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. కొద్ది రోజులుగా విద్యుత్‌ ఉత్పాదన ద్వారా నాగార్జునసాగర్‌కు, బ్యాక్‌ వాటర్‌ నుంచి తెలంగాణలోని కల్వకుర్తి ఎత్తిపోతలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా ఆంధ్రాలోని ఎస్‌ఆర్‌బీసీ కాలువలకు నీరు విడుదల చేశారు. ఆదివారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయంలో 184.2774 టీఎంసీలకు నీరు నిల్వ ఉంది. దీంతో డ్యాం నీటిమట్టం 879.30 అడుగులకు చేరుకుంది.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు



బీబీనగర్‌: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌ మండలంలోని గూడూరు గ్రామ పరిధిలో హైదరాబాద్‌– వరంగల్‌ జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు భువనగిరి వైపు వాహనాలు బారులుదీరాయి. తొలి ఏకాదశి సందర్భంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలిరావడంతో వాహనాల రద్దీ నెలకొంది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో టోల్‌ప్లాజా వద్ద రాత్రి వరకు వాహనాలు హైదరాబాద్‌ వైపు బారులుదీరాయి.

తల్లిపై ద్వేషంతో కూతురి హత్య

- కోరుట్ల చిన్నారి హత్య కేసులో చిన్నమ్మపై అనుమానం



చిన్నారి ఇంటి వద్ద గుమిగూడిన జనం

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో శనివారం రాత్రి హత్యకు గురైన ఆరేళ్ల బాలిక హితాక్షి కేసు కొత్త మలుపు తిరిగింది. చిన్నారిని ఆమె చిన్నమ్మే హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ముందుగా మృతదేహం దొరికిన ఇంటి యజమానిని అనుమానించినా.. అతడికి ఈ హత్యతో సంబంధం లేదని నిర్ధారించుకున్నారు. తోటికోడలు పెత్తనం సహించలేకే ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. హత్యలో ఒక్కరే ఉన్నారా..? మరెవరైనా పాలుపంచుకున్నారా..? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఆదర్శనగర్‌కు చెందిన సోదరులు ఆకుల రాము, లక్ష్మణ్‌లకు నవీన, మమతతో వివాహమైంది. నవీన, మమత అక్కాచెల్లెళ్ల కూతుళ్లు. రాము, నవీన దంపతులకు కుమారుడు వేదాంశ్‌, కూతురు హితాక్షి (6) ఉన్నారు. లక్ష్మణ్‌, మమత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. నాలుగు నెలల క్రితం మమత ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడి రూ.18 లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. దీనిపై కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో సైబర్‌క్రైం కేసు నమోదైంది. వారి కుటుంబంలో కొద్దికాలంగా గొడవలు కూడా జరుగుతున్నాయి. ఇంట్లో నవీనకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆమెపై మమత ద్వేషం పెంచుకున్నట్లు తెలిసింది. శనివారం ఉదయం వేదాంశ్‌, హితాక్షిని స్కూల్‌కు పంపిన నవీన.. ఆడపడుచుతో కలిసి షాపింగ్‌కు వెళ్లింది. ఇంట్లో అత్తతోపాటు మమత మాత్రమే ఉంది. సాయంత్రం స్కూల్‌ నుంచి పిల్లలు రాగానే మమత వారితో కలిసి పెద్దపులుల వేషధారణలు చూసేందుకు వెళ్లింది. అదే సమయంలో తన వెంట కూరగాయలు కోసే కత్తి, మొక్కలు కత్తిరించే కట్టర్‌ను తీసుకెళ్లినట్లు సమాచారం. సమీపంలోని ఇంటికి గేటు, బాత్‌రూంకు తలుపు లేకపోవడం.. సదరు ఇంటి యజమానికి ఆ ఏరియాలో కొంత వివాదాస్పదుడిగా పేరు ఉండటంతో ఆ ఇంటిని హత్య కోసం ఎంచుకున్నట్లు సమాచారం. రాత్రి 7.30 గంటల సమయంలో ముగ్గురు పిల్లలను ఇంటికి పంపిన మమత.. హితాక్షిని సదరు ఇంట్లోకి తీసుకెళ్లి గొంతుపై కత్తితో కోసి, కట్టర్‌తో మెడ, గొంతు చుట్టు కత్తిరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హితాక్షి చనిపోగానే హడావుడిగా ఇంటికి తిరిగి వెళ్లిన మమత.. రక్తం మరకలు ఉన్న దుస్తులు మార్చుకొని వాటిని వాషింగ్‌ మెషీన్‌లో వేసి, అందరితోపాటు హితాక్షి కోసం వెతికినట్లు తెలిసింది. హితాక్షి మృతదేహం దొరకగానే నవీనతో కలిసి ఆస్పత్రికి వచ్చిన మమత అక్కడ బోరున విలపించడం గమనార్హం.

• ఆటోరిక్షా హ్యాండ్‌బ్యాగ్

ధర కేవలం 35 లక్షలే



పారిస్: ఫ్యాషన్ పుట్టిల్లుగా పేరొందిన ఫ్రాన్స్‌లోని పారిస్‌లో కొత్త డిజైన్ విలాసవంత వస్తువొకటి మార్కెట్లోకి రంగ ప్రవేశం చేసింది. కొత్త ఫ్యాషన్‌కు అనుగుణంగా మెటీరియల్ కొని, కొలతలు ఇచ్చి, ధరించేలోపే ఆ ఫ్యాషన్ పాతబడిపోతుందని పారిస్ గురించి చెబుతుంటారు. అలాంటి నగరంలో సరికొత్త హ్యాండ్ బ్యాగ్ ఒకటి ఇప్పుడు సందడి చేస్తోంది. భారత్‌లో ఇరుకు సందుల్లో సర్రున దూసుకుపోయే సామాన్యుడి రథంగా పేరొందిన ఆటోరిక్షా ఆకృతిలో కొత్త బ్యాగ్‌ను సిద్ధంచేశారు. ప్రఖ్యాత ఫ్రాన్స్ లగ్జరీ బ్రాండ్ లూయిస్ విటన్ సంస్థ నిపుణులు ఈ బ్యాగ్‌ను రూపొందించారు. మూడు చక్రాలతో, రెండు చేతి హ్యాండిళ్లతో ఎంతో అందంగా బ్యాగ్‌కు తుదిరూపునిచ్చారు. ఒంటి రంగులో అత్యంత నాణ్యమైన తోలుతో దీనిని తయారుచేశారు. మెన్స్ స్ప్రింగ్/సమ్మర్ 2026 కలెక్షన్‌లో భాగంగా భారతీయత ఉట్టిపడేలా నవ కల్పనకు ఇలా జీవంపోశారు. మెన్స్‌వేర్ విభాగ క్రియేటివ్ డైరెక్టర్ అయిన ఫారెల్ విలియమ్స్ సారథ్యంలోని బృందం ఈ ఆటోరిక్షా హ్యాండ్ బ్యాగ్‌ను రూపొందించింది. దీని ధర కేవలం 35 లక్షల రూపాయలు అని 'డైట్ పరాటా' అనే నెటిజన్ ఒకరు వెల్లడించారు. వైకుంఠపాళి డిజైన్ ర్యాంప్‌వాక్ స్టేజీపై ఒక వ్యక్తి నడుచుకుంటూ వచ్చి ఈ బ్యాగ్‌ను ప్రదర్శిస్తున్న వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో తెగ వైరల్ అవుతోంది. దీనిపై కామెంట్ల పరంపర కొనసాగింది. ''మధ్య తరగతి వాహనం ఇలా ఎట్టకేలకు పారిస్ ఫ్యాషన్ షోలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది'', ''పశ్చిమ దేశాలకు ఒక్కసారిగా ఆసియా ఖండం, భారత్‌పై మక్కువ పెరిగినట్లుంది. ప్రాడా వారి కొల్హాపురీ పాదరక్షలు, బాస్మతీ రైస్ బ్యాగులతో దుస్తులు.. ఇలా ఇంకెన్నో వస్తువులు ఇప్పుడు ఒక్కసారిగా అంతర్జాతీయ ఫ్యాషన్‌గా మారిపోయాయి'' అని కామెంట్లు పెట్టారు. ''ఫ్యాషన్ డిజైనర్ల మెదళ్లలో ఐడియాలు ఇంకిపోయాయి. అందుకే ఇలా భారత్‌పై పడ్డారు'', ''ఆటో బాగుందిగానీ ఎక్కడి నుంచి లోపలికి ఎక్కాలి?'', ''ఆ బ్యాగ్ కొనాలంటే ఎన్ని ఆటోలను అమ్మాలో?'' అని మరికొందరు పోస్టులు పెట్టారు. ''గతంలో ఇదే లూయిస్ విటన్ విమానాలు, డాల్ఫిన్లు, పీతల ఆకృతుల్లో బ్యాగులు తెచ్చింది'' అని మరొకరు గుర్తుచేశారు.

భారతీయులకు యూఏఈ గోల్డెన్ వీసా

- రూ.23.3 లక్షలు చెల్లిస్తే జీవితకాల వీసా
- ఆస్తులు, వ్యాపారాలతో అవసరం లేని విధానం



దుబాయ్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం కొత్త రకం గోల్డెన్ వీసా పథకాన్ని ప్రారంభించింది. కొన్ని షరతులతో నామినేషన్ విధానంలో ఈ వీసాను జారీ చేయనుంది. లక్ష అరబ్ ఎమిరేట్స్ దినార్లు (సుమారు రూ.23.3 లక్షలు) ఫీజు చెల్లిస్తే జీవితకాలం వర్తించే వీసా అందజేస్తుంది. ఇప్పటిదాకా దుబాయ్‌లో గోల్డెన్ వీసా పొందాలనుకునే భారతీయులు రూ.4.66 కోట్ల విలువైన ఆస్తిని కొనుగోలు చేసి ఉండాలి. లేదా వ్యాపారంలో భారీగా పెట్టుబడి పెట్టి ఉండాలి. ఇవేమీ అవసరం లేకుండానే కేవలం ఫీజుతోనే వీసాను అందజేసేందుకు ఉద్దేశించిన ఈ విధానంలో వచ్చే మూడు నెలల్లో కనీసం 5 వేల మంది భారతీయులు దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నది దుబాయ్ ప్రభుత్వ వర్గాల అంచనా. పథకం పైలట్ ప్రాజెక్టు కోసం భారత్‌తో పాటు బంగ్లాదేశ్‌ను ఎంపిక చేసింది. గోల్డెన్ వీసా కావాలనుకునే వారు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న రయాద్ గ్రూప్ కార్యాలయాలను సంప్రదించాల్సి ఉంటుంది. లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆ కంపెనీ ఎండీ రయాద్ కమాల్ అయూబ్ చెప్పారు. దరఖాస్తుదారుల పూర్తి వివరాలు, మనీ లాండరింగ్ కేసులు, నేర చరిత్రతోపాటు సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలిస్తామన్నారు. అన్నీ ఓకే అయితేనే ఆ దరఖాస్తును ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. వీసా జారీపై తుది నిర్ణయం ప్రభుత్వమే తీసుకుంటుందని వివరించారు. ఫీడ్ బ్యాక్ ఆధారంగా ముందు ముందు ఈ పథకాన్ని చైనా వంటి ఇతర సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(సెపా) కుదిరిన దేశాలకు దుబాయ్ ప్రభుత్వం వర్తింపజేయనుంది.

జమిలికి ఓకే.. కానీ

సమస్యలను ఎత్తిచూపిన మాజీ సీజేఐలు



న్యూఢిల్లీ: లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే విధానానికి పలువురు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు మద్దతు ప్రకటించారు. అయితే ఎలక్షన్ కమిషన్‌కు అసాధారణ అధికారాలు కట్టబెట్టడం వంటి అంశాల్లో స్పష్టత, పారదర్శకత అవసరమని మాజీ సీజేఐలు జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేఎస్ కేహార్, జస్టిస్ రంజన్ గొగోయ్ అభిప్రాయపడ్డారు. జమిలీ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీకి చంద్రచూడ్ తాజాగా తన అభిప్రాయాలను నివేదించారు. ఒకే దేశం, ఒకే ఎన్నికల విధానానికి మద్దతిస్తూనే 'జమిలీ'లో సవరించాల్సిన లోపాలున్నాయని వ్యాఖ్యానించారు. లోక్‌సభతోపాటు అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమన్న విపక్షాల వాదనను తప్పుబట్టారు. అయితే ఈసీపై అజమాయిషీకి తావులేకుండా అసాధారణ అధికారాలు కట్టబెడుతూ రాజ్యాంగ సవరణ బిల్లులో చేసిన ప్రతిపాదనలను చంద్రచూడ్, గొగోయ్ తప్పుబట్టారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ ముందు చంద్రచూడ్‌తోపాటు మరో మాజీ సీజేఐ జేఎస్ కేహార్ జూలై 11న అభిప్రాయాలను వినిపించనున్నారు. జమిలి కోసం అసెంబ్లీల కాలపరిమితిని తగ్గించడం, పెంచడం వంటి నిర్ణయాలు తీసుకునే అధికారం ఈసీకి కట్టబెట్టాలన్న ప్రతిపాదనతో చంద్రచూడ్ విభేదించారు. మాజీ సీజేఐలు యు.యు.లలిత్, గొగోయ్ ఇప్పటికే అభిప్రాయాలను కమిటీ ఎదుట వెల్లడించారు.

'గ్లోబల్ సౌత్'కు దారుణ అన్యాయం

ద్వంద్వ ప్రమాణాలకు బలవుతూ వస్తోంది

- బ్రిక్స్ సదస్సులో మోదీ ఆక్షేపణ
- దుమ్మా కొట్టిన జిన్‌పింగ్
- వర్చువల్‌గా హాజరైన పుతిన్



బ్రిక్స్ సదస్సులో మాట్లాడుతున్న బ్రెజిల్ అధ్యక్షుడు డసిల్వా. చిత్రంలో లీ కియాంగ్, ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జై శంకర్, రామాఫొసా తదితరులు

రియో డీ జనీరో: ప్రపంచ ఆర్థికవ్యవస్థ పురోగతికి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్న దక్షిణార్ధ గోళ దేశాలు (గ్లోబల్ సౌత్) కీలక నిర్ణయాలు, ప్రయోజనాల విషయంలో బాధిత దేశాలుగా మిగిలిపోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు వేదికైంది. సదస్సుకు అధ్యక్ష, ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తున్న బ్రెజిల్‌లోని రియో డీ జనీరో నగరంలో ఆదివారం బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఆరంభమైంది. సదస్సులో భాగంగా ప్లీనరీ సెషన్‌లో తొలుత బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా మాట్లాడాక మోదీ మాట్లాడారు.

అవన్నీ నెట్‌వర్క్‌లేని ఫోన్లే

''ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడే గ్లోబల్ సౌత్ దేశాలు చివరకు ద్వంద్వ ప్రమాణాల కారణంగా బాధితదేశాలుగా మిగిలిపోతున్నాయి. అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత వంటి ఏ రంగంలో చూసినా గ్లోబల్ సౌత్ దేశాలకు దక్కేది శూన్యం. వాతావరణ మార్పుల కట్టడికి ఆర్థిక సాయం, సుస్థిరాభివృద్ధి, అధునాతన సాంకేతికత బదిలీ వంటి అంశాల్లో గ్లోబల్‌సౌత్ దేశాలు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వంటి అంతర్జాతీయ వ్యవస్థలు, సంస్థలను తక్షణం సంస్కరణల బాట పట్టించి దక్షిణార్ధ గోళ దేశాలకు న్యాయం జరిగేలా చూడాలి. విశ్వ ఆర్థికానికి కీలక భాగస్వామిగా ఉండి కూడా ప్రధాన నిర్ణయాత్మక వేదికలపై గ్లోబల్‌సౌత్‌కు స్థానం దక్కడం లేదు. వాటి వాణి వినపడటం లేదు. ఇది ప్రాతినిధ్యం దక్కట్లేదనే మాట కంటే విశ్వసనీయంగా, ప్రభావవంతంగా పనిచేసి కూడా ఎలాంటి ప్రయోజనం, లబ్ధి పొందలేపోవడమే గ్లోబల్ సౌత్ దేశాలకు అశనిపాతమవుతోంది. 20వ శతాబ్దంలో ఆవిర్భవించిన ఎన్నో కీలక అంతర్జాతీయ వ్యవస్థల్లో మూడింట రెండొంతుల జనాభాకు అసలు ప్రాతినిధ్యమే దక్కడం లేదు. గ్లోబల్‌సౌత్ దేశాలు లేకుండా ఇలాంటి వ్యవస్థలన్నీ సిమ్‌కార్డు ఉన్నా నెట్‌వర్క్‌లేని మొబైల్ ఫోన్ లాంటివే'' అని మోదీ వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదంపై సమిష్టి పోరు

ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలన్నీ సమిష్టిగా పోరాడాల్సిన అవసరం చాలా ఉందని మోదీ పిలుపునిచ్చారు. పహల్గాంలో అమాయక పర్యాటకులపై పాక్ ప్రేరేపిత జైషే ముష్కర మూక జరిపిన పాశవిక దాడిని ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాధినేతలకు ఆయన గుర్తు చేశారు. బ్రిక్స్ వేదికగా ఆ దాడిని మరోసారి ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ విషయంలో ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు అండగా నిలిచాయని గుర్తు చేసుకున్నారు. మరోసారి అలాంటి దుస్సాహసానికి పాల్పడకుండా పాక్‌కు మర్చిపోలేని రీతిలో సైనికంగా గుణపాఠం చెప్పామన్నారు. ఉగ్రమూలాలను పెకిలించివేయనిదే ప్రపంచ శాంతి అసాధ్యమన్నారు.

టైప్‌రైటర్లతో నేటి సాఫ్ట్‌వేర్ నడవదు

''సమకాలీన ప్రపంచం, కాలానికి తగ్గట్లుగా మేం మారతాం అని ప్రస్ఫుటంగా తెలియజెప్పేందుకే బ్రిక్స్ కూటమిలోకి కొత్త దేశాలను ఆహ్వానిస్తున్నాం. మా బాటలోనే ఐరాస భద్రతా మండలి, ప్రపంచ వాణిజ్య సంస్థ, బహుళజాతి అభివృద్ధి బ్యాంక్‌లు సంస్కరణలను తీసుకొచ్చి తమ చిత్తశుద్ధిని చాటాలి'' అని మోదీ హితవు పలికారు. కృత్రిమమేధ యుగంలో సాంకేతికత వారం వారం అప్‌డేట్ అవుతోంది. అలాంటప్పుడు 80 ఏళ్ల క్రితం ఏర్పడిన ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల్లో ఎప్పటికప్పుడు సంస్కరణల అప్‌డేట్లు జరగాల్సిందే. 20వ శతాబ్దినాటి టైప్‌రైటర్లతో 21వ శతాబ్దంలోని అధునాతన సాఫ్ట్‌వేర్ నడవదు. స్వీయ ప్రయోజనాలకంటే కూడా భారత్ మానవాళి ప్రయోజనాలకే పట్టకడుతుంది. బ్రిక్స్‌దేశాలతో కలిసి సమష్టిగా అన్ని రంగాల్లో నిర్మాణాత్మకమైన ప్రాతినిధ్యం వహించేందుకు మేం సదా సిద్ధంగా ఉన్నాం'' అని మోదీ అన్నారు.

మన రైతులకు కావాలి... రూ. 6.4 లక్షల కోట్లు!

అప్పుడే వాతావరణ మార్పులపై పోరు



న్యూఢిల్లీ: వాతావరణ మార్పులను తట్టుకుని రైతులు అభివృద్ధి చెందాలంటే భారత్‌లో రైతులకు ఏకంగా 75 బిలియన్ డాలర్ల (రూ.6.4 లక్షల కోట్ల) పెట్టుబడులు అవసరమని ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐఎఫ్ఏడీ)అధ్యక్షుడు అల్వారో లారియో అన్నారు. ప్రపంచవ్యాప్తంగానే గాక భారత్‌లోనూ గ్రామీణ సమాజాలకు సాయం అందించడం అతి పెద్ద సవాలని ఆయన తెలిపారు. వ్యవసాయాన్ని రైతులకు మరింత లాభదాయకంగా చేయడం, క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో ఉత్పాదకతను పెంచుకోవడం, ఆహార భద్రత నుంచి పోషకాహార భద్రతకు ఎదగడం వంటి అంశాలపై ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ''భారత్‌లోని రైతుల్లో చిన్న, సన్నకారు రైతులు 86.2శాతం మంది ఉన్నారు. నీటికొరత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తరచుగా కరువులు ఎదుర్కొంటున్నారు. కొన్ని వాతావరణ స్మార్ట్ పద్ధతులను అవలంబించడానికి ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి పెట్టుబడులు పెట్టాలి. పంటల వైవిధ్యం, మెరుగైన నీటి నిర్వహణ లేదా సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థలు, కమ్యూనిటీ విత్తన బ్యాంకులను సృష్టించడం, కరువును తట్టుకునే విత్తనాలను ఉపయోగించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యం. ఇవి దిగుబడిని పెంచుతాయి'' అని లారియో తెలిపారు. ''పేదరైతులకు పెట్టుబడులు, వారికి మార్కెట్ అనుసంధానం కీలకం'' అన్నారు.

టెక్సాస్ వరదల్లో... 70కి చేరిన మృతులు

11 మంది బాలికల గల్లంతు

కెర్‌విల్లే: అమెరికాలోని టెక్సాస్‌లో ఆకస్మికంగా కురిసిన వర్షాలు, గ్వాడలుపె నదికి వచ్చిన వరదల్లో గల్లంతైన వారి జాడ కోసం గాలింపు ముమ్మరమైంది. వరదల్లో చనిపోయిన వారి సంఖ్య కూడా 70కి చేరింది. వీరిలో చిన్నారులు 21 మంది ఉన్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయంటున్నారు. హంట్ పట్టణం వద్ద 'క్యాంప్ మిస్టిక్' సమ్మర్ క్యాంప్‌కు చెందిన 11 మంది బాలికల ఆచూకీ కోసం అధికారులు ప్రతికూల వాతావరణంలోనూ తీవ్రంగా శ్రమిస్తున్నారు. కొట్టుకొచ్చిన చెట్లు, తలకిందులుగా పడిపోయిన వాహనాలు, బురదతో నిండిన వ్యర్థాల్లో అన్వేషణ కొనసాగుతోంది. ఒక్క కెర్ కౌంటీలోనే 15 మంది చిన్నారులు సహా 43 మంది మృత్యువాతపడ్డారు. అయితే, గల్లంతైన వారి సంఖ్యపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. కాగా, క్యాంప్ మిస్టిక్ విషాదానికి బాధ్యులను తేల్చేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తోంది. భారీ వర్షాలు, వరదలు వస్తాయని తెలుసుగానీ వందేళ్లలోనే ఎన్నడూ కురవనంతటి స్థాయిలో వరదలు సంభవిస్తాయని ఊహించలేదని స్థానిక అధికారులు వాపోతున్నారు. అందుకే, గ్వాడలుపె నది పొడవునా ఉన్న సమ్మర్ క్యాంప్‌ల నిర్వాహకులకు ముందస్తు హెచ్చరికలు చేయలేకపోయామని చెబుతున్నారు.

రాయిటర్స్ 'ఎక్స్' ఖాతా బ్లాక్

తమకు సంబంధం లేదన్న కేంద్రం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వార్తా సంస్థ 'రాయిటర్స్' ఎక్స్ ఖాతా భారత్‌లో నిలిచిపోయింది. భారత ప్రభుత్వం నుంచి అందిన నోటీసు మేరకు ఖాతాను 'ఎక్స్' నిలిపి వేసినట్లు రాయిటర్స్ ప్రధాన అకౌంట్‌పై కనిపిస్తోంది. అయితే, రాయిటర్స్ ఎక్స్ అకౌంట్‌ను బ్లాక్ చేయాలంటూ తామెలాంటి నోటీసు ఇవ్వలేదని కేంద్రం పేర్కొంది. ఈ సమస్య పరిష్కారం కోసం 'ఎక్స్'తో చర్చలు జరుపుతున్నామంది. త్వరలోనే రాయిటర్స్ ఎక్స్ అకౌంట్‌ను పునరుద్ధరించే అవకాశాలు కన్పిస్తున్నాయి. కాగా, మే నెలలో ఆపరేషన్ సిందూర్ సమయంలో వందలాది ఇతర ఖాతాలతోపాటు రాయిటర్స్ అకౌంట్‌ను కూడా నిలిపివేయాలంటూ ఎక్స్‌ను కేంద్ర ప్రభుత్వం కోరిందని అధికార వర్గాలు తెలిపాయి. అప్పట్లో చాలా ఖాతాలు బ్లాక్ కాగా, రాయిటర్స్‌ది మాత్రం పనిచేసింది. ఎలాన్ మస్క్ యాజమాన్యంలోని 'ఎక్స్' తాజాగా రాయిటర్స్ అకౌంట్‌ను ఆపేసి ఉంటుందని చెబుతున్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌ను వివరణ అడిగిందని, ఖాతాను తక్షణమే పునరుద్ధరించాలని కోరిందని అధికార వర్గాలు అంటున్నాయి.

చైనాలో అధికార వికేంద్రీకరణ!



బీజింగ్: చైనాలో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శకం ముగిసిందనే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. 12 ఏళ్లుగా ఇనుప పిడికిలితో దేశాన్ని పాలిస్తున్న ఉన్న ఆయన నెమ్మదిగా అధికారాన్ని పార్టీలోని కీలక విభాగాలకు అప్పగించడం ప్రారంభించారు. దాంతో చైనాలో అధికార మార్పిడి రంగం సిద్ధమైనట్టు కన్పిస్తోంది. 24 మందితో కూడిన అధికార చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సీపీసీ)పొలిటికల్ బ్యూరో జూన్ 30న సమావేశమైంది. పార్టీలోని వివిధ సంస్థల పనులపై నిబంధనలను సమీక్షించింది. ఆయా సంస్థలు ప్రభావవంతమైన నాయకత్వాన్ని, సమన్వయాన్ని ప్రదర్శించాలని, ప్రధానమైన పనుల ప్రణాళికతోపాటు చర్చించడం, పర్యవేక్షించడంపై దృష్టి పెట్టాలని సూచించింది. ఈ విషయాలన్నీ ప్రభుత్వ అధీనంలోని వార్తా సంస్థ జిన్హువా తెలపడంతో అధికార మార్పిడి గురించి ఊహాగానాలు చెలరేగాయి. పార్టీ సంస్థలపై నిబంధనలు జిన్‌పింగ్ పదవీ విరమణ దిశగా సన్నాహాలను సూచిస్తున్నాయని పార్టీలోని కీలక సభ్యుడు ఒకరు తెలిపారు. సీపీసీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ తర్వాత చైనాలో అత్యంత శక్తివంతమైన నేతగా గుర్తింపు పొందిన జిన్‌పింగ్ పెద్ద సమస్యలపై దృష్టి పెట్టడానికి కొన్ని అధికారాలను ఇలా ఇతరులకు అప్పగిస్తున్నారని కొందరంటున్నారు. ఆదివారం రియో డి జనీరోలో మొదలైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి కూడా జిన్‌పింగ్ హాజరు లేదు. ఈ సమావేశానికి ఆయన గైర్హాజరవ్వడం గత 12 ఏళ్లలో ఇదే మొదటిసారి. 2012లో సీపీసీ జనరల్ సెక్రటరీగా జిన్‌పింగ్ అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి పాలనపై వేగంగా పట్టుసాధించారు. చైనాలో అతిపెద్ద అవినీతి వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహిస్తూ, అధికార నిర్మాణాలను తన చేతిలోకి తెచ్చుకున్నారు. పది లక్షల మందికి పైగా అధికారులను శిక్షించారు. డజన్ల కొద్దీ అగ్ర జనరల్‌లను తొలగించారు. పార్టీ 'ముఖ్య నాయకుడు'గా తనను తాను ప్రకటించుకున్నారు. మావో తరువాత ఈ హోదాను దక్కించుకున్నది జిన్‌పింగ్ మాత్రమే. ఆ తర్వాత నియమాలను సవరించి మరీ చైనా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 2022లో పార్టీ జనరల్ సెక్రటరీగా, 2023లో అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి కొనసాగారు. దాంతో బహుశా ఆయన జీవితాంతం అధ్యక్షుడిగా కొనసాగుతారని అంతా భావించారు.

కీలక విభాగాలకు అధికారాలు పంపిణీ చేస్తున్న జిన్‌పింగ్

- పొలిటికల్ బ్యూరో భేటీలో నిర్ణయం

మస్క్ 'అమెరికా పార్టీ'

- కొత్త పార్టీ పెట్టిన కుబేరుడు
- అమెరికన్ల స్వేచ్ఛ కోసమేనని వ్యాఖ్యలు



వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నంత పనీ చేశారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో విభేదాలు నానాటికీ ముదురుతున్న నేపథ్యంలో కొత్త పార్టీ ఏర్పాటు చేశారు. ఇంతకాలంగా తనకు అన్నీ ఇచ్చిన దేశానికి వీలైనంతగా తిరిగిచ్చేందుకు 'అమెరికా పార్టీ'ని స్థాపిస్తున్నట్టు శనివారం ప్రకటన చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పలు పోస్టులు పెట్టారు. ''దేశాన్ని దివాలా తీయించే అవినీతిని, వృథా ఖర్చులను అరికట్టడం తదితర కీలక అంశాలపై అధికార రిపబ్లికన్, ప్రధాన విపక్షమైన డెమొక్రటిక్ పార్టీ ఆ తాను ముక్కలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. దాంతో అమెరికా ప్రజలిప్పుడు నిజమైన రాజకీయ మార్పు కోరుకుంటున్నారు. ప్రతి ఇద్దరిలో ఒకరు కొత్త పార్టీ రూపంలో సమర్థమైన రాజకీయ ప్రత్యామ్నాయం కావాలనుకుంటున్నట్టు ఇటీవల మే జరిపిన సర్వేలో తేలింది. వారు ప్రాణ సమానంగా ప్రేమించే స్వేచ్ఛను వారికి తిరిగివ్వడమే లక్ష్యంగా నా పార్టీ పని చేస్తుంది'' అని ప్రకటించారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యేందుకు మస్క్ ఎంతగానో కృషి చేయడం, ఇద్దరూ అత్యంత సన్నిహితులుగా మారడం తెలిసిందే. కానీ అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

'ఎన్నికల జాబితా'పై సుప్రీంకు మొయిత్రా

బెంగాల్‌ను కేంద్రం లక్ష్యంగా చేసుకుందంటూ ఆరోపణలు

కోల్‌కతా: బిహార్‌లోని యువ ఓటర్లకు ఓటు లేకుండా చేసేందుకే ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు పూనుకుందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. బిహార్ తర్వాత ఈసీ తదుపరి లక్ష్యం 2026లో ఎన్నికలు జరిగే బెంగాల్ అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చర్యకు నిరసనగా ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లోని నిబంధనలు ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950కి విరుద్ధంగా ఉన్నాయి మహువా పేర్కొన్నారు. వివిధ పార్టీల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నందున ఈసీ ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని సూచించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ సుప్రీంను ఆశ్రయించినట్లు వివరించారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఆదేశాలను ఈసీ జారీ చేయకుండా చూడాలని కోరానన్నారు. 1987 జూలై 1-2004 డిసెంబర్ 2వ తేదీల మధ్య జన్మించిన వారు ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ కారణంగా ఓటేసే హక్కుకు లక్షలాది మంది దూరమవుతారని ఆరోపించారు. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను అమలు చేయాలంటూ ఈసీ జూన్ 24వ తేదీన ఆదేశాలు జారీ చేయడం తెల్సిందే. అనర్హులను జాబితా నుంచి తొలగించడం, అర్హులైన పౌరుల పేర్లు జాబితాలో ఉండేలా చూడటమే ఈ ఆదేశాల లక్ష్యమని ఈసీ అంటోంది. ఈసీ ఆదేశాలపై ఏడీఆర్, పీయూసీఎల్ వంటి పౌర సంఘాలు, కార్యకర్తలు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. అయితే, బిహార్‌లో ఎస్ఐఆర్ అమలుకు సంబంధించి తాము జారీ చేసిన ఆదేశాల్లో ఎలాంటి మార్పూ లేదని ఈసీ ఆదివారం స్పష్టం చేసింది.

బంగ్లా ఖాళీ చేయాల్సిందే

మాజీ సీజేఐ చంద్రచూడ్ నివాసంపై కేంద్రానికి సుప్రీం లేఖ



న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానంలో పదవీకాలంలో సంచలనాత్మక తీర్పులిచ్చిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ విషయంలో సుప్రీంకోర్టు తాజాగా అసాధారణ నిర్ణయం తీసుకుంది. రిటైరై 7 నెలలు గడుస్తున్నా అధికారిక బంగ్లాను ఖాళీచేయలేదని, వీలైనంత త్వరగా ఖాళీ చేయించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు లేఖ రాసింది. సీజేఐగా ఉండగా జస్టిస్ చంద్రచూడ్‌కు ఢిల్లీలో '5, కృష్ణమీనన్ మార్గ్'లో అధికారిక నివాసం కేటాయించారు. గత నవంబర్‌లో రిటైరైనా అందులోనే ఉంటున్నారు. దాంతో ఆయన తర్వాత సీజేఐ అయిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, ప్రస్తుత సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తమకు గతంలో కేటాయించిన నివాసాల్లో ఉన్నారు. అధికారిక నివాసంలోకి మారలేకపోయారు. దీన్ని ప్రస్తావిస్తూ కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సుప్రీంకోర్టు జూలై 1న లేఖ రాసింది. ''మే 31దాకా నివాసంలో ఉండేందుకు చంద్రచూడ్‌కు ఇచ్చిన అదనపు గడువు కూడా ముగిసింది. తక్షణం బంగ్లా ఖాళీ చేసేలా చూడండి'' అని పేర్కొంది.

ముందే గడువు కోరిన చంద్రచూడ్

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం తన తర్వాత సీజేఐగా సేవలందిస్తున్న నాటి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాను జస్టిస్ చంద్రచూడ్ మౌఖికంగా అభ్యర్థించారు. రిటైర్ అయ్యాక తనకు కేటాయించిన 14, తుగ్లక్ రోడ్ బంగ్లాలో మరమ్మతులు కొనసాగుతున్న కారణంగా ఆ బంగ్లాలోకి మారలేకపోతున్నానని జస్టిస్ ఖన్నాకు చెప్పారు. ఏప్రిల్ 30వ తేదీదాకా ఉండేందుకు అనుమతించాలని ఆయనను కోరారు. నెలకు రూ.5,000 లైసెన్స్ ఫీజుతో ఆ తేదీదాకా ఉండేందుకు ఆయన సమ్మతించారు. అయితే ఆ తర్వాత మే 31వ తేదీదాకా ఆ గడువును పొడిగించాలని మరోసారి ఆయన విన్నవించుకున్నారు. అయితే ఆఖరి అవకాశమని, మరోసారి గడువు పొడిగించాలని కోరొద్దని నాటి సీజేఐ షరతు విధించినట్లు తెలుస్తోంది. ఆ గడువు కూడా ఇప్పుడు ముగిసిపోయిన నేపథ్యంలో ఇక ఖాళీ చేయించడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని సుప్రీంకోర్టు వర్గాలు అభిప్రాయపడ్డాయి. అందులోభాగంగానే కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లేఖ రాసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి చంద్రచూడ్ ఇద్దరు కుమార్తెలు దివ్యాంగులు కావడం, వాళ్ల ఆరోగ్య పరిస్థితి ఏమాత్రం బాగోలేని కారణంగా సమీపంలోని ప్రతిష్టాత్మక ఎయిమ్స్ ఆస్పత్రిలో తరచూ చెకప్ చేయిస్తుండటంతో అందుకు అనువుగా ఉన్న ఈ బంగ్లాలో ఉండేందుకే ఆయన ఆసక్తి కనబరిచినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

ఘనంగా దలైలామా జన్మదిన వేడుకలు



బర్త్‌డే కేక్ తింటున్న దలైలామా

ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన పుట్టినరోజు శుభాకాంక్షలు

ధర్మశాల/వాషింగ్టన్: టిబెటన్ల అత్యున్నత ఆధ్యాత్మిక గురువు, బౌద్ధమతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్న 14వ దలైలామా టెంజిన్ గ్యాట్సో 90వ పుట్టినరోజు వేడుకలు హిమాచల్‌ప్రదేశ్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రపంచదేశాల నుంచి వేలాదిగా తరలివచ్చిన బౌద్ధ భిక్షువులు, బౌద్ధులు, పలువురు ప్రముఖుల సమక్షంలో ట్సుగ్లాంగ్‌ఖాంగ్ దలైలామా ఆలయం ప్రాంగణంలో జన్మదిన వేడుకలు జరిగాయి. కంగ్రా జిల్లాలోని మెక్‌లియోడ్‌గంజ్ పట్టణంలో జరిగిన ఈ వేడుకలకు పెద్దసంఖ్యలో విద్యార్థులు, నృత్యకారులు, నేపథ్యగాయకులు హాజరయ్యారు. ప్రపంచ శాంతి, మత సామరస్యం కోసం అలుపెరగకుండా పోరాడుతున్న దలైలామాకు తమ మద్దతు ఇకమీదటా కొనసాగుతుందని వేడుకల వేదికపై ఆసీనులైన పలు దేశాల రాజకీయ ప్రముఖులు ప్రకటించారు. ఒక్కో దశాబ్ద జీవితానికి ఒక అంతస్తు గుర్తుగా సిద్ధంచేసిన 9 అంతస్తుల కేక్‌ను కట్ చేశాక వేలాది మంది బౌద్ధుల సమక్షంలో దలైలామా ప్రసంగించారు. ''జనులందరికీ సేవచేయాలన్న నా సంకల్పానికి మీ ప్రేమే స్ఫూర్తిగా నిలుస్తోంది. శాంతిదేవుడైన 'బోధిసత్వాచార్యావతార' చూపిన మార్గంలోనే నిరంతరం నడుస్తున్నా. ఇంద్రియజ్ఞానమున్న జనులంతా నా సోదరసోదరీమణులు, స్నేహితులే. నా శక్తిమేరకు మీకు సేవ చేస్తా. నా పుట్టినరోజు అని తెల్సుకుని అమితానందంతో ఇంతదూరమొచ్చి వేడుకల్లో భాగస్వాములైన మీకందరికీ మనస్ఫూర్తిగా ధాంక్యూ'' అని దలైలామా వ్యాఖ్యానించారు. ''ఎక్కువ మంది జనముంటే మరింత ఎక్కువగా హృదయానందం పొంగిపొర్లుతుంది. ఆ ఆనందం నాకెంతో స్ఫూర్తినిస్తుంది. బోధిచిత్తాన్నే నేను ఆచరిస్తా. ప్రజల్ని నా వైపునకు తిప్పుకోవాలనే స్వార్థ లక్ష్యాలు పెట్టుకోవడం కంటే ప్రజలకు సేవ చేయడంపైనే నా దృష్టంతా ఉంటుంది'' అని దలైలామా అన్నారు. కేంద్ర మంత్రులు కిరెణ్ రిజిజు, రాజీవ్ రంజన్ సింగ్, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ, సిక్కిం మంత్రి సోనమ్ లామా, హాలీవుడ్ సీనియర్ నటుడు రిచర్డ్ గెరె తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. ''ప్రాచీన జ్ఞానసంపదకు, ఆధునిక ప్రపంచానికి సజీవ వారధి దలైలామా. ఆర్యభూమిలో దలైలామా దశాబ్దాలుగా ఉండిపోవడం మనకెంతో సంతోషకరం'' అని రిజిజు పొగిడారు.

శుభాకాంక్షలు తెలిపిన మోదీ

దలైలామాకు ప్రధాని మోదీ బర్త్‌డే విషెస్ చెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. ''90వ పుట్టినరోజు జరుపుకుంటున్న దలైలామాకు 140 కోట్ల మంది భారతీయులతోపాటు నేను సైతం శుభాకాంక్షలు చెబుతున్నా. ప్రేమ, తపన, సహనం, నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనం దలైలామా. ఆయన ఇచ్చి సందేశం దేశాలకతీతంగా జనులందరికీ శిరోధార్యం. ఆయన ఇలాగే దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నా'' అని మోదీ అన్నారు. అమెరికా తరఫున ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో సైతం సందేశం పంపించారు. ''టిబెటన్ల మానవ హక్కుల పరిరక్షణతోపాటు ప్రాథమిక స్వేచ్ఛకు అమెరికా నిత్యం మద్దతిస్తోంది. ఇతరుల(చైనా) జోక్యంలేకుండా టిబెటన్ల భాష, సంస్కృతి, మత వారసత్వ పరిరక్షణకు అమెరికా పాటుపడుతుంది'' అని ఆయన అన్నారు. అమెరికా మాజీ అధ్యక్షులు జార్జ్ డబ్ల్యూ బుష్, బిల్ క్లింటన్, బరాక్ ఒబామా సైతం తమ శుభాకాంక్షల వీడియో సందేశాలు పంపించారు.



దలైలామా చేతిని ముద్దాడుతున్న హాలీవుడ్ స్టార్ రిచర్డ్ గెరె



నిరీక్షణకు చెక్

నిమ్స్‌లో సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. రోగులందరికీ తక్షణమే వైద్య సేవలందేలా యాజమాన్యం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. -8లో



న్యూసెన్స్..పీక్స్

సోషల్ మీడియా రీల్స్ ఇప్పుడు జనానికి చికాకు తెప్పిస్తున్నాయి. పబ్లిక్ ప్లేస్‌లలో హెడ్‌సెట్ లేకుండా సౌండ్ ఎక్కువ పెట్టి రీల్స్ చూడడం ఇబ్బందికరంగా మారింది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 33, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.





కోటకు బోనం కళ

గోల్కొండ కోట కిటకిటలాడింది. ఆదివారం నాలుగో బోనం పూజలు ఘనంగా నిర్వహించగా..భక్తులు పోటెత్తారు. మహిళల బోనాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, నృత్యాలతో కోటంతా సందడి నెలకొంది. మహిళా భక్తులకు అడుగడుగునా భక్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. - గోల్కొండ



పాతబస్తీలో మొహర్రం ఊరేగింపు



లక్ష్మి(ఏనుగు) నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

మొహర్రం.. కోలాహలం

ఇస్లాం పరిరక్షణ కోసం కర్బలా యుద్ధ మైదానంలో అసువులు బాసిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌ను స్మరిస్తూ షియా ముస్లింలు ఆదివారం బీబీకా ఆలంతో సామూహిక ఊరేగింపు నిర్వహించారు. గత నెల 26 వ తేదీ నుంచి షియా ముస్లింలు మొహర్రం సంతాప దినాలను పాటిస్తున్నారు. ఇందులో భాగంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లోని అషుర్ ఖానాలలో ఆలంలను ప్రతిష్ఠించి మాతం, మజ్లిస్ నిర్వహిస్తున్నారు. ఆదివారం పదో మొహర్రం సందర్భంగా పాతబస్తీలో బీబీ ఆలం సామూహిక ఊరేగింపు నిర్వహించారు. డబీర్‌పురా లోని బీబీ కా ఆలంను లక్ష్మి అనే ఏనుగుపై పాతబస్తీ ప్రధాన వీధుల్లో సామూహిక ఊరేగింపు నిర్వహించారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక పైనుంచి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, దారుషిఫా వద్ద జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు ఊరేగింపునకు స్వాగతం పలికారు. ఊరేగింపు డబీర్ పురా దర్వాజా, యాకుత్‌పురా, కోట్ల అలీజా, చార్మినార్, మీరాలం మండి, దారుషిఫా నుంచి చాదర్‌ఘాట్ వరకు కొనసాగింది. - చార్మినార్



హైడ్రా పేదల పక్షపాతి

- త్వరలోనే ప్రభుత్వం కొత్త టీడీఆర్ విధానం తీసుకువస్తుంది
- ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం సాంకేతికంగా ముందుకు వెళ్తున్నాం
- 'తెలంగాణ ఫ్యాక్ట్ చెక్'లో వెల్లడించిన కమిషనర్ ఏవీ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: 'హైడ్రా ఎప్పుడూ పేదల పక్షపాతిగానే ఉంటుందని' కమిషనర్ ఏవీ రంగనాథ్ పునరుద్ఘాటించారు. హైడ్రా విజన్ అండ్ ఎజెండా అనే అంశంపై 'ఎక్స్' వేదికగా ఫ్యాక్ట్ చెక్ తెలంగాణ ఏర్పాటు చేసిన 'ప్రశ్నలు–జవాబులు' కార్యక్రమంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదివారం వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశ–విదేశాల నుంచి అనేక మంది అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. రంగనాథ్ వెల్లడించిన అంశాల్లో కీలకమైనవి ఇలా...



- హైడ్రాకు 169 పోస్టులు శాంక్షన్ చేయగా ప్రస్తుతం 45 మంది సిబ్బందే ఉన్నారు. వీరికి అదనంగా రెండు వేల మంది ఔట్ సోర్సింగ్ వాళ్లు ఉన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులు 20 వేల దాటాయి. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం సిబ్బందిని పెంచడంపై దృష్టి పెట్టింది.
- రానున్న రోజుల్లో హైడ్రా ప్రభావం ప్రజల్లోకి బలంగా వెళుతుంది. ఇప్పటికే ప్రజలు మాపై నమ్మకం పెంచుకుంటున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి ఫిర్యాదుదారులు తెల్లవారుజాము నుంచే ఎదురుచూస్తుండటమే దీనికి నిదర్శనం. బాధితుల కోసం త్వరలోనే ప్రభుత్వం ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) విధానాన్ని అమలులోకి తీసుకురానుంది.
- నిజాంపేటలో దాదాపు కిలోమీటరు పరిధిలో రోడ్డు పక్కన ఇళ్లు వేసుకున్న కొందరు ఇంటి ముందు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీని వల్ల 30 అడుగుల రోడ్డు 10 నుంచి 15 అడుగులకు తగ్గిపోయింది. ఫలితంగా దాదాపు పది కాలనీలకు చెందిన వాళ్లు రాకపోకల కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చాలా కాలంగా ఆ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. కోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయి. ఇవన్నీ పరిగణలోకి తీసుకుని వాటిని తొలగించాం.
- హైడ్రా ఏర్పాటైన తర్వాత ఏడాదిలో ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పించగలిగాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, చెరువుల్లో భూములు ఉన్నట్లు అనుమానిస్తే వాళ్లు సరిచూసుకుంటున్నారు. కొనేవాళ్లు లేకపోతే అమ్మే వాళ్లు, ఆక్రమించే వాళ్లు తగ్గిపోతారు. కొన్నిసార్లు కిందిస్థాయి వాళ్లు చేసిన చిన్నచిన్న పొరపాట్లను భూతద్దంలో చూపిస్తూ వ్యవస్థ పైన బురదజల్లే ప్రయత్నాలు జరిగాయి. మూసీలో జరిగే కూల్చివేతల్నీ హైడ్రాకు ఆపాదించారు.
- నగరంలో నీళ్లు నిలిచే ప్రాంతాల్లో చెరువుల చుట్టూ ఉన్నవి ఎక్కువగా ఉంటున్నాయి. ఇన్‌లెట్ నాలాలు పూడ్చివేయడమే దీనికి కారణం. ఫలితంగా తీవ్రమైన ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. సాంకేతికంగా నగరంలో ఉన్న అన్ని చెరువుల పరిస్థితుల్ని అధ్యయనం చేస్తున్నాం. ప్రతి దానికీ పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నాం.
- ఎన్నారైలు ఎవరైనా ఇక్కడ భూమిపై పెట్టుబడులు పెట్టాలని భావిస్తే హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్ ద్వారా ఎఫ్‌టీఎల్, బఫర్‌లు ప్రస్తుతం తెలుసుకోవచ్చు. కొన్ని ప్రైవేట్ ఏజెన్సీలు ఈ అంశాలను సాధారణ భాషలో అందుబాటులోకి తీసుకువచ్చారు. హైడ్రా కూడా ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్ నోటిఫికేషన్ కోసం ప్రయత్నిస్తోంది. దీని కోసం నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో కలిసి పని చేస్తున్నాం. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల్ని క్రోడీకరించి, శాటిలైట్ డేటాతో పాటు 2006 నాటి మ్యాప్‌లు సేకరించి '3డీ' మోడల్‌లో తయారు చేస్తున్నాం. ఇది 15 సెంటీమీటర్ల రిజల్యూషన్‌లో అందుబాటులోకి వస్తుంది.
- ప్రస్తుతం నగరంలో ఆరు చెరువులను పునరుద్ధరించనున్నాం. వీటిలో ఉన్న ఏ ఒక్క ఇంటి జోలికి వెళ్లలేదు. వాణిజ్య అవసరాల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు మాత్రమే తొలగిస్తున్నాం. ఇటీవల సున్నం చెరువులోనూ అక్రమ బోర్ల పైనే చర్యలు తీసుకున్నాం.
- హైడ్రా ఏర్పాటుకు ముందు నాటి కట్టడాల్లో నివాసాల జోలికి వెళ్లం. ఇవి అనుమతి తీసుకుని కట్టినా.. అనుమతి తీసుకోకుండా కట్టినా వాటిని కూల్చం. ఇదే విషయాన్ని పదేపదే స్పష్టం చేస్తున్నాం. చెరువులకు గతంలో ఫెన్సింగ్స్ వేసినా కూలగొట్టి ఆక్రమించారు. ఈ నేపథ్యంలోనే ప్రజల్లో అవగాహన కల్పించడానికే ప్రాధాన్యం ఇస్తున్నాం. పార్కుల్లో ఆక్రమణలు తొలగించినప్పుడు ఫెన్సింగ్ వేసి, బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

- ఓవైసీలకు సంబంధించి ఫాతిమా కాలేజీ సూరం చెరువులో ఉంది. ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రకారం ఇది ఎఫ్‌టీఎల్‌లో ఉంది. ఇలా చాలా కాలేజీలు, విద్యాసంస్థలు ఉన్నాయి. ఫాతిమా కాలేజీలో చాలా మంది పేద మైనార్టీలు ప్రతి ఏడాదీ పది వేల మంది చదువుతున్నారు. ఇది చారిటీ కోసం నడుస్తున్న వ్యవస్థ. చెరువు కోసం చూస్తే వేలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడతారనే ఉపేక్షిస్తున్నాం.
- ఎంఐఎంకు భయపడుతున్నాం అని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. బుమ్‌రుక్‌నుద్దౌలా లేక్‌లో ఎంఐఎం లీడర్లు నిర్మిస్తున్న నిర్మాణాలను కూల్చివేశాం. చాంద్రాయణగుట్టలోనూ ఇలానే చేశాం. హైడ్రా దృష్టిలో ఏ పార్టీ అయినా ఒక్కటే.



సెలవొస్తే సిటీ బస్సులకు సెలవ్!

భారీగా ట్రిప్పుల రద్దు

- బస్టాపుల్లోనే జనం పడిగాపులు
- శివారు కాలనీల ప్రయాణికులు విలవిల
- రాత్రి 8 దాటితే ఇల్లు చేరడం కష్టమే...

ఆదివారం సాయంత్రం నాలుగు గంటలు. ఘట్కేసర్ సమీపంలోని అన్నోజిగూడ బస్టాపు. రాజు అప్పటికి ఓ గంట నుంచి బస్సు కోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. చివరకు ఐదున్నర గంటలకు ఓ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి వచ్చింది. బస్సెక్కడం అతనికి పెద్దసవాల్‌గా మారింది.

...ఒక్క రాజు మాత్రమే కాదు. పోచారం బస్టాపులో చాలాసేపటి నుంచి పడిగాపులు కాస్తున్న మరికొంత మంది ప్రయాణికులు సైతం మరో బస్సు ఎప్పటికొస్తుందో తెలియని అనిశ్చితి కారణంగా ఆ కిక్కిరిసిన బస్సునే ఆశ్రయించారు. రాంపల్లి, ఘట్కేసర్, ఎదులాబాద్, కొర్రెముల, అంకుషాపూర్, చౌదరిగూడ, ప్రతాప్‌సింగారం, తదితర వందలాది కాలనీలకు చెందిన ప్రయాణికులు శని, ఆదివారాలు, ఇతర సెలవురోజుల్లో సిటీ బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగరం నలువైపులా ఔటర్‌రింగ్‌రోడ్డుకు చుట్టుపక్కల ఉన్న కాలనీలు, గ్రామాలకు బస్సులు అందుబాటులో ఉండడం లేదు. సాధారణ పనిదినాల్లోనే అరకొరగా నడిచే బస్సులకు సెలవు రోజుల్లో అధికారులు మరింత కోత విధిస్తున్నారు. దీంతో శివారు కాలనీలకు చెందిన ప్రజలు నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్యాబ్‌లు, సెవెన్ సీటర్, త్రీ సీటర్ ఆటోలపైన ఆధారపడాల్సి వస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో

రాత్రిపూట ఇల్లు చేరేదెలా...

ఈ బస్సుల కొరత కారణంగా వ్యాపార,వాణిజ్యసంస్థలు, షాపింగ్ సెంటర్‌లు, కిరాణాషాపులు, వస్త్రదుకాణాలు వంటి వివిధ చోట్ల పనిచేసే ఉద్యోగులు రాత్రిపూట ఇళ్లకు చేరడం కష్టంగా మారింది. 'విధులు ముగించుకొని రాత్రి 8 గంటలకు బస్టాపు వద్దకు వస్తే ఒక్క బస్సు కూడా కనిపించడం లేదు. ఆ రాత్రి బస్సు కోసం ఎదురుచూడలేక ఆటోల్లో వెళ్లవలసి వస్తుంది' అని సికింద్రాబాద్ నుంచి ప్రతి రోజు జగద్గిరిగుట్టకు రాకపోకలు సాగించే శ్రీలక్ష్మి చెప్పారు. చివరకు షేర్ ఆటోల్లో వెళ్లవలసి వస్తుందని, రాత్రిపూట ఆటోలను నమ్ముకొని ప్రయాణం చేయడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా నగరంలోని ప్రధాన వాణిజ్య, వ్యాపార కేంద్రాల నుంచి శివారు ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు వెళ్లే ప్రయాణికులకు రాత్రిపూట బస్సులు అందుబాటులో లేకపోవడం చాలా ఇబ్బందిగా మారింది. ఒకప్పుడు ప్రయాణికులు ఉన్నా లేకున్నా సమయానికి బస్సు మాత్రం వస్తుందనే భరోసా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

భారీగా ట్రిప్పుల రద్దు..

సెలవు రోజుల్లో సిటీ బస్సులు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో కనీసం అరగంటకో బస్సు చొప్పున నడిచే రద్దీ రూట్లలో రెండు, మూడు గంటలు గడిచినా బస్సులు అందుబాటులో ఉండడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెలవు దినాల్లో ప్రయాణికుల రాకపోకలు తక్కువగా ఉంటాయనే కారణాన్ని సాకుగా చూపుతూ అధికారులు భారీగా ట్రిప్పుల్లో కోత విధిస్తున్నారు. సాధారణ రోజుల్లోనే ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు నడపడం లేదు. సెలవురోజుల్లో ఈ కొరత మరింత తీవ్రంగా మారుతుంది. సాధారణంగా రోజుకు 10 ట్రిప్పులు నడిచే రూట్లలో సెలవు రోజుల్లో కనీసం 5 ట్రిప్పులు కూడా బస్సులు తిరగడం లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. సికింద్రాబాద్ నుంచి ఈసీఐఎల్, కుషాయిగూడ, సైనిక్‌పురి,నేరేడ్‌మెట్, సఫిల్‌గూడ, మల్కాజిగిరి తదితర ప్రాంతాలకు ప్రతి 15 నిమిషాల నుంచి అరగంటకు ఒకటి చొప్పున బస్సులు అందుబాటులో ఉంటాయి. కానీ సెలవొస్తే గంట గడిచినా బస్సు లభించడం లేదని, దీంతో ఆటోల్లో వెళ్లవలసి వస్తుందని మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన సుమ తెలిపారు. 'సెలవు రోజుల్లో జనమంతా ఇళ్లకే పరిమితమవుతారనే ఆలోచన ఏ మాత్రం సరైంది కాదు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల పనివిధానం భిన్నంగా ఉంటుంది కదా.' అని ఆమె విస్మయంవ్యక్తం చేశారు. షాపింగ్ కోసం, ఇతర అవసరాల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాలనుకున్నా బస్సులు ఉండడం లేదని పేర్కొన్నారు. మరోవైపు ప్రయాణికుల రద్దీ భారీగా ఉండే సికింద్రాబాద్–పటాన్‌చెరు. కోఠి–లింగంపల్లి, ఉప్పల్–మెహదీపట్నం, కొండాపూర్–ఉప్పల్, జీడిమెట్ల–సీబీఎస్, సికింద్రాబాద్–కోఠి, సికింద్రాబాద్–అఫ్జల్‌గంజ్ వంటి ప్రధాన రూట్లలో కూడా ఆది వారాలు, ఇతర సెలవు రోజుల్లో ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో ఉండడం లేదు. 'నిజానికి వారం రోజుల పాటు ఉద్యోగాలకే పరిమితమైన వాళ్లకు ఆ ఒక్క రోజే కాస్త ఊరట ఉంటుంది. ఇంటిల్లిపాది కలిసి బయటకు వెళ్లాలనుకుంటే బస్సులు మాత్రం అందుబాటులో ఉండవు' అని మల్కాజిగిరికి చెందిన సంపత్ ఆరోపించారు. ఆర్టీసీ లెక్కల ప్రకారం నగరంలోని 1050 రూట్లలో 2850 సిటీ బస్సులు తిరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఈ రూట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజుకు సుమారు 16 వేల ట్రిప్పులు తిరుగుతున్నట్లు అంచనా. కానీ సెలవు రోజుల్లో కనీసం 5 వేల ట్రిప్పులకు పైగా రద్దవుతున్నాయి.

ఇక తాగునీటికి బేఫికర్.!

- నిండుతున్న జలాశయాలు
- ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం

సాక్షి, సిటీబ్యూరో: మహానగరానికి ఈ ఏడాదంతా ఇక తాగునీటి సరఫరాకు ఎలాంటి డోకా లేనట్లే. నగరానికి తాగు నీరు అందించే ప్రధాన జలాశయాలు నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లితో పాటు మంజీరా, సింగూర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లకు సమృద్ధిగా జలాలు వచ్చి చేరుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఈ జలాశయాలు నిండుకుండల్లా మారుతున్నాయి. వాస్తవంగా వేసవిలో ప్రధాన జలాశయాల్లో నీటి మట్టం పడిపోవడంతో జలమండలి ముందస్తుగా అత్యవసర పంపింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే, ఈ సీజన్‌లో కురిసిన ముందస్తు వర్షాలు జలాశయాలకు జీవం పోశాయి. ప్రస్తుతం కృష్ణా, గోదావరి బేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో సాగర్, ఎల్లంపలి జలాశయాల్లో నీటి మట్టం బాగా పెరుగుతోంది



నాగార్జున సాగర్ జలాశయం

జలాశయాలే ఆధారం..

మహానగర తాగు నీటి అవసరాలకు జలాశయాల నుంచి సరఫరానే ప్రధాన ఆధారం. ముఖ్యంగా నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల నుంచే సుమారు 75 శాతంపైగా నీటి తరలింపు ఉంటుంది. సాగర్ జలాశయం నుంచి కృష్ణా తాగునీటి సరఫరా పథకం ఫేజ్ -1, 2,3ల ద్వారా రోజువారీ 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. గోదావరి బేసిన్‌లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గోదావరి నీటి సరఫరా పథకం-1 ద్వారా 168 ఎంజీడీల నీరు తరలిస్తున్నారు. అదేవిధంగా మంజీరా, సింగూర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి తాగునీటినీ తరలించి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని జలాశాయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

ప్రస్తుతం జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..

ప్రాజెక్టు	పూర్తి స్థాయి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం	గతేడాది నీటిమట్టం (అడుగుల్లో.)
నాగార్జున సాగర్	590.000	525.800	503.700
ఎల్లంపల్లి(గోదావరి)	485.560	468.592	459.143
మంజీరా	1651.750	1647.500	1645.800
సింగూర్	1717.932	1709.877	1704.643
ఉస్మాన్ సాగర్	1790.000	1782.750	1779.650
హిమాయత్ సాగర్	1763.500	1758.000	1755.900

విప్లవ కారులతో శాంతి చర్చలు జరపాలి


విరసం సదస్సులో మాట్లాడుతున్న అరసవిల్లి కృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం : ప్రభుత్వం విప్లవకారులతో శాంతి చర్చలు జరపడంతోపాటు ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండను నిలిపివేయాలని విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విప్లవ రచయితల సంఘం 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా '' కాల్పుల విరమణ ఒప్పందాలు- విప్లవోద్యమ పంథా - మార్క్సిస్ట్ దృక్పథం అంశంపై సదస్సు జరిగింది''. ఈ సందర్భంగా అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ...సాయుధ పోరాటమే విప్లవోద్యమాలకు ఏకైక మార్గం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న కార్మిక, రైతుల నిరసనలు పెరగడానికి మోదీ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. సామాజిక వేత్త అజిత్ మాట్లాడుతూ... విప్లవోద్యమం విలువలకు కట్టుబడి ఉందని అన్నారు.ఎన్ని నిర్బంధాలు విధించినా తన పంథా మార్చుకోకుండా ఎదిరించిందన్నారు. తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో కగార్‌కు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు అందోళన చేపట్టాయన్నారు. విరసం నేత వరలక్ష్మి మాట్లాడుతూ... చర్చలు జరపం అనే హక్కు ప్రభుత్వానికి లేదని , చర్చలే లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేదన్నారు. ఆదివాసీలను, విప్లవకారులను చంపడమంటే దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడమే అన్నారు. ఒక పక్క సుప్రీం కోర్టు ప్రజలను చంపే హక్కు లేదంటునాకన మరో పక్క ప్రభుత్వాలు కగార్ పేరుతో హత్యలు చేస్తుందన్నారు. ప్రొఫెసర్ రమ మేల్కొటే మాట్లాడుతూ... మనుషలను చంపి వనరులను కార్పొరేట్‌లకు ఇస్తే ఏమి మిగులుతుందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ....షెడ్యూల్ 5 అనేది స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుందని అలాంటి వాటికి ప్రత్యేక చట్టాలు ఇస్తూ ఉన్న వాటిని గౌరవించాలన్నారు. బస్తర్‌లో శాంతి భద్రతల పేరుతో హింస జరుగుతుందని ప్రజలను వెళ్లగొడుతున్నారని ఇలాంటి సందర్భంలో శాంతి చర్చలు జరగాలన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... తెలంగాణ సాహిత్యంపై విరసం చెరగని ముద్ర వేసిందని తెలంగాణలో ఉండే చైతన్యం ఎక్కడా లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతుందని , శాంతి చర్చలకు ఆహ్వానిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. పోలీస్ యంత్రాంగం వల్లనే శాంతి చర్చలు విఫలమవుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మాత్రం ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నాయన్నారు. మావోయిస్టుల డిమాండ్ అంత ప్రజల కనీస అవసరాల చుట్టే తిరుగుతాయని దాన్ని గుర్తించి ప్రజలను చంపడం మానేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు అంబటి నాగయ్య,పాణి, పాటు రంగరావు, సాధినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి యువకుడి మృతి

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీలో సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..హైదరాబాద్, లింగంపల్లికి చెందిన మచ్చూరి అనిల్‌కుమార్(26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. నలుగురితో కలిసి అతను శనివారం వైజాక్ కాలనీని సందర్శించేందుకు వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున స్నానం చేసేందుకు సాగర్ వెనుక జలాల్లోకి దిగి నీట మునిగి గల్లంతయ్యాడు. గాలింపు చేపట్టిన పోలీసులు అనిల్‌కుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరీక్షణకు చెక్



రోగి అవసరాల దిశగా నిమ్స్ అడుగులు

- ఓపీ కార్డుకు బదులుగా స్లిప్‌లు
- వృద్ధుల ఆరోగ్య భద్రతకు టీకా క్లినిక్
- వివిధ విభాగాలకు ప్రత్యేక ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు

లక్డీకాపూల్ : నిమ్స్‌లో పైరవీ లేనిదే చికిత్స దొరకదన్నది ఒకప్పటి మాట.. ఇప్పుడు అర్హులందరికీ ఎలాంటి అసౌకర్యానికి తావు లేకుండా సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టారు. ఆస్పత్రికి వచ్చిన రోగికి సకాలంలో మెరుగైన వైద్యం అందించే దిశగా నిమ్స్ అడుగులు వేస్తోంది. రోజు రోజుకూ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో యాజమాన్యం పలు నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టింది. ఆస్పత్రిలో ప్రధాన సమస్యగా ఉన్న ఓపీ కార్డు జారీ అంశంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా కియోస్క్‌తో ఓపీ స్లిప్‌లు జారీకి చర్యలు చేపట్టింది. అదే విధంగా ప్రత్యేక విభాగాలకు పూర్తి స్థాయిలో ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో వృద్ధులకు ప్రత్యేక క్లినిక్‌ను ఏర్పాటు చేశారు.

స్లిప్‌తో ఓపీ సేవలు..

ఆస్పత్రిలో ఓపీ సేవల కోసం రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం సుమారు 3500 మంది వస్తుండటంతో ఓపీ కార్డుల కోసం నిరీక్షణ తప్పట్లేదు. గంటల తరబడి క్యూలో ఉన్నా.. కొన్ని సందర్భాల్లో ఓపీ కార్డు లభించని పరిస్థితి. ఎంతో దూరం నుంచి వచ్చిన వారు ఆసుపత్రి షెడ్లల్లోనే గడుపుతున్నారు. దీంతో కియోస్క్ సేవలను విస్తరించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. ఓపీ స్లిప్‌కు సానుకూలత రావడంతో మిగతా రోగులకూ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో మరో ఐదు కియోస్క్‌లను ఏర్పాటు చేయనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ తరహా కొత్త సాంకేతికత ఇదే తొలిసారి అన్నారు. రోగి వివరాలు, సమస్యను ఎంటర్ చేసి ఆన్‌లైన్‌లో నిర్ణీత ఓపీ రుసుం చెల్లించిన తర్వాత స్లిప్పు వస్తుంది. దానిని తీసుకుని నేరుగా సంబంధిత విభాగం వద్దకు వెళ్లి వైద్యుడిని సంప్రదించవచ్చన్నారు. దీంతో గంటల తరబడి క్యూలో నిల్చొనే అవసరం ఉండదని తెలిపారు. కియోస్క్‌ల వినియోగంలో రోగులకు సాయం అందించేందుకు సహాయకులను నియమించనున్నారు. నిమ్స్‌లోని అన్ని విభాగాల ఓపీ స్లిప్పులు ఈ కియోస్క్‌లతో పొందవచ్చని డైరెక్టర్ వివరించారు.


నిమ్స్‌లో రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ సేవలందిస్తున్న కియోస్క్

వృద్ధులకు టీకా..


టీకా వేయించుకుంటున్న డైరెక్టర్ బీరప్ప

వృద్ధులకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో ప్రత్యేకించి వాక్సినేషన్ క్లినిక్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా నిమ్స్‌లో పెద్దలకు ప్రత్యేక టీకా విభాగాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధుల సమస్యలపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దృష్టి సారించిన నేపథ్యంలో ఆస్పత్రిలో ఆ దిశగా సేవలు అందించడం గమనార్హం. 60 ఏళ్లు దాటిన వారంతా కొన్ని రకాల టీకాలు వేయించుకోవాలని డైరెక్టర్ బీరప్ప తెలిపారు. ముఖ్యంగా అవయవ మార్పిడి చేయించుకున్న వారు, సీపీఓడీ, ఆస్తమా, స్టెరాయిడ్లు తీసుకునే రోగులతో పాటు హెల్త్‌కేర్ సిబ్బంది ఈ టీకాలు తీసుకోవాలన్నారు. పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు టీకాలు వేస్తున్నామన్నారు. ఈ క్రమంలో పలు విభాగాలకు సంబంధించి పూర్తి స్థాయిలో ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న మెడికల్ ఎక్స్‌లెన్సీ అవార్డు నిమ్స్ సేవలకు కొలమానంగా నిలుస్తుందన్నారు.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడు మహేశ్

ఘట్‌కేసర్: ఓ ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను చోరీ చేసిన కేసులో నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శేఖర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏదులాబాద్‌కు చెందిన పోలు నర్సింగ్‌రావు ఈ నెల 4న రాత్రి బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం బయటికి వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అంబర్‌పేట్ బతుకమ్మకుంటకు చెందిన చింతల మహేశ్, తన స్నేహితుడు రామగాళ్ల నిఖిత్‌తో కలిసి చోరీ చేసినట్లు గుర్తించారు. మహేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి బైక్ స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు నిఖిల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యం..


రిశిక, కార్తికేయ (ఫైల్)


ఉమాదేవి

సుభాష్‌నగర్: ఇద్దరు పిల్లలతో సహా ఓ మహిళ అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూరారం లక్ష్మీనగర్‌లోని శివాలయం రోడ్డులో సురేష్, ఉమాదేవి(36)దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి రిశిక(19), కార్తికేయ(12) సంతానం. ఈ నెల 5న మధ్యాహ్నం సురేష్ భార్యకు ఫోన్ చేయగా స్పందించలేదు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉండటంతో తెరిచి చూడగా ఫోన్ ఇంట్లోనే ఉంది. భౌరంపేట్‌లోని శ్రీచైతన్య కళాశాలకు వెళ్లి తన కుమార్తె రిశికను ఉమాదేవి తీసుకువెళ్లినట్లు కళాశాల యాజమాన్యం తెలిపిందని, వారి ఆచూకీ కనిపెట్టాలని కోరుతూ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాటి చెట్లను రీప్లాంట్ చేయాలి


ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పోచారం: గీత కార్మికులకు జీవనోపాధి కలిస్తున్న తాటి చెట్లను నరికి పాడు చేయకుండా ఇతర ప్రాంతాల్లో రీప్లాంట్ చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్‌లో సర్వే నెంబర్లు 311, 312, 313, 324, 326పార్టు, 327పార్టులో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ చేస్తూ తాటిచెట్లు, ఈత చెట్లను తొలగిస్తున్నందుకు నిరసనగా గీత కార్మికులు ఆదివారం ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్ కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాటిచెట్లపై నుండి కిందపడి చనిపోయిన వారు ఎంతో మంది ఉన్నారని, అయినా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయన్నారు. ఆరోగ్యమైన నీరా కావాలంటే తాటి చెట్లను తప్పనిసరిగా పెంచాలన్నారు. వందేళ్ల నాటి చెట్లను పది నిమిషాల్లో నేలమట్టం చేయడం దారుణమన్నారు. చెట్లను నకరడమంటే గీత కార్మికుల గుండెలపై తన్నినట్లన్నారు. గీత కార్మిక సంఘ రాష్ట్ర నాయకుడు పంజాల జైహింద్ గౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో వెంచర్ల మాటున తాటిచెట్లను తొలగించవద్దన్నారు. 300 పైగా కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడి బతుకుతున్నాయన్నారు. కార్మికులకు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే వెంచర్‌లో పనులు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘ నాయకులు కట్ట దర్శన్, భిక్షపతి, వెంకటేశ్, పాండు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అసత్య ప్రచారాలు మానుకోండి


ఫిర్యాదు చేస్తున్న జక్కిడి శివచరణ్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై దుష్ప్రచారం చేస్తున్న బీజేపీ ఐటీ విభాగంపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ ఐటీ విభాగం ప్రతినిధి రతన్‌రంజన్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఒక పార్లమెంట్ సభ్యుడిని అగౌరపరచడమే కాకుండా మహిళల సాధికారత, గౌరవంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బీహార్ ఎన్నికల్లో భాగంగా గ్రామీణ ప్రాంతంలో నివసించే పేద మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం కోసం శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేశారన్నారు. మహిళలను కించపరుస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీకి దేశవ్యాప్తంగా ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ ఇటువంటి దుష్ప్రచారానికి పూనుకుందన్నారు. కార్యక్రమంలో శక్తి సూపర్ షీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కె.విద్యారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దీపక్, ప్రగ్యా, , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్‌చరణ్, వి.సురేష్, వై.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజేంద్రనగర్‌కు సీఎం రాక

రాజేంద్రనగర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం రాజేంద్రనగర్‌కు రానున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలోని బొటానిక్ గార్డెన్‌లో వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటనున్నారు. ఇందుకోసం అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 9 గంటలకు ఆయన బొటానిక్ గార్డెన్‌కు వచ్చిన అనంతరం అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులతో పాటు విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులో కలిసి మొక్కలను నాటనున్నారు.

పెంపుడు జంతువులకు టీకా తప్పని సరి

హిమాయత్‌నగర్ : పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రేబిస్ టీకా వేయించాలని తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ మల్లీశ్వరి అన్నారు. ఆదివారం నారాయణగూడ సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ హాస్పిటల్‌లో సూపరింటెంట్ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా డా.మల్లీశ్వరి మాట్లాడుతూ రేబీస్ వ్యాధి, కుక్కలు, పిల్లులు, గబ్బిలాల లాలాజలం ద్వారా సంక్రమిస్తుందన్నారు. అవి కరిచినప్పుడు గాయానికి కట్టు కట్టకుండా సబ్బుతో నల్లా నీళ్లతో శుభ్రంగా కడిగి వైద్యుడిని సంప్రదించాలన్నారు. యాంటి రేబిస్ ఇంజక్షన్, లేదా టీటీ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి ఎం.ప్రవీణ్ కుమార్, ఇండియన్ ఇమ్యునోజికల్ ప్రతినిధి ఉదయ్ శంకర్, సహాయ సంచాలకులు డా.ఎస్.శ్రీనివాస్ రెడ్డి, డా.బి.నవీన్ కుమార్ రెడ్డి, పశు వైద్యాధికారులు డా.అరవింద్, డా.చంద్రశేఖర్ రెడ్డి, డా.ప్రవీణ్ కులకర్ణి, డా.సురేష్, డా.రంజిత్, తివారి తదితరులు పాల్గొన్నారు.

నగల బ్యాగ్ అప్పగింత


బ్యాగ్‌ను అప్పగిస్తున్న రాయదుర్గం పోలీసులు

గచ్చిబౌలి: ఆటోలో మరిచిపోయిన నగలను రాయదుర్గం పోలీసులు నూతన దంపతులకు తిరిగి అప్పగించారు. డీఎస్ఐ చైతన్య రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నాటకకు చెందిన నూతన దంపతులు చంద్రశేఖర్, జ్యోతి రాయదుర్గంలో ఉంటున్న సోదరుని ఇంటికి వచ్చారు. ఆదివారం సాయంత్రం వారు నానల్ నగర్ నుంచి ఆటోలో రాయదుర్గం వెళ్లారు. ఆటో వెళ్లిపోయిన తర్వాత బ్యాగ్ మరిచిపోయినట్లు గుర్తించిన వారు బ్యాగ్‌లో ఆరు తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం సిబ్బంది సీసీ పుటేజీల ఆధారంగా ఆటోను గుర్తించారు. పోలీసులు ఫోన్ చేయగా ఆటోలో బ్యాగ్ ఉన్నట్లు డ్రైవర్ చెప్పడంతో రెండున్నర గంటల వ్యవధిలోనే ఆటో డ్రైవర్‌ను రప్పించి బ్యాగ్‌తో పాటు బంగారు ఆభరణాలు వారికి అప్పగించారు.

ఏకలవ్య భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి


ఏకలవ్య జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

కవాడిగూడ: ఏకలవ్య భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ మొదలు పెట్టిన ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తి చేయలేని దారుణ పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్ బండ్‌పై ఉన్న కొమురంభీం విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కవిత ఏకలవ్యుని చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎరుకల కులస్థుల అభివృద్ధికి ఎంపవర్ మెంట్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. 50 వేల ఎరుకల కుటుంబాలకు లబ్ధి చేకూర్చే ఈ పథకాన్ని మరింత మెరుగు పరిచి అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల సామాజిక వర్గానికి అన్ని పార్టీలు సముచిత అవకాశాలు కల్పించాలన్నారు. రూ. 500 కోట్లతో ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఏకలవ్య భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని , చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఏకలవ్య ఫౌండేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయించి ఎరుకల కులస్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుత్తాడి రవికుమార్, రాజయ్య, శ్రీనివాస్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, సాయి, వీరన్న, మొగులయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ 'అడ్మిషన్ల' కోసం గాలం..!

హలో సార్ గుడ్ మార్నింగ్... మీరు అక్షయ్ పేరెంటేనా? అక్షయ్‌కు ఎంత ర్యాంకు వచ్చింది?ఏ కోర్సు కోసం ప్లాన్ చేశారు. కన్వీనర్ కోటాలో ఆ కోర్సు సీటు కష్టమే కదా..? బీ కేటగిరి మేనేజ్‌మెంట్ కోటా కింద వెళ్లేకండి. డబ్బులు వృథా చేయవద్దు. మా కాలేజీలో తక్కువ ఫీజులో అదే కోర్సు పూర్తి చేయవచ్చు. ఒకసారి మా కాలేజీ క్యాంపస్‌ను విజిట్ చేయండి. ఆలస్యం చేయకండి. ఎప్పుడు వస్తారు? రేపు బాబుతో కలిసి వస్తారా? వచ్చేటప్పుడు నా నెంబర్‌కు కాల్ చేయండి సార్.



సార్, నమస్తే... మాది ఫలనా ఎడ్యుకేషన్ అకాడమీ. మీరు విజయ్ ఫాదరేనా? బీటెక్‌లో ఏ కోర్సు ప్లాన్ చేశారు. గుజరాత్ టాప్ వన్ ఇంజనీరింగ్ కాలేజీ ఉంది. విశాలమైన స్థలం. హాస్టల్ వసతి, తక్కువ ఫీజు, స్కాలర్ షిప్, కోర్సు పూర్తయి తర్వాత మంచి ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ గ్యారంటీ. ఇప్పటికే 30 మందికి అడ్మిషన్లు ఇప్పించాం. కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి. ఆసక్తి ఉంటే ఆలస్యం చేయకండి. ఆలోచించి సంప్రదించండి.

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల ఫోన్ల తాకిడి

- ఒక వైపు కన్సల్టెన్సీలు, మరోవైపు ప్రైవేట్ డీమ్డ్ వర్సిటీలు
- తక్కువ ఫీజుతో సీటు,హాస్టల్ వసతి అంటూ ఎర
- విద్యార్థుల తల్లిదండ్రుల అయోమయం

సాక్షి,సిటీబ్యూరో: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కూడా పూర్తి కావస్తోంది.ఏ ర్యాంక్ వరకు ఏ కాలేజీలో సీటు వస్తోందన్న ఊహాగానాలు ఉపందుకున్నాయి. గత విద్యా సంవత్సరం వచ్చిన ర్యాంకులను బట్టి అంచనా వేస్తున్నారు. టాప్ 10 నుంచి 20 కాలేజీల్లో సీటు ఆశలు సన్నగిల్లుతున్నాయి. వివిధ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు, కన్సల్టెన్సీలు నుంచి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ల తాకిడి పెరిగింది. మరోవైపు డీమ్డ్ వర్సిటీల నుంచి వాట్సాప్, ఎస్ఎంఎస్ మేసేజ్‌లు విపరీంగా పెరిగిపోతున్నాయి. రోజు వారీగా కనీసం 20 నుంచి 30 నుంచి ఫోన్లు వస్తుండటంతో ర్యాంకులు ఎక్కువ వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. స్థానిక కాలేజీలో తమ పిల్లలకు వచ్చిన ర్యాంకుల బట్టి సీటు వస్తుందా? వారి భవిష్యతేంటని ఆందోళన చెందుతున్నారు.

సీఎస్ఈ కోర్సుకు డిమాండ్

మహానగర పరిధిలోని టాప్ 20 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కోర్సుకు డిమాండ్ బాగా పెరిగింది. సీటు కోసం ఎంత ఫీజు అయినా చెల్లించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా సీట్లు లేకపోవడంతో, మేనేజ్‌మెంట్‌లు సొమ్ము చేసుకుంటున్నాయి. అయితే మేనేజ్‌మెంట్ కోటాలో సైతం కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సుల సీట్లకే పోటీ విపరీతంగా కనిపిస్తోంది. వాస్తవంగా మొత్తం సీట్లలో 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేసుకునే అవకాశం ఉంది. ర్యాంక్ ఆధారంగా కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద సీట్లను నింపి మిగితా సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. సీఎస్ఈ అనుబంధ కోర్సుల్లోని సీట్లు టాప్ కాలేజీలలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు, సెంకడరీ కాలేజీల్లోనూ రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల దాకా తీసుకుంటున్నారు.

డీమ్డ్‌వర్సిటీల తాకిడి..

ప్రై వేటు డీమ్డ్ వర్సిటీలు ఇంజనీరింగ్(బీటెక్) కోర్సులో అడ్మిషన్ల కోసం పోటీపడుతున్నాయి. తమ పీఆర్‌ఓలు, కన్సల్టింగ్ ఏజెన్సీల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో ఫోన్లు, వాట్సాప్, సందేశాల తాకిడి పెరిగింది.ఇప్పటికే వర్సిటీలు ప్రవేశాల కోసం అడ్మిషన్ ప్రకటనలు విడుదల చేసి కోర్సులు, ఫీజులు, ప్లేస్‌మెంట్ అవకాశాలు వంటి వివరాలతో పాటు వర్సిటీ ప్రాంగణం, సౌకర్యాలు, ల్యాబ్‌లు, క్రీడా మైదానాలతో విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. తక్కువ ఫీజు, హాస్టల్ వసతి అంటూ గాలం వేస్తున్నాయి.

అందరికీ సీట్ వస్తుంది..

రాష్ట్రంలో ఇంజనీరింగ్ బోలెడన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి పేర్కొంటోంది. సీట్ల కోసం డొనేషన్ కట్టి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రైవేటు కాలేజీల్లో బీ-క్యాటగిరీ సీట్ల భర్తీకి ప్రభుత్వం ఇంకా అనుమతించలేదని, నిబంధనలకు వ్యతిరేకంగా ముందే భర్తీ చేస్తే చర్యలు తప్పవని కాలేజీల యాజమాన్యాలను హెచ్చరిస్తోంది. అనుమతి లేని కాలేజీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తోంది. హైదరాబాద్ నానక్‌రాంగూడ , మాదాపూర్,హైటెక్ తదితర ప్రాంతాల్లోని పలు ఇంజనీరంగ్ సంస్థలకు ఏఐసీటీఈ గుర్తింపు లేదని స్పష్టం చేసింది.

చరిత్రను వక్రీకరించేలా 'హరిహర వీరమల్లు'

బీసీ సంఘం నేత ఆరోపణ

పంజగుట్ట: పవన్‌కళ్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు సినిమా పూర్తి కల్పితమని, ప్రజా వీరుడు పండగ సాయన్న జీవిత చరిత్రను తీసుకుని చరిత్రలో ఎక్కడాలేని కల్పిత పాత్రలతో ఈ సినిమా తీస్తున్నారని బీసీ సంఘం నాయకుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి డాక్టర్ శివ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రను వక్రీకరించే ఈ సినిమాను అడ్డుకుంటామని, త్వరలో సినిమాపై హైకోర్టులో పిల్ వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పండగ సాయన్న జీవిత చరిత్ర ఆధారంగా సినిమా తీశారని తాము ఆరోపించగా, సినిమా యూనిట్ తప్పును సమర్థించుకునేందుకు పండగ సాయన్న సినిమా కాదని, 1336లో విజయనగర సామ్రాజ్యం స్థాపించిన హరిహర బుక్కరాయలు కథ అని చెబుతున్నారని అన్నారు. సినిమా ట్రైలర్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందన్నారు. డబ్బులకోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని తప్పకుండా అడ్డుకుంటామని, త్వరలోనే హైకోర్టును ఆశ్రయిస్తామని శివ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

వెంగళరావునగర్: డివిజన్‌లోని జవహర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ మహిళా నేతలు కార్పొరేటర్ దేదీప్య విజయ్ సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో విజయాగౌడ్, వెంకటరమణమ్మ, లక్ష్మీగౌడ్, రాజమ్మ, కృష్ణవేణి ఉన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులకు జరిమానా, జైలు

బంజారాహిల్స్: సెంట్రల్ జోన్ ట్రాఫిక్ పోలీసులు అబిడ్స్, చిక్కడపల్లి, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 2 రోజులుగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 105 మంది ట్రాఫిక్ ఉల్లంఘనులను గుర్తించారు. వీరిని నాంపల్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట ఆదివారం హాజరుపర్చారు. వీరిలో 75 మందికి రూ.2,100 ల జరిమానా, 12 మందికి రూ.3,100, ఒకరికి కోర్టు రైజింగ్, రూ.3,300 ల జరిమానా, 17 మందికి జైలు, రూ.4,100 ల జరిమానా విధించారు. మొత్తం రూ.2,39,000 జరిమానా కోర్టు విధించినట్లు సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ మోహన్ కుమార్ తెలిపారు.

పుస్తకావిష్కరణ


బుక్‌ను ఆవిష్కరిస్తున్న దేవాంశ్ అలిజర్

బంజారాహిల్స్: బంగారంతో పాటు వజ్రాలు ఇతర ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటిలో జరిగే మోసాలు ఇతర అంశాలపై అవగాహన కల్పించేలా నగరానికి చెందిన యువ రచయిత దేవాంశ్ అలిజర్ రాసిన 'స్టాప్–డోంట్ బై జువెలరీ అంటిల్ యూ రీడ్ దిస్' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జూబ్లీహిల్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత దేవాంశ్ మాట్లాడుతూ.. ఆభరణాల కొనుగోలు అంశాల్లో తెలుసుకోవాల్సిన అంశాలపై సమగ్రమైన సమాచారాన్ని పుస్తకంలో పొందుపర్చామన్నారు. ధరలో పారదర్శకత, అపోహలు, కిటుకులను గురించి వివరించామన్నారు.

బీవీబీపీ విద్యాశ్రమం ఫౌండేషన్ డే వేడుకలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో ఫౌండేషన్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ శ్రీవాత్సవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో చైర్మన్ గోపాలకృష్ణన్, రీజినల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మదన్‌రావు, డైరెక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అకారణంగా కుటుంబంపై దాడి

వెంగళరావునగర్ : అకారణంగా మహిళతో పాటుగా ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న వనపర్ల రేఖ ఈనెల 4న వెంగళరావునగర్‌లోని తన సోదరుడి ఇంటికి కుటుంబంతో సహా వచ్చింది. అర్ధరాత్రి ఇంటి వద్ద కూర్చుని మాట్లాడుతుండగా అదే కాలనీకి చెందిన ఉమేశ్, మహేశ్, జీవన్ తదితరులు మద్యం తాగి వచ్చి అకారణంగా ఆమెను దూషించారు. అంతేగాకుండా దాడిచేసి గాయపరిచారు. ఆమె భర్త రవి కుమారుడు ధనేష్, మరిది బాబు అడ్డుకోగా వారిపై కూడా దాడి చేశారు. బాధితులు సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న అనంతరం ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జితో ఇక్కట్లు..!

జూబ్లీహిల్స్ సర్కిల్–18లో పూర్తిసాయి ఏఎంఓహెచ్ లేని వైనం

- గాడి తప్పుతున్న పారిశుద్ధ్య పనులు
- ముఖ్యమంత్రి నివసించే ప్రాంతంలోనే తీవ్ర నిర్లక్ష్యం
- రోజుల తరబడి పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందుల్లో స్థానికులు


బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఎదుట ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెత్తాచెదారం

బంజారాహిల్స్: అది సీఎం రేవంత్‌రెడ్డి..హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి, కోమటిరెడ్డి, కొండా సురేఖ తదితరులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, జీహెచ్‌ఎంసీ, పోలీసు ఉన్నతాధికారులు నివసిస్తున్న కీలకమైన జూబ్లీహిల్స్ సర్కిల్. అయితే ఈ సర్కిల్‌లోనే పారిశుద్ధ్య సమస్య రోజ రోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 ఏఎంఓహెచ్ ఇన్‌చార్జి హోదాలో ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన పర్మినెంట్ ఉద్యోగం చందానగర్ సర్కిల్ కాగా, కీలకమైన జూబ్లీహిల్స్ సర్కిల్‌కు ఇన్‌చార్జిగా ఉండి వారానికోసారి అలా వస్తూ ఇలా తూతూమంత్రంగా తిరుగుతూ వెళ్లిపోతున్నాడు. దీంతో పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో పాటు సూపర్‌వైజర్, ఎస్‌ఎఫ్‌ఏలపై నియంత్రణ కోల్పోయారు. ఫలితంగా రోజూ చెత్తను ఊడ్చి కుప్పలను తొలగించి పరిశుభ్రతకు పెద్దపీట వేయాల్సిన ఏఎంఓహెచ్ విభాగం తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తుండడంతో చెత్త కుప్పలు ఎక్కడికక్కడే పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. ఈ సర్కిల్ పరిధి కిందికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లు వస్తాయి. వీటి పరిధిలో బ్యూరోక్రాట్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బడా పారిశ్రామిక, వ్యాపారవేత్తలు నివసిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత గల సర్కిల్‌కు పర్మినెంట్ ఏఎంఓహెచ్‌ను నియమించడంలో ఉన్నతాధికారులతో పాటు సంబంధిత మంత్రులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయి ఏఎంఓహెచ్ లేకపోవడంతో ఎస్‌ఎఫ్‌ఏలు ఆడిందే ఆట..పాడిందే పాట అన్నట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పారిశుద్ధ్య విభాగం మీద పూర్తిగా పట్టు తప్పారు. జూబ్లీహిల్స్ సర్కిల్‌కు పూర్తిస్థాయిలో ఏఎంఓహెచ్‌ను నియమించాల్సిన అవసరం ఉండగా, సంబంధిత అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఇటీవల ఇక్కడ చెత్తాచెదారం సమస్య మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయి ఏఎంఓహెచ్‌ను నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేతలు


నివాళులర్పిస్తున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు


నివాళులర్పిస్తున్న సీఎన్ రెడ్డి తదితరులు

ఫిలింనగర్: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఆదివారం ఫిలింనగర్‌లో నిర్వహించారు. జూబ్లీహిల్స్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నేత కాటూరి రమేశ్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విగ్రహాల చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని సూచించారు.

ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో..

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు గంట మల్లేశ్, నర్సింగరావు, యాకమ్మ, రఘు, కథలయ్య, భిక్షపతి, గంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహమత్‌నగర్, ఎస్పీఆర్‌హిల్స్‌లో..

రహమత్‌నగర్: రహమత్‌నగర్,ఎస్పీఆర్‌హిల్స్‌లోని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు . దళిత కాంగ్రెస్ నాయకులు రవిశంకర్, శాంతకుమార్, సంజీవరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బోరబండ బస్టాప్ వద్ద..

బోరబండ బస్టాప్ వద్ద కాంగ్రెస్ నాయకులు మహేశ్ కుమార్‌గౌడ్, అశోక్, జై భీమ్ యాదగిరి, జీవన్ నాయక్, మహేందర్ తదితరులు నివాళులర్పించారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి



ఫిలింనగర్: మహనీయుల చౌరస్తాలో డాక్టర్ శ్యామా ప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు బీజేపీ నేతలు గౌతమ్‌రావు, సారంగుల అమర్నాథ్, జిల్లా, అసెంబ్లీ, డివిజన్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువకుడి ఆత్మహత్య

వెంగళరావునగర్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్‌గోదావరి ప్రాంతానికి చెందిన వీరవల్లి పవన్‌కుమార్ (24) కొంతకాలంగా నగరంలోని ఎల్లారెడ్డిగూడ హాస్టల్‌లో ఉంటున్నాడు. అతని సోదరి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఆమెకు తన కజిన్ సోదరుడు చనిపోయినట్టు రూమ్మేట్ ద్వారా సమాచారం అందడంతో ఈ విషయాన్ని కుమారుడు వరుస అయిన ఎల్లారెడ్డిగూడలో ఉంటున్న వాసంశెట్టి దుర్గాప్రసాద్‌కు తెలియజేసింది. దాంతో హుటాహుటినా అందరూ హాస్టల్ వద్దకు వెళ్లి చూడగా బాత్‌రూంలో టవల్‌తో పవన్‌కుమార్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దుర్గాప్రసాద్ ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుడిపై అత్త ఫిర్యాదు

వెంగళరావునగర్: తన కుమార్తెను వేధిస్తున్న ఓ అల్లుడిపై అత్త మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం..రహమత్‌నగర్‌కు చెందిన కె.బచనీని తన కుమార్తెను ఇటీవల మహబూబ్‌నగర్‌కు చెందిన రత్లావత్ రవి అనే యువకుడికి ఇచ్చి పెళ్లి చేసింది. అయితే తన కుమార్తెను ప్రతిరోజు రవి ఇబ్బంది పెడుతూ మానసికంగా హింసిస్తున్నాడు. దీంతో గతంలో అతనిపై 3వ మెట్రోపాలిటన్ జడ్జి వద్ద కేసు పెట్టింది. అయినప్పటికీ తరచూ వేధిస్తూనే ఉన్నాడు. దాంతో అతనిపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆదివారం లేఖ విడుదల చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన 250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల పెన్షన్ సౌకర్యంతో పాటు ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు కార్డు, ప్రభుత్వ పథకాల్లో 20 శాతం వాటా, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డితో స్పష్టమైన ప్రకటన చేయించాలని లేఖలో పేర్కొన్నారు. సమావేశంలో ఫోరం రాష్ట్ర కమిటీ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సురేందర్ రెడ్డి, దయానంద్, గగన్ కుమార్, జానకీ రెడ్డి, ఇంద్రాకుమార్, రాంబాబు, జగన్ యాదవ్, విష్ణువర్ధన్, శ్యామల, అనంతలక్ష్మి, వీరస్వామి, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, భానుప్రకాశ్, గౌస్, సుదర్శన్, భాస్కర్, చంద్రశేఖర్, శివకుమార్ నేత, సుదర్శన్ యాదవ్, రాజేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పీర్ల ఊరేగింపు

బంజారాహిల్స్: మొహర్రం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ బస్తీలో చిల్లా గౌస్ ఏ పాక్ మొహర్రం పీర్ నందియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పీర్ల ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీసభ్యులు ఖాజా బందేనవాజ్, అల్లా మొహ్మద్, ఇమామ్ హుసేన్ పీర్లను ఊరేగించారు. బస్తీవాసులు పీర్లకు మొక్కులు చెల్లించుకుంటూ ముందుకు సాగారు. దశరథ్ చౌహాన్, రాందాస్ చౌహాన్, మహ్మద్ అహ్మద్, వి. రాములు, మహ్మద్ సలీం, చౌహాన్ శంకర్, ఫర్హీద్ షరీఫ్, యోగ్య, కిషన్, షాహబుద్దీన్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

హిమాయత్‌నగర్ : మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయా రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్ 4, ఫరీద్‌బస్తీలో ఏర్పాటు చేసిన ఆలం (పీర్ల)ను ఆమె ఆదివారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోరబండ భారత్‌నగర్‌లో..

రహమత్‌నగర్ : బోరబండ భారత్‌నగర్‌లో మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పీర్లను దర్శించుకుని దట్టీలు సమర్పించారు. కాంగ్రెస్ నాయకులు కాసుల మహేశ్‌గౌడ్, ఖయ్యూం, ఆనంద్, వెంకటేశ్, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రహమత్‌నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్‌నగర్‌లో కార్పొరేటర్ సీఎ న్‌రెడ్డి పీర్లకు మొక్కులు చెల్లించుకున్నారు. నాయకులు మన్సూర్, ఎక్బాల్, అహ్మద్, సయ్యద్ షరీఫ్ తదతరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడలోని అసుర్‌ఖానా వద్ద..

శ్రీనగర్‌కాలనీ: మొహర్రం పండుగ మతసామరస్యానికి ప్రతీక అని మాజీ ఎంపీ అజారుద్దీన్ అన్నారు. ఎల్లారెడ్డిగూడలోని అసుర్‌ఖానా వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ వనం సంగీత, వనం శ్రీనివాసయాదవ్, మాజిద్, గని, అసుర్‌ఖానా ఇన్‌చార్జి షేక్ జాఫర్, షరీఫ్, ఖలీమ్ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పాటుపడాలి

హిమాయత్‌నగర్ : మహిళల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ పాటుపడాలని ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ జ్యూడీషియల్ మెంబర్ (రిటైర్డ్) జస్టిస్ టి.రజనీ అన్నారు. న్యాయసేవా పథంలో జస్టిస్ డాక్టర్ గురిజాల రాధారాణి 36 ఏళ్ల కొనసాగి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జిగా జూన్ 28న పదవీ విరమణ చేసిన సందర్భంగా కుల నిర్మూలన సంఘం (కేఎన్‌ఎస్), మానవ వికాస వేదిక (ఎంవీవీ), ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ), జనవిజ్ఞాన వేదిక (జేవీవీ), విజ్ఞాన దర్శిని సంయుక్తాధ్వర్యంలో అభినందన సభ కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు ఎండీ వహీద్ అధ్యక్షతన ఆదివారం రాత్రి బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాధారాణి, సీఎల్‌ఎన్ గాంధీ దంపతులను అతిథులు ఘనంగా సన్మానించారు. అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (రిటైర్డ్), సలహాదారులు కేఎన్‌ఎస్ సీఎల్‌ఎన్ గాంధీ, కేవీఎస్ గౌరవ అధ్యక్షుడు గుత్తా జ్యోత్స్న, విజ్ఞానదర్శిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లి ఆదామ్ రాజ్, ఎంవీవీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా భాస్కర్, జేవీవీ జాతీయ అధ్యక్షుడు సమ్మి స్వరాజ్యలక్ష్మి, భారత్ భూషన్, సభలో హన్మంతరావు (ఎంవీవీ), జ్యోతి(కేఎన్‌ఎస్), వీఎం కృష్ణా రెడ్డి (ఐఎల్‌పీఏ), పద్మ(జేవీవీ), టీ.లక్ష్మీదేవి (ఐఎల్‌పీఏ) మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విజన్‌కు అనుగుణంగా ఉత్పత్తులు అందించాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, పుస్తక రచయిత మనోహర్‌రావు

బంజారాహిల్స్: 2047 విజన్‌కు అనుగుణంగా ఆయా సంస్థలు తమ ఉత్పత్తులను అందించాలని సైయెంట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్. మోహన్‌రెడ్డి అన్నారు. ఇంజినీరింగ్ తయారీ రంగంలో 60 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న మార్గదర్శక వ్యవస్థాపకుడు వంగూరి మోహన్‌రావు రచించిన 'జ్ఞాపకాల పుస్తకం హౌ ఐ బిల్ట్ ఇట్'ను తాజ్‌కృష్ణాలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. తన వ్యవస్థాపక విజయగాథ ఎంతోమంది పారిశ్రామికవేత్తలు, యువకులకు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈఎల్‌సీవో లిమిటెడ్ చైర్మన్, ఎండీ డాక్టర్ రమేశ్ దాట్ల, గుణేశ్వర పుర్సర్ల, ద్వారకనాథ్ పట్నంతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు


గంజాయి విక్రేతలతో ఎక్సైజ్ పోలీసులు

బంజారాహిల్స్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు, ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని వెంకటగిరి వాటర్‌వర్క్స్ కార్యాలయ సమీపంలో శనివారం అర్ధరాత్రి నలుగురు యువకులు పెద్ద మొత్తంలో గంజాయి కలిగి ఉండడమే కాకుండా అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లుగా ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు చేసి మహానంది తిమ్మాపురం గ్రామానికి చెందిన దూదెకుల శివసాయి (28), మట్టాడ ప్రవీణ్ (27), కే గణేశ్ (25), పావులూరి కల్యాణ చక్రవర్తి (25)ని అరెస్టు చేశారు. వీరి నుంచి 2 కిలోలకు పైగా డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే 4 ఐఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని కూడా సీజ్ చేశారు. ఇందులో ప్రధాన నిందితుడు శివసాయి ప్రైవేట్ ఉద్యోగి కాగా, ప్రవీణ్ డ్రైవర్‌గా, గణేశ్ టైలర్‌గా పని చేస్తున్నారు. వీరంతా జల్సాలకు తేలికగా డబ్బు సంపాదించాలని అడ్డదారుల్లో గంజాయి విక్రయాలు చేస్తున్నట్లుగా విచారణలో తేలింది. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువతిని వేధిస్తున్న యువకుడి రిమాండ్


వరప్రసాద్

ఫిలింనగర్: యువతితో పాటు ఆమె తండ్రిని వేధింపులకు గురిచేస్తున్న యువకుడిని ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డికి చెందిన మల్లుగళ్ల వరప్రసాద్ (23) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఆల్విన్‌కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. కొంతకాలం క్రితం ఓయూకాలనీకి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థినిని ప్రేమించాడు. అయితే వరప్రసాద్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఆమె లవ్‌కి బ్రేకప్ చెప్పేసింది. అయినా వరప్రసాద్ వినకుండా తనను ఎప్పటిలాగే ప్రేమించాలని లేకుంటే గతంలో దిగిన వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తానంటూ బాధితురాలితో పాటు ఆమె తండ్రికి కూడా వాట్సప్‌లో మెసేజ్‌లు పెట్టాడు. ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను తండ్రికి కూడా పంపిస్తూ వేధింపులకు గురిచేయడమే కాకుండా ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో బాధిత తండ్రి ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి వరప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సెల్‌ఫోన్లు అపహరిస్తున్న వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్: సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేస్తున్న వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..యూసుఫ్‌గూడలో నివసించే నగేశ్‌తో పాటు మరో ఇద్దరు స్నేహితులు గంజాయి, మద్యానికి బానిసయ్యారు. డబ్బుల కోసం అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ నడుచుకుంటూ వెళ్తున్న వారిని టార్గెట్ చేసి సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేస్తుంటారు. ఇదే క్రమంలో శనివారం తెల్లవారుజామున జర్నలిస్ట్‌కాలనీ చౌరస్తాలో ముగ్గురు బీహార్ యువకులు విధులు ముగించుకుని వెళ్తుండగా అడ్డగించి అరవింద్‌కుమార్ అనే యువకుడిని బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–45లో సెల్‌ఫోన్ లాక్కొని ముగ్గురు పరారయ్యారు. అక్కడి నుంచి నేరుగా మాదాపూర్ వైపు వెళ్లి అక్కడ కూడా ఓ వ్యక్తి సెల్‌ఫోన్ లాక్కునేందుకు యత్నిస్తుండగా విధుల్లో ఉన్న మాదాపూర్ పోలీసులు నగేశ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరో ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. నిందితుడిని విచారించగా కేబీఆర్ పార్కు పక్కన ఫోన్ స్నాచింగ్ చేసినట్లు చెప్పడంతో బంజారాహిల్స్ పోలీసులు నిందితుల్లో ఒకరైన నగేశ్‌ను అదుపులోకి తీసుకుని మిగతా ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు. బాధితుడు అరవింద్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామం తప్పనిసరిగా చేయాలి


వర్క్‌షాప్‌లో పాల్గొన్న సీనియర్ పాత్రికేయులు

పంజగుట్ట: ప్రతిఒక్కరూ రోజు 30 నిమిషాలు వారానికి 5 రోజులు తప్పకుండా వాకింగ్ చేయాలని నిమ్స్ ఆసుపత్రి కార్డియోథెరసిక్ వైద్యుడు అమరేశ్వర్ రావు అన్నారు. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, ప్రెస్ క్లబ్ హైదరాబాద్ సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రన్నింగ్, వెల్‌నెస్, యాక్టివ్ లైఫ్‌స్టైల్‌పై ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. శరీరం సహకరిస్తే రన్నింగ్, లేకుంటే వాకింగ్ చేయాలన్నారు. జర్నలిస్టులు వారి వృత్తిలో నిత్యం బిజీగా ఉంటారని నిద్ర కూడా తక్కువగా ఉంటుందని, కానీ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి నిద్ర ఎంతో అవసరమన్నారు. దీంతో పాటు మంచి ఆహారం కూడా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, సీనియర్ పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు


శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, శ్రీనగర్‌కాలనీ, ఖైరతాబాద్ డివిజన్లలో తొలి ఏకాదశి పండుగను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు పోటెత్తారు. శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి వేకువజామునే అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అలాగే బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని గౌరీ శంకర్ కాలనీ సీతా రామచంద్రా స్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలతో పాటు తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి శత ఘటాభిషేకం పూజా కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో దర్శనానికి పోటెత్తిన భక్తులు


బంజారాహిల్స్ గౌరీశంకర్‌కాలనీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శత ఘటాభిషేకంలో భక్తులు


స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పేయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ విజయభాస్కర్ రచించిన సృష్టిగర్ప గ్రంథావిష్కరణ సాయంత్రం 6 గంటలకు నాంపల్లిలోని ఎస్సీఆర్ తెలుగు వర్సిటీలో జరుగుతుంది.
- శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మ్యూజిక్ టీచర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని క్యాంపస్ స్కూల్‌లో సంగీత ఉపాధ్యాయుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 11వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రాథమిక ఉపాధ్యాయ(పీఆర్‌టీ) సంగీత ఉపాధ్యాయులను నియమించనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులతోపాటు అన్ని సర్టిఫికెట్లను తీసుకు రావాలని సూచించారు. నెలకు రూ.35 వేల ఏకీకృత జీతం చెల్లించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు హెచ్‌సీయూ వెబ్‌సైట్ www.uohyd.ac.in నిసందర్శించాలని అధికారులు తెలిపారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాషన్ ప్రియుల కోసం మరోసారి హైలైఫ్ ఎగ్జిబిషన్‌నగరవాసుల ముందుకొచ్చింది. హైటెక్ సిటీలోని నోవాటెల్ హోటల్‌లో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను హీరోయిన్లు రాశీసింగ్, భ్రమరాంబిక, హైలైఫ్ ఎగ్జిబిషన్ ఎండీ అండ్ సీఈఓ అబి డొమినిక్ ప్రారంభించారు. నగరానికి చెందిన 350 మందికిపైగా ప్రముఖ డిజైనర్ల డిజైనర్ దుస్తులు ప్రదర్శనలో ఉన్నాయి. మంగళవారం వరకూ ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

బీభత్సం సృష్టించిన కారు



ఇరుక్కుపోయిన కారును లాగుతున్న సిబ్బంది

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ వద్ద ఆదివారం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ సందర్భంగా అక్కడున్న ప్రజలందరూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. వివరాలు... ఆదివారం ఓ కారు అతివేగంగా యూసుఫ్‌గూడ పెట్రోలు బంకులోకి దూసుకు వచ్చింది. పెట్రోలు పోసే మిషన్‌ను ఢీకొట్టి ఇరుక్కుపోయింది. దాంతో బంకు సిబ్బంది, స్థానికులు ఉరుకులు, పరుగులు తీశారు. అయితే కారులోంచి ఎలాంటి మంటలు రాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొద్ది సేపటికి అతికష్టం మీద సిబ్బంది కారును బయటకు లాగారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పెట్రోలు బంకు నిర్వాహకుల ఫిర్యాదుతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ల నిర్మాణం పూర్తయ్యేనా?

శివారులోని 13 పురపాలికల్లో ఐదేళ్లుగా 'సా'గుతున్న పనులు

- రూ.39.90 కోట్ల కేటాయింపు.. విడుదల కాని నిధులు
- ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యే చొరవ చూపాలంటున్న స్థానికులు



దమ్మాయిగూడలో...

సాక్షి,సిటీబ్యూరో: సమీకృత మార్కెట్‌యార్డుల నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. నగర శివారు ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా 13 పురపాలక సంఘాల్లో ఐదేళ్ల కిందట బీఆర్‌ఎస్ హయాంలో ఈ మార్కెట్ల పనులు ప్రారంభమయ్యాయి. అయితే సరిపడా నిధులు విడుదల కాకపోవటంతో పనులు ముందుకు సాగలేదు. కాంగ్రెస్ సర్కారు కూడా ఈ నిర్మాణాలపై చొరవ చూపకపోవడం గమనార్హం. 2022లోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్, బోడుప్పల్, నిజాంపేట, పీర్జాదిగూడ, కొంపెల్లి, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, మేడ్చల్, నాగారం, పోచారం, దమ్మాయిగూడ, దుండిగల్ పురపాలక సంఘాల్లో మార్కెట్ల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. ఈ మార్కెట్లు అందుబాటులోకి వస్తే నగరశివారు ప్రజలకు కూరగాయలు, మాంసం, పండ్లు, ఇతర తినుబండారాలు ఒకేచోట లభించే అవకాశముంది.

◆ స్థలాన్ని బట్టి నిధులు..

పురపాలక సంఘాల్లో ఒక ఎకరం నుంచి రెండు ఎకరాల స్థలం లోపు నిర్మించతలపెట్టిన మార్కెట్లకు రూ.2 కోట్లు, రెండు ఎకరాలు ఆపైన ఉన్న స్థలంలో నిర్మించతలపెట్టినవాటికి రూ.4.50 కోట్లు కేటాయిస్తూ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పురపాలిక యంత్రాంగం ఆయా పట్టణాల్లో మార్కెట్ల భవన నిర్మాణ సముదాయాల్లో భాగంగా షెడ్లు, పార్కింగ్ నిర్మాణ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను చేపట్టారు.

◆ భూములు, నిధులు ఇలా...

ఆయా మున్సిపాలిటీల్లో మార్కెట్ల కోసం అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని అధికార యంత్రాంగం కేటాయించింది. భవనాలు, పార్కింగ్, ఇతర వసతుల పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.39.90 కోట్లు మంజూరు చేసింది. జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జా దిగూడ కార్పొరేషన్లలో సమీకృత మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణం కోసం రూ.4.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయగా, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున నిధులు వెచ్చించేలా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

నిధులు విడుదల చేయాలి

మార్కెట్ల భవన సముదాయాల నిర్మాణాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తగినన్ని నిధులు విడుదల చేస్తే తప్ప అవి ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ఇందుకోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరముందని స్థానికులు అంటున్నారు. స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పెద్దలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లటంతోపాటు ఒత్తిడి పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

2028లో బీసీలదే రాజ్యాధికారం

మాస్ అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

నాగోలు: బీసీ ఉద్యమంలో నవశకం మొదలైందని, 2028లో బీసీలదే రాజ్యాధికారమని మన ఆలోచన సాధన సమితి(మాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు అన్నారు. మాస్ ఆధ్వర్యంలో 37 నియోజకవర్గాల్లోని 135 గ్రామాలకు చెందిన 540 మంది బీసీ కార్యనిర్వాహకుల చైతన్య సదస్సు నాగోలులో నర్సింగ్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలను మాస్ రాజకీయంగా, సామజికంగా, ఆర్థికంగా చైతన్యపరుస్తూ రాజ్యాధికారం దిశగా తీసుకువెళుతోందని అన్నారు. గ్రామాల్లో ఉన్న బీసీ కులాలు ఏకమైతే తప్ప ఆధిపత్య కులాల రాజకీయ నాయకులను నిలువరించలేమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎవరూ డిమాండ్ చేయకున్నా అగ్రకులాల పాలకులు అక్రమంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను దోచి పెడుతున్నారని, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని అన్నారు. కులవృత్తులు చేసుకునే బీసీల మధ్యన చిచ్చు పెట్టి అగ్రకులాల పార్టీలు రాజకీయ లబ్ధి పొందుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామ్‌షెఫర్డ్, స్టేట్ ఆడిట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ నూతనకంటి వెంకటేశ్వర్లు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, గడ్డం నర్సింహ్మాగౌడ్, దొంత ఆనందం, పూస నర్సింహ్మా, నేరెళ్ల దేవేందర్, తడక యాదగిరి, గుండ్ల ఆంజనేయులు గౌడ్, కోరంగి దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భరత్‌గౌడ్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, మురళీధర్ రావు

కవాడిగూడ: బోనాల పండుగను జంట నగరాల ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్ గౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారికి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగను ప్రశాంతంగా జరిగేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మురళీధర్‌రావు, మర్రి శశిధర్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌గౌడ్, కార్పొరేటర్లు కె.రవిచారి, జి.రచనశ్రీ, సుప్రియా నవీన్‌గౌడ్, సరళ, దీపిక, నాయకులు మేకల సారంగపాణి, జమాల్‌పురి నందు, గాజుల కిరణ్, జయపాల్‌రెడ్డి, కుశాల్ గౌడ్, భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ నూతన కార్యవర్గం

బంజారాహిల్స్: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ నూతన (2025–26) అధ్యక్షుడిగా కల్యాణ్ పంగులూరి, కార్యదర్శిగా లక్ష్మీ విసిరెడ్డి ఎన్నికయ్యారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడమే కాకుండా బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలకు ఉపాధి కల్పనే ధ్యేయంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2025–26 సంవత్సరానికి కూడా పలు కార్యక్రమాలతో ముందుకు సాగుతామని నూతన కార్యవర్గం ప్రకటించింది. అత్యంత ఆడంబరంగా జరిగిన వేడుకలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సైకాలజిస్ట్స్ కౌన్సిల్ అవసరం



హిమాయత్ నగర్: రాష్ట్రంలోని సైకాలజిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'సైకాలజిస్ట్ కౌన్సిల్'ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హిమాయత్‌నగర్ సత్యనారాయణరెడ్డి భవన్‌లో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రముఖ హిప్నాటిస్ట్, మెజీషియన్ డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంచందర్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో మానవ సంబంధాలు దెబ్బతినడం, పని ఒత్తిళ్లు, వ్యక్తిగత సమస్యలు ప్రజల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక నిపుణుల పాత్ర ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. సమావేశంలో డా.శ్రీపూజ, ఎ.సుధాకర్, శ్రీధర్, డా.నండూరి అర్చన, రాజు ఆచార్య పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకే సాహితీ సృజన

విశ్రాంత జడ్జి నాగమారుతి శర్మ



ఇనాక్ సాహితీ దృక్పథం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నాగమారుతి శర్మ, కాసీం, జనార్ధనమూర్తి

చిక్కడపల్లి: సాహిత్యాన్ని సామాజిక శ్రేయస్సు కోసం ఉపయోగించేవారు ఋషితుల్యులని, ఇనాక్ ఆ కోవకు చెందినవారని సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతి శర్మ అన్నారు. బడుగు వర్గాల శ్రేయస్సే ఇనాక్ సాహిత్య దృక్పథమని, ఆయన సాహిత్యంపై కేవలం దళితవాద ముద్ర సరికాదని అన్నారు. ఆదివారంరాత్రి త్యాగరాయ గానసభ నిర్వహణలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తహంలో భాగంగా కళా సుబ్బారావు కళావేదికపై ఆచార్య కాత్యాయని విద్మహే రచించిన 'కొలకలూరి ఇనాక్ సాహితీ దృక్పథం'గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగమారుతి శర్మ ఈ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ కాత్యాయని తన గ్రంథంలో ఇనాక్ సాహిత్య వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారని వివరించారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్థనమూర్తి, వంశీ రామరాజు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీతారత్నం శిష్య బృందం గాన గోష్ఠి జరిగింది.

'కళాపీఠం' వ్యవస్థాపకుడు రామదాసు మృతి

చిక్కడపల్లి: తెలుగు సాహిత్య కళాపీఠం వ్యవస్థాపకుడు చిక్కా రామదాసు (76) ఆదివారం రాత్రి మరణించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ పార్శిగుట్టలోని నివాసంలో మృతిచెందారు. ఈయనకు భార్య, ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బట్టల వ్యాపారం చేస్తూనే తెలుగు భాష అభ్యున్నతికి తనవంతుగా తెలుగు సాహిత్య కళాపీఠాన్ని స్థాపించి కార్యక్రమాలు చేపట్టారు. ఆయన జన్మదినం రోజునే కన్నుమూశారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం ముషీరాబాద్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మాదాపూర్‌లో 'టీటా' బోనాలు



మాదాపూర్: పోతురాజుల విన్యాసాలు, ఒగ్గుడోలు, గుస్సాడి నృత్యాలతో కళాకారులు సందడి చేశారు. తెలంగాణ సమాచారం, సాంకేతిక సంఘం(టీటా) ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని చిన్న పెద్దమ్మ ఆలయంలో ఐటీ ఉద్యోగులు ఘనంగా బోనాల ఉత్సవం నిర్వహించారు. ప్రముఖ ఐటీ సంస్థల నుంచి 21 బోనాలను అమ్మవారికి సమర్పించారు. టీటా గ్లోబల్ అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత ముందుకెళ్లినా సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోవద్దన్నారు. డప్పుల చప్పుళ్లకు అనుగుణంగా పోతురాజులు నాట్య ప్రదర్శనలు చేశారు. ఒగ్గుడోలు, శివసత్తులు, గుస్సాడి కళాకారులు సంప్రదాయ ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, కార్పొరేటర్ హేమ సామల, సామాజిక సేవకులు చీకోటి ప్రవీణ్, డాక్టర్ జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాలకు అదనపు పోస్టులు సృష్టించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ

కాచిగూడ: తెలంగాణలో 2017 సంవత్సరంలో కొత్త జిల్లాల్లో ఏర్పాటు చేసిన తహసీల్దార్, మున్సిపల్ ఆఫీసులు, పోలీస్ స్టేషన్లు, గ్రామ పంచాయతీలకు అవసరమైన అదనపు పోస్టులు సృష్టించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకే ఇన్‌చార్జీలుగా బాధ్యతలు ఇచ్చి కొనసాగిస్తున్నారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆర్.కృష్ణయ్య సీఎం రేవంత్ రెడ్డికి ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో 23 కొత్త జిల్లాల్లో 40 శాఖల జిల్లా, తాలుకా ఆఫీసులు, 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజనల్ ఆఫీసులు, 76 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 25 డీఎస్పీ ఆఫీసులు, 31 పోలీస్ సర్కిల్స్, 7 పోలీస్ కమిషనరేట్లు, 4,383 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయని పేర్కొన్నారు. వీటిల్లో గ్రూపు–1, గ్రూపు –2, గ్రూపు–4 సర్వీసుల్లో కొత్త పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. వాటిలో గ్రూపు –1లో 50 శాతం, గ్రూపు –2లో 40 శాతం డైరెక్టు రిక్రూట్‌మెంట్ కోటా కింద ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బోనాల వేడుకలు తెలంగాణకే గర్వకారణం



సబ్జిమండీలో బోనం జ్ఞాపికతో ఎమ్మెల్సీ కవిత

గోల్కొండ: బోనాల వేడుకలు తెలంగాణకే గర్వకారణమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సబ్జిమండీ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారి బోనాల వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. సంఘం బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 51వ వార్షిక బోనాల వేడుకలను ఆదివారం ఆమె సబ్జీమండీలో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ చొరవతోనే బోనాలకు ప్రపంచ గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆమె సబ్జిమండీ శ్రీ కనకదుర్గ దేవాలయం నుంచి శ్రీ మాత మహంకాళీ దేవాలయం వరకు జరిగిన భారీ తొట్టెల ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఊరేగింపు గోల్కొండకు చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దొరుతుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.వేణుబాబు, బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మామిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా ఎన్నికలకు వెళ్లొద్దు

బీసీ కులాల ఐక్యవేదిక సమావేశంలో వకుళాభరణం



సమావేశంలో అభివాదం చేస్తున్న కృష్ణమోహన్‌రావు తదితరులు

ఖైరతాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని అమలు చేయకుండా ఎన్నికలు జరిపేందుకు ప్రయత్నిస్తోందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు విమర్శించారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్‌లో బీసీ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికీ రాష్ట్రపతి ఆమోదం పొందని బిల్లుల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చురుగ్గా వ్యవహరించడంలేదని, అఖిల పక్ష నాయకులను తీసుకొని వెళ్లి రాష్ట్రపతిని కలవాలని అన్నారు. ఎన్నికల కోసం హైకోర్టులో మరింత సమయం కోరాలని సూచించారు. సర్వే పూర్తిస్థాయి వివరాలను ఇప్పటికీ బహిర్గతం చేయలేదని పేర్కొన్నారు. తమిళనాడు ప్రభుత్వం 69 శాతం రిజర్వేషన్లకు 9వ షెడ్యూల్‌లో ఆర్టికల్ 31–బి ద్వారా రక్షణ పొందిందని, తెలంగాణ మాత్రం ఆ మార్గాన్ని అనుసరించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి కమిటీ చట్టబద్ధత గోప్యతపై తీవ్ర సందేహాలు ఉన్నాయని, కులాలవారీగా సూచికలు ఎలా రూపొంచబడ్డాయో స్పష్టత లేదని పేర్కొన్నారు. సమావేశంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మీతోపాటు బీసీ నాయకులు వి.ప్రకాష్, వినోద్‌యాదవ్, వెంకటేష్ గౌడ్, రుక్మిణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు గోడ కూల్చివేతపై నిరసన

ప్లకార్డులు ప్రదర్శించిన బాచుపల్లి ఏపీఆర్ ప్రణవ్ ఆంటీలియా కమ్యూనిటీ ఓనర్స్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఏపీఆర్ ప్రణవ్ ఆంటీలియా కమ్యూనిటీ నివాసితులు

నిజాంపేట్: బాచుపల్లిలోని ఏపీఆర్ ప్రణవ్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీ సరిహద్దు గోడను హైడ్రా అధికారులు అక్రమంగా కూల్చివేశారంటూ నివాసితులు నిరసన వ్యక్తం చేశారు. జూన్ 24న హైడ్రా కూల్చివేసిన ఈ ఘటనపై ఏపీఆర్ ప్రణవ్ ఆంటీలియా ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ 650 కుటుంబాలు నివసించే ఈ కమ్యూనిటీలో హెచ్ఎండీఏ ఆమోదించిన లేఅవుట్ ప్లాన్ ప్రకారం నిర్మించిన గోడను ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేఅవుట్ 46 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, 650కి పైగా విల్లాలు, 60 అడుగుల ప్రధాన రహదారి ఉన్నాయన్నారు. కొంతమంది బయటి వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనం కోసం వంద అడుగుల రోడ్డుకు అడ్డంగా గోడ కట్టామని అంటున్నారని, వాస్తవానికి అది సర్వే నెంబర్‌లు 41, 42, 54, 53 గుండా వెళ్తోందని వివరించారు. నోటీసు లేకుండా కూల్చివేయడంపై హైడ్రా స్పష్టమైన వివరణ ఇవ్వాలని అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నాగేశ్వరరావు దుర్భాకుల, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు వలివేటి, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి బెల్లపుకొండ, జాయింట్ సెక్రటరీ భార్గవిరెడ్డి సాదరి, ఇతర అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి కృపతో రాష్ట్రం సస్యశ్యామలం



గోల్కొండ బోనాల వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

గోల్కొండ: ఎలమ్మ తల్లిమహాశక్తివంతురాలని ఆమె కృపతోనే తెలంగాణ ఎప్పుడూ సస్యశ్యామలంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారి 4వ బోనం ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. కోటకు వచ్చిన ఆయనకు గోల్కొండ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ వారు స్వాగతం పలికారు. ఆయన వెంట కమిటీ ప్రతినిధులు అబేద్, మహ్మద్ షానవాజ్‌ఖాన్, ఇలియాస్ అలీ, ఠాకూర్, శైలేందర్‌సింగ్, ఎ.అశోక్ కుమార్, జంగయ్య, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

డ్రగ్ కంట్రోల్ అధికారుల మెరుపు దాడులు

'సాక్షి'కథనానికి స్పందన..పలువురు డిస్ట్రిబ్యూటర్లపై కేసులు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: డ్రగ్ కంట్రోల్ అధికారులు రంగంలోకి దిగారు. కాసులకు కక్కుర్తిపడి నకిలీ మందులు అమ్ముతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపుతున్నారు. వారం వ్యవధిలో నాలుగు నకిలీ మందులను గుర్తించారు. గత నెల 25న 'డ్రగ్ కంట్రోల్ తప్పుతోందా?'అనే శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. అదే రోజు నగరంలోని కోఠి ప్రాంతంలోని మెడికల్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. బ్రాండెడ్ కంపెనీ పేరిట నకిలీ మందులను మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో సదరు డిస్ట్రిబ్యూటర్లపై కేసులు నమోదు చేశారు. తాజాగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూటర్లపై దాడులు నిర్వహించారు. కవాడిగూడలోని ఎస్‌బీఐ కాలనీలోని అరవింద్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్‌పై దాడి చేసి నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నారు. ఆయా కేసులపై విచారణ చేపట్టారు.

నగరం కేంద్రంగా నకిలీ దందా...

హైదరాబాద్ మార్కెట్‌లో పేరొందిన మందుల కంపెనీలకు మంచి గుర్తింపు ఉంది. దీంతో గత కొంతకాలంగా నకిలీల ముఠా కళ్లు ఇటువైపు మళ్లాయి. ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ మందులను తయారు చేసి, మెడికల్ షాపులకు అధిక మొత్తంలో మార్జిన్ ఆశ చూపిస్తున్నారు. జేబులు నింపుకోవడానికి మెడికల్ దుకాణాల యజమానులు కూడా సై అంటున్నారు. ఒకవైపు ఎలాంటి అర్హతలు లేకున్నా నకిలీ వైద్యులు రోగులకు వైద్యం చేస్తుండగా, మరికొందరు బ్రాండెడ్ పేరు చెప్పి నకిలీ మందులను మార్కెట్‌లో చెలామణి చేస్తున్నారు. దీంతో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. సామాన్యులు ఏది నకిలీ, ఏది అసలు అనేది తెలుసుకునే అవకాశం లేకపోవడంతో ఈ ముఠాల పని మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నచందంగా నడుస్తోంది.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, సోమవారం, 7, జూలై, 2025



ముదిమి వయసులో..

'రాజీ'పడని బామ్మ..

- 15 నిమిషాల పాటు 250 కిలోల గంట మోగిస్తూ..
- రోజుకు మూడు సార్లు ఆరగింపు సమయంలో క్రమం తప్పకుండా
- శ్రీనగర్ కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అబ్బురపరుస్తున్న బామ్మ

చిత్రంలో కనిపిస్తున్న బామ్మ పేరు రాజీ.. వయసు సుమారు 80 సంవత్సరాలపైనే ఉంటాయి.. పాతికేళ్ల క్రితం శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. అప్పటినుంచి అదే తన ఇల్లు.. అక్కడే ఉంటోంది.. గుడిలో ప్రసాదం తింటూ అక్కడే గడిపేస్తుంది.. సరిగ్గా నిటారుగా నుంచునే ఓపిక కూడా లేదు.. వయసు పైబడడంతో బామ్మ నడుము ఒంగిపోయింది. కానీ స్వామివారి ఆరగింపు సమయం వచ్చిందంటే చాలు వెంటనే గుడిలో ఏర్పాటు చేసిన 250 కిలోల భారీ గంట వద్దకు వడివడిగా వెళ్లిపోతుంది.. 15 నిమిషాల పాటు జరిగే ఆరగింపు తంతు పూర్తయ్యే వరకూ గంట కొడుతూనే ఉంటుంది.. ఒక్క క్షణం కూడా ఆగదు.. ఇలా ప్రతిరోజూ మూడు సార్లు ఆరగింపు సమయాల్లో బామ్మ గంట కొట్టాల్సిందే.. గుడికి వచ్చిపోయే వాళ్లంతా బామ్మను చూస్తూ ఈ వయసులో ఈవిడకి ఇంత శక్తి ఎలా వస్తుందని ఆశ్చర్యపోతుంటారు.. తాను ఎవ్వరితోనూ మాట్లాడదు.. ఎలా గంట కొడుతున్నావ్ బామ్మా అని అడిగితే మాత్రం ఆ దేవుడే నాతో ఇలా కొట్టిస్తున్నాడని చెబుతుంది.. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీధర శర్మ బామ్మ గురించి చెబుతూ ఈ వయసులో కూడా ఆ బామ్మ అలా గంట కొడుతుండటం చూస్తే స్వామివారే ఆమెకు శక్తినిచ్చినట్లు అనిపిస్తుందని, తాను కూడా ఎంతో ఆశ్చర్యానికి లోనవుతుంటానని, ఇదంతా స్వామివారి దయని అన్నారు.

– బంజారాహిల్స్



అన్ని ప్రదేశాల్లో మొబైల్ సౌండ్ పొల్యూషన్

కనీస బాధ్యత, పరివర్తన అవసరమంటున్న నగరవాసులు

అత్యధికంగా పెరిగిన మొబైల్ స్క్రీన్ వాచింగ్

ఈ నిర్లక్ష్యపు ట్రెండ్ 'స్క్రీన్ న్యూసెన్స్' పై విమర్శలు

న్యూసెన్స్ పీక్స్..

హెడ్‌సెట్ లేకుండా చూసే రీల్స్‌తో ఇతరులకు ఇబ్బంది

టెక్నాలజీ అనేది మనకు ఓ వరం. కానీ దాని వాడకంలో బాధ్యత లేకపోతే అదే వరం నాశనానికి దారి తీస్తుంది. మొబైల్ మన జీవితంలో భాగం కావొచ్చు కానీ అది ఇతరుల జీవన శైలిని దెబ్బతీయకుండా ఉండాలంటే మనకు ఒక పరిమితి, పరిపక్వత, పరివర్తన అవసరం. మొబైల్ వినియోగంలో మైండ్‌ఫుల్‌నెస్ కలిగి ఉండటం కాలానుగుణంగా మారిన అవసరం. అంతే కాదు, అది మనిషిగా మన విలువల్ని చూపించే మోడరన్ మెచ్యూరిటీ కూడా. తోటివారి మనస్థితిని పట్టించుకోకుండా వారి అశాంతికి కారణమవ్వడం నిర్లక్ష్యమే కాదు.. వ్యక్తిత్వాన్ని కోల్పోవడమే.

పబ్లిక్ స్పేస్‌లోనూ..

హాస్పిటల్స్, రెస్టారెంట్లు, దేవాలయాలు, పార్కులు, థియేటర్లు, ఫంక్షన్ హాల్స్.. ఇవన్నీ ప్రజలకు ఆరోగ్యం, మానసిక విశ్రాంతి, భక్తి, ఆనందం లేదా ఇతర అవసరాల కోసం ఉపయోగపడే ప్రదేశాలు. కానీ ఇక్కడ సైతం మొబైల్ స్క్రీన్ కల్చర్ తలెత్తుతోంది. రెస్టారెంట్‌లో ఆర్డర్ వచ్చే వరకు ఫోన్ స్క్రోల్ చేయడం, ఆలయంలో మంత్రాల మధ్యలో రింగ్‌టోన్లు వినిపించడం, మరీ ముఖ్యంగా హాస్పిటల్ వార్డుల్లో రీల్స్ ప్లే అవడం వంటి ఘటనలు ఇప్పుడు సర్వసాధారణంగా మారాయి.

మెట్రోలో మొబైల్ మ్యూజిక్ షో!

ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైళ్లలో ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తుంది. వర్కింగ్ క్లాస్, విద్యార్థులు, వృద్ధులు ప్రయాణించే మెట్రోలో కొంతమంది యువత రీల్స్ చేస్తూ చుట్టుపక్కల వారికి అసౌకర్యం కలిగిస్తున్నారు. ఉద్యోగాల ఒత్తిడి నుంచి అలసిపోయిన ప్రయాణికులు విశ్రాంతి కోరుకుంటున్న సమయంలో పక్కనే ఉన్న వారు పెద్దగా ఫోన్ సౌండ్‌తో వీడియోలు చూడటం, గేమ్స్ ఆడటం వల్ల వారి మానసిక ప్రశాంతత దెబ్బతింటోంది. సింపుల్‌గా ఒక హియర్‌ఫోన్స్/హెడ్‌సెట్ పెట్టుకుంటే సరిపోతుంది అనే పరివర్తన అవసరం. హెడ్‌సెట్ పెట్టుకున్నవారితో మరో సమస్య.. చుట్టుపక్కల ఏం జరుగుతుందో పట్టించుకోకుండా మెట్రో డోర్‌కు అడ్డంగా నిలబడటం, దారి మధ్యలో ఎటూ పోకుండా ఇబ్బంది కలిగించడం వంటి సమస్యలు సృష్టిస్తున్నారు.



పరిష్కార మార్గాలు..

అవగాహన కార్యక్రమాలు: ప్రభుత్వం, టెక్ కంపెనీలు, మున్సిపాలిటీలు కలిసి 'మైండ్‌ఫుల్ మొబైల్ యూజ్' గురించి అవగాహన పెంచాలి.

సైలెంట్ జోన్లు: మెట్రోల్లో, హాస్పిటల్స్‌లో, దేవాలయాల్లో మొబైల్ సైలెన్స్ జోన్లను స్పష్టంగా సూచిస్తూ బోర్డులు పెట్టాలి.

యాప్స్‌తో నియంత్రణ: కొంతమంది యూజర్లు తమ మొబైల్ యూజ్‌ను ట్రాక్ చేసి నియంత్రించడానికి 'స్క్రీన్ టైమ్', 'ఫోకస్ మోడ్' వంటి ఫీచర్లను వినియోగించవచ్చు.

స్వీయ నియంత్రణ: అన్నింటికన్నా ప్రధానమైంది స్వీయ నియంత్రణ.. ప్రతి ఒక్కరూ తమ వినియోగాన్ని బాధ్యతగా మలుచుకోవాలి. అది మన సమాజానికి, తనకు తాను ఇచ్చే గౌరవం కూడా.

ప్రభావాలు..

మానసిక అసౌకర్యం: నిర్లక్ష్యంగా వినిపించే సౌండ్‌లు ఇతరులను డిస్టర్బ్ చేస్తాయి. ఇది ప్రత్యేకించి చదువుకునే విద్యార్థులు, శారీరకంగా అలసిపోయిన ఉద్యోగులు, మానసికంగా టెన్షన్‌లో ఉన్నవారికి తీవ్రంగా నష్టాన్ని, విరక్తిని కలిగిస్తుంది.

పరిసరాల పట్ల బాధ్యత కోల్పోవడం: దేవాలయాల్లో, ఆసుపత్రుల్లో, థియేటర్లలో మానవీయ బాధ్యత లేకుండా మొబైల్ వాడకం వల్ల సామాజిక విలువలు మసకబారుతున్నాయి.

సామాజిక దూరం: ఒకే ప్రదేశంలో ఉన్నా, తన ఫోన్‌లో మునిగిపోయే వ్యక్తి చుట్టూ ఉన్నవారితో కనెక్షన్ కోల్పోతాడు. దీని వల్ల సంబంధాలు బలహీనపడతాయి.

"ప్రస్తుత తరుణంలో మొబైల్ వినియోగం పెరిగిన విధానం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇంటర్నెట్, సోషల్ మీడియా, ముఖ్యంగా రీల్స్ వల్ల ప్రతి ఒక్కరి చేతిలో ఫోన్ అనేకన్నా దేహంలో ఒక భాగంగా మారిపోయిందనడంలో అతిశయోక్తి లేదేమో అనిపిస్తుంది. అయితే ఈ డిజిటల్ కల్చర్ ఇప్పుడు ప్రైవేటు స్పేస్ నుంచి బహిరంగ ప్రదేశాల్లోనూ విస్తరిస్తూ, ఇతరులకు అసౌకర్యం కలిగించే స్థితికి చేరింది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ రీల్స్ వంటి షార్ట్ వీడియోలు చూస్తూ ప్రజలు అందులో మునిగిపోతున్నారు. ఇది వారి వ్యక్తిగత విషయంగా అనిపించినా, పబ్లిక్ ప్రదేశాల్లో హెడ్‌సెట్ లేకుండా పెద్ద సౌండ్‌తో వీడియోలు చూడటం వల్ల అది చుట్టుపక్కల వారికి న్యూసెన్స్‌గా మారుతోంది. వారు ఉన్న ప్రదేశాన్ని బట్టి ఈ నిర్లక్ష్యం మానసిక, సామాజిక ఇబ్బందులకు గురిచేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో"





ఈ నిర్లక్ష్యపు కల్చర్‌కి కారణాలు

స్వీయ నియంత్రణ లోపం: వ్యక్తిగత ప్రపంచం నుంచి పబ్లిక్ స్పేస్‌లోకి వస్తున్నామంటే కొన్ని నైతిక విలువలు ఉంటాయనే స్పృహ కలిగి ఉండాలి. మన నిర్లక్ష్యం ఏ ఒక్కరికి ఇబ్బంది కలిగించినా వ్యక్తిగా విలువ కోల్పోవడమే.

డిజిటల్ డోపమైన్: రీల్స్, షార్ట్ ఫార్మ్ కంటెంట్ మానసికంగా వినోదం కలిగించడంతో పాటు డోపమైన్ విడుదలకు కారణమవుతుంది. దీనివల్ల ఎప్పటికప్పుడు స్క్రీన్‌కి ఆకర్షితులవుతారు. ఎంత సమయం వారు అందులో మునిగిపోయారో వారికే తెలీదు. అలాంటిది ఇతరుల ఇబ్బందులను ఎలా గుర్తించగలుగుతారు.

నివేదికలు లేకపోవడం: పబ్లిక్ ప్లేస్‌లలో మొబైల్ వినియోగంపై కచ్చితమైన నియమాలు లేకపోవడం కూడా ఈ అలవాట్లను పెంచుతోంది.

సామాజిక అవగాహన లోపం: ఇతరుల మనస్థితిని అర్థం చేసుకోకుండానే వ్యక్తిగత వినోదం కోసం మిగతావారిని అసౌకర్యానికి గురిచేస్తున్నారు.

సందడిగా ఎస్పీడీఎల్

సిల్వర్ జూబ్లీ

గచ్చిబౌలిలో కెరీర్ గ్రోత్‌పై సెమినార్



సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని ప్రముఖ దూర విద్యా సంస్థల్లో ఒకటైన సింబయోసిస్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఎస్పీడీఎల్) తమ 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా గచ్చిబౌలిలో కెరీర్ గ్రోత్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ ఉచిత సెమినార్‌లో డేల్ కార్నెగీ లీడర్‌షిప్ మాస్టర్‌క్లాస్, హెచ్ఆర్ రౌండ్‌టేబుల్, కెరీర్ కౌన్సెలింగ్ సెషన్లు హైలెట్‌గా నిలిచాయి. హెచ్ఆర్ సెషన్లలో భవిష్యత్తు ఉద్యోగ వాతావరణం, అవకాశాలు, డిజిటల్ రంగం, డీఈఐ వంటి అంశాలు చర్చకు వచ్చాయి. కార్యక్రమంలో సంస్థ పూర్వ విద్యార్థులకు అవార్డులు అందజేశారు.

అంతర్జాతీయ స్థాయిలో భారతీయ వంటకాల ఔన్నత్యాన్ని చాటుతూ, టేస్ట్ అట్లాస్ విడుదల చేసిన ప్రపంచంలోని 100 ఉత్తమ ఫుడ్ సిటీస్ జాబితాలో హైదరాబాద్ 50వ స్థానంలో నిలిచింది. ఈ గౌరవం సాధించిన ఆరు భారతీయ నగరాల్లో ముంబయి టాప్ (5వ స్థానం)లో ఉండగా అమృత్సర్(43వ స్థానం), ఢిల్లీ(45వ స్థానం), కోల్‌కతా(71వ స్థానం), చెన్నై (75వ స్థానం) స్థానం దక్కించుకున్నాయి. ఈ ఆరు నగరాలు దేశవ్యాప్తంగా వంటకాల వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, భారతీయ రుచులను ప్రపంచ వేదికపై సత్తా చాటుతున్నాయని చెప్పకనే చెబుతున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

గ్లోబల్ ఫేవరెట్..

- ప్రపంచ ఆహార జాబితాలో హైదరాబాద్
- టేస్ట్ అట్లాస్ ఉత్తమ ఫుడ్ సిటీస్‌లో నగరానికి 50వ స్థానం
- టాప్ ఐదులో ముంబయి, భారత్ నుంచి మొత్తం ఆరు నగరాలు



మన నగర వంటకాల్లో ప్రధానంగా హైదరాబాద్ బిర్యానీదే హైలైట్. కానీ ఇక్కడి ఫుడ్ వారసత్వం ఒక్కటే కాదు.. హలీం, నిహారీ, పత్తర్ కా గోష్ట్ వంటి రుచులు కూడా ఈ నగరపు బహుళ సాంస్కృతిక భవితవ్యాన్ని ప్రతిబింబించాయి. పర్షియన్, టర్కీ, మొఘల్ ప్రభావం కలిసిన ఈ వంటకాలను స్థానికుల నైపుణ్యం మేళవించడంద్వారా ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.

పుంజుకోనున్న ఫుడ్ టూరిజం..

ఈ ఘనత నగర జీవనశైలిలో కీలకమైన విషయం. హైదరాబాద్‌లో ఫుడ్ టూరిజం, ట్రెడిషనల్ ఫుడ్ బ్రాండ్స్, స్ట్రీట్ ఫుడ్ కల్చర్ ఇప్పుడు మరింత పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానికుల ప్రామాణికతతో పాటు, కొత్త తరానికి అనుగుణంగా నగరంలో కొత్తగా పుట్టుకొస్తున్న కల్చర్ కెఫేలు, ట్రెండీ రెస్టారెంట్లు ఈ రుచుల పునర్జన్మకు వేదికవుతున్నాయి. ఇప్పుడు హైదరాబాద్ వంటకాలు మణిహారంలో మాణిక్యంలా, అంతర్జాతీయ స్థాయిలో గర్వించదగ్గవిగా మారుతున్నాయి. ఈ జాబితా ద్వారా ఈ భాగ్యనగర ప్రశస్తి మరోసారి విశ్వవ్యాప్తం అవుతోంది.



- హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో సక్సెస్ మీట్
- యోగా సాధకులు స్పందించగా రూ.3.40 లక్షల విరాళం
- సేకరించిన నిధులు టీ హబ్ వేదికగా ఆర్మీకి అందజేత

ఆర్మీకి 'యోగా సింధూర్' విరాళం

రాయదుర్గం: 'యోగా నా కోసం.. నేడు దేశం కోసం' నినాదంతో జాతిని మేల్కొలిపే మహా యజ్ఞానికి పూనుకోవడమే కాదు.. వారు ఎంచుకున్న టాస్క్ విజయవంతంగా పూర్తిచేసి విరాళాలను ఆర్మీకి అందించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఆదివారం ఒక్కొక్కరూ ఒక్కరూపాయి విరాళం పిలుపుతో జాతిని జాగృతం చేశారు.. అలా సేకరించిన రూ.3.40 లక్షల విరాళాలను దేశ సైనికులకు అందించారు. యోగా సింధూర్ పేరిట సక్సెస్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెలలో యోగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ యోగా నారాయణ, యోగా సింధూర్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు కే.శివదుర్గాప్రసాద్ బృందం ఆధ్వర్యంలో ఈ సక్సెస్ మీట్ నిర్వహించారు. విరాళాల్లో కొంత భాగాన్ని ఆపరేషన్ సింధూర్‌లో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుడు మురళి నాయక్ కుటుంబానికి, మిగిలిన వాటిని నేషనల్ డిఫెన్స్ అకాడమీకి అందించారు. యోగా సింధూర్, వర్చువల్



యోగా మహాయజ్ఞం నిర్వహణలో విజయం సాధించినందుకు వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించగా దీన్ని నిర్వాహకుల పర్యవేక్షణలో అందించారు. యోగా సింధూర్, సక్సెస్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు, యోగా సాధకులు పాల్గొన్నారు.

గోల్డెన్ విండోలో..

న్యూరో రిహాబిలిటేషన్ కీలకం

సాక్షి, సిటీబ్యూరో: రోగి కోలుకోవడంలో రిహాబిలిటేషన్ కీలకం అని, అది కూడా గోల్డెన్ విండో సమయంగా పేర్కొనే దశలోనే జరగాలని నిపుణులు స్పష్టం చేశారు. పీఎంఆర్ (ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్) డే సందర్భంగా న్యూరోలాజికల్ ప్రమాదాల అనంతర ఆరోగ్య సంరక్షణ పద్ధతులపై సోమాజిగూడలోని హెల్త్ కేర్ ఎట్ హోమ్ (హెచ్‌సీఏహెచ్) సంస్థ ఓ సదస్సు నిర్వహించింది. స్ట్రోక్, స్పైనల్ కార్డ్ గాయాలు, ట్రామాటిక్ బ్రెయిన్ ఇన్‌జ్యూరీ వంటి సందర్భాల్లో 72 గంటల్లోపే న్యూరో రిహాబిలిటేషన్ ప్రారంభించడం అత్యంత కీలకం అని ఈ సదస్సులో నిపుణులు స్పష్టం చేశారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో 30–40 ఏళ్ల వయసులోనే స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయని, పలు ఆస్పత్రులు రికవరీ ప్లాన్ లేకుండానే రోగులను ఇంటికి పంపించేస్తున్నారని డా.ఆస్తిక్ భట్ ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య నిపుణులు డా.శివ మాట్లాడుతూ సరైన సమయంలో క్రమబద్ధమైన రిహాబిలిటేషన్‌తో రోగులు పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని చెప్పారు. ఆధునిక రిహాబ్ సెంటర్లలో రోబోటిక్ థెరపీ, గేమిఫైడ్ టెక్నాలజీ, మైల్‌స్టోన్ ట్రాకింగ్ వంటి పద్ధతుల ద్వారా అత్యుత్తమ రికవరీ సాధ్యమవుతుందని డా.గౌరవ్ థుక్రాల్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.



శ్రీమహావిష్ణువు ఆశీస్సులు మనందరిపై ఉండాలి

- తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 'రాష్ట్ర ప్రజలందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు. ఈ ఆషాఢ శుద్ధ ఏకాదశిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, శ్రీమహావిష్ణువు ఆశీస్సులు మనందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని వైఎస్ జగన్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

దయ, కరుణ, శాంతికి ప్రతీక మొహర్రం

దయ, కరుణ, శాంతికి ప్రతీక మొహర్రం అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. 'దయ, కరుణ, శాంతికి ప్రతీక మొహర్రం. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ అలైహిస్సలాం బలిదానానికి గుర్తుగా నిర్వహించుకునే ఈ మొహర్రంను ముస్లిం సోదర సోదరీమణులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.





స్వర్ణాల తీరం... భక్తజనసంద్రం

రొట్టెల పండుగ ప్రారంభం

బారాషహీద్ దర్గా కిటకిట

మత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరు బారాషహీద్ దర్గాలో ఏటా నిర్వహించే రొట్టెల పండగ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వర్ణాల చెరువులో కోర్కెలు తీర్చే వరాల రొట్టెలు ఇచ్చిపుచ్చుకున్నారు. చదువు, ఉద్యోగం, పెళ్లి, సంతానం, ఆరోగ్యం, సౌభాగ్యం, ధనం, విదేశీయానం, ఉద్యోగోన్నతి వంటి తమ కోరికలు తీరాలంటూ కుల, మతాలకు అతీతంగా భక్తులు స్వర్ణాల చెరువు బాట పట్టారు. కోర్కెలు తీరిన భక్తులు రొట్టెలు వదిలేందుకు.. కొత్త కోర్కెల రొట్టెలు పట్టుకునేందుకు వచ్చే భక్తులతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. తొలిరోజు రాష్ట్రం నలుమూలల నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చారు. స్వర్ణాల చెరువులో పుణ్యస్నానాలు చేసి, రొట్టెలు మార్చుకున్నారు. యుద్ధవీరుల త్యాగనిరతిని స్మరిస్తూ సమాధులను దర్శించుకున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ రొట్టెల పండగలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. వేలాదిగా తరలివస్తున్న భక్తులను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తూ నిరంతరం దర్గా పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. తొలిరోజు లక్షమంది వరకు భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు



సింహం కాదు శునకమే!

డుంబ్రిగూడ మండల కేంద్రంలోని చాపరాయిలో సింహం లాంటి ఆకారాన్ని చూసి పర్యాటకులు భయభ్రాంతులకు గురయ్యారు. తీరా అది సింహం కాదు.. శునకమని తెలిశాక దానివద్దకు చేరి ఫొటోలు తీసుకున్నారు. విశాఖపట్నం న్యూకాలనీకి చెందిన ఇశాక్‌సింగ్ అనే వ్యక్తి ఇంగ్లిష్ మాస్టిఫ్ జాతికి చెందిన శునకాన్ని వెంట తీసుకుని, ఆదివారం మిత్రులతో చాపరాయికి వచ్చారు. ఈ శునకాన్ని పెంచేందుకు ప్రతి నెల రూ.70–80 వేలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. యూరోప్ దేశాలకు చెందిన ఈ శునకాన్ని పంజాబ్‌లో రూ.2 లక్షలకు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

– డుంబ్రిగూడ(అల్లూరి సీతారామరాజు జిల్లా)



రెడ్‌బుక్‌కు రెడ్ సిగ్నల్!

సోషల్ మీడియాలో పోస్టులు, వ్యాఖ్యల కేసుల్లో 'సుప్రీం' కీలక తీర్పును దర్యాప్తు అధికారి పాటించారా? లేదా? పరిశీలించాలన్న ఏపీ హైకోర్టు ఆదేశాలతో పోలీసుల్లో వణుకు

అర్నేష్‌కుమార్, ఇమ్రాన్‌ప్రతాప్ గాది కేసుల్లో సుప్రీం తీర్పును గుర్తు చేసిన హైకోర్టు

మేజిస్ట్రేట్‌లు యాంత్రికంగా రిమాండ్‌కు పంపుతుండటంపై విస్మయం

ఖాకీల అరాచకాలు, అప్రజాస్వామిక విధానాలపై కన్నెర్ర

సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులకు తెర

ఏడాదిగా అక్రమ కేసులతో వేధించిన పోలీసులు

పౌరుల భావ ప్రకటనా హక్కును కాలరాస్తూ అణచివేతలు

ఏడాదిలో ఏకంగా 822 మందికి నోటీసులు

253 అక్రమ కేసులు.. 86 మంది అక్రమంగా అరెస్టు

హైకోర్టు ఆదేశాల పట్ల సర్వత్రా హర్షం.. జాతీయ స్థాయిలో చర్చ

న్యాయ వ్యవస్థపై దాడే!

జస్టిస్ శ్రీనివాసరెడ్డిపై ట్రోలింగ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం

కారకులపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి

- ఆయన నిష్పాక్షికంగా తీర్పులు వెలువరించారు.. న్యాయమూర్తుల వ్యక్తిత్వ హననాన్ని సహించేది లేదు
- న్యాయ వ్యవస్థ స్వతంత్రత విషయంలో రాజీ లేదు
- దురుద్దేశపూర్వకంగా సాగించే దాడులు, దూషణలపై డీజీపీ నేతృత్వంలో ప్రత్యేక విభాగంతో దర్యాప్తు చేపట్టాలి
- గతంలో జరిగిన ఘటనలపైనా విచారణకు ఆదేశించాలి
- కారకులపై న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించాలని కేంద్ర, ఏపీ ప్రభుత్వాలు, సుప్రీంకోర్టు, ఏపీ హైకోర్టును కోరుతూ బార్ కౌన్సిల్ తీర్మానం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పట్టణ యూనిట్లు 1.13 లక్షలే..!

- ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం చేయూత అరకొరే
- పీఎంఏవై–అర్బన్ కింద రూ.1,695 కోట్లే మంజూరు
- ఇక గ్రామీణ యూనిట్లపైనే రాష్ట్ర ప్రభుత్వం ఆశ
- ఇప్పటివరకు మంజూరీపై స్పష్టతనివ్వని కేంద్రం



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి భారీ మొత్తంలో ఆర్థిక చేయూత అందుతుందని ఆశించిన రాష్ట్ర ప్రభుత్వానికి నిరాశ తప్పేలా కనిపించటం లేదు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద పట్టణ ప్రాంత యూనిట్లను ఈ సంవత్సరానికి రెండున్నర లక్షల నుంచి మూడు లక్షల వరకు సాధించుకోవాలని భావించినా, కేంద్రం 1.13 లక్షలు మాత్రమే మంజూరు చేసింది. దీంతో ఈ రూపంలో రూ.1,695 కోట్లు మాత్రమే అందే అవకాశం ఉంది. తొలి సంవత్సరం నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్కో ఇంటి వ్యయాన్ని రూ.5 లక్షలుగా నిర్ధారించటంతో ఈ ఏడాదికి రూ.22 వేల కోట్లు అవసరం కానున్నాయి. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు పీఎంఏవై పథకం కింద వీలైనన్ని అర్బన్ యూనిట్లు మంజూరు చేయించుకోవాలని ప్రభుత్వం భావించింది. కేంద్రం అర్బన్ ఇళ్ల యూనిట్ కాస్ట్‌ను రూ.లక్షన్నరగా ఖరారు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని మూడొంతుల ప్రాంతాన్ని పట్టణ ప్రాంతంగా ప్రభుత్వం నిర్ధారించింది. ఇందుకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల సంఖ్యను పెంచటం ద్వారా రాష్ట్రంలోని సింహభాగం ప్రాంతాన్ని వాటి పరిధిలోకి తెస్తూ ఉత్తర్వు జారీ చేసింది. తెలంగాణలో పట్టణీకరణ అధికంగా ఉందని పేర్కొంటూ పీఎంఈవై పట్టణ ప్రాంత యూనిట్లను గరిష్ట సంఖ్యలో మంజూరు చేయాలని కోరింది. కానీ, తాజాగా కేంద్రం 1.13 లక్షల అర్బన్ ఇళ్లనే మంజూరు చేసింది.

రూరల్‌కు ఎన్ని ఇస్తుందో..

పట్టణ ప్రాంతాల ఇళ్లకు కేంద్రం రూ.లక్షన్నర చొప్పున నిధులు ఇవ్వనుండగా, గ్రామీణ ప్రాంతాల ఇళ్లకు రూ.72 వేలు మాత్రమే ఇస్తుంది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంత యూనిట్ల విషయంలో కేంద్రం నిర్ణయం వెల్లడించలేదు. దీంతో ఎన్ని ఇళ్లు మంజూరు చేస్తుందో తెలియక రాష్ట్ర ప్రభుత్వంలో కొంత అయోమయం నెలకొంది. పట్టణ ప్రాంత యూనిట్లు పోను మిగిలిన ఇళ్లకు సరిపడా గ్రామీణ ప్రాంత యూనిట్లు మంజూరు చేసే అవకాశం లేదని తెలుస్తోంది. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ఇళ్ల విషయంలో రూ.5 లక్షల పూర్తి యూనిట్‌కాస్ట్‌ను భరించాల్సిన పరిస్థితి ఉండబోతోంది. ఇది రాష్ట్ర ఖజానాపై పెద్ద భారమే మోపుతుంది. అర్బన్ యూనిట్లకు కేంద్రం ఇచ్చే రూ.లక్షన్నర పోను రాష్ట్రం రూ.3.5 లక్షలు భరించాల్సి ఉంటుంది. గ్రామీణ యూనిట్లకు కేంద్రం ఇచ్చే రూ.72 వేలు పోను రాష్ట్ర ప్రభుత్వం 4.28 లక్షలను భరించాలి. ఈ రెండు యూనిట్లు మంజూరు కానివాటికి పూర్తిగా రూ.5 లక్షలను రాష్ట్రమే చెల్లించాల్సి ఉంటుంది. అర్బన్ యూనిట్లు ఆశించిన సంఖ్యలో మంజూరు కాకపోవటంతో, మిగతా మొత్తం ఇళ్లకు సంబంధించి గ్రామీణ యూనిట్లు మంజూరు చేయాలని కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి చేస్తోంది.



టీడీఎఫ్ పాతికేళ్ల వేడుక పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆగస్టు 8 నుంచి టీడీఎఫ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన ప్రతినిధులు

హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర వహించి, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం(టీడీఎఫ్) 25 వసంతాల వేడుకలు జరుపుకుంటోంది. ఆగస్టు 8, 9, 10 తేదీల్లో అమెరికాలోని కాలిఫోర్నియాలో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరుతూ ఆదివారం టీడీఎఫ్–యూఎస్ఏ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీఎఫ్ పాతికేళ్ల వేడుక పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీఎఫ్–యూఎస్ఏ పూర్వ అధ్యక్షురాలు కవితా చల్లా, టీడీఎఫ్–ఇండియా అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వద్దన్నవారికీ ఇందిరమ్మ ఇళ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ఆదేశాలు జారీచేసింది. వచ్చిన దరఖాస్తుల్లో అతి పేదలు, నిరుపేద వికలాంగులు, ఆదుకునే వారు లేని పేద వితంతువులు వంటివారికి వెంటనే ఇల్లు పొందే అర్హత ఉందని తేల్చి వారిని ఎల్1 జాబితాలో చేర్చింది. సొంత జాగా ఉన్నవారికే ఈసారి ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించినందున దాన్ని తొలి అర్హతగా తేల్చింది. ఇక నిరుపేదలే అయినప్పటికీ సొంత జాగా లేని వారికి తదుపరి విడతల్లో ఇళ్లు కేటాయించవచ్చని నిర్ణయించి వారి దరఖాస్తులను ఎల్2 జాబితాలో చేర్చింది. గతంలో ఇలాంటి ఇంటి పథకంలో కొంత లబ్ధి పొంది (బేస్‌మెంట్ వరకు నిధులు పొందినవారు), అద్దె ఆర్‌సీసీ పైకప్పు ఇంటిలో ఉంటున్నవారు, పేదలే అయినా కొంత మెరుగ్గా ఉన్నవారి దరఖాస్తులను ఎల్3లో చేర్చారు. వీరికి తొలి విడతలో ఎట్టి పరిస్థితిలో ఇల్లు ఇవ్వటానికి వీలు లేదని నిర్ణయించారు.

తప్పు గుర్తించిన టెక్నాలజీ

రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 3 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఇందులో 1.48 లక్షల ఇళ్ల నిర్మాణం మొదలైంది. ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆయా దశల ఆధారంగా ఇళ్లకు ఆర్థిక సాయం పంపిణీ జరుగుతోంది. ఇటీవల అలా పంపిణీ జరుగుతున్న సమయంలో ఎల్3 జాబితాలోని వారు కూడా ఉన్నట్టు గృహనిర్మాణ శాఖ కేంద్ర కార్యాలయంలోని సాంకేతిక వ్యవస్థ గుర్తించింది. వెంటనే ఎక్కడో పొరపాటు జరిగిందని అధికారులు ఆరా తీయగా, 12 వేల మంది ఎల్3 జాబితాలోనివారు ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టినట్లు తేలింది. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్తే నిధుల విడుదలపై ప్రభావం పడుతుందేమోనని అధికారుల్లో టెన్షన్ మొదలైంది. దీంతో విషయాన్ని గృహనిర్మాణ శాఖ అధికారులు ఆయా జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లారు. ఎల్3 జాబితాలోని వారికి ఆర్థికసాయం పంపిణీ నిలిపేసి, వారిపై రీసర్వే చేయాలని నిర్ణయించారు.

అర్హులుగా మార్చే ప్రయత్నం..

ఎల్3లోని వారికి ఇళ్లు మంజూరు అయ్యాయంటే.. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కాయన్న అపవాదు వచ్చే ప్రమాదం ఉంది. దీంతో వారు కూడా నిరుపేదలే కాబట్టి.. తొలివిడత సర్వేలో సిబ్బంది సరిగా చూడకుండా వారిని ఎల్3లో చేర్చారన్న కోణంలో ఇప్పుడు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీరిలో సింహభాగం మంది అర్హులే అని తేల్చి వారికి యథాప్రకారం బిల్లులు మంజూరు చేస్తారని తెలుస్తోంది.

ఎలా జరిగింది?

జిల్లాల స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణ బాధ్యత కలెక్టర్లదే. ఇళ్ల మంజూరీకి ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించి తేల్చాల్సి ఉంటుంది. అర్హులను తేల్చేందుకు అప్పట్లో వివిధ విభాగాలకు చెందిన సిబ్బందితో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మొత్తం తతంగంలో స్థానిక ఎమ్మెల్యేది కీలక పాత్ర. ఎల్1 జాబితాలోని వారికే ఇళ్లను మంజూరు చేయాల్సి ఉన్నా.. కొందరు నేతలు ఎల్3లోని వారు కూడా అర్హులే అంటూ వారి పేర్లను సిఫారసు చేశారు. గ్రామ సభలు వాటికి ఆమోదం తెలిపాయి. వారికి అలా ఇళ్లు మంజూరయ్యాయి. ఎల్3 లోని వారి వివరాలు కూడా గృహనిర్మాణ శాఖకు సంబంధించిన ప్రత్యేక యాప్‌లో ఆధార్ కార్డు నంబర్, రేషన్‌కార్డుతో అనుసంధానించి నిక్షిప్తం చేశారు. ఈ జాబితాలోని దరఖాస్తుదారులకు బిల్లులు మంజూరు చేస్తే, ఆ యాప్‌లో రెడ్ మార్క్ కనిపిస్తుంది. అలా కుప్పలు తెప్పలుగా రెడ్ మార్కులు కనిపించటంతో ఏ1 జాబితాలోకి వారు ఎలా వచ్చారు? దీని వెనక ఏం జరిగిందన్న కోణంలో అంతర్గతంగా విచారణ చేపట్టారు.

ప్రతి ఒక్కరికీ గూడు మా లక్ష్యం: భట్టి



ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న భట్టి

ముదిగొండ: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పెద్దమండవ, బాణాపురం, వనంవారి కిష్టాపురం గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. వనంవారి కిష్టాపురంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలి విడతలో 4.58 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. ఇది దేశంలోనే రికార్డు అని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సంక్షేమ పథకాలను ఆపేది లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఒక్క ఊర్లో కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో 95 లక్షల రేషన్‌కార్డుల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయ విద్యుత్‌కు రూ.17,500 కోట్లు చెల్లిస్తున్నామని, ప్రతీ పేద కుటుంబానికి ఉచిత కరెంట్ అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు తమ ప్రభుత్వం రూ.25 వేల కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు అందించి ప్రతీ మహిళను కోటీశ్వరులను చేస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు.

స్మార్ట్‌గా సాగట్లేదు..!

▶ మొదటి పేజీ తరువాయి

చేయడంతోపాటు 'అమృత్'తొలి విడతలో 12 నగరాలు/పట్టణాలను.. ఆ తర్వాత అమృత్ 2.0 కింద మరో 19 పట్టణాలను గుర్తించింది. కేంద్ర, రాష్ట్రాల చెరి సగం వాటా నిధులతో పనులకు శ్రీకారం చుట్టింది.

స్మార్ట్ కింద ఇంకా పూర్తవని పనులు ఇవీ..

వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో స్మార్ట్‌సిటీ మిషన్ కింద రూ. 2,918 కోట్ల వ్యయంతో 169 ప్రాజెక్టులను మొదలుపెట్టగా రెండు కార్పొరేషన్లలో స్మార్ట్‌సిటీ మిషన్ గడువు ముగింపు నాటికి 85.2 శాతం పనులు మాత్రమే పూర్తయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వరంగల్ కార్పొరేషన్‌లో రూ. 1,800 కోట్లతో చేపట్టిన 119 ప్రాజెక్టుల్లో 84.9 శాతం పూర్తవగా అందులో రూ. 35 కోట్లతో చేపట్టిన 11 రోడ్ల పనులు 80 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇక కరీంనగర్‌లో రూ. 1,117 కోట్లతో చేపట్టిన 50 ప్రాజెక్టుల్లో పనులు 89 శాతం మేర జరిగాయి. రూ. 34.05 కోట్లతో వడ్డేపల్లి బండ్ పనులు 60 శాతమే పూర్తయ్యాయి. కరీంనగర్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు కేంద్రం రూ. 35 కోట్లు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ రూ. 35 కోట్ల విడుదలలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయి. స్మార్ట్‌సిటీ మిషన్ కింద 47 ప్రాజెక్టులు చేపట్టగా కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణం సహా ఐదు పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు.

'అమృత్'ఆలస్యం..: అమృత్ పథకం తొలి విడత కింద ఆదిలాబాద్, రామగుండం, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, సిద్దిపేట (ఎం), మహబూబ్‌నగర్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడ, వరంగల్, గ్రేటర్ హైదరాబాద్‌ను ఎంపిక చేసిన కేంద్రం.. అందుకోసం రూ. 1,663.08 కోట్లు కేటాయించింది. ఆ తర్వాత 2021 అక్టోబర్‌లో అమృత్ 2.0 కింద తెలంగాణలో 19 పట్టణాలు, నగరాలకు 252 ప్రాజెక్టుల కోసం రూ. 9,584.26 కోట్లు ప్రకటించింది. ఇప్పటివరకు రూ. 5,355.05 కోట్ల విలువైన 107 ప్రాజెక్టుల పనులు చేపట్టగా రూ. 4,229.21 కోట్ల విలువైన 145 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధమై టెండర్ల దశలో ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. ఆర్మూరు, గద్వాల, కాగజ్‌నగర్, కోదాడ, జనగామ, కోరుట్ల, కొత్తగూడెం, మంచిర్యాల, పాల్వంచ, సిరిసిల్ల, మెట్‌పల్లి, తాండూరు తదితర ప్రాంతాల్లో పనులు పూర్తికాలేదు.



వరంగల్‌లో భద్రకాళి బండ్ అభివృద్ధి, సుందరీకరణ కోసం స్మార్ట్‌సిటీ కింద రూ. 84.20 కోట్లు కేటాయించారు. తొలి దశలో రూ.32 కోట్లతో చేపట్టిన పనులు మూడేళ్ల కిందట పూర్తవగా.. రెండు, మూడు దశల్లోని సుమారు రూ. 52.50 కోట్ల పనులు గడువు దాటినా పూర్తి కాలేదు.



ఖమ్మం నగరంలో అమృత్ 2.0 కింద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రాజెక్టుకు రూ.189.50 కోట్లు, పదేళ్లపాటు నిర్వహణ కోసం రూ.60 కోట్లు కలిపి రూ. 249.5 కోట్లు కేటాయించారు. ఈ పనులు 2024 మార్చి 15న ప్రారంభించగా ఇంకా సాగుతూనే ఉన్నాయి.

పదేళ్లు అయినా..



భద్రకాళి బండ్ అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తయితే వరంగల్ నగరానికి కొత్త అందం వస్తుందని భావించాం. కానీ పదేళ్లు గడుస్తున్నా ఆ పనులు పూర్తికాలేదు.

–చింతాకుల ప్రభాకర్, ఏనుగులగడ్డ


ఎప్పుడు పూర్తవుతాయో..



మానవ వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియడం లేదు. ఎప్పుడు మాట్లాడినా చివరి దశకు చేరుకున్నాయంటున్నారే తప్ప పూర్తి చేసింద్దైతే లేదు.

– అనుమాస ప్రసన్నకుమార్, మామునూరు, వరంగల్


వెంటనే పూర్తి చేయాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన మూడు ఎస్టీపీల పనులు వెంటనే చేపట్టాలి. రెండేళ్ల దాటినా ఇంకా శ్రీకారం చుట్టకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం.

– పగడం మల్లేశ్, పద్మావతికాలనీ, మహబూబ్‌నగర్

భూసేకరణపై స్పష్టత రావాలి..



మహబూబ్‌నగర్ నగర పరిధిలో నిర్మించే మూడు ఎస్టీపీలకు భూసేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే 9 నెలల్లోనే ఎస్టీపీలను నిర్మిస్తాం. గడువులోగా పనుల పూర్తికి ప్రయత్నిస్తున్నాం.

– విజయభాస్కర్‌రెడ్డి, ఈఈ, పబ్లిక్‌హెల్త్, మహబూబ్‌నగర్

డాక్టర్ వైఎస్‌ఆర్ స్ఫూర్తి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వై. ఈశ్వరప్రసాద్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అభిమానుల ఆత్మీయ సమ్మేళనంతోపాటు వైఎస్ఆర్ 76వ జయంతి కార్యక్రమాన్ని ఈ నెల 8న హైటెక్ సిటీలోని బుట్ట కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. దీన్ని పురస్కరించుకొని ఆదివారం కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్స్ వద్ద, వివేకానందనగర్ కాలనీ రిక్రియేషన్ క్లబ్ వద్ద వైఎస్ఆర్ స్ఫూర్తి వ్యవస్థాపకులు వై. ఈశ్వర ప్రసాద్‌రెడ్డి, సభ్యులు ఏపీ రెడ్డి, ఎస్‌వీఎస్ రెడ్డి వైఎస్ఆర్ స్ఫూర్తి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు, ప్రాంతాలకు, కులమతాలకు అతీతంగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డితో కలిసి పనిచేసిన వారిని.. వారితో అనుబంధం ఉన్న వారిని ఒకే వేదికపైకి చేర్చి వారి అనుభవాలను, రాజశేఖరరెడ్డి గొప్పతనం గురించి ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వైఎస్ఆర్ అభిమానులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మత్స్యకారులకు నగదు ఇవ్వండి

- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం కోసం చెరువులు, కుంటల్లో చేప విత్తనాలు పోసే కార్యక్రమం బదులు నేరుగా మత్స్యకారులకు ఆ మేరకు నగదు సాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి కోరారు. మధ్యదళారుల పాత్ర లేకుండా ఈ పథకం ద్వారా నేరుగా మత్స్యకారులకు లబ్ధి కలిగేలా నగదు ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. చేప పిల్లల పంపిణీ కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచి సరఫరా చేస్తోందని, ఈ క్రమంలో ఏటా డిసెంబర్ వరకు జాప్యం జరుగుతోందని ఆ లేఖలో తెలిపారు. జూలై, ఆగస్టు మాసాల్లోనే మత్స్యకారులు నీటివనరుల్లో చేపల ఉత్పత్తి చేపట్టాల్సి ఉంటుందన్నారు.



మంచిమాట

ఆశ్రిత లక్షణం

తమకు జీవితాన్ని ప్రసాదించి, తాము చేసే పనికి ఎంతోకొంత సొమ్మును పారితోషికంగా ఇచ్చి రక్షించే యజమానిని ఆశ్రితులు సైతం రక్షించడం పరమ విధి. అసలు ఆశ్రితులు అంటే ఎవరు? బాధల్లో ఉన్నప్పుడు గానీ, మనకు ఏదైనా అవసరం వచ్చినప్పుడు "నేనున్నాను" అని చెంత నిలిచి ఆదరించేవాడు మిత్రుడు, ఆ రకంగా విపత్తులో మేలు పొందినవాడు ఆశ్రితుడు. పెద్ద అర్థంలో తీసుకుంటే, జగతిలోని జీవులందరూ ఆశ్రితులే..!! అందరినీ రక్షించేది ఆ పరంధాముడే..!!

ఈ విశాల విశ్వంలో ఏదో ఒక అవసరాన్ని తీర్చుకునేందుకు మనం మరొకరి మీద ఆధారపడక తప్పదు. ఆ విధంగా ఆపత్కాలంలో మనను ఆదుకున్నవాళ్ళను వదిలి వేయకుండా, వీలున్నంతగా సహాయం చేయగలగడమే ఉత్తమ ఆశ్రిత లక్షణం. ఇక, ప్రస్తుత ప్రపంచంలో వివిధ రకాలవ్యాపకాల్లో, ఉద్యోగాల్లో తమ విధులు నిర్వహించే ఉద్యోగులందరూ ఆశ్రితుల కోవలోకే వస్తారు. తమ సంస్థ ఒక్కొక్కసారి అభివృద్ధిలో ఉన్నతస్థానంలో నిలువవచ్చు, మరొకసారి ఊహించని ఇబ్బందుల్లో కూరుకుపోవచ్చు. అయితే, సంస్థ ఉత్థానంలో ఏ విధంగా ఉద్యోగులు ఆనందించి, తమ వ్యక్తిగత ప్రగతికి బాటలు వేసుకున్నారో, ఆ సంస్థ కష్టాల్లో, నష్టాల్లో కూరుకుపోతున్నప్పుడు, సంస్థను వీడకుండా, తమ వంతు సహకారాన్ని అందించాలి. తాము సంస్థకు వెన్నెముకగా ఉన్నామని, ఏ ఇబ్బందినైనా దాటడంలో తాము అహరహం కృషి చేస్తామని యాజమాన్యానికి భరోసా యివ్వాలి. ఎక్కడ తమకు ఎక్కువ జీతం, సదుపాయాలు ఉంటాయో, అక్కడికి తక్షణమే మారిపోయే ప్రస్తుత తరానికి చెందిన యువతీ యువకులు ఈ మాటలు వింటే నవ్విపోతారు. వారి దృష్టిలో ఈ విధంగా నడుచుకోవడం దాదాపుగా అసాధ్యం.కానీ, ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో తోడుగా నిలిచి, ఉత్తేజాన్ని అందించే ఈ ఉత్తమ లక్షణం సంస్థకు భవితను చూపడంలో అత్యంత అవసరం. ఏ సంస్థ మనుగడకైనా నమ్మకస్తులైన ఉద్యోగులు చాలా అవసరం. వారి అంకితభావం, సంస్థ తమ సొంతం అన్న బలీయమైన అనుబంధం వల్లనే ఆ సంస్థ లేక వ్యవస్థ నాలుగు కాలాలపాటు పచ్చగా నిలబడుతుంది. శతాబ్దాలుగా వ్యాపార వ్యవహారాలను అచ్చెరువొందేలా నిర్వహిస్తూ, చెదరని నమ్మకానికి నమూనాగా నిలిచిన అగ్రగామి సంస్థల రహస్యం ఆ సంస్థను ఆశ్రయించి ఉండడమే గాక, సర్వకాల సర్వావస్థల్లో తమ సహకారాన్ని అందించే ఉద్యోగులే..!!

ఇక, రామాయణ కథలోనూ అత్యంత విశ్వసనీయులైన ఆశ్రితులు మనకు తారసపడతారు. ముందుగా చెప్పుకోవలసింది సుగ్రీవుడు. అన్నయైన వాలిపట్ల భయంతో కొండల్లో తలదాచుకున్న సుగ్రీవుడు, శ్రీరాముని శరణు వేడి, రఘువీరుని పరాక్రమంతో వాలి నిహతుడు కాగా, తాను కిష్కింధకు రాజయ్యాడు. సీతాన్వేషణ ఘట్టంలో నలుచెరగులకు వానరులను పంపి, శ్రీరామునికి ప్రీతిని కలిగించాడు. అదే విధంగా చెప్పుకోవలసిన మరొక అద్భుత పాత్ర విభీషణునిది. అన్న ధర్మవిహితమైన తన మాటలను పెడచెవిని పెట్టడంతో రాముని శరణు వేడాడు. రావణుని తమ్ముడైన విభీషణునికి శరణాగతిని ప్రసాదించి, ఆశ్రయమిచ్చాడు. రాముని నీడలో ఆశ్రితుడైన విభీషణుడు రామునికి యుద్ధ సమయంలో లంకలోని రాక్షసుల బలాబలాలను, బలహీనతలను తెలియజేసి, దుష్ట సంహారానికి బాటలు వేశాడు. ఆఖరికి అయోధ్య త్వరగా చేరాలన్న రాముని ఆతృతను గమనించి, శ్రీరాముని తన పుష్పక విమానంలో సాగనంపి, తన శుభ లక్షణాలను లోకాలన్నిటికీ ఘనంగా తెలియజేశాడు.

అధునాతన యుగంలోనూ ఆశ్రితులు ఈ విధంగా తమకు ఆశ్రయమిచ్చిన వారికి సహకరిస్తే, సంస్థలు ఇతోధికంగా వృద్ధి చెందుతాయని, దేశ పురోగతికి బంగరు బాటలు ఏర్పడతాయని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదు.


– తత్వ ప్రవచన సుధాకర
వెంకట్ గరికపాటి

పచ్చటి కోరిక

భారతీయ పురాతన కాలానికి చెందిన ఒక కథను ఈ సందర్భంలో పరికించడం సమంజసం. కాశీదేశంలో ఒక వేటగాడు విషపూరితమైన బాణాన్ని లేడిపై ప్రయోగించగా అది పచ్చటి ఫలవృక్షానికి తాకింది. దాని ప్రభావం వల్ల ఆ చెట్టు కొద్ది కాలానికి పూర్తిగా ఎండిపోయింది. ఆ చెట్టు తొర్రలో కొంతకాలంగా ఒక చిలుక నివసిస్తూ ఉండేది. ఎండిపోయినా, ఆ చెట్టును వీడిపోకుండా చిలుక ఆ చెట్టు తొర్రలోనే నివాసం ఉండసాగింది. ఒకానొక సందర్భంలో దేవరాజైన ఇంద్రుడు ఆ చిలుకతో సంభాషిస్తూ, "ఓ చిలుకా.. ఈ చెట్టు పూర్తిగా ఎండిపోయింది. ఈ చెట్టు తొర్రలో ఉండడంవల్ల నీకు ఎటువంటి ప్రయోజనం లేదు. పచ్చగా ఉన్న మరొక చెట్టును ఆశ్రయించి, నీవు ఆనందంగా గడుపు" అని సలహా యిచ్చాడు. ఇంద్రుని మాటలకు ప్రత్యుత్తరమిస్తూ, ఆ చిలుక "చెట్టు పండినపుడు ఉండడం, ఎండినపుడు విడిచిపోవటం కృతఘ్నత కదా.. ఈ చెట్టు ఎండిపోయినా, నేను ఇక్కడే ఉంటాను.." అంది. దేవేంద్రుడు ఆ చిలుక మాటలకు ఎంతగానో సంతోషించాడు. చిలుకను ఏదైనా వరం కోరుకోమన్నాడు. అప్పుడు ఆ చిలుక "స్వామీ..! ఈ చెట్టుకు పూర్వ వైభవాన్ని అనుగ్రహించు" అని కోరింది. ఆ చిలుక కోరిన విధంగానే దేవేంద్రుడు ఆ చెట్టు మళ్ళీ పచ్చగా ఉండేలా కటాక్షించాడు. ఆ విధంగా ఆశ్రితురాలైన ఆ చిలుక వల్ల ఆ చెట్టుకు మేలు జరిగి, పునర్వైభవాన్ని పొందింది. ఆశ్రితుల లక్షణం ఇంత చక్కగా ఉంటే, యజమాని లేక సంస్థకు ఎంతో మేలు జరుగుతుందని ఈ కథ మనకు తెలియజేస్తుంది.

ఆత్మదర్శిని

ఆలోచనలే సాక్షిగా...



ఆలోచనలను సాక్షిగా గమనించినప్పుడు ఆ ఆలోచనల కారకం ఆగిపోతుంది. ఆలోచనలను గమనించినపుడు ఆలోచనల నుండి విడివడతావు. నీవు స్వచ్ఛమైన సాక్షీచైతన్యానివని తెలుసుకుంటావు. నీ నిజతత్వాన్ని తెలుసుకుంటావు. మనస్సు నిన్ను ఈ క్షణంలో ఎప్పుడూ ఉండనివ్వదు. ఈ క్షణంలో అసలు మనస్సు ఉనికే ఉండదు. హృదయమే ఉంటుంది. స్వచ్ఛమైన చైతన్యమే ఉంటుంది. మనస్సు అంటేనే గతానికి, భవిష్యత్తుకు సంబంధించినది. ఈ క్షణంలో అసలు కాలం అనేదే ఉండదు. గాఢమైన శూన్యమే ఈ క్షణం. మనస్సు అంటేనే కల్పన. అదే దాని ఉనికికి ఆధారం. అందుకే ఎప్పుడూ ఏదో ఒకటి సృష్టించి నిన్ను దుఃఖంలోకి తీసుకు వెళుతుంది.



ఆనందం నీ మూలస్థితి. దాని కోసం ఎక్కడా వెదకవలసిన అవసరమే లేదు. నిన్ను నీవు తెలుసుకోవాలి. నీ ఆత్మలో నీవు స్థిరపడాలి. నిన్ను నీవు తెలుసుకున్నప్పుడు కోరికలు, అహంకారం అనేవి ఉండటానికే అవకాశం లేదు. మనస్సు ఖాళీ స్థితిని ఉండనివ్వదు. ఏదో ఒకటి నింపడానికే ప్రయత్నిస్తూ ఉంటుంది. శూన్యంలో మనస్సు ఉండలేదు. అందుకే మనం ఖాళీగా ఉన్న సమయంలో కూడా ఏదో ఒక అనవసర విషయాలను కల్పించుకుంటాము. టీవీ చూడటం, ఇరుగుపొరుగుతో కబుర్లు చెప్పటం లాంటి పనులైనా చేస్తాము గానీ ఆ శూన్యాన్ని స్వీకరించలేము. ఇదంతా మనస్సుకు బానిసవ్వడం వల్లనే జరుగుతుంది. అందుకే స్వచ్ఛమైన చైతన్యం వైపు, విషయాలు లేని శూన్యంవైపు, సత్యం వైపు తీసుకువెళ్ళే ధ్యానాన్ని చేయడానికి ఇష్టపడము. ధ్యానంలో ఊహలు, ఆలోచనలు అనేవి ఏమీ ఉండవు. కేవలం శుద్ధ చైతన్యమే ఉంటుంది. జ్ఞాపకాలు, జ్ఞానం, నమ్మకాలు అనేవన్నీ మాయమైపోతాయి. అందుకే మనస్సు ధ్యానంవైపు వెళ్ళనివ్వదు. సినిమాలో పాత్రలు ఏడిస్తే, నవ్వితే మనం కూడా ఆ పాత్రల్లో లీనమై ఆయా భావోద్వేగాలకు లోనైనట్టే నిజజీవితంలో కూడా ఈ శరీరం–మనస్సులనే నేను అని నమ్మి, మన నిజతత్వాన్ని మరచిపోయి వాటితోనే కలిసిపోతున్నాము. దీని నుండి బయటపడడానికే నిత్యం మనం చేసే ప్రతి పనిలోనూ సాక్షీభావనతో ఉండటం అలవర్చుకోవాలి. నడుస్తున్నా, మాట్లాడుతున్నా, చూస్తున్నా, వింటున్నా, ఆ పని చేసేవాడిని గమనిస్తూ నీవు సాక్షిగా ఉండాలి. నేను ద్రష్టను అనే ప్రజ్ఞ ప్రతిక్షణం ఉన్నప్పుడే దుఃఖం నిన్ను అంటదు. నిత్యం సచ్చిదానందంలో ఉంటావు. శరీరాన్ని గమనిస్తే శరీరమే నేను అనే భావన నుండి బయటపడతావు. మనస్సును గమనిస్తే మనస్సు మాయమౌతుంది. భావోద్వేగాలను గమనిస్తే అవి క్రమంగా మాయమై నీవు చైతన్యంగా మిగిలిపోతావు. నీవు అన్నింటికీ కర్తగా ఉండకూడదు. ఆ కర్తను చూసేవాడిగా, ద్రష్టగా ఉండాలి. నిత్యజీవితంలో మనం ఉద్యోగిగా, భర్తగా, భార్యగా, కొడుకుగా రకరకాల పాత్రల్లో ఉన్నప్పుడు బయటి ప్రపంచాన్ని గమనిస్తూంటాము. అందుకే విషయాలతో కలిసిపోతాము. కానీ ధ్యానంలో నిన్ను నీవు గమనిస్తావు. శరీరం–మనస్సులకు భిన్నంగా వాటిని గమనిస్తున్న సాక్షిగా నీ లోపలి ప్రపంచాన్ని గమనిస్తూ ఉంటావు. నీ ఆలోచనలను, భావోద్వేగాలను, సంవేదనలను, చివరికి ఆ గమనించే వాడిని కూడా గమనిస్తూ ఉంటావు. ధ్యానం అంటేనే చైతన్య ప్రవాహం. ధ్యానం కూడా ఫలితాన్ని ఆశిస్తూ చేయకూడదు. విముక్తి, మోక్షం అనేవి కూడా లక్ష్యాలుగా పెట్టుకోకూడదు. ఎందుకంటే అది కూడా నీ మనస్సు రూపమే. మనస్సు కల్పనే.

– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

సందర్భం

గురు అనుగ్రహం

గురువులు, ఆచార్యుల అనుగ్రహం లేకుంటే ఏదీ అర్థం కాదు, ఏదీ సాధించలేము. అందుకే గురువును సాక్షాత్తూ త్రిమూర్తులయిన బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపంతో పోల్చారు పెద్దలు. ఈ దేశంలో ఎందరో మహానుభావులు, మహాత్ములైన గురువులున్నారు. సర్వగురువులకూ గురుస్థానీయుడు వేదవ్యాసుడు. అందరు గురువుల్లోనూ అంశల భేదంతో వేదవ్యాసమహర్షి ఉంటాడు. ఈ విధమైన ఏకత్వ గురుభావన ఈ దేశ సంప్రదాయం. గురువు అనుగ్రహం ఉంటేనే భగవంతుడి అనుగ్రహం లభిస్తుంది. అంటే భగవంతుణ్ణి దర్శించాలంటే ముందుగా గురువు అనుగ్రహాన్ని పొందాలి.

ఇనప ముక్కను బంగారంగా మార్చే పరుసవేది గురువు. అలాగని గురువును పరుసవేదితోనే పూర్తిగా పోల్చడానికి వీలు కాదు. అంతకు మించినవాడు. అన్నింటికీ అతీతుడు.

మనిషి అయినవాడు బాధ్యతల నుంచి పారిపోకుండా ఎటువంటి పరిస్థితుల్లోనూ ఘర్షణకు తావులేకుండా కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా ఎలా నిర్వహిస్తాడో వ్యాసభగవానుడు, శంకర భగవత్పాదుల వంటి గురువులు వైరాగ్యం అంటే బాధ్యతలను వదిలిపెట్టడం కాదని,



వ్యామోహపడకుండా బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వహించడమనే సందేశాన్ని ఈ సమాజానికి అందించారు. ఇక అవతార పురుషులైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు కూడా గురువులను ఆశ్రయించి, సంపూర్ణంగా గురు కృపను పొందినవారే.

గురువును ఎప్పుడూ వినయ విధేయతలతో ప్రసన్నం చేసుకోవాలే కానీ, అహంకారంతో తూలనాడి వారి ఆగ్రహానికి గురికాకూడదు. దేవేంద్రుడంతటివాడు గురువైన బృహస్పతి తన కొలువులోకి రావడాన్ని చూసి కూడా లేవకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఆయన ఆగ్రహానికి గురై సింహాసనంతో సహా సర్వసంపదలనూ పోగొట్టుకున్నాడు. చివరకు తప్పు తెలుసుకుని ఆయనను ఆశ్రయించి ఆయన అనుగ్రహంతోనే తిరిగి పూర్వ వైభవాన్ని పొందాడు. అందుకే గురువు గురువే.

– డి.వి.ఆర్.

10, గురువారం గురు పూర్ణిమ


సాక్షి సినిమా


● చిరంజీవి

డేట్ ఫిక్స్?

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఈ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ సంక్రాంతికి విడుదల కావాల్సింది... కానీ కుదర్లేదు. 'గేమ్ ఛేంజర్' సినిమా కోసం ఈ సినిమా విడుదలను వాయిదా వేశామని అప్పట్లో ఈ చిత్రం యూనిట్ పేర్కొంది. ఆ సంగతి అలా ఉంచితే, తాజాగా ఈ సినిమాను సెప్టెంబరు 18న విడుదల చేసే ఆలోచనలో ఉన్నారట. ఇక 'విశ్వంభర'కి సంబంధించి ఓ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించాల్సి ఉంది. ఈ పాటలో చిరంజీవితో పాటు బాలీవుడ్ నటి మౌనీ రాయ్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. 'అన్నయ్య' సినిమాలోని పాపులర్ పాట 'ఆట కావాలా పాట కావాలా...'కి రీమిక్స్‌గా ఈ పాట ఉంటుందని సమాచారం. ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్రిష హీరోయిన్‌గా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

వాస్తవ కథను వెలికి తీద్దాం


● రణ్‌వీర్ సింగ్

''ఒక భారీ అగ్ని ఎగిసే క్షణం ఆసన్నమైంది... కొందరు అపరిచితుల గురించి తెలియని వాస్తవ కథను వెలికి తీద్దాం'' అంటూ హిందీ చిత్రం 'ధురంధర్'లోని తన పోస్టర్‌ని, టీజర్‌ని షేర్ చేశారు హీరో రణ్‌వీర్ సింగ్. ఆదివారం (జూలై 6) రణ్‌వీర్ పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్, టీజర్‌ని విడుదల చేసి, ఈ సినిమాని డిసెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. టీజర్‌లో రణ్‌వీర్ ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపించారు. థ్రిల్, వయొలెన్స్, మిస్టరీలతో ఈ టీజర్ సాగుతుంది, 'ధురంధర్'లో సంజయ్ దత్, మాధవన్, అర్జున్ రామ్‌పాల్, అక్షయ్ ఖన్నా, సారా అర్జున్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడిగా తొలి చిత్రం 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' (2019)తో జాతీయ అవార్డు సాధించిన ఆదిత్య ధర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని భారత నిఘా, శాంతి భద్రతల మాజీ అధికారి, ప్రస్తుత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ జీవితం ఆధారంగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. జియో స్టూడియోస్ సమర్పణలో బీ62 స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చిత్రదర్శకుడు ఆదిత్య ధర్ ఓ నిర్మాత కాగా, జ్యోతీ దేశ్‌పాండే సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ది 100 సినిమాను ఫస్ట్ డే చూస్తాను

– తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


● శశిధర్, ఆర్‌కే సాగర్, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వెంకీ, రమేశ్

''మంచి సందేశంతో 'ది 100' సినిమా నిర్మించారు. పోలీసాఫీసర్‌గా సాగర్ కరెక్ట్‌గా ఫిట్ అయ్యాడు. ఈ సినిమాను ఫస్ట్ డే చూడాలనుకుంటున్నాను. ఒక రిటైర్డ్ బ్యాంకు ఆఫీసర్ కూడా ఐదుకోట్ల రూపాయలు పోగొట్టుకున్నటువంటి సైబర్ క్రైమ్స్ ఈ రోజుల్లో మనం చూస్తున్నాం. ఇలాంటి సమయంలో ఈ సినిమా చాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆర్‌కే సాగర్ మంచి హీరో అవుతాడనిపిస్తోంది. ఈ సంవత్సరం 'గద్దర్ అవార్డ్స్'లో బెస్ట్ ఫిల్మ్‌గా 'ది 100' వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగని నేను రికమండ్ చేయడం లేదు. ఈ సినిమా ట్రైలర్ చూసినప్పుడు అనిపించింది. ఇక పైరసీ వల్ల వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. పైరసీని అరికట్టడానికి ఆల్రెడీ మా ప్రభుత్వం పోలీస్ అధికారులతో మాట్లాడి యాక్షన్ తీసుకోవడం జరిగింది'' అని **తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి** అన్నారు.

'మొగలిరేకులు' సీరియల్ ఫేమ్ హీరో ఆర్‌కే సాగర్ హీరోగా నటించిన చిత్రం 'ది 100'. ఈ చిత్రంలో హీరోయిన్లు మిషా నారంగ్, ధన్య బాలకృష్ణ నటించారు. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో రమేశ్ కరుటూరి, వెంకీ పూశడపు, జె. తారక్ రామ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న రిలీజ్ కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై, బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు.

ఈ వేడుకలో తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ– ''ది 100' సినిమా చూశాను. ఒక పవర్‌ఫుల్ యాక్టింగ్‌తో మంచి సోషల్ మెసేజ్ చెప్పడానికి దర్శకుడు శశి మంచి ప్రయత్నం చేశారు. సాగర్ నాకు చాలా సంవత్సరాల నుంచి పరిచయం. మా ప్రాంత వాసి. టాలీవుడ్, బాలీవుడ్‌లోనే కాదు... హాలీవుడ్‌లోనూ రాణించగల ప్రతిభ సాగర్‌లో ఉంది. ఐపీసీలోని మంచి సెక్షన్‌లోని సారాంశంతో 'పవర్‌ఫుల్ వెపన్ టు డిఫెండ్ యువర్‌సెల్ఫ్' అనే పాయింట్‌తో తీసిన సినిమా ఇది. ఈ రోజు ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు రావాల్సింది. కానీ ఆయనకు మరో కార్యక్రమం ఉండటం వల్ల, మాకు తెలియజేయడం జరిగింది'' అన్నారు శ్రీధర్‌బాబు.

ఆర్‌కే సాగర్ మాట్లాడుతూ– ''ఐటీ మినిస్టర్ శ్రీధర్ అన్నగారు నా సినిమా చూసి, నన్ను ఆశీర్వదించారు. అలాగే నా కోసం ఈ వేడుకకు వచ్చిన వెంకట్‌రెడ్డి అన్నకు ధన్యవాదాలు. ఎస్. గోపాల్ రెడ్డి, కోదండ రామిరెడ్డి, డైరెక్టర్ బి.గోపాల్ గార్లు... వాళ్ల ఫ్యామిలీలో నన్ను చేర్చుకున్నందుకు థ్యాంక్స్. 'ది 100' అనేది ఒక వెపన్. కొందరు సాధారణ ప్రేక్షకులకు ఈ సినిమాను చూపించినప్పుడు, వాళ్లు కన్నీళ్ళు పెట్టుకున్నారు'' అని అన్నారు. **రాఘవ్ ఓంకార్ శశిధర్ మాట్లాడుతూ–** ''ఓ రియల్ పోలీసాఫీసర్ జీవితంలో జరిగిన ఒక సంఘటన విని, ఇలాంటివి కూడా జరుగుతున్నాయా? అనిపించి, ఈ పాయింట్‌ను చెప్పాలనుకున్నాను. ఈ చిత్రంలో మహిళల గురించీ చెప్పడం జరిగింది. ప్రతి ఫ్యామిలీ చూడాల్సిన చిత్రం'' అని చెప్పారు. ''ది 100'లో ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మంచి సందేశం ఉంది'' అన్నారు **నిర్మాత రమేశ్.** ''ఈ వేడుకకు వచ్చిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ బాబుగార్లకు, మిగతా పెద్దలందరికీ థ్యాంక్స్'' అని **నిర్మాత వెంకీ** చెప్పారు. ఈ వేడుకలో ఎ. కోదండ రామిరెడ్డి, బి. గోపాల్, ఎస్. గోపాల్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఇంకా 'ది 100' చిత్రబృందంలోని పలువురు పాల్గొన్నారు.

నిర్మాత అంటే ముళ్ల సింహాసనమే

– ఎస్‌కేఎన్



''ఒకప్పుడు శాటిలైట్ హక్కులు, ఆ తర్వాత హిందీ డబ్బింగ్ హక్కులు, ఇటీవల ఓటీటీ ... ఇలా ఒక్కో టైమ్‌లో ఒక్కో విధంగా నిర్మాతలకు ఆదాయం వస్తుంటుంది. కానీ ఈ అన్ని దశల్లోనూ థియేటర్స్‌లో ఆడిన సినిమాలే ఎక్కువ లాభాలను తీసుకువచ్చాయి. థియేటర్స్‌లో ఆడిన సినిమాలే మంచివని నిర్మాతలు మరింత నమ్మితే ఎగ్జిబిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలు కూడా బాగుంటాయి. ఓటీటీ వాళ్ల నుంచి డబ్బులొస్తాయి అని హీరో–డైరెక్టర్ కాంబినేషన్‌ని సెట్ చేసుకుని ఇటీవల వచ్చిన కొన్ని సినిమాలు వర్కౌట్ కాలేదు'' అని నిర్మాత ఎస్‌కేఎన్ అన్నారు. సోమవారం (జూలై 7) ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశంలో ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''జర్నలిస్ట్‌గా ఉన్న నేను చరణ్, బన్నీ (రామ్‌చరణ్, అల్లు అర్జున్) సలహా మేరకు పీఆర్‌ఓగా కెరీర్ ఆరంభించాను. అయితే దర్శకుడు మారుతి తన దర్శకత్వంలో చేయబోయే సినిమాకు నిర్మాతగా ఉండమని ప్రోత్సహించాడు. అలా మారుతి దర్శకత్వంలో నేను, శ్రేయాస్ శ్రీను కలిసి 'ఈ రోజుల్లో..' సినిమా చేశాం. ఆ సినిమా సక్సెస్‌తో నిర్మాతగా నా జర్నీ మొదలైంది. ఇక యూవీ క్రియేషన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, గీతా ఆర్ట్స్, మైత్రీ... ఇలా ఇతర నిర్మాణ సంస్థలతోనూ అసోసియేట్ అయి, సినిమాలు చేస్తున్నానంటే ఇందుకు కారణం అల్లు అరవింద్‌గారు ఇచ్చిన ప్రోత్సాహం. ఎలాంటి కష్టం వచ్చినా స్థిరంగా ఉండటం మిత్రుడు, నిర్మాత బన్నీ వాసు నుంచి నేర్చుకున్నా. అల్లు అర్జున్ గారి నుంచి నాకు మోరల్ సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది. అయితే నిర్మాతగా ఉండటం అనేది ముళ్ల సింహాసనం లాంటిది. ఇక 25 మంది తెలుగు అమ్మాయిలను పరిచయం చేయాలనే టార్గెట్‌తో ఏడెనిమిది మందిని పరిచయం చేశాను. హీరోయిన్స్ అని మాత్రమే కాకుండా... ఇతర విభాగాల్లోనూ చాన్స్ కల్పిస్తున్నాం. త్వరలో ఓ మహిళా దర్శకురాలిని పరిచయం చేయనున్నాను. ఇక రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్', కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. తెలుగు 'బేబీ' హిందీ రీమేక్ షూటింగ్ వచ్చే నెల ప్రారంభిస్తాం. సంతోష్ శోభన్, అలేఖ్య హారికల సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. నూతన దర్శకులు కృష్ణ, అవినాష్‌లతో సినిమాలు ఉన్నాయి. 'ది రాజాసాబ్' తర్వాత మారుతితో ఓ సినిమా, హిందీ 'బేబీ' తర్వాత సాయి రాజేశ్‌తో మరో సినిమా ఉన్నాయి. 'త్రీ రోజెస్ 2' సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ కానుంది'' అని చెప్పారు.

ఓటీటీ

ఇది చూడొచ్చు

హై ఓల్టేజ్ యాక్షన్ క్లీనింగ్

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం క్లీనర్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఊహించని, ఊహకందని విషయాలను మనం చూడగలిగేది వెండితెర మీదే. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సన్నివేశాలతో ప్రేక్షకులను రక్తి కట్టించే దర్శకుల ఊహ మాత్రం ఎవరి ఊహకూ అందనిది. అటువంటి ఊహతోనే అల్లుకున్న కథ 'క్లీనర్' సినిమా. ఈ కథ లైన్ ఎంత చిన్నదిగా ఉంటుందో కథ నడిచే తీరు మాత్రం అందనంత ఎత్తులో ఉంటుంది. గంటన్నర నిడివితో ఉన్న హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. అంతలా ఏముందీ కథలో ఓసారి చూద్దాం. జోయే తన తమ్ముడు మైఖేల్‌తో లండన్‌లో ఓ అపార్ట్‌మెంట్లో ఉంటుంది. మైఖేల్ ఆటిజమ్ వ్యాధి బారిన పడ్డ స్పెషల్ చైల్డ్. కానీ మంచి టాలెంటెడ్ కిడ్. జోయే ఆర్మీలో పని చేసిన అమ్మాయి. ఇప్పుడు మాత్రం పోషణ కోసం అగ్నియన్ ఎనర్జీ సంస్థకి సంబంధించిన బిల్డింగ్‌లో క్లీనర్‌గా చేస్తుంటుంది. ఓ రోజు ఆ బిల్డింగ్‌లో పెద్ద పార్టీ జరుగుతుంది. దాని కోసంగా వంద అంతస్తుల బిల్డింగ్‌లోని పై ఫ్లోర్ అద్దాలు క్లీన్ చేయాలని జోయేకి టాస్క్ ఇస్తాడు మేనేజర్. తను ఆ పని చేస్తున్నప్పుడు తన తమ్ముడిని ఓ సూపర్ వైజర్ దగ్గర వదిలి పెట్టి జోయో గాల్లో వేలాడుతూ అద్దాలను క్లీన్ చేస్తుంటుంది. ఇంతలో బిల్డింగ్‌లోకి కొందరు దుండగులు పెద్ద బాంబులు, తుపాకీలతో చొరబడి పార్టీలో ఉన్న వీఐపీలనందరినీ తమ ఆధీనంలోకి తెచ్చుకుంటారు. జోయే అద్దాలను క్లీన్ చేస్తూనే ఇదంతా గమనిస్తూ తన తమ్ముడి గురించి బెంగపడుతుంది. జోయే గాల్లోనుండి బిల్డింగులోకి రావాలంటే సూపర్ వైజర్ తన రోప్‌ని ఆపరేట్ చేయాలి. కానీ దుండగులు ఆ సూపర్‌వైజర్‌ని చంపేస్తారు. మరి... జోయే అక్కడి నుండి బయటపడి తనను, తన తమ్ముడిని రక్షించుకోగలదా? అన్నదే సినిమా. పైన చెప్పుకున్నట్టు ఈ సినిమా ఓ హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్. ముఖ్యంగా ఈ సినిమాలో జోయే చేసే స్టంట్స్‌కి ఒళ్ళు గగుర్పొడుస్తుంది. అంతేకాదు... కథ చాలా ట్విస్టులతో నడుస్తూ ప్రేక్షకుడి మతి పోగొడుతుంది. ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా ఈ సినిమా తెలుగులోనూ లభ్యమవుతోంది. మార్టిన్ క్యాంప్‌బెల్ దర్శకత్వం వహించిన మంచి టైమ్‌పాస్ మూవీ. ఎంజాయ్ ది క్లీనింగ్ డన్ బై జోయే.

– హరికృష్ణ ఇంటూరు

బర్మింగ్‌హామ్‌లో జైహింద్

అచ్చిరాని వేదికపై భారత్ చిరస్మరణీయ విజయం

- తొమ్మిదో ప్రయత్నంలో ఎడ్జ్‌బాస్టన్ గ్రౌండ్‌లో టీమిండియాకు దక్కిన తొలి గెలుపు
- రెండో టెస్టులో 336 పరుగులతో శుబ్‌మన్ గిల్ బృందం జయభేరి
- 6 వికెట్లతో హడలెత్తించిన ఆకాశ్‌దీప్
- గురువారం నుంచి లార్డ్స్‌లో మూడో టెస్టు

బుమ్రాకు విశ్రాంతినివ్వడం... కుల్దీప్‌ను విస్మరించడం... ప్రసిధ్‌ను కొనసాగించడం...

టాపార్డర్‌ను కూల్చిన అనంతరం ప్రత్యర్థిని కోలుకోనివ్వడం... సరైన సమయంలో ఇన్నింగ్స్ 'డిక్లేర్' చేయకపోవడం... ఇన్ని ప్రతికూలతలకు తోడు చివరి రోజు వర్షం సైతం ఆతిథ్య జట్టును ఆదుకునేలా కనిపించడంతో.. ఒకదశలో భారత విజయంపై నీలినీడలు కమ్ముకోగా... ఆకాశ్‌దీప్ సింగ్ వాటిని పటాపంచలు చేస్తూ విజృంభించాడు. యువసారథి శుబ్‌మన్ గిల్ బ్యాటింగ్ మెరుపులకు... ఆకాశ్ నిప్పులు చెరిగే బౌలింగ్ తోడవడంతో ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో టీమిండియా విజయఢంకా మోగించింది. నాలుగేళ్ల క్రితం 'గబ్బా స్టేడియం'లో ఆస్ట్రేలియాపై తొలి విజయంలో కీలకపాత్ర పోషించిన గిల్, పంత్, సిరాజ్... ఇక్కడ కూడా సత్తా చాటడంతో బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో టీమిండియా తొలిసారి టెస్టుల్లో గెలిచింది. గతంలో ఎడ్జ్‌బాస్టన్ గ్రౌండ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ 8 టెస్టులు ఆడగా ... ఏడింటిలో ఓడి... ఒకసారి 'డ్రా' చేసుకుంది. తొమ్మిదో ప్రయత్నంలో గెలుపు రుచి చూసింది.

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్ పర్యటనలో భారత క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో తొలిసారి టెస్టు ఫార్మాట్‌లో విజయం నమోదు చేసుకుంది. బ్యాటర్ల బీభత్సానికి బౌలర్ల సహకారం తోడవడంతో రెండో టెస్టులో టీమిండియా 336 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. విదేశాల్లో పరుగుల తేడా పరంగా భారత జట్టుకు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. 608 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 72/3తో ఆదివారం చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు చివరకు 68.1 ఓవర్లలో 271 పరుగులకు ఆలౌటైంది. జేమీ స్మిత్ (99 బంతుల్లో 88; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. భారీ వర్షం కురవడంతో ... చివరిరోజు ఆట ఆలస్యంగా ప్రారంభం కాగా... ఒకదశలో వరుణుడి సాయంతో ఇంగ్లండ్ గట్టెక్కేలా కనిపించినా... వాన తెరిపినిచ్చిన అనంతరం భారత బౌలర్లు విజృంభించి ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లారు. ఆకాశ్‌దీప్ 6 వికెట్లతో అదరగొట్టగా... సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, జడేజా, సుందర్ తలా ఒక వికెట్ పడగొట్టారు.

బర్మింగ్‌హామ్‌లో భారత్‌కు ఇదే మొదటి గెలుపు కాగా... ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను టీమిండియా 1–1తో సమం చేసింది. భారత కెప్టెన్ గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. లార్డ్స్‌లో గురువారం నుంచి మూడో టెస్టు జరుగుతుంది.

మళ్లీ అతడే...

వర్షంతో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ఆట ప్రారంభం కావడంతో ఓవర్లను కుదించారు. దీంతో ఏ మూలో భారత విజయంపై అనుమానాలు రేకెత్తగా... వాటిని ఆకాశ్‌దీప్ పటాపంచలు చేశాడు. రెండో ఓవర్ తొలి బంతికే పోప్ (24)ను క్లీన్ బౌల్డ్ చేసిన ఆకాశ్... తదుపరి ఓవర్‌లో బ్రూక్ (23)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో ఇంగ్లండ్ ఆత్మరక్షణలో పడగా... లంచ్ విరామానికి ముందు కెప్టెన్ బెన్ స్టోక్స్ (73 బంతుల్లో 33; 6 ఫోర్లు)ను అవుట్ చేయడం ద్వారా సుందర్ జట్టును విజయానికి మరింత చేరువ చేశాడు. ఇక గెలుపు లాంఛనం మాత్రమే మిగలగా... తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో జేమీ స్మిత్ ఎదురుదాడికి దిగాడు. ధాటిగా ఆడుతూ ఓటమి అంతరాన్ని తగ్గించే ప్రయత్నం చేశాడు. ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో రెండు భారీ సిక్స్‌లు కొట్టిన స్మిత్ మరో షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ అవుట్ కావడంతో ఇంగ్లండ్ ఓటమి ఖరారైంది.



గిల్ గెలుపు గర్జన

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 407; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 427/6 డిక్లేర్డ్; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** డకెట్ (బి) ఆకాశ్‌దీప్ 25; క్రాలీ (సి) (సబ్) సుదర్శన్ (బి) సిరాజ్ 0; పోప్ (బి) ఆకాశ్‌దీప్ 24; రూట్ (బి) ఆకాశ్‌దీప్ 6; బ్రూక్ (ఎల్బీ) ఆకాశ్‌దీప్ 23; స్టోక్స్ (ఎల్బీ) (బి) సుందర్ 33; స్మిత్ (సి) సుందర్ (బి) ఆకాశ్‌దీప్ 88; వోక్స్ (సి) సిరాజ్ (బి) ప్రసిధ్ కృష్ణ 7; కార్స్ (సి) గిల్ (బి) ఆకాశ్‌దీప్ 38; టంగ్ (సి) సిరాజ్ (బి) జడేజా 2; బషీర్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (68.1 ఓవర్లలో ఆలౌట్)** 271. **వికెట్ల పతనం:** 1–11, 2–30, 3–50, 4–80, 5–83, 6–153, 7–199, 8–226, 9–246, 10–271. **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 21.1–2–99–6; సిరాజ్ 12–3–57–1; ప్రసిధ్ కృష్ణ 14–2–39–1; జడేజా 15–4–40–1; సుందర్ 6–2–28–1.



ఆకాశ్‌దీప్‌కు సహచరుల అభినందన

> బుమ్రా అందుబాటులో లేకున్నా.. మా బౌలర్లు చక్కటి ప్రదర్శన కనబర్చారు. పేసర్లే 17 వికెట్లు తీసి ఇస్తే.. కెప్టెన్‌కు ఇంకేం ఇబ్బంది ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లో అయినా 20 వికెట్లు తీయగల బౌలింగ్ దళం మాకు ఉంది. గతంలో ఎన్నోసార్లు సిరీస్ తొలి మ్యాచ్‌లో ఓడిన తర్వాత తిరిగి పుంజుకున్నాం. గత మ్యాచ్ అనంతరం లోపాలపై దృష్టి పెట్టాం. ఈసారి బౌలింగ్, ఫీల్డింగ్‌లో మెరుగైన ప్రదర్శన వల్లే విజయం సాధ్యమైంది. నా ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా. క్రీజులో ఉన్నప్పుడు బ్యాటర్‌గానే ఆలోచిస్తా. తదుపరి మ్యాచ్‌లో బుమ్రా ఆడుతాడు.
> – గిల్, భారత కెప్టెన్

> ఈ ప్రదర్శనను క్యాన్సర్‌తో పోరాడుతున్న నా సోదరికి అంకితమిస్తున్నా. ఈ మ్యాచ్‌లో నా ఆటతీరుతో ఆమె ఎంతగానో సంతోషించి ఉంటుంది. బంతి అందుకున్న ప్రతిసారి నా మదిలో ఎన్నో ఆలోచనలు వస్తుంటాయి. వాటిని అధిగమిస్తూ వికెట్లు పడగొట్టేందుకు ప్రయత్నిస్తా. సరైన ప్రదేశంలో బంతులేయడంపై దృష్టి పెట్టా అది ఫలితాన్నిచ్చింది. ఇంగ్లండ్ బ్యాటర్ల కోసం ప్రత్యేక ప్రణాళికలతో మైదానంలో అడుగుపెట్టా. వాటిని అమలు చేయడంలో విజయవంతమయ్యా. లార్డ్స్ టెస్టు గురించి ఇప్పటి నుంచే ఆలోచించడం లేదు.
> – ఆకాశ్‌దీప్, భారత బౌలర్

1692 ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి చేసిన పరుగులు. భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్టు మ్యాచ్‌లో ఇవే అత్యధికం.

'ఆకాశ'మంత ఆనందం...

- అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్న భారత పేసర్
- మ్యాచ్‌లో పది వికెట్లతో అందరి ప్రశంసలు చూరగొన్న ఆకాశ్‌దీప్

సాక్షి క్రీడా విభాగం

ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా తొలి టెస్టులోనూ టీమిండియా మెరుగైన ప్రదర్శనే చేసింది. 15 సెషన్ల పాటు సాగిన పోరులో... అధిక భాగం మనదే ఆధిపత్యం. కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ శతకాలతో ప్రత్యర్థి ముందు 371 పరుగుల లక్ష్యం నిలిచింది. ఎలాంటి పిచ్‌పైనైనా నాలుగో ఇన్నింగ్స్‌లో ఈ స్కోరు ఛేదించడం కష్టతరమే! అందులోనూ ప్రపంచ అత్యుత్తమ పేసర్లలో ఒకడైన జస్‌ప్రీత్ బుమ్రాను ఎదుర్కొంటూ పరుగులు రాబట్టడం అంటే ఆషామాషీ కాదు! అయితే ఇక్కడే ఇంగ్లండ్ ప్లేయర్లు తమ గేమ్ ప్లాన్‌తో ఆకట్టుకున్నారు. బుమ్రాను గౌరవించిన ఆతిథ్య ఆటగాళ్లు ఇతర బౌలర్లపై విరుచుకుపడ్డారు. నిర్జీవ పిచ్‌పై ఇంగ్లండ్ బ్యాటర్లు పరుగుల పండగ చేసుకుంటుంటే... మనవాళ్లు చేష్టలుడిగి చూస్తుండటం తప్ప మరేం చేయలేకపోయారు. సిరాజ్ ప్రభావం చూపలేకపోగా... ప్రసిధ్ కృష్ణ టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఏ బౌలర్‌కు సాధ్యం కాని చెత్త గణాంకాలు ఖాతాలో వేసుకున్నాడు. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లో శుబ్‌మన్ గిల్ నిర్ణయాలు బెడిసికొట్టడంతో... ఇక సిరీస్‌లో టీమిండియా కోలుకోవడం కష్టమే అనే వార్తలు వినిపించాయి. దీనికి తోడు ఆరు నెలల ముందు నుంచే బుమ్రా ఇంగ్లండ్ పర్యటనలో మూడు టెస్టులే ఆడుతాడు అని మేనేజ్‌మెంట్ ఊదరగొడుతుండగా... రెండో మ్యాచ్‌కు అతడు అందుబాటులో లేకుండా పోయాడు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇప్పటి వరకు టెస్టు మ్యాచ్ గెలిచిన చరిత్రలేని భారత జట్టు... ప్రధాన పేసర్ బుమ్రా లేకుండానే బరిలోకి దిగింది. ఇంకేముంది మరో పరాజయానికి బాటలు పడ్డట్లే అనే ఊహాగానాలు జోరందుకున్నాయి. ఇలాంటి స్థితిలోనే టీమిండియా అద్భుతం చేసింది. మహామహా ఆటగాళ్లకు సాధ్యం కాని ఘనతను ఖాతాలో వేసుకుంది. యువ సారథి శుబ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ చేయడం వల్లే టీమిండియా కొండంత స్కోరు చేసిన మాట వాస్తవమే అయినా... ఆత్మవిశ్వాసం లోపించిన బౌలింగ్ దళంలో జవసత్వాలు నింపిన ఘనత మాత్రం ఆకాశ్‌దీప్‌కే దక్కుతుంది.

బుమ్రా స్థానాన్ని భర్తీ చేయాల్సిన తీవ్ర ఒత్తిడిలో... కొత్త బంతి అందుకున్న ఆకాశ్‌దీప్ తన రెండో ఓవర్‌లోనే ఇంగ్లండ్‌కు 'డబుల్ స్ట్రోక్' ఇచ్చాడు. ఓ చక్కటి బంతితో డకెట్‌ను బుట్టలో వేసుకున్న ఈ బీహార్ పేసర్... తదుపరి బంతికి ఓలీ పోప్‌ను పెవిలియన్ బాట పట్టించి భారత శిబిరంలో ఆనందం నింపాడు. ఈ రెండు వికెట్లలో క్యాచ్‌లు పట్టిన గిల్, రాహుల్‌కు కూడా సమాన పాత్ర ఉన్నా... జట్టులో ఒక్కసారిగా సానుకూల దృక్పథం తీసుకొచ్చింది మాత్రం ముమ్మాటికీ ఆకాశ్‌దీపే. మరో ఎండ్‌లో సిరాజ్ కూడా రాణించడంతో ఇంగ్లండ్ వెనకడుగు వేసినట్లే అనిపించినా... బ్రూక్, స్మిత్ ట్రిపుల్ సెంచరీ భాగస్వామ్యం తిరిగి ఆతిథ్య జట్టును పోటీలోకి తెచ్చింది. ఈ దశలో మరోసారి ఆకాశ్‌దీప్ డబుల్ ధమాకా మోగించాడు. బ్రూక్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన ఆకాశ్‌దీప్... వోక్స్‌కు పెవిలియన్ బాట చూపెట్టాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో అతడి బౌలింగ్ మరింత పదునెక్కింది. నాలుగో రోజు రెండు వికెట్లు తీసిన ఆకాశ్... ఆఖరి రోజు తన బౌలింగ్‌తో ఇంగ్లండ్‌ను బెంబేలెత్తించాడు. వర్షం విరామం అనంతరం కాస్త సీమ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై చక్కటి బంతులతో పోప్, బ్రూక్‌ను అవుట్ చేసి భారత విజయానికి బాటలు వేశాడు. ఈ క్రమంలో కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శనతో అదుర్స్ అనిపించుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఆకాశ్‌దీప్ తీసిన ఐదు వికెట్లు వరుసగా డకెట్, రూట్, పోప్, బ్రూక్, స్మిత్‌వి కావడం అతడి బౌలింగ్ నైపుణ్యాన్ని చాటుతోంది. బుమ్రాలాగా మెరుపు వేగం లేకున్నా... లైన్ అండ్ లెంగ్త్‌తో కూడిన క్రమశిక్షణ కట్టిపడేసింది. తొలి ఇన్నింగ్స్ ప్రదర్శన అనంతరం 'తదుపరి మ్యాచ్‌లో అవకాశం దక్కుతుందో లేదో' అని అనుమానం వ్యక్తం చేసిన ఆకాశ్... రెండో ఇన్నింగ్స్ ప్రదర్శనతో తనను జట్టు నుంచి తప్పించలేని పరిస్థితి కల్పించాడు. ఈ జోరు ఇలాగే సాగిస్తే సుదీర్ఘకాలం అతడు జట్టుకు ప్రాతినిధ్యం వహించడం ఖాయమే!

2 ఇంగ్లండ్ గడ్డపై టెస్టు మ్యాచ్‌లో 10 వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా ఆకాశ్ నిలిచాడు. 1986లో ఇదే మైదానంలో చేతన్ శర్మ కూడా 10 వికెట్లు పడగొట్టాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్ఎస్‌సీ 1340 జూనియర్ ఇంజనీర్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో గ్రూప్–బి (నాన్–గెజిటెడ్, నాన్–మినిస్టీరియల్) స్థాయిలో జూనియర్ ఇంజనీర్(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహిస్తుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1340.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్(సివిల్), జూనియర్ ఇంజనీర్(మెకానికల్), జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్), జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్–మెకానికల్).
» **అర్హత:** సంబంధిత విభాగంలో (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్) డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కొన్ని పోస్టులకు పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 01.01.2026 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. సీపీడబ్ల్యూడీకి చెందిన కొన్ని పోస్టులకు 32 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయో సడలింపు ఉంటుంది.
» **పే స్కేల్:** రూ.35,400 నుంచి రూ.1,12,400.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్షలు(పేపర్–1, పేపర్–2) ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.07.2025
» **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరి తేది:** 22.07.2025.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 01.08.2025 నుంచి 02.08.2025.
» **పేపర్–1 కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు:** 27.10.2025 నుంచి 31.10.2025 వరకు
» **పేపర్–2 కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు:** జనవరి నుంచి ఫిబ్రవరి 2026 మధ్యలో.
» **వెబ్‌సైట్:** https://ssc.gov.in

ఐబీపీఎస్‌లో 1,007 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,007.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ, బీటెక్, ఎల్ఎల్‌బీ, ఎంఏ, ఎంఆర్క్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమా, పీజీడీబీఎం, పీజీడీబీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 20 నుంచి 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.36,000 నుంచి రూ.63,840. డీఏ+హెచ్ఆర్ఏ+ఇతర అలవెన్సులు ఉంటాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.07.2025
» **ప్రిలిమినరీ ఆన్‌లైన్ పరీక్ష:** ఆగస్ట్ 2025.
» **మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్ష:** నవంబర్ 2025.
» **ఇంటర్వ్యూ:** డిసెంబర్ 2025 నుంచి జనవరి 2026.
» **వెబ్‌సైట్:** https://www.ibps.in

టీఐఎస్ఎస్,ముంబైలో వివిధ ఉద్యోగాలు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టీఐఎస్ఎస్) సోషల్ సర్వే రీసెర్చర్, హోమియోపతి/పబ్లిక్ హెల్త్ రీసెర్చర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** సోషల్ సర్వే రీసెర్చర్–01, హోమియోపతి/పబ్లిక్ హెల్త్ రీసెర్చర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.57,150.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.07.2025
» **వెబ్‌సైట్:** https://tiss.ac.in

గెస్ట్ కాలం

ఇంజనీరింగ్ బ్రాంచ్ ఎంపికలో..
విద్యార్థి ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలి

» అన్ని బ్రాంచ్‌లు ముఖ్యమైనవే
» కాలేజీ ఎంపిక అత్యంత కీలకం
» సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి.నరసింహులుతో ప్రత్యేక ఇంటర్వ్యూ

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ (ఈఏపీసెట్) ప్రక్రియ ప్రారంభమైంది. బ్రాంచ్, కాలేజ్ ఎంపికపై విద్యార్థులకు అనేక సందేహాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ఎలాంటి బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాలి, కాలేజీ ఎంపికలో పరిగణనలోకి తీసుకోవాల్సిన ప్రామాణికాలు, భవిష్యత్ అవకాశాలు తదితర అంశాలపై సీబీఐటీ (చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి.నరసింహులుతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..



ప్రొఫెసర్ సి.వి.నరసింహులు, ప్రిన్సిపాల్, సీబీఐటీ

ప్రశ్న: ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు బ్రాంచ్ ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సమాధానం: ప్రతి విద్యార్థి తమకంటూ ప్రత్యేకమైన ఆసక్తులు, నైపుణ్యాలు, ఆలోచనా శైలి, లక్ష్యాలు కలిగి ఉంటారు. విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దే క్రమంలో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, ఉపాధ్యాయులు విద్యార్థి అభిప్రాయాలపై ప్రభావం చూపుతారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, బంధువులు, పరిచయ వర్గాల ప్రేరణ కూడా ఉంటుంది. చాలా మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులు చేస్తున్న ఉద్యోగాల ప్రభావంతోనూ, బంధువుల విజయ గాథలతోను, లేదా సమాజంలో ఆదరణ పొందిన రంగాల పట్ల ఆకర్షణతోనూ ప్రత్యేక బ్రాంచ్‌ల పట్ల ఆసక్తిని పెంచుకుంటారు. ఉదాహరణకు ఒక విద్యార్థి సోదరుడు/సోదరి మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ లేదా గూగుల్‌లో ప్రాజెక్టు లీడర్‌గా పనిచేస్తూ, అమెరికా/కెనడా వంటి దేశాల్లో ఉన్నత వేతనం, మంచి హోదాను కలిగి ఉంటే.. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ లేదా దాని అనుబంధ బ్రాంచ్‌లను ఎంచుకోవాలనుకుంటాడు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో కూడా బ్రాంచ్ ఎంపికలో విద్యార్థి ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలి.

- ముఖ్యంగా బ్రాంచ్ ఎంపికలో విద్యార్థి సామర్థ్యం,అభ్యాస స్థాయిని పరిగణలోకి తీసుకోవాలి.
- గణితం, భౌతిక శాస్త్రంపై పట్టున్న విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఏరోనాటికల్, లేదా సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు తీసుకోవచ్చు. అలాగే లాజికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్ బలంగా ఉన్న విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, దాని అనుబంధ బ్రాంచ్‌లను ఎంచుకోవచ్చు.
- కెమిస్ట్రీ, లేదా బయాలజీపై మంచి పునాది ఉన్న వారు కెమికల్ ఇంజనీరింగ్ లేదా బయోటెక్నాలజీని తీసుకోవచ్చు.
- చివరగా ఎంచుకునే ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో విద్యార్థి నిజమైన ఆసక్తి, సామర్థ్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. బయటి ఒత్తిడి,ట్రెండ్ల కంటే విద్యార్థి కలలు, అభిరుచులు, సామర్థ్యాల ఆధారంగా నిర్ణయం తీసుకోవడమే ఉత్తమమని నా అభిప్రాయం.

ప్రశ్న: మంచి ఇంజనీరింగ్ కాలేజీని ఎలా ఎంచుకోవాలి?

సమాధానం: విద్యార్థి జీవితంలో సరైన కాలేజీని ఎంచుకోవడం అత్యంత కీలక నిర్ణయంగా పేర్కొనవచ్చు. ఈ నిర్ణయం విద్యార్థి కెరీర్ ప్రస్థానాన్ని మాత్రమే కాకుండా, భవిష్యత్ అవకాశాలను కూడా ప్రభావితం చేస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు. కాలేజీ ఎంపికలో ప్రధానంగా ఐదు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. అవి.. ఫ్యాకల్టీ నాణ్యత, మౌలిక వసతులు, ప్లేస్‌మెంట్స్, కాలేజికున్న గుర్తింపు, అదనపు సౌకర్యాలు.

- **ఫ్యాకల్టీ(బోధన సిబ్బంది) నాణ్యత:** ఫ్యాకల్టీ–స్టూడెంట్ నిష్పత్తి ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ఉన్నదా లేదా అనేది పరిశీలించాలి. సాధారణంగా 20:1 నిష్పత్తిలో అంటే.. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఫ్యాకల్టీ ఆ కళాశాలలో పనిచేస్తున్నారా లేదా గమనించాలి. ఈ విధంగా నిష్పత్తి ఉండటం వల్ల విద్యార్థులపై కళాశాల వ్యక్తిగతంగా దృష్టిపెట్టడానికి, మెంటార్‌షిప్‌కు అవకాశం ఉంటుంది. అలాగే పీహెచ్‌డీ అర్హతలున్న ఫ్యాకల్టీ ఉంటే.. సబ్జెక్టులపై లోతైన అవగాహన, పరిశోధనల పట్ల ఆసక్తి, బోధన నాణ్యతను సూచిస్తుంది. అదేవిధంగా పరిశ్రమలో పనిచేసిన అనుభవమున్న ఫ్యాకల్టీ ఉంటే.. పరిశ్రమలో వాస్తవ సంఘటనలను, తమ అనుభవాలను విద్యార్థులకు బోధిస్తారు. అనుభవం కలిగిన బోధన సిబ్బంది ఉండటం వల్ల విద్యార్థికి అవసరమైన మార్గదర్శకత్వం (మెంటార్‌షిప్) నాణ్యత పెరుగుతుంది. ఫ్యాకల్టీ పరిశోధన, కన్సల్టెన్సీ ప్రాజెక్టులు, పబ్లికేషన్స్ వంటి కార్యకలాపాలు విద్యార్థులకు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పిస్తాయి.
- **వసతులు, లెర్నింగ్ రిసోర్సెస్:** ఆధునిక వసతులు కలిగిన తరగతి గదులు, స్మార్ట్ బోర్డులు, ప్రొజెక్టర్లు, ఐసీటీ సౌకర్యాలతో డిజిటల్ లెర్నింగ్‌కు అవకాశం ఉంటుంది. ప్రతి ఇంజనీరింగ్ బ్రాంచ్‌కు అనుగుణంగా పరిశ్రమ ప్రమాణాలకు దగ్గరగా ఉండే ప్రయోగశాలలు ఎంతో ముఖ్యం. అలాగే సెమినార్ హాల్స్, కాన్ఫరెన్స్ హాల్స్, ఆడిటోరియం వంటివి అతిథి ఉపన్యాసాలకు, సాంస్కృతి, సాంకేతిక ఈవెంట్‌లకు అవసరం. అదేవిదంగా క్రీడా సౌకర్యాలు ఉండటం వల్ల విద్యార్థుల శారీరక, సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడతాయి. అంతేకాకుండా కాలేజీలోని గ్రంథాలయంలో పుస్తకాలు, జర్నల్స్, ఈ–బుక్స్, డిజిటల్ డేటాబేస్ వంటి వనరుల గురించి తెలుసుకోవాలి. వైఫై క్యాంపస్‌లో ఉంటే పరిశోధనలు, ఆన్‌లైన్ కోర్సులు, కోడింగ్, ప్రాజెక్టులకు దోహదపడుతుంది.
- **ప్లేస్‌మెంట్స్, పరిశ్రమలతో అనుసంధానం:** ప్లేస్‌మెంట్స్‌లో సగటు ప్యాకేజీ, గరిష్ట ప్యాకేజీ, ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్న ప్రముఖ కంపెనీలు, కోర్ కంపెనీలు, గత కొన్ని సంవత్సరాల ట్రెండ్స్‌ను తెలుసుకోవాలి. అలాగే పరిశ్రమలతో భాగస్వామ్యం ఇంటర్న్‌షిప్ అవకాశాలు, లైవ్ ప్రాజెక్టులు, ప్రీ ప్లేస్‌మెంట్స్ గుర్తించి తెలుసుకోవాలి. అలాగే ప్లేస్‌మెంట్స్ ట్రెయినింగ్, సాఫ్ట్‌స్కిల్స్, మాక్ ఇంటర్వ్యూ సౌకర్యాల ఉన్నాయో లేదో చూడాలి.
- **కాలేజీ రెప్యుటేషన్, రికగ్నిషన్, అక్రిడిటేషన్:** కాలేజీ ఎప్పుడు ఏర్పాటైంది, కాలేజీ ఏర్పాటై ఎక్కువ కాలమైతే పూర్వవిద్యార్థుల నెట్‌వర్క్, పరిశ్రమ సంబంధాలు బలంగా ఉంటాయి. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ఉందా, ఏ బ్యాండ్‌లో ఉంది, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ఉండటం కూడా కాలేజీని ఎంచుకోవడంలో ఒక ముఖ్యమైన ప్రామాణికంగా చెప్పొచ్చు. ఎన్‌బీఏ అక్రిడిటేషన్ అనేది ప్రత్యేక ప్రోగ్రామ్‌కు ఇస్తారు. ఇది ఆ ప్రోగ్రామ్ క్వాలిటీని సూచిస్తుంది. న్యాక్ అనేది కాలేజీకి ఇస్తారు. ఇది మొత్తం కాలేజీ నాణ్యతను సూచిస్తుంది.
- **చివరగా అదనపు సౌకర్యాలు:** క్యాంటీన్ సౌకర్యం, క్రీడల మైదానం, రవాణా సౌకర్యం, అల్యూమ్నీ నెట్‌వర్క్, స్టూడెంట్ క్లబ్స్, ఇండస్ట్రియల్ టూర్స్, ఎడ్యుకేషన్ టూర్స్ అనేవి ఉన్నాయా అనేది గమనించాలి.

ప్రశ్న: భవిష్యత్ ట్రెండ్స్ ఎలా ఉంటాయి?

సమాధానం: రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా అనలిటిక్స్, వర్చువల్ రియాలటీ, ఆగ్యుమెంటెడ్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్, రోబోటిక్స్, ఆటోమేషన్ ప్రభావం పెరుగుతుందనే చర్చ ఉంది. వీటిపైన ఎన్‌పీటీఈఎల్, యూ ట్యూబ్ లెక్చర్స్ వంటి వాటి ద్వారా అవగాహన పెంచుకోవడం మేలు. వాస్తవానికి అన్ని బ్రాంచ్‌లు ముఖ్యమైనవే. కోర్ బ్రాంచ్‌లతోనూ సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్లేస్‌మెంట్స్‌కు హాజరుకావచ్చు. అన్ని బ్రాంచ్‌ల వాళ్లకు ఐటీ రంగంలో ఉద్యోగాలకు అవకాశం ఉంది. సివిల్, మెకానికల్, ఏరోనాటికల్ వంటి కోర్ బ్రాంచ్‌లకు భవిష్యత్‌లో డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. కొత్తగా క్వాంటం కంప్యూటింగ్, క్లౌడ్ వంటి వస్తున్నాయి. టెక్నాలజీ మారుతూ ఉంటుంది. కాబట్టి కాలానికి అనుగుణంగా నూతన నైపుణ్యాలు పెంచుకోవాలి.

పూర్తి ఇంటర్వ్యూ కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- ఇంగ్లిష్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- జీఎస్-ఎన్విరాన్‌మెంట్ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	193	83,433
నిఫ్టీ ▲	56	25,461


విదేశీ సూచీలు			
నాస్‌డాక్	20,601	▲	208
డోజోన్స్	44,829	▲	344
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,823	▼	1
డాక్స్	23,787	▼	147
షాంఘై	3,472	▲	11
నికాయ్	39,810	▲	25

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.00	86.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.30	118.27
€	యూరో	ఎస్‌బీఐ	99.29	102.03
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.42	59.95
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.06	57.27
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.69	69.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.87	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.36	24.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.04	12.87

బ్యాంక్ లాకర్.. ఎంత భద్రం?



చాలా మందికి బ్యాంక్ లాకర్ నమ్మకమైన, భద్రమైన వేదిక. రక్షణ దృష్ట్యా విలువైన డాక్యుమెంట్లు, బంగారం, వెండి, వజ్రాభరణాలను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుస్తుంటారు. కొందరు నగదును కూడా లాకర్లలో పెడుతుంటారు. బ్యాంకు లాకర్లపై కొండంత భరోసాతో ఉండేవారికి యూపీలోని మొరాదాబాద్‌లో 2023లో జరిగిన ఒక ఘటనను గుర్తు చేయాల్సిందే. ఒక మహిళ తన కుమార్తె వివాహ అవసరాల కోసం ఉద్దేశించిన రూ.18 లక్షల నగదును, ఆభరణాలతోపాటు లాకర్‌లో ఉంచగా.. చెదలు ఆ నోట్లను చిత్తు చిత్తు చేసేశాయి. ఈ కేసులో ఆమెకు ఒక్క రూపాయి పరిహారం ముట్టలేదు. అందుకే లాకర్‌ను వినియోగించుకునే ప్రతి ఒక్కరూ ముందుగా నియమ, నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలి. లాకర్‌లో ఉంచిన వాటికి నష్టం జరిగితే బ్యాంక్ బాధ్యత ఏ మేరకు అన్నది స్పష్టత తీసుకోవాలి. అవసరమైతే బీమా రక్షణతో భరోసా కల్పించుకోవాలి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

బ్యాంకు లాకర్లో పెట్టేశాం కదా ఇక నిశ్చింతగా ఉండొచ్చనుకుంటే పొరపాటే. అధిక తేమ లేదా చెదలు లాకర్‌లో ఉంచిన డాక్యుమెంట్లు, కరెన్సీ నోట్లను దెబ్బతీసే అవకాశం లేకపోలేదు. దీనికితోడు వరదల కారణంగా లాకర్లలోకి నీరు చేరొచ్చు. భూకంపం కారణంగా నిర్మాణమే దెబ్బతినొచ్చు. చోరీ, దోపిడీలన్నవి అరుదుగా జరుగుతుంటాయి. ఇలాంటి అన్ని రకాల నష్టాలకూ బ్యాంక్‌లు పరిహారం చెల్లించవన్న విషయం కచ్చితంగా తెలుసుకోవాలి. ''విలువైన వాటిని స్టోర్ చేసుకునేందుకు బ్యాంక్ లాకర్లు భద్రమైన ఎంపికే. కానీ, ఇందులో రిస్క్‌లు కూడా ఉన్నాయి. వీటిని అర్థం చేసుకుని సరైన చర్యలు తీసుకోవడం ద్వారా అందులో ఉంచిన మీ వస్తువులను రక్షించుకోవచ్చు'' అని సాల్వే బిస్సెల్స్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ మేనేజ్‌మెంట్ క్వాంటిటేటివ్ అనలిస్ట్ స్నేహాశిష్‌దాస్ తెలిపారు.

వేటికి పరిహారం..

లాకర్ విషయంలో ఆర్‌బీఐ 2021లో కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. లాకర్లలో ఉంచిన వాటికి నష్టం జరిగితే బ్యాంక్ బాధ్యత ఏ మేరకో ఇందులో స్పష్టత ఇచ్చారు. బ్యాంకుల నిర్లక్ష్యం కారణంగా దొంగతనం, అగ్నిప్రమాదం, భవనం కూలిపోవడం లేదా ఉద్యోగి మోసం కారణంగా లాకర్లలో ఉన్న వాటికి నష్టం వాటిల్లితే పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అది కూడా బ్యాంక్ లాకర్ వార్షిక అద్దె/చార్జీకి గరిష్టంగా 100 రెట్ల వరకే బ్యాంక్‌లు చెల్లిస్తాయి. ఉదాహరణకు బ్యాంక్ లాకర్ చార్జీ ఏటా రూ.5,000 ఉందనుకుంటే.. లాకర్లలో ఉంచిన వాటికి నష్టం జరిగితే బ్యాంక్ గరిష్టంగా రూ.5 లక్షలను చెల్లిస్తుంది. బ్యాంక్‌లు సరైన చర్యలు తీసుకున్నప్పటికీ వరదలు, భూకంపాల కారణంగా లాకర్లలో ఉంచిన వాటికి నష్టం వాటిల్లితే అలాంటి సందర్భాల్లో బాధ్యత వహించబోవని దాస్ తెలిపారు. అంతేకాదు డాక్యుమెంట్లను సరైన భద్రతతో కూడిన ప్యాకేజీతో ఉంచకపోయినా నష్టానికి బ్యాంక్‌లు బాధ్యత తీసుకోవని చెప్పారు. తేమకు దెబ్బతినని, నీటితో తడిసినా దెబ్బతినని పాలిథీన్ బ్యాగుతోపాటు చెదలు పట్టలేని ప్యాక్‌తో రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కస్టమర్ల నిర్లక్ష్యం వల్ల వాటిల్లే నష్టానికి బ్యాంకులు పరిహారం చెల్లించవు. లాకర్‌ను సరైన విధంగా లాక్ చేయకుండా వెళ్లిపోయిన సందర్భాల్లో నష్టానికి కస్టమర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్లాన్ అహెడ్ వెల్త్ అడ్వైజర్స్ సీఎఫ్‌పీ విశాల్ ధావన్ తెలిపారు.

వీటికి అనుమతి..

బంగారం, వెండి, వజ్రాభరణాలు, బంగారం/వెండి వస్తువులు, బంగారం కాయిన్లు, బిస్కెట్లు లాకర్లలో ఉంచొచ్చు. చట్టబద్ధమైన డాక్యుమెంట్లు, బీమా పత్రాలు, వీలునామాలు, ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పత్రాలు, బర్త్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్లు ఉంచొచ్చు. షేరు సర్టిఫికెట్లు, మ్యూచువల్ ఫండ్స్ తదితర పెట్టుబడుల పత్రాలను కూడా భద్రంగా పెట్టుకోవచ్చు. ప్రముఖ బ్యాంక్‌లు లాకర్లలోనూ భిన్న రకాల సైజులను (నాలుగు రకాలు) ఆఫర్ చేస్తున్నాయి. వీటి చార్జీలు, సదుపాయాలు వేర్వేరుగా ఉన్నాయి. తమ అవసరాలకు అనుకూలమైన దాన్ని ఎంపిక చేసుకోవాలి.

లాకర్ ఇన్సూరెన్స్..

లాకర్‌లో ఉంచిన వాటికి నష్టం జరిగితే కొన్ని సందర్భాల్లో బ్యాంకుల నుంచి పరిహారం రాదు. కనుక లాకర్ సదుపాయం వినియోగించే ప్రతి ఒక్కరూ లాకర్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. ఎందుకంటే బ్యాంక్‌లు చెల్లించే పరిహారం సైతం వార్షిక అద్దెకు గరిష్టంగా 100 రెట్లకు మించదు. లాకర్‌లో అంతకుమించి విలువైన వాటిని ఉంచే వారు తప్పకుండా ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవాలి. లాకర్‌లో ఉంచిన వస్తువుల విలువను తెలియజేసే సర్టిఫికెట్‌లు/ధ్రువీకరణలను జాగ్రత్తగా దగ్గర ఉంచుకోవాలి. లాకర్‌లో ఉంచిన వాటి విలువకు తగ్గకుండా బీమా కవరేజీ తీసుకోవాలి. అగ్నిప్రమాదం, చోరీ, ఉగ్రవాదం, ప్రకృతి విపత్తుల కారణంగా లాకర్‌లోని వాటికి నష్టం వాటిల్లితే పరిహారం లభిస్తుంది. లాకర్‌లో విలువైన డాక్యుమెంట్లకు కవరేజీ కోసం రైడర్‌లు తీసుకోవాల్సి ఉంటుంది. లాకర్‌లో ఉంచిన వాటిని నిర్ధారించేందుకు వీలుగా ఫోన్‌లో ఫొటో తీసి పెట్టుకోవడం మంచిది. చాలా కంపెనీలు రూ.3–40 లక్షల మధ్య సమ్ అష్యూర్డ్‌తో లాకర్ ఇన్సూరెన్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి. హోమ్ ఇన్సూరెన్స్‌లోనూ లాకర్‌లో ఉంచిన వాటికి కవరేజీని భాగం చేసుకోవచ్చు. కాకపోతే హోమ్ ఇన్సూరెన్స్ మొత్తం కవరేజీలో లాకర్‌కు సంబంధించి 20% మించదు.

వీటిని ఉంచడం చట్టవిరుద్ధమే..

- ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డ్రగ్స్ నిషేధం. చెడిపోయే పదార్థాలు కూడా ఏవీ ఉంచకూడదు. హానికారకమైనవీ పెట్టకూడదు.
- కరెన్సీ నోట్లను సైతం లాకర్లలో ఉంచకూడదు. ఒకవేళ ఉంచినట్టయితే వాటికి నష్టం వాటిల్లితే బ్యాంకులపై బాధ్యత ఉండదు.
- బ్యాంక్‌లో శబ్ద కాలుష్యానికి దారితీసేవి, బ్యాంక్ లాకర్ల భద్రతకు ముప్పు కలిగించే వాటిని ఉంచడం నిబంధనలకు విరుద్ధం.



భద్రత విషయంలో పూచీ ఉందా?



లాకర్ల భద్రత విషయంలో బ్యాంక్‌లు ఎన్నో రకాల చర్యలు తీసుకుంటూ ఉంటాయి. అయినప్పటికీ అక్కడక్కడ లోపాలకు అవకాశం లేదని భావించకూడదు. లాకర్లను రీన్‌ఫోర్స్‌డ్ స్టీల్‌తో చేయించడమే కాకుండా, భద్రత ఎక్కువగా ఉండే ప్రాంతంలో, యాక్సెస్ పరిమితంగా ఉండే చర్యలు తీసుకుంటాయి. వీటిని సీసీటీవీ కెమెరాలు, అత్యాధునిక అలారమ్ వ్యవస్థలతో పర్యవేక్షిస్తుంటాయి. బ్యాంక్ ఉద్యోగి, కస్టమర్ ఇద్దరి వద్ద ఉండే తాళం చెవులతో (డ్యుయల్ కీ) తెరవాల్సి ఉంటుంది. ఇది కూడా భద్రతా సదుపాయమే. తేమ, చెదలను తట్టుకునే విధంగా అధిక నాణ్యత కలిగిన లాకర్లను కొన్ని బ్యాంక్‌లు వినియోగిస్తున్నాయి. బ్యాంక్‌లు చెదల నివారణకు చర్యలు కూడా తీసుకుంటుంటాయి'' అని దాస్ వివరించారు. బ్యాంక్ వైపు నుంచి భద్రతా పరంగా లోపాలను గుర్తించినట్టయితే వాటిని అధికారుల దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్లడం మంచిదే. ఈ నిర్లక్ష్యం కారణంగా భవిష్యత్తులో తమ లాకర్లలోని వాటికి నష్టం వాటిల్లితే ఆధారంగా పనికొస్తుంది.

కొత్త ఒప్పందంపై సంతకం చేశారా?

కొన్నేళ్ల క్రితం లాకర్ తీసుకుని, 2021 ఆగస్ట్ తర్వాత బ్యాంక్‌తో కొత్త అగ్రిమెంట్‌పై సంతకం చేయని వారు.. వెంటనే ఆ పనిచేయాలి. సవరించిన లాకర్ ఒప్పందాలపై కస్టమర్ల అంగీకారం తీసుకోవాలంటూ ఆర్‌బీఐ నాడు ఆదేశించింది. ఇందుకు గడువును తొలుత 2023 జనవరి 1కి పొడిగించింది. తర్వాత అదే ఏడాది డిసెంబర్ 31 వరకు, తర్వాత 2024 మార్చి 31 వరకు పొడిగించడం గమనార్హం. కానీ, 2025 చివరి వరకు గడువు ఇవ్వాలని బ్యాంక్‌లు కోరుతున్నాయి. లాకర్ ఖాతాదారుల్లో 20 శాతం వరకు ఇంకా ఒప్పందాలపై సంతకాలు చేయకపోవడమే ఇందుకు కారణం. సవరించిన కొత్త లాకర్ ఒప్పందాలపై సంతకాలు చేయకపోతే అప్పటి వరకు లాకర్ వినియోగించుకునేందుకు బ్యాంక్‌లు అనుమతించకపోవచ్చని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి పేర్కొన్నారు. తుది నోటీసు జారీ చేసి, అప్పటికీ కస్టమర్ల నుంచి స్పందన లేకపోతే లాకర్లను సీల్ చేయొచ్చని ప్లాన్‌అహెడ్ వెల్త్ అడ్వైజర్స్ సీఎఫ్‌పీ విశాల్ ధావన్ తెలిపారు. కొత్త లాకర్ నిబంధనల ప్రకారం బ్యాంక్‌లు.. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని కస్టమర్లను కోరొచ్చు. గతంలో ఈ డిపాజిట్ ఎంత మొత్తం అన్న పరిమితి లేదు. ఇప్పుడు లాకర్ మూడేళ్ల అద్దె, కస్టమర్ డిఫాల్ట్ అయితే లాకర్ తెరిచేందుకు అయ్యే చార్జీలకు సరిపడానే డిపాజిట్ తీసుకోవాల్సి ఉంటుంది. కొత్త అగ్రిమెంట్‌కు అయ్యే చార్జీలను బ్యాంకులే భరిస్తాయి.



నామినేషన్ తప్పనిసరి..



లాకర్ తెరిచే సమయంలో సర్వైవర్‌షిప్ క్లాజును నమోదు చేయాలి. లేదా నామినేషన్‌ను అయినా తప్పకుండా నమోదు చేయాలి. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో నామినీని లాకర్ తెరిచేందుకు బ్యాంక్ అనుమతిస్తుంది. ఉమ్మడిగా మరొకరితో కలసి లాకర్ తెరిచినట్టయితే.. ఇద్దరి సంతకాల ఆమోదంతో నిర్వహించే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇలాంటప్పుడు తమ వారసులను నామినీలుగా నమోదు చేయాలి. సర్వైవర్‌షిప్ క్లాజ్ ఎంపిక చేసుకుంటే. ఎనీవన్ లేదా సర్వైవర్ (ఎవరైనా లేక జీవించి ఉన్న వారు) ఆప్షన్ అనుకూలంగా ఉంటుంది. ఇవేమీ లేకుండా లాకర్ తీసుకుంటే.. దురదృష్టవశాత్తూ మరణించిన సందర్భంలో లాకర్‌లో ఉన్న వాటిని పొందడానికి వారసులు ఎంతో శ్రమ పడాల్సి వస్తుంది. మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్, సక్సెషన్ సర్టిఫికెట్ లేదా లెటర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌ను సమర్పించాల్సి వస్తుంది. సాక్షులు, వారసుల సమక్షంలో లాకర్‌లో ఉన్న వాటిని బ్యాంక్ సిబ్బంది నమోదు చేయాల్సి వస్తుంది. కేవైసీ వివరాలతో క్లెయిమ్ సమర్పించాలి. ఈ ప్రక్రియలన్నీ ముగిసి లాకర్‌లో వాటిని పొందేందుకు చాలా సమయం పడుతుంది.

ముందు జాగ్రత్తలు..

- డాక్యుమెంట్లను నీటికి తడవని, అగ్ని ప్రమాదంలో కాలిపోని విధంగా ప్యాక్ చేసి ఉంచుకోవాలి సురక్షితం.
- నోట్లను లాకర్‌లో ఉంచకపోవడం మంచిది. దీనికి బదులు ఎఫ్‌డీ చేసుకోవడం వల్ల రక్షణతోపాటు రాబడి కూడా వస్తుంది.
- లాకర్‌లో ఉంచిన ప్రతీ వస్తువు వివరాలను డైరీలో రాసుకోవాలి. ప్రతీ వస్తువును ఫొటో తీసి పెట్టుకోవాలి.



- అవసరం లేకపోయినా సరే లాకర్‌లో ఉంచిన వాటిని నిర్ణీత కాలానికి ఒకసారి పరిశీలించుకోవాలి. కనీసం ఆరు నెలలకు ఒకసారి అయినా లాకర్‌ను తెరిచి చూడాలి.
- లాకర్‌లో ఉంచే అన్నింటికీ కవరేజీ వర్తించే పాలసీ తీసుకోవాలి.

స్టాక్స్ వ్యూ

ప్రిన్స్ పైప్స్ | బ్రోకరేజ్: కీనోట్ క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 365 టార్గెట్: రూ. 497

ఎందుకంటే: 1987లో ప్రారంభించిన ప్రిన్స్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ లిమిటెడ్ దేశంలోని ప్రముఖ పైపింగ్ సొల్యూషన్ ప్రొవైడర్లలో ఒకటిగా ఎదిగింది. కీలక పాలిమర్ల తయారీ సామర్థ్యంతో వ్యవసాయం, గృహ, ఇతర పారిశ్రామిక రంగాల కోసం సమగ్ర మల్టీ పాలిమర్ పోర్ట్‌ఫోలియో కలిగిన కొద్ది సంస్థల్లో ఒకటిగా నిలిచింది. 2025 నాటికి కంపెనీ దేశవ్యాప్తంగా 8 తయారీ కేంద్రాలను నడుపుతోంది. ప్లాస్టిక్ పైప్స్ పరిశ్రమలో సుమారు 5 శాతం మార్కెట్ వాటాతో ఈరంగంలోని టాప్ 5 కంపెనీల్లో ఒకటిగా కొనసాగుతోంది. బాత్‌వేర్ రంగంలోకి కూడా ప్రవేశించిన కంపెనీ గత ఏడాది ఆక్వెల్ అనే బ్రాండ్‌ను సొంతం చేసుకోవడం ద్వారా ఈ విభాగాన్ని కూడా బలోపేతం చేసింది. అనుబంధ సంస్థల్లో పెట్టుబడులను కొనసాగిస్తోంది. ప్లాస్టిక్ పైపుల తయారీకి వాడే మౌలిక పదార్థాల ధరలు స్థిరపడడంతో అమ్మకాలు పెరుగుతాయని, కంపెనీ రెవెన్యూ లాభదాయకత మెరుగుపడుతుందనే అంచనా మార్కెట్లో నెలకొంది.



ఇన్వెంచరస్ నాలెడ్జ్ | బ్రోకరేజ్: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,597 టార్గెట్: రూ. 1,820

ఎందుకంటే: కంపెనీ ఇటీవల అమెరికాలోని అనుబంధ సంస్థ ద్వారా కొత్త గా ఏర్పాటుచేసిన మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ లో 48 శాతం వాటా కోసం రూ.145 కోట్లు పెట్టుబడి ప్రకటించింది. బ్యాలన్స్ షీట్ ఆధారిత పెట్టుబడుల నుంచి భాగస్వామ్యాల దిశగా మారడం వల్ల ఆర్థికంగా బలపడే అవకాశం ఉంది. కంపెనీ ఇటీవలే మూడు కస్టమర్ ఎంగేజ్‌మెంట్ మోడల్స్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది.వీటి వల్ల ఉన్నతస్థాయి ఎబిటా లాభాల అవకాశం కనిపిస్తోంది.కంపెనీ మార్గదర్శకాలు, పెట్టుబడి శైలి మార్పులు, భవిష్యత్తులో ఉన్నతస్థాయి లక్ష్యాలను సాధించగలదనే నమ్మకాన్ని స్పష్టంగా కలిగిస్తున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై ఫోకస్!	అధిక రాబడులకు మార్గం!

లార్జ్‌క్యాప్ - మిడ్‌క్యాప్‌లో ఏది మెరుగు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను ప్రతి నెలా రూ.5,000 చొప్పున 20 సంవత్సరాల పాటు ఇన్వెస్ట్ చేయడం ద్వారా పెద్ద మొత్తాన్ని సమకూర్చుకోవాలని అనుకుంటున్నాను. దీర్ఘకాలం కోసం మంచి మ్యూచువల్ ఫండ్స్ పథకాలు ఏవైనా ఉన్నాయా? – వాణి

మీ పెట్టుబడులకు తగినంత దీర్ఘకాలం ఉంది. కనుక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మీకు మంచి ఎంపిక అవుతుంది. ఈక్విటీ మార్కెట్లన్నవి ఆటుపోట్లను ఎదుర్కొంటూ ఉంటాయి కనుక మీ సొకర్యానికి అనుగుణంగా మంచి పథకాన్ని ఎంపిక చేసుకోవాలి. మీరు మొదటిసారి ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్‌తో ఆరంభించొచ్చు. పెట్టుబడుల్లో మూడింట రెండొంతులను ఈక్విటీలకు, మిగిలిన ఒక వంతును డెట్ సాధనాలకు ఇవి కేటాయిస్తాయి. ఈక్విటీ విభాగం ఆటుపోట్లను ఎదుర్కొనే సమయంలో డెట్ పెట్టుబడులు కుషన్‌గా పనిచేస్తాయి. అచ్చమైన ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులతో పోల్చి చూసినప్పుడు ఆటుపోట్ల ప్రభావం హైబ్రిడ్ పెట్టుబడులపై తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ దీర్ఘకాలంలో మంచి రాబడులను అందిస్తాయి. నెలకు రూ.5,000 చొప్పున 20 ఏళ్ల పాటు సిప్ చేస్తూ వెళితే 12.18 శాతం రాబడుల ఆధారంగా (గత 20 ఏళ్ల సగటు రాబడి) రూ.51.25 లక్షలు సమకూరుతుంది. పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్) సాధనాలకు కేటాయించుకోవడం ఎంతో అవసరం . ఎందుకంటే మార్కెట్ కరెక్షన్లలో ఇన్వెస్టర్లు ఆందోళనకు గురికావడం సహజం. ఆ సమయంలో నష్టాలకు సైతం ఈక్విటీ పెట్టుబడులు అమ్మేస్తుంటారు. అలాంటి తరుణంలో అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ పెట్టుబడుల విలువ క్షీణతను పరిమితం చేస్తాయి. మార్కెట్ల ఆటుపోట్లను తట్టుకునే సామర్థ్యం ఉన్నవారు.. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌ను సైతం పరిశీలించొచ్చు. ఇవి లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో విభాగంలో పెట్టుబడులను మార్పులు చేర్పులు చేస్తుంటాయి. చారిత్రకంగా చూస్తే వీటి వార్షిక రాబడి గత 20 ఏళ్లలో 12.66 శాతం చొప్పున ఉంది. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ కంటే కొంచెం అదనపు రాబడులను ఇవ్వగలవు.



ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో వేటిని ఎంపిక చేసుకోవాలి. – అనిరుధ్

దీర్ఘకాలంలో ఏ విభాగం అధిక రాబడులను ఇస్తుందన్నది ఊహించడమే అవుతుంది. ముఖ్యంగా ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్నప్పుడు కాలవ్యవధి కనీసం ఐదేళ్లకు తగ్గకుండా చూసుకోవాలి. ఇన్వెస్ట్ చేసిన తొలి ఐదేళ్ల కాలంలోనే మార్కెట్ సైకిల్ (దిద్దుబాటు) ఉండొచ్చు. కొన్ని సందర్భాల్లో లార్జ్‌క్యాప్ కంపెనీలు మంచి పనితీరు చూపిస్తే.. కొన్ని సందర్భాల్లో మిడ్‌క్యాప్ కంపెనీలు మంచి ప్రదర్శన చేస్తాయి. కొన్ని సందర్భాల్లో స్మాల్‌క్యాప్ విభాగం అధిక రాబడులను ఇస్తుంటుంది. కనుక ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచిది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మేనేజర్‌కు ఏ విభాగంలో అయినా ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛ ఉంటుంది. మార్కెట్ సైకిల్‌లో ఒక విభాగం మంచి పనితీరు, మరో విభాగం బలహీన పనితీరు చూపిస్తున్న సందర్భాల్లో ఫ్లెక్సీక్యాప్ పథకం ద్వారా ఆ సైకిల్‌ను చక్కగా అధిగమించగలరు.

ప్రభుత్వ బ్యాంకుల్లో కొలువుల మేళా

- 2025–26లో 50,000 మందికి అవకాశం
- ఒక్క ఎస్‌బీఐ నుంచే 20,000 మంది భర్తీ



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టనున్నాయి. పెరుగుతున్న వ్యాపార కార్యకలాపాలు, విస్తరణ నేపథ్యంలో సుమారు 50,000 మందిని భర్తీ చేసుకోనున్నాయి. ఇందులో 21,000 మంది ఆఫీసర్ స్థాయి వారు కాగా, మిగిలిన వారు క్లర్క్ తదితర ఉద్యోగాలకు సంబంధించి ఉండనున్నారు. ప్రభుత్వరంగంలో 12 బ్యాంకులు ఉండగా, ఒక్క ఎస్‌బీఐనే 20,000 మందికి అవకాశం కల్పించనుంది. ఇందులో భాగంగా ఎస్‌బీఐ ఇప్పటికే 505 మంది ప్రొబేషనరీ ఆఫీసర్లను నియమించుకుంది. అలాగే, 13,455 మంది జూనియర్ అసోసియేట్స్ భర్తీని సైతం చేపట్టింది. శాఖల స్థాయిలో కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు తాజా నియామకాలు చేపట్టినట్టు ఎస్‌బీఐ ప్రకటించడం గమనార్హం. 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలోని శాఖల స్థాయిలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంది. ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగులు 2025 మార్చి చివరికి 2,36,226 మంది ఉన్నారు. ఇందులో 1,15,066 మంది ఆఫీసర్ ర్యాంకుల్లోని వారే. ఉద్యోగుల వలసలను 2 శాతంలోపునకు పరిమితం చేసేందుకు ఎస్‌బీఐ చర్యలు తీసుకుంటుండడం గమనార్హం. ప్రభుత్వరంగంలో రెండో అతిపెద్ద బ్యాంక్ పీఎన్‌బీ సైతం ప్రస్తుత ఆర్థిక సంవత్సంలో రూ.5,500 మందిని కొత్తగా నియమించుకోనుంది. ఈ ఏడాది మార్చి నాటికి పీఎన్‌బీ వ్యాప్తంగా 1,02,746 మంది ఉద్యోగులున్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.4,000 మందిని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నియమించుకోనుంది.

సబ్సిడరీల బలోపేతంపై దృష్టి..

సబ్సిడరీల కార్యకలాపాలను మరింత విస్తరించి, వాటిని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయడం ద్వారా రాబడులు పెంచుకోవడంపై దృష్టి సారించాలని ప్రభుత్వరంగ బ్యాంక్‌లను కేంద్ర ఆర్థిక శాఖ ఇటీవల ఆదేశించడం గమనార్హం. అవసరాలకు అనుగుణంగా సబ్సిడరీ సంస్థల్లో బ్యాంక్‌లు అదనపు పెట్టుబడులు పెడతాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కార్యకలాపాల విస్తరణతో సబ్సిడరీల్లోనూ నియామకాలు పెరిగే అవకాశాలు ఉంటాయని విశ్లేషకుల అంచనా.

యాక్సిస్ సర్వీసెస్ ఆపర్చూనిటీస్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా సర్వీసెస్ ఆపర్చూనిటీస్ ఫండ్ పేరిట ఓపెన్ ఎండెడ్ స్కీమును ప్రకటించింది. ఇది జూలై 18 వరకు అందుబాటులో ఉంటుంది. బ్యాంకింగ్ నుంచి మొదలుకుని ఈ–కామర్స్, ఫిన్‌టెక్, హెల్త్‌కేర్ వరకు వివిధ రంగాల్లో అత్యుత్తమంగా రాణిస్తున్న సంస్థల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. భారీ స్థాయిలో వృద్ధి చెందగలిగి, పెట్టుబడులను సమర్థంగా వినియోగించుకుంటూ, పోటీ సంస్థలతో పోలిస్తే మెరుగ్గా ఉన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడుల వృద్ధి ప్రయోజనాలను కల్పించడం ఈ ఫండ్ ప్రధాన లక్ష్యం. సేవల రంగానికి అనుకూల పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక ప్రగతికి ఇది కీలకంగా ఉంటుందని యాక్సిస్ ఏఎంసీ ఎండీ బి. గోపకుమార్ తెలిపారు.



క్లుప్తంగా...

ఎద్దును ఢీకొట్టిన వందేభారత్ రైలు



ముందు భాగం ధ్వంసమైన వందేభారత్ రైలు

కేసముద్రం: రైల్వేట్రాక్‌పై అడ్డుగా వచ్చిన ఎద్దును వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం–తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం ఏపీలోని విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వైపు వందేభారత్ రైలు వెళుతోంది. ఈ క్రమంలో కేసముద్రం–తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రంగాపురం గేటు సమీపంలో ట్రాక్ దాటుతున్న ఎద్దును రైలు ఢీకొట్టింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృత్యువాతపడగా, రైలు ముందుభాగం (క్యాటిల్ గార్డ్) విరిగిపోయింది. ఈ ఘటనతో అప్రమత్తమైన లోకో పైలెట్ రైలును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ఈ సమాచారం తెలుసుకున్న రైల్వే అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. 20 నిమిషాల అనంతరం రైలును అక్కడి నుంచి పంపించారు.

సినారె జాతీయ పురస్కారానికి అస్సామీ కవి నీలిమ్ కుమార్



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి స్మృత్యర్థం.. సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ ప్రదానం చేసే విశ్వంభర జాతీయ సాహిత్య పురస్కారానికి ఈ సంవత్సరం ప్రముఖ అస్సామీ కవి నీలిమ్ కుమార్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు సి.గంగ, డాక్టర్ జె.చెన్నయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగనున్న డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతి ఉత్సవంలో.. నీలిమ్ కుమార్‌ను రూ.5 లక్షలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానించనున్నట్లు తెలిపారు. 24 కవితా సంపుటాలు వెలువరించిన నీలిమ్ కుమార్.. కుసుమా గ్రజ్ జాతీయ పురస్కారం, ఉదయ భారతి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన కవితలను ఆంగ్లం, స్పానిష్, జర్మన్, ఫ్రెంచ్, హిందీ, నేపాలీ, మరాఠీ, పంజాబీ, బెంగాలీ తదితర అనేక భాషల్లో అనువదించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పాలనా కారణాలతోనే బదిలీ చేయలేదు

ఏళ్ల తరబడి ఒకేచోట సిబ్బంది పని చేస్తుండటంపై దేవాదాయశాఖ వివరణ

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలోని కీలక సెక్షన్‌లలో ఏళ్లుగా పాతుకుపోయిన సిబ్బందికి స్థానచలనం కల్పించకపోవడానికి పరిపాలనాపరమైన అంశాలే కారణమని దేవాదాయ శాఖ పేర్కొంది. గతంలోనే బదిలీల కోసం ప్రతిపాదనలు పంపినా పరిపాలనాపరమైన కారణాలతో ఆ ప్రక్రియ జరగలేదని తెలిపింది. అనుభవజ్ఞులైన సిబ్బంది అందుబాటులో లేకపోవడం కూడా అందుకు మరో కారణమని స్పష్టం చేసింది. దాదాపు ఎనిమిదేళ్లుగా కీలక సెక్షన్‌లలో కొందరు అధికారులు పనిచేస్తుండటం, పనులు జరగాలంటే వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తుండటాన్ని వివరిస్తూ రెండు రోజుల కిందట 'సాక్షి'కథనం ప్రచురించడం తెలిసిందే. దీనికి దేవాదాయ అదనపు కమిషనర్ కృష్ణవేణి పేరుతో కమిషనర్ కార్యాలయం వివరణ ఇచ్చింది. ఆయా అధికారులతోపాటు దేవాలయాల బడ్జెట్ మంజూరుకు డబ్బు వసూలు చేస్తున్న తీరుపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని వివరించింది.

తిరుమలలో ఇకపై రాత్రి భోజనంలోనూ వడలు వడ్డింపు



తిరుమల: అన్నప్రసాద కేంద్రాల్లో ఇకపై రాత్రి భోజన సమయంలో నూ భక్తులకు వడలు వడ్డించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగా ఆదివారం తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో స్వామి, అమ్మవార్ల చిత్రపటం వద్ద వడలను ఉంచి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పూజ నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులకు వడ్డించారు. ఆదివారం నుంచి రాత్రి భోజన సమయంలోనూ భక్తులకు వడలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

రెండ్రోజులు గరుడ సేవ

జూలై 10న గురు పౌర్ణమి, జూలై 29న గరుడ పంచమి సందర్భంగా టీటీడీ రెండుసార్లు గరుడ వాహన సేవ నిర్వహించనుంది. శ్రీ మలయప్ప స్వామివారు గరుడ వాహనంపై నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు గరుడ వాహన సేవ జరగనుంది.

తప్పని తెలిసినా..


ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ కొనసాగింపు

- సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో బానిసలుగా మారుతున్న వైనం
- పందెంరాయుళ్లలో అత్యధికులు 18–25 మధ్య వయస్కులే
- ఇంటర్ వరకు చదివిన వాళ్లే 41.8%
- 'ప్రహార్' సర్వేలో వెలుగులోకి

వయస్సుల వారీగా పంటర్లు.. (శాతాల్లో)	
18-25 మధ్య	45.2
26-30 మధ్య	16.7
31-35 మధ్య	13.8
36-40 మధ్య	11.3
41-50 మధ్య	10
51-70 మధ్య	3







రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌కు బానిసలుగా మారిన వారిలో అత్యధికులకు అది తప్పని తెలిసీ కొనసాగిస్తున్నట్లు వెల్లడైంది. ఇందులో అత్యధిక శాతం యువకులే కావడం గమనార్హం. వీరిలో ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్న వారే ఎక్కువ శాతం ఉన్నారు. సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో బెట్టింగ్‌లు ప్రారంభించి ఆ ఉచ్చులో చిక్కుకుపోతున్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ పబ్లిక్ రెస్పాన్స్ ఎగెనెస్ట్ హెల్ప్‌లెస్‌నెస్ అండ్ యాక్షన్ ఫర్ రెడ్రస్సల్ (ప్రహార్) ఇటీవల ఆరు వారాల పాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సర్వే నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,761 మంది పంటర్లు (పందెం రాయుళ్ల) నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ఈ నేపథ్యంలోనే పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. 'ఫోర్సెస్ డ్రైవింగ్ ఆన్‌లైన్ బెట్టింగ్ అండ్ గాంబ్లింగ్ (ఆన్‌లైన్ బెట్టింగ్‌కు జూదానికి ప్రేరేపిస్తున్న శక్తులు)'పేరుతో ఆరు వారాల పాటు నిర్వహించిన ఈ సర్వే వివరాలను ప్రహార్ గత వారం విడుదల చేసింది. ఇటీవలి కాలంలో అనేక మంది యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌లో నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్నారు. దీంతో ఈ యాప్‌లపై చర్యలు, కట్టడి కోసం ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు విభాగాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ప్రహార్ సంస్థ చేసిన సర్వేకు ప్రాధాన్యత ఏర్పడింది. సర్వేలో వెల్లడైన ముఖ్యాంశాలు..

- ➤ ప్రధానంగా ప్లేస్టోర్, యాప్ స్టోర్స్‌లో ఉన్న యాప్‌లతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టెలిగ్రాం ద్వారా వస్తున్న లింకుల ద్వారా ఈ గేమింగ్, బెట్టింగ్ జరుగుతోంది. పంటర్లలో అత్యధికులు దిగువ మధ్య తరగతికి చెందిన వాళ్లే ఉంటున్నారు. వీరి నెలవారీ వేతనం లేదా జీతం రూ.15 వేల కంటే తక్కువగానే ఉంటోంది.
- ➤ రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌పై నిషేధం ఉంది. దీంతో ఆయా యాప్‌లు చాలావరకు ఇక్కడ పని చేయవు. ఈ కారణంగానే పంటర్లలో 69 శాతం మంది వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్)లు వాడుతున్నారు. ఇవి డౌన్‌లోడ్ చేసుకుంటే ఆయా యాప్‌లు వాడవచ్చు.
- ➤ 95 శాతం మంది తమ గుర్తింపు బయటపడకుండా జాగ్రత్త పడుతూ నకిలీ పేర్లతో ఆడుతున్నారు.

అల్పాదాయ వర్గాల వారే ఎక్కువ..

- ➤ ఇక్కడ నిషేధం ఉన్నప్పటికీ బెట్టింగ్ యాప్‌లతో పాటు లింకుల ద్వారా అందుబాటులోకి వచ్చే సైట్‌లను వినియోగించడం చాలా తేలికని 89 శాతం అభిప్రాయపడ్డారు.
- ➤ 86 శాతం మంది డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బెట్టింగ్, గేమింగ్ వైపు మొగ్గుతున్నారు.
- ➤ 96 శాతం మంది బెట్టింగ్‌పై నిషేధం ఉందని, తప్పని తెలిసీ ఈజీ మనీ (సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశ) కోసం ఈ వ్యసనాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో అన్ని వయస్సులు, రంగాలు, వర్గాల వారు ఉన్నారు.
- ➤ సర్వేలో పాల్గొన్న వారిలో 89 శాతం మంది ప్రతిరోజూ డబ్బు వెచ్చించి ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌లు ఆడుతున్నారు.
- ➤ 56 శాతం మంది ఈ దందాలో ఎదుటివారు సులభంగా డబ్బు సంపాదిస్తున్నారనే భావనతో బెట్టింగ్ కొనసాగిస్తున్నారు. అయితే అత్యధికులు తీవ్రంగా నష్టపోవడం తప్ప లాభపడిన దాఖలాలు లేవు.
- ➤ ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ద్వారా ఆర్జించిన దానికంటే నష్టపోయిందే ఎక్కువని మెజార్టీ పంటర్ల అభిప్రాయం. ఈ పంటర్లలో 79 శాతం కనిష్టంగా రూ.50 వేల కంటే ఎక్కువ నష్టపోయిన వాళ్లే కావడం గమనార్హం.

సాక్షి, హైదరాబాద్

టుడేస్ గ్రాఫిక్

ఏ రాష్ట్రం ఆయుష్షు గట్టిది..

భారత్, వివిధ రాష్ట్రాల్లో సగటు ఆయుర్దాయం వివరాలు ఇలా..

రాష్ట్రం	సగటు ఆయుర్దాయం
కేరళ	74.8
ఢిల్లీ	74.6
జమ్మూ - కాశ్మీర్	74.1
హిమాచల్ ప్రదేశ్	73.6
తమిళనాడు	73
మహారాష్ట్ర	72.5
పశ్చిమ బెంగాల్	72.1
పంజాబ్	70.8
ఉత్తరాఖండ్	70.8
ఒడిశా	70.4
ఆంధ్ర ప్రదేశ్	70.3
తెలంగాణ	70.3
గుజరాత్	70.1
రాజస్తాన్	69.9
కర్ణాటక	69.6
జార్ఖండ్	69.4
బిహార్	69
హర్యానా	68.6
అస్సాం	68.1
మధ్యప్రదేశ్	67.4
ఉత్తర ప్రదేశ్	67.2
ఛత్తీస్‌గఢ్	64.4

భారత్ 69.9



ఆధారం: ఆఫీస్ ఆఫ్ ది రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఇటీవల విడుదల చేసిన 2018–22 గణాంకాలు..

కొలిక్కిరాని పాలిసెట్

▶ మొదటి పేజీ తరువాయి

దీనిపై వివరాలు సేకరిస్తోంది. నిఘా వర్గాలు కూడా అసలేం జరిగిందని వాకబు చేస్తున్నాయి. పాలిసెట్ తొలి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 4వ తేదీన చేపట్టాల్సి ఉంది. ఈలోగా పాలిసెట్ వెబ్ ఆప్షన్ల డేటా మొత్తం ఎరైజ్ అయిన విషయం బయటకు పొక్కింది. దాదాపు 22 వేల మంది విద్యార్థులు పాలిటెక్నిక్ సీట్ల కోసం ఎదురుచూస్తున్నారు.

పదేపదే ఎర్రర్స్

డేటా రికవరీ కోసం సాంకేతిక విద్యా విభాగం శనివారం రాత్రి నుంచి పరుగులు పెడుతోంది. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే ఉద్యోగులను కొన్నాళ్లు ఆఫీసుకు రావద్దని ఆదేశించారు. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం ప్రత్యేక సాంకేతిక బృందాలను రంగంలోకి దించి సాఫ్ట్‌వేర్ పొరపాట్లను గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. డేటాను బ్యాకప్ ద్వారా రికవరీ చేసినప్పటికీ, ఆప్షన్ల విషయంలో సెకన్లలోనే డేటా స్క్రీన్ మీది నుంచి మాయమవుతున్నట్లు తెలిసింది. ప్రాథమిక హార్డ్ డిస్క్‌ల్లో కొన్ని రకాల బగ్స్ ఏర్పడినట్టు తెలిసింది. క్యాంపు కార్యాలయంలోని కంప్యూటర్స్‌లో ఎవరైనా వైరస్ ఉన్న పెన్ డ్రైవ్‌లు వాడితే ఇలాంటి బగ్స్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. లేదా ఆప్షన్ల డేటాను నెట్‌వర్క్ ద్వారా ఇతరులు తమ ఆధీనంలోకి తీసుకున్నా సమస్య రావచ్చని తెలిపారు. ఇలా చేయగలిగే అవకావం కేవలం క్యాంపు కార్యాలయంలోని సిబ్బందికే ఉంటుందని చెబుతున్నారు. ఇది ఎవరు చేశారు? ఎందుకు చేశారు? ఆప్షన్లు తారుమారు చేసే ప్రయత్నాలు జరిగాయా? అనే సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

రంగంలోకి నిఘా వర్గాలు

ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన డేటా రాత్రికి రాత్రే తుడిచి పెట్టుకుపోవడంతో ప్రభుత్వ వర్గాలు షాక్‌కు గురయ్యాయి. దీనిపై ప్రభుత్వం నిఘా వర్గాల సమాచారం కోరినట్టు తెలిసింది. ఇంటెలిజెన్స్ వర్గాలు రాత్రి నుంచి సాంకేతిక విద్య వర్గాల ద్వారా సమాచారం సేకరిస్తున్నాయి. ప్రాథమిక సమాచారాన్ని ఆదివారం ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. మరోవైపు సీట్ల కేటాయింపు ఆలస్యం కావడంపై విద్యార్థుల్లో ఆవేశం కట్టలు తెంచుకుంటోందని నిఘా వర్గాలు అంచనా వేశాయి. పాలిసెట్ క్యాంపు కార్యాలయం ఉండే సాంకేతిక విద్యా విభాగానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు అవసరమని ప్రభుత్వానికి నివేదించాయి. దీంతో సమీప పోలీసుస్టేషన్లతో పాటు, స్పెషల్ బ్రాంచీతో సమన్వయం చేసుకోవాలని అధికారిక ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది.

క్యాంపు అధికారులు ఏం చెబుతున్నారు?

పాలిసెట్ ఫీజుల వ్యవహారమే సీట్ల కేటాయింపు ఆలస్యానికి కారణమని అధికారులు అంటున్నారు. గత ఏడాది నవంబర్‌లో ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల ఫీజులు పెరిగాయి. రూ.15 వేల నుంచి రూ.39 వేల వరకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రభుత్వ కాలేజీల్లో రూ.3,800 మాత్రమే ఫీజు వచ్చింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.15 వేలు ఇస్తుంది. కానీ, మిగిలిన రూ.24 వేలు విద్యార్థులు చెల్లించాలా? ప్రభుత్వమే రీయింబర్స్ చేస్తుందా? అనే విషయంలో స్పష్టత రాలేదని చెబుతున్నారు. దీనికోసమే సీట్ల కేటాయింపు ప్రక్రియ ఆలస్యమవుతోందని అంటున్నారు. ఇదే నిజమైతే ప్రభుత్వ పెద్దలకు ఈ విషయం తెలియదా? అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ఎట్టకేలకు ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లకు మోక్షం

- సీట్లు, కాలేజీలు, బ్రాంచీల వివరాలు విడుదల
- కన్వీనర్ కోటా సీట్లు 76,795
- కొత్త సీట్లకు అనుమతించని ప్రభుత్వం
- కౌన్సెలింగ్ పరిధిలోకి 171 కాలేజీలు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. విద్యార్థులు ఆప్షన్లు ఇవ్వడానికి వీలుగా కాలేజీలు, సీట్లు, బ్రాంచీల వివరాలను ఎప్‌సెట్ క్యాంప్ ఆఫీసు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. వాస్తవానికి ఈ ప్రక్రియ ఆదివారం ఉదయం నుంచే ప్రారంభం కావాలి. కానీ రాత్రి 7 గంటలకు అప్‌లోడ్‌వేసే ప్రక్రియ పూర్తయింది. దీంతో సోమవారం నుంచి వెబ్ ఆప్షన్ల నమోదుకు విద్యార్థులు మొగ్గు చూసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని 171 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నాయి. మొత్తం 1,07,218 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 70 శాతం.. అంటే 76,795 సీట్లు కన్వీనర్ కోటా కిందకు వస్తాయి. మిగతావి యాజమాన్య కోటా కింద భర్తీ చేస్తారు. దాదాపు 68 శాతం వరకూ కంప్యూటర్, దాని అనుబంధ ఎమర్జింగ్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయి. కోర్ గ్రూప్‌లో గత ఏడాది కొన్ని కాలేజీలు సీట్లు తగ్గించుకున్నాయి. ఇవి 7 వేల వరకూ ఉంటాయి. వీటి స్థానంలో కంప్యూటర్ బ్రాంచీల్లో సీట్లు పెంచమని కోరాయి. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతి లభించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సీట్ల పెంపునకు అనుమతించలేదు. జేఎన్‌టీయూహెచ్ పరిధిలో రెండు కాలేజీలు డీమ్డ్ హోదా పొందితే, ఒక కాలేజీ మూసివేతకు వెళ్లింది. అయితే, పాలమూరు, శాతవాహన, కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ పరిధిలో మూడు కొత్త కాలేజీలు పెరిగాయి.

- యూనివర్సిటీల అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీలు.. యూనివర్సిటీ కాలేజీలు, ప్రైవేటు వర్సిటీల్లో సీట్ల వివరాలు.. (రెండు ప్రైవేటు వర్సిటీల్లో 1,800 సీట్లు ఉంటాయి. ఇందులో 1,260 సీట్లు కన్వీనర్ కోటా కిందకు వస్తాయి).

యూనివర్సిటీ	కాలేజీలు	మొత్తం సీట్లు	కన్వీనర్ కోటా
ఉస్మానియా	14	10,230	7,161
జేఎన్‌టీయూహెచ్	130	87,804	61,463
కాకతీయ	4	1,576	1,103
ప్రభుత్వ,	23	7,608	7,608
ప్రైవేటు వర్సిటీలు			
మొత్తం	171	1,072,18	76,795

ప్రధాన బ్రాంచీల్లో సీట్లు..

బ్రాంచీ	సీట్లు
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్	1,235
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్	858
సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ)	1,439
సీఎస్ఈ (డేటాసైన్స్)	6,996
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)	26,150
ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్	12,495
ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ)	10,125
ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ)	4,301
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)	3,681
మెకానికల్ ఇంజనీరింగ్	2,994
సివిల్ ఇంజనీరింగ్	3,129

ఇక శత్రు డ్రోన్లు ధమాలే..

మానవ రహిత వైమానిక వాహనాలైనా జలసమాధే



- అత్యాధునిక యాంటీ డ్రోన్ వ్యవస్థకు హిందుస్థాన్ షిప్ యార్డ్ శ్రీకారం
- పెంటగాన్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం
- యుద్ధ నౌకలపై శత్రు డ్రోన్లని పసిగట్టే సముద్ర భద్రత, కమ్యూనికేషన్ వ్యవస్థ
- 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నా పసిగట్టే రియల్ టైమ్ డిటెక్షన్ ట్రాకింగ్

సాక్షి, విశాఖపట్నం: సముద్ర జలాల్లో శత్రుదేశాల డ్రోన్లు, మానవ రహిత వైమానిక వాహనాలు కనిపిస్తే వెంటనే జలసమాధి చేసే వ్యవస్థకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ పదును పెడుతోంది. ఇటీవల దాయాది దేశం పాకిస్థాన్ భారత్‌పై డ్రోనాస్త్రాలు సంధించగా వాటిని తుత్తునియలు చేసిన విషయం తెలిసిందే. దీనిని ఆదర్శంగా తీసుకుని సముద్ర జలాల్లో శత్రుదేశాల మానవ రహిత వైమానిక వాహనాలు దూరంలో ఉన్నప్పుడే పసిగట్టి.. వాటిని జల సమాధి చేసే యాంటీ డ్రోన్ వ్యవస్థని యుద్ధ నౌకల్లో ఏర్పాటుకు హిందూస్థాన్ షిప్‌యార్డు పెంటగాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఆదివారం ఒప్పందం కుదుర్చుకుంది. షిప్‌యార్డు సీఎండీ కమొడర్ హేమంత్ ఖత్రీ నేతృత్వంలో పీఆర్‌ఎస్ సంస్థ ఎండీ డాక్టర్ స్వామినాథన్ మణికందన్, షిప్‌యార్డు డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న హెచ్ఎస్ఎల్ సీఎండీ, పీఆర్ఎస్ ఎండీ, అధికారులు

30 కి. మీ దూరంలోనే పసిగట్టేలా..

ప్రస్తుతం కొన్ని యుద్ధ నౌకల్లో షార్ట్ రేంజ్ కమ్యునికేషన్ సిస్టమ్ అమల్లో ఉంది. వీటి ద్వారా నాలుగు లేదా ఐదు కిలోమీటర్ల దూరంలో డ్రోన్లు, మానవ రహిత విమానాల్ని పసిగట్టి సమాచారాన్ని ప్రధాన కేంద్రానికి అందిస్తుంటాయి. కానీ.. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందంతో అధునాతన యాంటీ డ్రోన్ వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది.

యుద్ధ నౌకలకు డ్రోన్ ముప్పు ఉండదిక



సముద్ర జలాల్లో పహారా కాస్తున్న యుద్ధ నౌకలకు ఈ ఒప్పందం ద్వారా సమగ్ర రక్షణ లభిస్తుంది. దీర్ఘ శ్రేణి కమ్యూనికేషన్ వ్యవస్థని త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నాం. రక్షణ రంగ సాంకేతికతలో షిప్‌యార్డు భాగస్వామ్యం మరింత పెరుగుతోంది. వచ్చే త్రైమాసికంలో ఇంటిగ్రేషన్ ట్రయల్స్‌ని ప్రారంభిస్తాం. తర్వాత తొలి విడతలో ఫ్రంట్‌లైన్ యుద్ధ నౌకల్లో ఈ రియల్ టైమ్ డిటెక్షన్ ట్రాకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తాం.

– కమొడర్ హేమంత్ ఖత్రీ, సీఎండీ, హెచ్ఎస్ఎల్

ప్రత్యేకతలివీ

- రియల్‌టైమ్ డిటెక్షన్ ట్రాకింగ్ ద్వారా 30 కిలోమీటర్ల దూరంలోని డ్రోన్లనూ సులువుగా గుర్తించవచ్చు.
- ఒక్క అడుగు కూడా కదలనియ్యకుండా ధ్వంసం చేయొచ్చు.
- 400 ఎంహెచ్‌జెడ్ 6గిగా హెర్ట్జ్ స్పెక్ట్రమ్ పరిధిలో ఉన్న యుద్ధ నౌకలు, నౌకాదళ కేంద్రాలకు ఈ యాంటీ డ్రోన్ వ్యవస్థ శత్రుదేశాల సమాచారాన్ని క్షణాల్లో చేరవేస్తుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మఠాలకు ముప్పు

- కనుమరుగవుతున్న మఠాలు
- వేల ఏళ్ల సంస్కృతి నేలపాలు
- కొలనుపాక సోమేశ్వరాలయంపై నిర్లక్ష్యం
- ప్రభుత్వం చొరవ చూపాలంటున్న భక్తులు



పురావస్తు శాఖ వారు తొలగించిన మఠం పైకప్పు



మఠంలోంచి తొలగించి ఆరు బయట ఉంచిన గణనాథుని విగ్రహం

సాక్షి, యాదాద్రి: వందల ఏళ్ల నాటి అపురూప ఆలయ సంపద ఆలనాపాలనా లేక ధ్వంసమవుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకలో వీరశైవ మతానికి చెందిన శ్రీచండీకాంబసహిత సోమేశ్వరాలయం ఉంది. వీరశైవ పంచపీఠాల్లో కొలనుపాక ఒకటి. రేణుక సిద్ధుని జన్మభూమిగా ప్రసిద్ధి. ఈ ఆలయ ప్రాంగణంతోపాటు.. గ్రామంలో పలుచోట్ల 22 కులాలకు సంబంధించిన మఠాలు ఉన్నాయి. వీటిలో కొన్ని పూర్తిగా కనుమరుగవగా, మరికొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. కొన్ని కులాలు.. తమ మఠాలను అభివృద్ధి చేసుకుంటుండగా.. నిరుపేద కులాలకు చెందిన మఠాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మఠాల అభివృద్ధి పన్నెండేళ్లుగా పూర్తి కాలేదు. దీంతో శిథిల చరిత్రకు నిలయంగా సోమేశ్వర దేవాలయ ప్రాంగణం నిలుస్తోంది.

మఠం అంటే..

మత ధర్మ నిష్ఠాపరుడై సద్భక్తి, వైరాగ్యంతో వీరుడనిపించుకొనడమే వీరశబ్దం అర్థం. 12వ శతాబ్దపు ఉత్తరార్థంలో కన్నడ దేశపు కాలాచురి రాజైన బిజ్జలుని మంత్రి బసవనితో వీరశైవం వ్యాప్తి పొందింది. అంతకు ముందే ఆరాధ్య శైవం వ్యాప్తిలో ఉండేది. వీరశైవం ఆంధ్రదేశంలో ప్రవేశించి రాజుల ఆదరణ పొందింది. కాకతీయ రాజుల కాలంలో వీరశైవం మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లిందని చరిత్ర పరిశోధకులు చెబుతారు. కాకతీయ రాజుల కాలంలో అనేక శైవ దేవాలయాలు నిర్మితమయ్యాయి. శైవ పీఠాలు, మఠాలు.. రాజుల సహాయ సహకారాలతో ఏర్పడి ప్రజాదరణ పొందాయి. అట్టడుగు వర్గాలలో వీరశైవం వ్యాప్తి పొందింది. వీరశైవం విజృంభించిన తర్వాత.. కొలనుపాకలో ప్రతి కులానికి ఒక మఠం ఏర్పడింది. వీరశైవులు తమ మతాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అష్టాదశ వర్గాల వారికి శివాలయాలు నిర్మించి ప్రజల మన్ననలు పొందారు.

మఠాల ప్రాధాన్యం

మఠం అంటే.. మతపరమైన విద్యాబోధన కేంద్రం. విద్యాలయం. సన్యాసులు నివసించే ప్రాంతాలని, దేవాలయాలని అనేక అర్థాలున్నాయి. మఠాలు దేవాలయాలకు అనుబంధంగా ఉంటాయి. దేవాలయాలన్నీ ఆధ్యాత్మిక జీవనం గడిపే సద్వర్తనులైన ఆచార్యుల నిలయాలు. వీటికి అనుబంధంగా ఉండే మఠాల్లో.. ఆచార్యులు విద్యార్థులకు విద్యాబోధన చేస్తుండేవారు. మఠాచార్యులు అన్ని శాస్త్రాలలో ప్రవీణులుగా ఉండేవారు. పదో శతాబ్దంలో కాలాముఖ శైవాచార్యులు మఠాలను ఏర్పాటు చేసి.. ఆధ్యాత్మిక జీవనం గడుపుతూ శిష్యులకు విద్యాబోధన చేస్తుండేవారు. ఎందరో రాజులు కాలాముఖ శైవ గురువులను రాజగురువులుగా ఆదరించి పోషించారు. సాంఘికంగా వీరికి చాలా విలువ ఉండేది. వీరు చెప్పిందే వేదం. రాజు నుంచి బంటు వరకు మఠాచార్యుల ఆజ్ఞలను పాటిస్తూ గౌరవిస్తుండేవారు. సంఘాన్ని శాసించే కేంద్ర బిందువుగా మఠాచార్యులుండేవారు. ఈ మఠాలన్నీ 10వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు గొప్ప స్థితిలో ఉన్నాయి. మఠాలన్నీ విద్యా కేంద్రాలుగానే కాకుండా సాంస్కృతిక కేంద్రాలుగా ఉండి.. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ఆధ్యాత్మిక జీవనాన్ని అలవాటు చేయడానికి దోహదపడుతుండేవని పరిశోధకుల అభిప్రాయం.

కుల ప్రాతిపదికన..


కొలనుపాకలో కుల ప్రాతిపదికతో ఏర్పడిన 22 మఠాలున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ ఇన్ని కుల మఠాలు ఒక్క దగ్గర లేవు. ఇది కొలనుపాకకు ఉన్న ప్రత్యేకత. శ్రీశైలంలో 13 మఠాలున్నట్లు సాహిత్య, శాసనాల ద్వారా తెలుస్తోంది. కాలముఖ మఠాలు 2, వీరశైవ మఠాలు 3, గోళకీ మఠాలు 4, ఆరాధ్య మఠాలు 1, ఇతర మఠాలు 3 శ్రీశైలంలో ఉన్నాయి. కానీ కొలనుపాకలో ప్రతి కులానికి ఒక మఠం ఉంది. వీరశైవం బాగా వ్యాప్తి చెందాలంటే ప్రతి కులంలో ఉన్న వ్యక్తులకు శైవదీక్ష ఇప్పించాలి. కులప్రాతిపదికగా మఠాలు ఏర్పాటు చేస్తే.. అది సాధ్యమవుతుందనే ఉద్దేశంతో కులానికి ఒక మఠం ఏర్పాటు చేశారు.

ప్రతి మఠంలో నంది, శివలింగం

కొలనుపాకలోని ప్రతి మఠం దాదాపు అలంకారాలు లేకుండా నిర్మితమయ్యాయి. ప్రతి ఆలయంలో శివలింగం, నంది తప్ప వేరే అలంకారాలు లేవు. ప్రతి కులం వారు పండుగ రోజుల్లో.. శివరాత్రి రోజు తమ తమ మఠాలను అలంకరించుకుని పూజలు జరుపుకొంటారు. కొలనుపాకలో 18 కులాల వారికి గురువులున్నారు. మఠాల దగ్గర పండుగ రోజుల్లో ఆయా కుల పురాణాలు పఠిస్తుండేవారు. ఆ జానపద గాయకులను ప్రతి కులం వారు ఆదరించి పోషించారు. ప్రతి కుల పురాణంలో కేంద్ర బిందువు వీర శైవమే. అన్ని కులాలకు తమ కులమే మూలమని ప్రతి కుల పురాణాల ఇతివృత్తాలలో కనిపిస్తుంది. సోమేశ్వరస్వామి ఆలయ సింహద్వారం వద్ద ప్రమాణ మండపం ఉంది. తగాదాలలో ప్రమాణాలు చేయాల్సి వస్తే ఈ మండపం దగ్గరికి వచ్చి ప్రమాణం చేస్తుంటారు. ఈ మండపంలో అబద్ధాల ప్రమాణాలు చేస్తే అరిష్టం కలుగుతుందని ప్రజల విశ్వాసం.



మఠం అభివృద్ధి కోసమంటూ.. ఆరుబయట ఉంచిన శివలింగాలు, రాతి ప్రతిమలు



మఠం ముందు రెండు నంది విగ్రహాలు



పురావస్తు శాఖ వారు ఆరుబయట ఉంచిన మఠం రాతి స్తంభాలు

కొలనుపాకలోని మఠాలివే..

వైశ్యమఠం, గాండ్ల మఠం, కాపుల మఠం, గొల్ల మఠం, కుర్మ మఠం, గౌండ్ల మఠం, మేర మఠం, పద్మశాలి మఠం, మేదరి మఠం, జాంద్ర మఠం, చాకలి మఠం, మంగలి మఠం, కుమ్మరి మఠం, వడ్డెర మఠం, మహమ్మాయి మఠం, మాల మఠం, మాదిగ మఠం, చిప్ప మఠం, సంగరి మఠం, పెరెక మఠం, శంబరి మఠం, తెనుగు మఠం ఉన్నాయి.



బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బీసీలకు మోదీ ఏం చేశారు?

మాజీ ఎంపీ వీహెచ్



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీ.. దేశంలోని ఓబీసీల కోసం ఏం చేశారో చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. ఓబీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అయనను పలుమార్లు కలిసి కోరినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీల అభ్యున్నతికి ఈనెల 15వ తేదీన కర్ణాటకలో జరగనున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుల సమావేశానికి కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తనను ఆహ్వానించారని చెప్పారు. బీసీ బిల్లు కోసం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత రైల్‌రోకో ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించినట్టు వీహెచ్ వెల్లడించారు.

పర్యావరణ హితుడు.. బలరాముడు

- ఆరేళ్లలో 19,570 మొక్కలు నాటిన సింగరేణి సీఎండీ బలరాం
- గంటలో 1257 మొక్కలు నాటి రికార్డు
- ఎక్కడ పర్యటించినా మొక్కలు నాటాల్సిందే..



మొక్కలు నాటుతున్న బలరాం

గోదావరిఖని: పచ్చదనంతోనే పర్యావరణం మెరుగుపడుతుంది.. మొక్కలు నాటితేనే స్వచ్ఛమైన సమాజం ఏర్పడుతుంది.. ఇది త్రికరణశుద్ధిగా నమ్మడమే కాదు.. ఆచరణలో చూపిస్తున్నారు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం. పర్యావరణ ప్రేమికుడిగా మొక్కలు నాటుతూ.. సమాజానికి పచ్చదనం ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నారు. హోదాను పక్కనబెట్టి టీ షర్ట్, షార్ట్ ధరించి.. పార చేతబట్టుకుని విరివిగా మొక్కలు నాటుతూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఐఆర్‌ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్) నుంచి 2018 డిసెంబర్‌లో సంస్థలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా విధుల్లో చేరిన ఆయన.. 2019 జూన్ నుంచి మొక్కల పెంపకంపై దృష్టి సారించారు. ఆరేళ్లలో 19,570 మొక్కలు నాటడం విశేషం. ట్రీమ్యాన్ అవార్డు, గ్రీనరీ అవార్డులను కూడా అందుకున్నారు.

అటవీ విస్తీర్ణం పెంచాలని..

రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచాలన్న మహాయజ్ఞంలో బలరాం భాగం కావాలనుకున్నారు. వర్షాకాలం వస్తే చాలు.. మొక్కలు నాటడాన్ని సవాల్‌గా స్వీకరిస్తున్నారు. ఇలా ఆరేళ్లలో 19,570 మొక్కలు నాటి గ్రీన్‌చాలెంజ్ విసురుతున్నారు. భారీ వర్షానికి వెరవకుండా.. సింగరేణి ఓసీపీ వన్ డంప్‌యార్డుపై సొంతంగా మొక్కలు నాటడం విశేషం. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఒకప్పుడు 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు చేరుకోగా.. సింగరేణి చేపట్టిన పచ్చదనంతో 45 డిగ్రీలకు తగ్గిందని బలరాం స్పష్టం చేశారు. పచ్చని చెట్లే కాకుండా, పండ్లనిచ్చే చెట్లను నాటి.. చుట్టు పక్కల గ్రామాలకు ఉచితంగా అందిస్తామని తెలిపారు.

పర్యావరణ దినోత్సవం రోజే అంకురార్పణ

2019 జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా.. మొదట సింగరేణి ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలోని బంగ్లాస్ ఏరియాలో.. బలరాం 105 మొక్కలు నాటి తనలోని పర్యావరణ సంకల్పాన్ని చాటారు. శ్రీరాంపూర్‌లోని భూమికి 180 అడుగుల ఎత్తులో ఉన్న ఓసీపీ ఓబీ కుప్పలపై 2019 జులై 20వ తేదీన జరిగిన మెగా హరితహారంలో పాల్గొని.. గంటలో 1237 మొక్కలను నాటి అందరినీ అబ్బురపరిచారు. అన్ని మొక్కలు నాటి కూడా.. తన రోజువారీ విధులకు హాజరయ్యారు. శ్రీరాంపూర్‌లో ఆయన సాధించిన రికార్డు హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులోకి ఎక్కింది.

మియావాకీ పద్ధతిలో చిట్టడవులకు శ్రీకారం..

జపాన్‌లో ప్రాచుర్యం పొందిన మియావాకీ పద్ధతిలో మొక్కల పెంపకాన్ని బలరాం ప్రయోగాత్మకంగా ఇల్లందు, భూపాలపల్లి ఏరియాలో ప్రారంభించారు. ఆయన నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో.. అందులో పక్షులు గూడు కట్టుకొని ఉంటున్నాయి. భూపాల్‌పల్లి, శ్రీరాంపూర్ ఏరియాలో నాటిన మొక్కలు చిన్నపాటి వనాన్ని తలపించేలా పెరగడం విశేషం.

పర్యటించిన ప్రతీ దేశంలో..

సింగరేణి సీఎండీ బలరాం అధికారికంగా పర్యటించిన ప్రతీ దేశం, అడుగుపెట్టిన ప్రతీ రాష్ట్రంలోనూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు మొక్కలు నాటుతున్నారు. గతంలో ఆస్ట్రేలియాలో పర్యటించినప్పుడు, తాజాగా ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ కార్యాలయాన్ని సందర్శించినప్పుడు అక్కడ మొక్కలు నాటారు.

కూలీ నుంచి ఐఆర్‌ఎస్ వరకు..

బలరామ్‌ది మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లా. తిరుమలగిరికి చెందిన హూన్య, కేస్లీ దంపతుల ఏడుగురు సంతానంలో పెద్దవారు. చిన్నతనంలో ఆర్థిక పరిస్థితుల కారణంగా కూలి పనికి కూడా వెళ్లారు. భవన నిర్మాణ కూలీగా.. హమాలీగా.. రైతు కూలీగా పనిచేసి కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్నారు. పదో తరగతి అనంతరం హైదరాబాద్ వలస వచ్చారు. ఇంటర్మీడియట్ చదువుతుండగా.. ఆయనకు వివాహం కావడంతో గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్‌గా పనిచేశారు. షేరింగ్ ఆటో నడిపారు. చదువుపై ఉన్న ఆసక్తితో పట్టుదలతో శ్రమించారు. అకుంఠిత దీక్షతో 2010లో సివిల్స్‌లో రెవెన్యూ సర్వీసుకు ఎంపికయ్యారు. ముంబైలో ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగంలో డిప్యూటీ కమిషనర్‌గా మొదటి పోస్టింగ్. తెలంగాణలోని ప్రతిష్ఠాత్మక సింగరేణికి సేవలు అందించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలోనూ భాగస్వామి కావాలన్న ఉద్దేశంతో.. డిప్యుటేషన్‌పై డైరెక్టర్ ఫైనాన్స్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు సంస్థ సీఎండీగా సమర్థవంతంగా సంస్థను ముందుకు తీసుకెళ్తున్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్, సౌర విద్యుదుత్పత్తి చేస్తుండగా, రాబోయే రోజుల్లో విండ్, హైడల్ విద్యుదుత్పత్తి దిశగా సంస్థను ముందుకు తీసుకెళ్తున్నారు. రాబోయే రోజుల్లో క్రిటికల్ మినరల్ ప్రాజెక్టును కూడా చేపట్టాలని తీవ్రంగా శ్రమిస్తున్నారు.

పురస్కారాల బలరాం

అందరిలోనూ పర్యావరణ స్పృహను పెంచేందుకు కృషి చేస్తున్న డైరెక్టర్ బలరాం సేవలను గుర్తిస్తూ.. గ్రామోదయ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ వారు గ్రామోదయ బంధు మిత్ర పురస్కారంతో సత్కరించారు. 11,300 మొక్కలు నాటి రికార్డు నెలకొల్పిన సందర్భంగా.. ఆయనకు రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ వనమిత్ర పురస్కారాన్ని అందజేశారు. సమాజ అభ్యున్నతికి నిస్వార్థంగా సేవలు అందించే వ్యక్తులకు.. ప్రముఖ ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ ప్రకటించే ప్రతిష్ఠాత్మక అవర్ నైబర్‌హుడ్ హీరో పురస్కారం కూడా డైరెక్టర్ బలరాంను వరించింది.



అవార్డు అందుకుంటున్న సీఎండీ బలరాం

కొత్త రేషన్ కార్డులు వచ్చేస్తున్నాయ్..!

- ఈనెల 14న సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బహిరంగ సభ
- కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఇప్పటికే 4.41 లక్షల కార్డులు మంజూరు



సాక్షి, యాదాద్రి: కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈనెల 14న సీఎం రేవంత్‌రెడ్డి సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డులతోపాటు, కొత్తగా మంజూరు చేస్తున్న రేషన్ కార్డులన్నింటినీ స్మార్ట్ కార్డుల తరహాలో పంపిణీ చేయనున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి బీపీఎల్, అంత్యోదయ, దారిద్ర్య రేఖకు పైనున్న వారికి వివిధ రంగుల్లో కార్డులు ముద్రించి ఇవ్వనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇంతవరకు కొత్త రేషన్‌కార్డులను ప్రింట్ చేయలేదు. మీసేవ ద్వారా, ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులకు కొత్త కార్డులు ఇవ్వడంతోపాటు, కొత్త సభ్యులను కూడా చేరుస్తున్నారు. రేషన్‌కార్డుల దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోంది. భూభారతి, రెవెన్యూ సదస్సుల పనిభారం పెరగడంతో రెవెన్యూ యంత్రాంగానికి కార్డుల దరఖాస్తుల పరిశీలన ఆలస్యం అవుతోంది. అయితే ఈనెల 10 వ తేదీలోగా కొత్తకార్డుల మంజూరు ప్రక్రియ పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు.

మీసేవ దరఖాస్తులకు కార్డులు

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మీసేవ ద్వారా కొత్త రేషన్‌కార్డుల కోసం 9,59,374 దరఖాస్తులు రాగా ఈ దరఖాస్తుల్లో 30,73,885 యూనిట్లు ఉన్నాయి. వచ్చిన దరఖాస్తుల్లో 4,41,060 రేషన్‌కార్డులు మంజూరు చేశారు. ఇందులో 13,82,569 యూనిట్లను చేర్చారు. కాగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో తక్కువ, సిద్దిపేట, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, నిర్మల్ జిల్లాల్లో అత్యధికంగా రేషన్‌కార్డులు మంజూరు చేశారు.

కొత్త సభ్యుల చేరికలు భారీగానే..

రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేరిక కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. కుటుంబ రేషన్ కార్డులో పేర్లు లేని లక్షలాది మంది సభ్యులు ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నారు. చేర్పుల కోసం 17,12,923 మంది కొత్త సభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 13,94,235 మంది పేర్లు చేర్చడానికి అర్హతగా గుర్తించారు. ఇందులో కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలు ముందున్నాయి. అయితే కొత్తగా సభ్యుల చేరికకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే తల్లిదండ్రుల కార్డులో పేరు ఉన్న వారు అందులోంచి తమ పేర్లను తొలగిస్తేనే కొత్త కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉంది. చాలా మంది పాత కార్డులో పేరు తొలగించడం లేదు. కార్డులో పేరు తొలగిస్తే కొత్తకార్డు వస్తుందో రాదోనన్న భయం వారిని వెంటాడుతోంది.

360 డిగ్రీల కోణంలో పరిశీలన

ప్రజాపాలన దరఖాస్తులను 360 డిగ్రీల కోణంలో ప్రభుత్వం పరిశీలిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా పాలన గ్రామ సభలు ఏర్పాటు చేసి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకుంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 19,32,464 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్ర స్థాయి విచారణ జరిపిన అనంతరం 8,64,606 దరఖాస్తులు అర్హత కలిగినవిగా గుర్తించారు. అయితే వీటిని 360 డిగ్రీల కోణంలో విచారణ జరిపి కార్డులు మంజూరు చేయనున్నారు. ఇంకా 6,98,646 ప్రజాపాలన దరఖాస్తులు విచారణ చేయాల్సి ఉంది. విచారణ పూర్తి చేసినవి 12,33,818 దరఖాస్తులు ఉన్నాయి. అయితే మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి వెంటవెంటనే కార్డుల మంజూరు అవుతుండడంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు మీసేవలో మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు.

రేషన్ కోసం ఎదురు చూపులు


మే 24 తర్వాత మంజూరు అయిన రేషన్ కార్డులకు సన్నబియ్యం విడుదల చేయలేదు. సీఎం రేవంత్‌రెడ్డి తిరుమలగిరి సభలో కొత్త కార్డులకు రేషన్ బియ్యం విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అయితే ఈ సంవత్సరం మే 24వ తేదీలోపు మంజూరైన కొత్తరేషన్ కార్డులకు జూన్, జూలై, ఆగస్టు నెల బియ్యం ఇచ్చారు. తమ కార్డులకు బియ్యం మంజూరు చేయాలని కొత్త లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రకృతి విశ్వరూపం





అల్లూరి జిల్లా ఏజెన్సీలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో సాగు చేపట్టేందుకు గిరిజన రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాలకు సమీపంలోని కొండల మధ్య భూముల గట్లను సరి చేసి నీటిని నిల్వ చేస్తున్నారు. దీంతో ఎటుచూసినా పచ్చని కొండల మధ్య పొలాలు తటాకాలను తలపించేలా నీటితో కనువిందు చేస్తున్నాయి. మధ్యమధ్యలో ప్రవహించే నీటి గలగలలు.. కలుషితం లేని గాలి.. మనసుకు ఎంతో ఆహ్లాదాన్నిస్తున్నాయి. డ్రోన్ కెమెరాతో 'సాక్షి' క్లిక్ చేసిన ఈ అపురూప దృశ్యాలు చూడాలంటే బుంగాపుట్టు పంచాయతీ కొంజిరిగూడ ప్రాంతాన్ని సందర్శించాల్సిందే.
– ముంచంగిపుట్టు



మేఘాల దోబూచులాట

కురిసి మురిపించిన వాన కొద్దిరోజులుగా ముఖం చాటేసింది. గుక్కెడు నీళ్లందక మొలకలు మెడలు వాల్చేశాయి. అన్నదాత ఒళ్లంతా కళ్లుచేసుకుని ఆశగా ఆకాశం వంక చూస్తున్నాడు. పంట చేలతో మేఘాలు దోబూచులాడుతున్నాయి. ఆదివారం పొద్దుగూకే సమయంలో చుట్టంలా వచ్చి దట్టంగా అలముకున్న మేఘాలను చూసి రైతులు సంతోషించారు. అనంతపురం రూరల్ మండలం కొమిరి కమ్మూరు వద్ద ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

క్లుప్తంగా...


కొనసాగుతున్న బర్లీ పొగాకు కొనుగోళ్లు

మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జ్ ఎండీ ఢిల్లీ రావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్నట్లు మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జ్ ఎండీ ఢిల్లీ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 5వ తేదీ వరకు 2,245 బేళ్ల (2,088 మెట్రిక్ టన్నులు) కొనుగోలు చేసి రైతులకు రూ.17.20 కోట్లు చెల్లించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నామని, రైతులు తప్పనిసరిగా సీఎంఏపీపీలో నమోదు కావాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం మాత్రమే ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం అందించి కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. 20 శాతం తేమ, 25 నుంచి 150 కిలోల బరువు ఉండే శుభ్రత కలిగిన బేళ్లను మాత్రమే స్వీకరిస్తామని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలు లేకపోతే బేళ్లను తిరస్కరిస్తామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో బయోమెట్రిక్ నమోదు, క్యూఆర్ కోడ్ ట్యాగింగ్, డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియ సెప్టెంబర్ వరకు కొనసాగుతుందని తెలిపారు.


కాణిపాక బ్రహ్మోత్సవానికి ముహూర్తం ఖరారు

- ఆగస్టు 27వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవం ప్రారంభం
- సెప్టెంబర్ 16తో ముగింపు



కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 27వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వినాయచవితి రోజు నుంచే ఉత్సవాన్ని ప్రారంభించనున్నారు. 28న ధ్వజారోహణం, హంసవాహనం, 29న బంగారు నెమలి వాహనం, 30న మూషికవాహనం, 31న బంగారు చిన్న, పెద్ద శేష వాహనం, సెప్టంబర్ 1వ తేదీన చిలుక వాహనం, వృషభవాహనం, 2వ తేదీ గజవాహనం, 3న రథోత్సవం, 4న తిరు కల్యాణం, 5న ధ్వజారోహణం, ఏకాంత సేవలు జరుగనున్నాయి. ఆపై ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 6వ తేదీ అధికారనంది వాహనం, 7న రావణబ్రహ్మ వాహనం, 8న యాళివాహనం, 9న సూర్యప్రభవాహనం, 10న చంద్రప్రభవాహనం, 11న కల్పవృక్ష వాహనం, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకీ, 14న కామధేను వాహనం, 15న పూలంగిసేవ, 16న తెప్పోత్సవంతో ఉత్సవం ముగియనున్నట్లు ఆలయ ఈవో పెంచల కిషోర్ పేర్కొన్నారు.

చిన్న దుకాణానికి భారీగా విద్యుత్ బిల్లు



మలికిపురం: చిన్న వస్త్ర దుకాణానికి భారీగా విద్యుత్ బిల్లు రావడంతో ఆ యజమాని అవాక్కయ్యాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం గ్రామానికి చెందిన కుంపట్ల యువకుమార్ స్థానిక సెంటర్‌లో ఓ కొట్టు అద్దెకు తీసుకుని చిన్నపాటి వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణానికి ప్రతి నెలా రూ.500 నుంచి రూ.800 మధ్య కరెంటు బిల్లు వచ్చేది. అయితే, జూన్ నెలకు సంబంధించిన భవన యజమాని రామారావు పేరిట తన దుకాణానికి ఏకంగా రూ.3,38,496 బిల్లు వచ్చిందని యువకుమార్ ఆదివారం తెలిపారు. తన దుకాణంలో స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి నేరుగా తన మొబైల్ నంబరుకు బిల్లు వస్తోందని, ఇప్పుడు పెద్ద మొత్తంలో బిల్లు రావడంతో కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేశానని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు కోసం డొంక స్వాహా!

- ప్రతిపాదన పెట్టిన కూటమి ఎమ్మెల్యే బంధువు
- వెంచర్ దారిగా మారనున్న డొంక రోడ్డు
- ఆఘమేఘాలపై కదిలిన ఫైలు
- రూ.10 కోట్ల భూమి రూ.2 కోట్లకే అప్పగింత!
- తమకు దారి లేకుండా చేస్తున్నారంటూ రైతుల ఆందోళన
- డ్రైనేజీని సైతం పూడ్చేస్తున్నారని వదంతులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : మా వెంచర్లకు రోడ్డు వేసుకుంటాం. డొంక రోడ్డును ప్రభుత్వ రేటుకు ఇచ్చేయండంటూ కూటమి ఎమ్మెల్యే సోదరుడు ప్రతిపాదన పెట్టడం.., చినబాబు అంగీకారం తెలపడంతో ఆ భూమికి రెక్కలొచ్చేశాయి. ఆఘమేఘాలపై ఫైలు కదిలింది. తమ పొలాలకు దారి ఉండదని రైతులు అభ్యంతరం చెబుతున్నా రూ. 10 కోట్ల విలువైన భూమిని రూ. 2 కోట్లకే అప్పగించడానికి రంగం సిద్ధమైంది. దీనిపై అభ్యంతరాలు తెలపాలంటూ తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నోటీసులు కూడా అంటించారు.



విల్లాలు కట్టనున్న 100 ఎకరాల భూమి ఇదే



ఈ డొంక రోడ్డునే రియల్ ఎస్టేట్ వ్యాపారికి అప్పగించే ప్రయత్నం చేస్తున్నది...

పొలాల దారి మూసేసి..

గుంటూరు జిల్లా తాడేపల్లిలో రైల్వే ట్రాక్, ఐటీసీ వెనుక ఉన్న 99 ఎకరాల భూమిని 36 మంది రైతులు సంవత్సరాల తరబడి సాగు చేసుకుంటున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సోదరుడు ఇక్కడ గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణానికి 33 మంది రైతుల నుంచి 94 ఎకరాలను సేకరించారు. ఈ వెంచర్ కోసం రైతులు పొలాలకు వెళ్లే డొంక రోడ్డు తీసుకోవడానికి ఎమ్మెల్యే సోదరుడు సిద్ధమయ్యారు. సర్వే నంబర్ 255, 275/1ఎ, 302, 316–1లోని 2.04 ఎకరాల డొంక రోడ్డు భూమిని తమకు కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. ఎల్ ఆకారంలో ఉండే ఈ డొంక రోడ్డు ఒక భాగం పంట పొల్లాలోకి వెళ్తుంది. మరో భాగంలో తాడేపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మురుగు నీరు పోయేందుకు కాలువ ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మార్కెట్ విలువ రూ. 10 కోట్లు ఉండగా, ప్రభుత్వ రికార్డుల్లో ధర రూ.2 కోట్లకు ఎమ్మెల్యే సోదరుడు కోరడం, చినబాబు అండతో ఆ ఫైలు చకచకా కదలడం జరిగిపోయాయి. డొంక రోడ్డు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ పేపరు ప్రకటన ఇచ్చారు. ఎంటీఎంసీ కార్యాలయం, తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం, వార్డు సచివాలయంలో నోటీసు బోర్డుల్లో కూడా ఈ నోటీసులు పెట్టారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. డొంక రోడ్డు వెంచర్లకు ఇస్తే తమ పొలాలకు దారి ఉండదని చెబుతున్నారు. ముఖ్యంగా రైల్వే ట్రాక్‌కు అవల ఉన్న 55 ఎకరాలకు ఇదే దారి. వీటిని వివరిస్తూ, తమ అభ్యంతరాలతో పలువురు రైతులు జిల్లా కలెక్టర్, జేసీ, తాడేపల్లి తహసీల్దార్, ఎంటీఎంసీ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈలోగా ఎమ్మెల్యే సోదరుడు రోడ్డు పనులు వేగంగా చేసుకుపోతున్నారు. మిమ్మల్ని రైల్వే అధికారులు వెళ్లనివ్వడం లేదు కదా ఇక మీకు ఈ దారి ఎందుకు అంటూ ఎమ్మెల్యే సోదరుడు బెదిరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. అధికార పార్టీ వారైనందున తాడేపల్లి రెవెన్యూ అధికారులను మేనేజ్ చేశారని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

డ్రైనేజీనీ కలిపేస్తారా?

తాడేపల్లి తహసీల్దార్ డొంక రోడ్డులో ఒక వైపు మాత్రమే ఉన్న రెండెకరాలను ఎమ్మెల్యే తమ్ముడికి అతి తక్కువ ధరకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తుండగా, ఎమ్మెల్యే తమ్ముడు ఏకంగా 20 అడుగుల వెడల్పు డొంక, 10 అడుగుల వెడల్పు ఉన్న డ్రైనేజీని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఈ డ్రైనేజీని మూసేస్తే తాడేపల్లి పట్టణం సలాం హోటల్ సెంటర్, ముగ్గురోడ్డు, పోలకంపాడు నుంచి వచ్చే మురుగు, వర్షం నీరు బయటకు వెళ్లదని, ఇది తాడేపల్లికి ప్రమాదకరమని రైతులు అంటున్నారు. అయినా.. చినబాబు, ఎమ్మెల్యే అండదండలు, అధికారుల దన్నుతో డొంక రోడ్డును వెంచర్ రోడ్డుగా మార్చడానికి రంగం సిద్ధమైపోయింది.



పూడ్చేయనున్న డ్రైనేజీ ఇదే

పడకేసిన పర్యాటకం

- అవకాశాలు అపారం
- పట్టించుకోని ప్రభుత్వం
- కడలిలో కలసిన బీచ్‌ల అభివృద్ధి
- ఆలయ పర్యాటకంపైనా చిన్నచూపు



నీలి సంద్రం.. ప్రకృతి అందం : కాకినాడ బీచ్

పిఠాపురం: ఎగసిపడే అలలతో.. సహజ సౌందర్యానికి నిలయమైన నీలి సంద్రం.. మెత్తని ఇసుక తిన్నెలు.. మనసును పరవశింపజేసే ప్రకృతి అందాలు.. కాకినాడ జిల్లా సాగర తీరానికే సొంతం. ఇక్కడ తీసిన ఎన్నో సినిమాలు సూపర్‌డూపర్ హిట్ అయ్యాయి. సెలవు రోజులు వచ్చాయంటే చాలు.. వేలాదిగా పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు సాగర తీరానికి పోటెత్తుతూంటారు. పర్యాటకాభివృద్ధికి ఇక్కడ ఎన్నో అవకాశాలున్నాయి. ఇటువంటి జిల్లాలో పర్యాటకం కొన్నాళ్లుగా పడకేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

జిల్లావ్యాప్తంగా ఎక్కడెక్కడ బీచ్‌లు అభివృద్ధి చేయవచ్చో అధ్యయనం చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ మేరకు ఫిషరీస్ యూనివర్సిటీ, పర్యాటక, మత్స్యశాఖల ప్రతినిధులతో బృందాన్ని నియమించింది. ఇప్పటికే కాకినాడలో బీచ్ ఉండగా.. జిల్లాలోని మరో 21 ప్రాంతాల్లో పర్యాటకులను ఆకర్షించేలా బీచ్‌లను ప్రత్యేంగా అభివృద్ధి చేయవచ్చని ఆ బృందం గుర్తించింది. ఈ 22 బీచ్‌ల అభివృద్ధికి గత ప్రభుత్వం ప్రతిపాదించింది. దేశంలో 10 బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన బీచ్‌లు ఉండగా.. మన రాష్ట్రంలో విశాఖ రుషికొండ బీచ్ ఆ జాబితాలో స్థానం సాధించింది. అటువంటి బ్లూ ఫ్లాగ్ బీచ్‌ను కోస్టల్ జోన్ రెగ్యులేషన్ నోటిఫికేషన్ ప్రకారం కాకినాడలో ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బ్లూ ఫ్లాగ్ బీచ్‌లకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు కూడా. పర్యావరణం, స్నానపు నీటి నాణ్యత, పర్యావరణ నిర్వహణ, సందర్శకుల భద్రత తదితర 33 ప్రమాణాలకు అనుగుణంగా ఉండే బీచ్‌లకు అంతర్జాతీయ సంస్థ ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్లు ఇస్తుంది. అవిధమైన గుర్తింపు లభిస్తే కాకినాడ సాగరతీరం మరో గోవాను తలపించేలా అభివృద్ధి చెందుతుందని పర్యాటకులు ఆశించారు. దీనివలన స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు సేవలు, పర్యాటక రంగం ద్వారా ప్రభుత్వానికి దండిగా ఆదాయం లభిస్తుందని భావించారు. ఈలోగా గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రావడంతో బీచ్‌ల అభివృద్ధి కడలిలో కలిసిపోయింది. జిల్లాలో ఇప్పటికే ఉన్న పర్యాటక ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేయడంతో పాటు కొత్త ప్రాంతాలను సైతం తీర్చిదిద్ది, మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

ఎన్నో పర్యాటక ఆకర్షణలు

- కాకినాడ నుంచి తుని సమీపంలోని అద్దరిపేట వరకూ ఉన్న సాగరతీరం ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. కాకినాడ వద్ద బీచ్ పార్కు, ఉప్పాడ బీచ్ రోడ్డు ప్రాంతం, అద్దరిపేట వద్ద సాగర తీరం, పంపు హౌస్‌లు పర్యాటక ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. కార్తిక మాసాల్లో ఈ ప్రాంతాలు పిక్నిక్ స్పాట్లుగా కూడా వెలుగొందుతున్నాయి.
- ప్రధానంగా కాకినాడ కేంద్రంగా వాకలపూడి బీచ్ పార్కు, లైట్ హౌస్, కుంభాభిషేకం రేవు, కాకినాడ పోర్టు, ఫిషింగ్ హార్బర్, శిల్పారామం, ఆ పక్కనే గెస్ట్ హౌస్, కాకినాడ శివారు జగన్నాథపురంలో ఫ్రెంచ్, డచ్, బ్రిటిష్ వారు నిర్మించిన చర్చిలు పర్యాటకంగా పేరొందాయి. వీటికి పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది.
- కాకినాడ సమీపంలోని హోప్ ఐలాండ్ సముద్రం మధ్యలో సహజంగా ఏర్పడిన ద్వీపం. ప్రస్తుతం ఇది మంచి పిక్నిక్ స్పాట్‌గా మారింది. ఇక్కడకు వెళ్లేందుకు కాకినాడ హార్బర్, కోరంగి మడ అడవుల నుంచి రవాణా సౌకర్యాలున్నాయి.
- తాళ్లరేవు మండలంలోని మడ అడవులు పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి లొకేషన్లు పర్యాటకులనే కాదు.. సినీ ప్రముఖులను సైతం ఆకర్షిస్తున్నాయి. కడలి కెరటాలు, పచ్చని చెట్లు, ఇసుక తిన్నెలు, మధ్యలో కాలువల వంటి ప్రకృతి అందాలు ఎక్కడో సముద్రం మధ్య ఉన్న దీవులను తలపిస్తూంటాయి.
- ప్రత్తిపాడు మండలంలోని ఎరకంపాలెం శంఖవరం మండలం ఆంధ్రా శబరిమలై తదితర ప్రాంతాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తూటాయి.
- వేల సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన ఆలయాలు, దర్శనీయ ప్రదేశాలు, కొడవలి బౌద్ధ స్థూపాలు, చారిత్రక ప్రాంతాలు జిల్లాలో కొలువై ఉన్నాయి.
- తలుపులమ్మ లోవ, అన్నవరం సత్యదేవుడు, సామర్లకోట భీమేశ్వరస్వామి, పిఠాపురం పాదగయ, పెద్దాపురం మండలం తొలి తిరుపతిలో వెలసిన శృంగార వల్లభ స్వామి, కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారు తదితర ఆలయాలకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తూంటారు.
- దేశవిదేశాల నుంచి జిల్లాకు ఏటా దాదాపు 25 లక్షల మంది పర్యాటకులు వస్తున్నారు.

అభివృద్ధికి గత ప్రభుత్వం ప్రతిపాదించిన బీచ్‌లు

సాగర సంబరాల బీచ్ (బ్లూ ఫ్లాగ్), ఎన్‌టీఆర్, నేవల్ ఎన్‌క్లేవ్, నేమాం బీచ్, హోప్ ఐలాండ్, దానవాయిపేట బీచ్, గడ్డిపేట, అద్దరిపేట, పంపాదిపేట, యర్రయ్యపేట, అన్నయ్యపేట, ఎల్లయ్యపేట, నర్సిపేట, తలపంటిపేట, కె.చోడిపల్లిపేట, కోనపాపపేట, కుంభాభిషేకం, పెరుమాళ్లపురం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్, ఉప్పాడ బీచ్, కోరంగి మడ అడవులు, యానాం బీచ్‌లు.



అద్దరిపేట సాగర తీరంలో ఆకట్టుకునే పంప్‌హౌస్



నడిసంద్రంలో ప్రకృతి సౌందర్యాల ఖని : పర్యాటకులను ఆకర్షించే హోప్ ఐలాండ్ తీరం

ఆస్ట్రేలియాలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు




సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియాలోని అన్ని ప్రధాన నగరాల్లో ఆదివారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ప్రవాస భారతీయులు(ఎన్నారైలు) ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్ మరణం లేని మహనీయుడని, తెలుగు జాతికి ఆయన చేసిన సేవలు ఎప్పుడూ గుర్తుండిపోతాయని ఎన్నారైలు కొనియాడారు. తమలో చాలామంది వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా చదువుకుని ఇక్కడికి వచ్చి సెటిల్ అయ్యామని, తమ జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు వైఎస్సార్ అని గుర్తుచేసుకున్నారు. బ్రిస్బేన్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, నాయకులు ఇరువురి బ్రహ్మారెడ్డి, బొమ్మిరెడ్డి జశ్వంత్‌రెడ్డి, వీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సాగర్, విష్ణు, వంశీ చాగంటి, రామకృష్ణారెడ్డి వల్లూరి, జగ్గవరపు రాకేష్, కోటా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్నవారికి జూమ్ కాల్ ద్వారా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి యశ్వంత్, సీనియర్ నాయకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, కొట్టు సత్యనారాయణ, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కొఠారు అబ్బయ్య చౌదరి, అరే శ్యామల, ఆలూరు సాంబశివారెడ్డి, చల్లా మధుసూదన్‌రెడ్డి, కారుమూరి వెంకటరెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

న్యూజిలాండ్‌లోనూ వైఎస్సార్ జయంతి సంబరాలు



న్యూజిలాండ్‌లోని ప్రధాన నగరాల్లో కూడా ఆదివారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ప్రవాస భారతీయులు ఘనంగా నిర్వహించారు. ఆక్లాండ్‌లోని పిక్లింగ్ కన్వెన్షన్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ న్యూజిలాండ్ కమిటీ కన్వీనర్ బుజ్జిబాబు నెల్లూరి, కో–కన్వీనర్లు ఆనంద్ ఎద్దుల, దేగపూడి సమంత్, సభ్యులు బాలశౌర్య, రాజారెడ్డి, పిల్లా పార్థ, జిమ్మి, గీతారెడ్డి, ఆళ్ల విజయ్, రమేష్ పనటి, సంకీర్త్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యూజిలాండ్ మాజీ మంత్రి మైకేల్ ఉడ్ హాజయ్యారు. ఎన్నారైలు బీరం బాల, కళ్యాణ్‌రావు, కోడూరి చంద్రశేఖర్, అర్జున్ రెడ్డి, మల్లెల గోవర్ధన్, జగదీష్‌రెడ్డి, ఇందిర సిరిగిరి తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



సాక్షి, అమరావతి: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ ఆధ్వర్యంలో లండన్‌లోని ఈస్ట్‌హోమ్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూకే నలుమూలల నుంచి వైఎస్సార్ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి అంబటి రాంబాబు ఆన్‌లైన్‌లో పాల్గొని వేడుకల్లో భాగస్వాములైన వారిని అభినందించారు. వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతా మాట్లాడుతూ.. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని రాజశేఖరరెడ్డి జీవితాన్ని, వారు సాధించిన విజయాలను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మహానేత ఆశయ సాధనకు వైఎస్ జగన్ శ్రమిస్తున్నారన్నారు. నేతలందరూ వైఎస్ జగన్ వెంట నడవాలని, ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ ఓబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యూకే కో–కన్వీనర్ మలిరెడ్డి కిశోర్‌రెడ్డి, కీలక కమిటీ సభ్యులు శ్రీనివాస్ దొంతిబోయిన, ఎన్ఆర్ నందివెలుగు, సురేందర్ రెడ్డి అలవల, బీవీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




లే టూర్

కాశ్మీర్ లోయలో సూర్యోదయం

14 వేల అడుగుల ఎత్తులో పాంగాంగ్ ఉప్ప నీటి సరస్సు. సరస్సు నీటి మీద సూర్యోదయం సూర్యాస్తమాల వీక్షణం. పాకిస్థాన్ సరిహద్దులో భారతదేశ తొలి గ్రామం టర్‌టక్. బుద్ధుని అవశిష్ట స్థాపితమైన ధవళకాంతుల శాంతి స్థూపం. తొమ్మిది అంతస్థుల నిర్మాణం లాంచెన్ పాల్కర్ ప్యాలెస్. సియాచిన్ వార్ మెమోరియల్... హండర్ సాండ్ డ్యూన్స్. ఇవన్నీ లధాక్, లే పట్టణం... ఆ పరిసరాల్లోనే ఉన్నాయి.

1వ రోజు

హైదరాబాద్ నుంచి లే పట్టణానికి ప్రయాణం. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి 6E2056/6821 విమానం ఉదయం 7.45 గంటలకు బయలుదేరుతుంది. మధ్యాహ్నం 12.50 గంటలకు లే కు చేరుతుంది. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చి హోటల్ గదిలో చెక్ ఇన్. లే సముద్రమట్టం కంటే 11,500 అడుగుల ఎత్తులో ఉంది. కాబట్టి మారిన వాతావరణానికి అనుగుణంగా దేహం తనను తాను సరిచేసుకోవడం కోసం ఆ రోజు విశ్రాంతి తీసుకోవడం మంచిది. ఆక్సిజెన్ స్థాయులకు తగినట్లు దేహం సమన్వయం చేసుకోవడానికి సమయం పడుతుంది. వయసులో ఉన్న వాళ్లు త్వరగా అడ్జస్ట్ అవుతారు. వీలయితే మార్కెట్, బజారులో ప్రశాంతవిహారాన్ని ఆస్వాదించవచ్చు. రాత్రి బస లేహ్‌లోనే.




2వ రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత సైట్‌సీయింగ్‌కి బయలుదేరాలి. లే పట్టణంలోని శాంతిస్థూప, లే ప్యాలెస్‌ల సందర్శనం. ఆ తర్వాత 'హాల్ ఆఫ్ ఫేమ్', గురుద్వారా పథేర్ సాహిబ్, మాగ్నటిక్ హిల్, సింధు నది– జన్స్కార్ నదుల సంగమ స్థలి, ఆల్చి మోనాస్ట్రీ దర్శనం తర్వాత తిరిగి లేహ్ పట్టణానికి వచ్చి రాత్రి బస చేయాలి.

శాంతికి ఇందిరా గాంధీ చేయూత

బుద్ధుని అవశిష్టాన్ని ప్రతిష్ఠించి నిర్మించిన స్థూపం ఇది. బౌద్ధం ప్రపంచ శాంతిని కోరుతుంది. లధాక్ కేంద్రపాలిత ప్రాంతం(ఉమ్మడి కశ్మీర్), లే పట్టణంలో బౌద్ధులు శాంతికి చిహ్నమైన ధవళ స్థూపాన్ని నిర్మించాలని తలపెట్టారు. వారికి జపాన్‌లోని బౌద్ధులు ఆర్థిక సహాయం చేశారు. మనదేశంలోని ఇతర రాష్ట్రాల బౌద్ధులు కూడా తమవంతు సహాయం చేశారు. ఈ నిర్మాణాన్ని 1983లో తలపెట్టారు. దారి తోవ లేని ఈ ప్రదేశానికి వాహనాలు వెళ్లడం కోసం రోడ్డు నిర్మాణానికి నిధులను అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ శాంక్షన్ చేశారు. జమ్ముకశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణానికి మెటీరియల్ సమకూర్చింది. బౌద్ధావలంబకులతోపాటు భారత ఆర్మీ జవానులు కూడా ఈ నిర్మాణం కోసం శ్రమదానం చేశారు. ఈ స్థూపం లే పర్యాటకానికి కేంద్రబిందువైంది. ఇక్కడ సూర్యోదయం, సూర్యాస్తమయం అందంగా ఉంటాయి. సూర్యకిరణాలు చుట్టూ ఉన్న మంచు పర్వతాల మీద ప్రతిబింబిస్తూ కళ్లు మిరుమిట్లు గొలుపుతాయి.




లే రాజమందిరం

లే పట్టణంలో ఉంది కాబట్టి లే ప్యాలెస్ అంటారు, కానీ దీని అసలు పేరు లాంచెన్ పాల్కర్ ప్యాలెస్. క్రీ.శ 1600 నాటి నిర్మాణం. బయటి నుంచి చూస్తే రాయి మీ రాయి పెట్టి నిటారుగా ఎటువంటి సృజనాత్మకత లేని నిర్మాణం అనిపిస్తుంది. కానీ లోపల ఉన్న పెయింటింగ్స్ చూస్తే ప్రపంచంలోని క్రియేటివిటీని రాశిపోసినట్లు అనిపిస్తుంది. పెయింటింగ్స్‌లో రంగుల కోసం జాతిరాళ్ల చూర్ణాన్ని అద్దారు. ఇది తొమ్మిది అంతస్థుల రాజమందిరం. కింది అంతస్థుల్లో గుర్రపుశాలలు, ధాన్యం నిల్వ చేసే గదులు. పై అంతస్థుల్లో సెంగె నమ్‌గ్యాల్ రాజ కుటుంబం నివసించేది. డోంగ్రా జాతి ఉద్యమకారులు ప్యాలెస్‌ను ఆక్రమించుకోవడంతో రాజకుటుంబీకులు ఈ ప్రదేశానికి 15 కిలోమీటర్ల దూరాన స్టోక్ అనే ప్రదేశంలో ఉన్న రాజమందిరానికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ ప్యాలెస్ పాడుపడింది. ఇప్పుడు నిర్వహణ బాధ్యతను ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తీసుకుని పునరుద్ధరిస్తోంది. ఈ ప్యాలెస్ నుంచి కశ్మీర్ మంచుకొండలు కనువిందు చేస్తాయి.



3వ రోజు

లే నుంచి నుబ్రాకు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి ఖర్దూంగ్‌లా పాస్ మీదుగా నుబ్రా వ్యాలీ చేరడం. నుబ్రాలో గదిలో చెక్ ఇన్. దీక్షిత్, హండర్ గ్రామాలు, మోనాస్ట్రీల పర్యటన. సాయంత్రం కామెల్ సఫారీని ఆస్వాదించి రాత్రి నుబ్రా వ్యాలీలో బస.





నుబ్రా మంచు పూల పరిమళం

నుబ్రా అంటే పూల లోయ అని అర్థం. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్. ఇలాంటి పూలలోయ ఉత్తరాఖండ్‌లో కూడా ఉంది. ఇది కశ్మీర్‌లోయలోని పూల లోయ. షియోక్ నది– సియాచిన్ (నుబ్రాదగ్గర ఈ నదిని కూడా నుబ్రా నది అనే పిలుస్తారు, ఇదే నదిని టిబెట్లో యర్మా నదిగా పిలుస్తారు) నది కలిసే ప్రదేశంలో విస్తారమైన లోయ ఉంది. మనుష్యసంచారం ఉండని ఆ లోయ రకరకాల పూల చెట్లకు ఆలవాలమైంది. పదివేల అడుగుల ఎత్తులో ఒక లోయ, ఆ లోయలో పూలు... ఆ ఊహ కూడా అందంగా ఉంటుంది. ఈ లోయకు ఒక వైపు పాంగాంగ్ లేక్ ఉంది. ఒంటి మీద సాగే నుబ్రా పూలతోటలు, హండర్ గ్రామంలోని ఇసుక తిన్నెల విహారం జీవితాంతం గుర్తుండే జ్ఞాపకం.

4వ రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత టర్‌టక్ గ్రామానికి ప్రయాణం. దారిలో సియాచిన్ వార్ మెమోరియల్ దర్శనం, థాంగ్ జీరో పాయింట్ వీక్షణం. మధ్యాహ్న భోజనం టర్‌టక్ గ్రామంలో. బాల్టీ హెరిటేజ్ హౌస్, మ్యూజియం, నాచురల్ కోల్డ్ స్టోరేజ్ ప్లేస్ (ఫ్రీజింగ్ పాయింట్), సాయంత్రం కల్చరల్ షో తర్వాత రాత్రి బస నుబ్రా వ్యాలీలో.



యుద్ధం... మరపురాని జ్ఞాపకం!

సియాచిన్ వార్ మెమోరియల్ సియాచిన్ బేస్ క్యాంపు దగ్గర ఉంది. ఇది దేశం కోసం అసువులు బాసిన సైనికుల జ్ఞాపకార్థం నిర్మించిన కట్టడం. సియాచిన్ గ్లేసియర్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధక్షేత్రం.



ఈ నేల మనదే!

టర్‌టక్ గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇది మనదేశపు చివరి గ్రామంగా గుర్తిస్తారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో టిబెట్ సరిహద్దులో ఉన్న మాణా గ్రామాన్ని కూడా దేశపు చివరి గ్రామంగా గుర్తించేవారు. ఇప్పుడు మాణా గ్రామానికి తొలి గ్రామం హోదా దక్కింది. పాకిస్థాన్ సరిహద్దును తాకుతున్న టర్‌టక్ గ్రామం 1971 యుద్ధంలో భారత్ సొంతమైంది. బాల్టిస్థాన్ రీజియన్‌కు చెందిన ప్రదేశం. టర్‌టక్‌లో నివసించే ప్రజలు కూడా బాల్టి తెగకు చెందిన వారే. షియోక్ నది తీరాన, సియాచిన్ గ్లేసియర్‌కు ముఖద్వారం ఈ గ్రామం. ఒకసారి పాక్ పాలనలోకి వెళ్లి తిరిగి భారత్ సొంతమైన ప్రదేశంగా ఈ మట్టి మీద నడవడం గొప్ప థ్రిల్.

5వ రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ త్వరగా ముగించుకుని హోటల్ గది చెక్ అవుట్ చేసి పాంగాంగ్ కి బయలుదేరాలి. ఆ రోజు పాంగాంగ్ లేక్, పరిసరాల ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ విశ్రాంతి విహారమే. రాత్రి బస కూడా అక్కడే.

యుద్ధక్షేత్రాల సరస్సు



పాంగాంగ్ త్సో అత్యంత విశాలమైన సరస్సు. ఉప్పునీటి సరస్సు. ఏడువందల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం. అంటే దాదాపు హైదరాబాద్ నగరమంత. ఈ సరస్సు యాభై శాతం టిబెట్ పరిధిలో చైనా పాలనలో ఉంది. నలభై శాతం లధాక్ పరిధిలో భారత్ పాలనలో ఉంది. మిగిలిన పదిశాతం మాత్రం భారత్– చైనాల మధ్య వివాదాస్పద ప్రదేశంగా ఉంది. ఈ నీటి స్వచ్ఛతను నీటి అడుగున ఉన్న రాళ్లు చెప్తాయి. నీరు శీతాకాలంలో గడ్డకట్టుకుపోతుంది. బోర్డర్ టూరిజమ్ పేరుతో ఈ ప్రదేశం ఇప్పుడు పెద్ద టూరిస్ట్ స్పాట్‌గా అభివృద్ధి చెందింది. భారత్ రణ్‌భూమి దర్శన్‌లో భాగంగా మిలిటరీ విభాగం యుద్ధక్షేత్రాలు, వార్ మెమోరియల్‌లలోకి పర్యాటకులకు అనుమతిస్తోంది.

6వ రోజు

సూర్యోదయానికి ముందే నిద్రలేచి పాంగాంగ్ సరస్సు మీద సూర్యోదయాన్ని వీక్షించాలి. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి లేహ్‌కు ప్రయాణం. దారిలో థిక్‌సీ మోనాస్ట్రీ, షే ప్యాలెస్, రాంచోస్ స్కూల్ చూసుకుని లేహ్‌కు చేరి హోటల్ గదిలో చెక్ ఇన్ అవ్వాలి. ఆ రోజు సాయంత్రం సరదాగా మార్కెట్ విహారం, షాపింగ్‌లో గడపడమే.

ఈశాన్యంలో సూర్యోదయం

పాంగాంగ్ సరస్సు దాదాపుగా 14 వేల అడుగుల ఎత్తులో ఉంది. ప్రపంచంలో ఎత్తైన ఉప్పు నీటి సరస్సు ఇదే. ఈ సరస్సు తీరాన్నుంచి సూర్యోదయం, సూర్యాస్తమయాలను వీక్షించడం అద్భుతమైన అనుభవం. అయితే సూర్యోదయాన్ని వీక్షించాలంటే ఉదయం ఐదింటికే అక్కడ ఉండాలి. అలాగే సూర్యాస్తమయం కోసం రాత్రి ఏడున్నర వరకు వేచి చూడాలి. మనకు ఉత్తరాయనం, దక్షిణాయనం ఉన్నట్లే ఈ రోజుల్లో సూర్యోదయం ఈశాన్య దిక్కులోనూ, సూర్యాస్తమయం వాయువ్య దిక్కులోనూ జరుగుతుంది.



7వ రోజు

తెల్లవారు జామునే నిద్రలేచి బ్రేక్‌ఫాస్ట్ చేసి లేహ్‌లో గది చెక్ అవుట్ చేసి ఎయిర్‌పోర్టుకు బయలుదేరాలి. 6E6822/6217 విమానం మధ్యాహ్నం 13.30 గంటలకు లేహ్‌లో బయలుదేరి 19.15 గంటలకు హైదరాబాద్‌కి చేరుతుంది.

ప్యాకేజ్ ఇలా ఉంటుంది!


- 'లే విత్ టర్‌టక్ ఎక్స్ హైదరాబాద్ (ఎస్‌హెచ్‌ఏ41)' ఏడు రోజుల టూర్. ఆగస్టు 20వ తేదీ హైదరాబాద్ నుంచి మొదలవుతుంది.
- సింగిల్ ఆక్యుపెన్సీలో 47 వేలవుతుంది. డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 42 వేలు, ట్రిపుల్ ఆక్యుపెన్సీలో 41,600 రూపాయలవుతుంది.
- టూర్ కోడ్: LEH WI-TH TURTUK EX HYDERABAD (SHA41)

ప్యాకేజ్‌లో ఇవన్నీ ఉంటాయి!

- హైదరాబాద్ నుంచి లేహ్, లేహ్ నుంచి హైదరాబాద్‌కి విమానం టికెట్‌లు.
- లేహ్‌లో 3 రాత్రులు, నుబ్రాలో 2 రాత్రులు, పాంగాంగ్‌లో ఒక రాత్రి హోటల్ గదుల బస.
- సైట్ సీయింగ్ ప్రయాణానికి నాన్ ఏసీ వాహనాలు, షేరింగ్ పద్ధతిలో.
- ఆరు రోజులు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, రాత్రి భోజనం
- ట్రావెల్ ఇన్సూరెన్స్, గైడ్, కల్చరల్ షో, రోజుకో వాటర్ బాటిల్, ఐటెనరీలో సూచించిన ప్రదేశాల ఎంట్రీ టికెట్‌లు ప్యాకేజ్ ధరలోనే. టూర్ మేనేజర్ ఉంటారు, అత్యవసరానికి ఆక్సిజెన్ సిలిండర్ సిద్ధంగా ఉంటుంది.

ఇవేవీ ప్యాకేజ్‌లో వర్తించవు!

- ఇంటి నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు, ఎయిర్‌పోర్టు నుంచి ఇంటికి రవాణా.
- హోటళ్లలో లాండ్రీ, టెలిఫోన్, ఎక్స్‌ట్రా వాటర్ బాటిళ్లు.
- పర్యాటక ప్రదేశాల్లోకి వీడియో కెమెరాకు ఎంట్రీ ఫీజ్, క్యామెల్ రైడ్‌తోపాటు ఇతర వినోద కార్యక్రమాలు, ఐటెనరీలో లేని ఆహారం ఆర్డర్ చేసుకుంటే విడిగా డబ్బు చెల్లించాలి.
- వాతావరణం అనుకూలతలను బట్టి అవసరమైతే టూర్ ఐటెనరీలో స్వల్పమార్పులు ఉంటాయి. వాటికి సహకరించాలి.



– వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి



‘సాధించే [illegible] ముందు లక్ష్యాలు [illegible]’

– [illegible] స్టాక్ మార్కెట్ నిపుణుడు

సాక్షి ప్లస్
సోమవారం॥ 7-7-2025

బిజినెస్ రీల్

ఇన్వెస్కో నుంచి ఇన్‌కమ్ ఆర్బిట్రేజ్ ప్లస్ ప్లాన్



ముంబై: ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్.. ఇన్వెస్కో ఇండియా ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్‌ను కొత్తగా తీసుకొచ్చింది. ఈ నూతన ఫండ్ ఆఫర్ 2న ప్రారంభం కాగా.. 16వ తేదీ వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. యాక్టివ్‌గా నిర్వహించే డెట్ ఫండ్స్, ఈక్విటీ ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో ఈ పథకం పెట్టుబడులు పెడుతుంటుంది. సంప్రదాయ డెట్ పథకాలకు ప్రత్యామ్నాయంగా ఈ పథకాన్ని రూపొందించి తీసుకొచ్చినట్టు ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్ తెలిపింది. తక్కువ రిస్క్‌తో కూడిన రాబడి, పన్ను పరంగా మెరుగైన ప్రయోజనం కోరుకునే దీర్ఘకాల పెట్టుబడులకు ఈ పథకం అనుకూలంగా ఉంటుందని పేర్కొంది. మొత్తం పెట్టుబడుల్లో 60–65 శాతాన్ని ఇన్వెస్కో ఇండియా కార్పొరేట్ బాండ్ ఫండ్‌లో పెడుతుంది. 35–40 శాతం మధ్య ఇన్వెస్కో ఇండియా ఆర్బిట్రేజ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది.

బజాజ్ అలియాంజ్ లైఫ్ నిఫ్టీ 500 మల్టీఫ్యాక్టర్ 50 ఇండెక్స్ ఫండ్



జీవిత బీమా సంస్థ బజాజ్ అలియాంజ్ లైఫ్ తాజాగా నిఫ్టీ 500 మల్టీఫ్యాక్టర్ 50 ఇండెక్స్ ఫండ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను (ఎన్‌ఎఫ్‌వో) ప్రకటించింది. దీన్ని తమ యులిప్ పాలసీల కింద అందిస్తుంది. ఇది నిఫ్టీ 500 మల్టీఫ్యాక్టర్ MQVLV 50 ఇండెక్స్‌ను ట్రాక్ చేసే విధంగా ఉంటుంది. పాలసీదారులకు ఇటు లైఫ్ కవరేజీతో పాటు అటు మల్టీఫ్యాక్టర్ ఆధారిత ఈక్విటీ ఇండెక్స్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కూడా ఇస్తుంది. ఎన్‌ఎఫ్‌వో జూలై 14తో ముగుస్తుంది.

యువత కోసం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ యులిప్ పథకం



యువతకు దీర్ఘకాలంలో సంపద సృష్టికి దోహదపడేలా ఐసీఐసీఐ ప్రూ స్మార్ట్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్లస్ పేరిట మార్కెట్ ఆధారిత యులిప్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్. దీన్ని నెలవారీగా రూ. 1,000 ప్రీమియంకే కొనుగోలు చేయొచ్చని సంస్థ తెలిపింది. ఇటు లైఫ్ కవరేజీతో పాటు అటు దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకు కూడా ఇది ఉపయోగపడుతుందని కంపెనీ చీఫ్ ప్రోడక్ట్, డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పల్టా తెలిపారు. వీలైనంత ముందుగా ఇన్వెస్ట్‌మెంట్ మొదలుపెట్టి దీర్ఘకాలం కొనసాగించేలా యువతకు యులిప్ ప్లాన్‌లు ఉపయుక్తంగా ఉంటాయన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-7-2025	
విశాఖ	560-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	570-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	560-00
వరంగల్	562-00
రిటైల్ ధర	6.20

భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై ఫోకస్!

- టీసీఎస్ క్యూ1 ఫలితాలు కీలకం...
- విదేశీ నిధుల ప్రవాహం పైనా దృష్టి...
- ఈ వారం మార్కెట్ గమనంపై విశ్లేషకుల అంచనా



న్యూఢిల్లీ: మార్కెట్ల గమనాన్ని నిర్దేశించే పలు కీలక సంఘటనలు ఈ వారంలో చోటు చేసుకోన్నాయి. ముఖ్యంగా ప్రపంచాన్ని కుదిపేస్తున్న ట్రంప్ టారిఫ్ వార్‌పై కీలక ప్రకటన వెలువడనుంది. అనేక దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలకు 90 రోజుల సస్పెన్షన్ గడువు జూలై 9తో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొన్ని దేశాలు యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదర్చుకోగా.. భారత్ కూడా వాణిజ్య చర్చల్లో తలమునకలైంది. ఈ సంప్రదింపులు విజయవంతమై, డీల్ గనుక కుదిరితే మార్కెట్ సెంటిమెంట్ మరింత పుంజుకుంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వాణిజ్య సంబంధ రంగాలకు ఈ ఒప్పందం బూస్ట్ ఇస్తుందని చెబుతున్నారు. ‘ఈ వారం ఒక్క భారత్ మార్కెట్లకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లకు చాలా కీలకం కానుంది. ఉత్కంఠ రేపుతున్న జూలై 9 అమెరికా టారిఫ్ డెడ్‌లైన్ దగ్గరకొచ్చింది. ప్రపంచ వాణిజ్య స్థితిగతులను ఇది మార్చేయనుంది. అలాగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ అదే రోజున విడుదల చేసే పాలసీ మినిట్స్ కూడా మార్కెట్లపై ప్రభావం చూపుతుంది’ అని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (రీసెర్చ్) అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

ఫలితాల సీజన్.. టీసీఎస్ బోణీ

కార్పొరేట్ ఫలితాల సీజన్ మళ్లీ మొదలవుతోంది. ఈ నెల 10న టీసీఎస్ క్యూ1 (2025–26, ఏప్రిల్–జూన్ క్వార్టర్) ఫలితాల బోణీ కొట్టనుంది. అదే రోజున టాటా ఎలెక్సీ కూడా ఫలితాలను ప్రకటించనుంది. ఈ వారంలోనే 11న అవెన్యూ సూపర్‌మార్ట్, ఆదిత్య బిర్లా మనీ ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయంగా మార్కెట్ ఫోకస్ క్యూ1 ఫలితాల వైపు మళ్లనుంది. ‘భారత్–యూఎస్ మధ్య వాణిజ్య చర్చల్లో సానుకూల ఫలితం వెలువడితే మార్కెట్ సెంటిమెంట్ మరింత పుంజుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ వంటి రంగాలకు ఇది జోష్ ఇస్తుంది. మార్కెట్లు ఇప్పుడు పై స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న క్యూ1 ఫలితాలు కూడా సూచీల గమనానికి దిశా నిర్దేశం చేస్తుంది’ అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు.

> **గత వారమిలా...**
> దేశీ సూచీలు గత వారంలో రివర్స్ గేర్ వేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 626 పాయింట్లు (0.74%), ఎన్‌ఎస్ఈ నిఫ్టీ 176 పాయింట్లు (0.68%) చొప్పున నష్టపోయాయి.

క్రూడ్, రూపాయి ట్రెండ్...

బ్రెంట్ క్రూడ్ ధరల ట్రెండ్, డాలర్‌తో రూపాయి మారకం విలువ కదలికలను కూడా ఇన్వెస్టర్లు నిశితంగా గమనించనున్నారు. అదేవిధంగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ధోరణి కూడా మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపనుంది. ‘ఎఫ్ఐఐలు మళ్లీ కొనుగోళ్ల బాట పట్టడానికి రెండు అంశాలు కీలకం కానున్నాయి. భారత్–అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కుదిరితే మార్కెట్లకు సానుకూలాంశం. ఎఫ్ఐఐలు మళ్లీ పెట్టుబడులకు సై అంటారు. అలాగే క్యూ1 ఫలితాల్లో రికవరీ సంకేతాలు కనిపించడం కూడా సానుకూలంగా నిలుస్తుంది. ఈ రెండింటి విషయంలో నిరుత్సాహం ఎదురైతే మార్కెట్‌పైనా, ఎఫ్ఐఐల నిధుల ప్రవాహంపైనా తీవ్ర ప్రతికూల ప్రభావం ఉంటుంది’ అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మొత్తంమీద చూస్తే ఇండో–యూఎస్ వాణిజ్య ఒప్పందంపై స్పష్టత కోసం వేచిచూసే ధోరణి, క్యూ1 ఫలితాలపై అంచనాల నేపథ్యంలో మార్కెట్లు కన్సాలిడేషన్‌లో ఉండొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా వ్యాఖ్యానించారు.

జూలైలో ఎఫ్‌పీఐలు ఆచితూచి...



ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, ఆర్‌బీఐ రేట్ల కోత వంటి సానుకూలతల నేపథ్యంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) గత నెలలోనూ నికర కొనుగోలుదారులుగా నిలిచారు. రూ.14,590 కోట్లు ఈక్విటీల్లో వెచ్చించారు. వెరసి వరుసగా మూడో నెలలోనూ పెట్టుబడుల బాటలోనే కొనసాగారు. అయితే, ఈ నెలలో మళ్లీ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తొలి వారంలో రూ.1,421 కోట్ల అమ్మకాలు జరిపారు. ముఖ్యంగా అమెరికా ట్రేడ్ వార్ డెడ్‌లైన్ దగ్గరపడటం, క్యూ1 ఫలితాల సీజన్‌పై అంచనా అంచనాల నేపథ్యంలో ఎఫ్‌పీఐలు ప్రస్తుతానికి ఆచితూచి వ్యవహరిస్తున్నారని ఏంజెల్ వన్ సీనియర్ ఫండమెంటల్ ఎనలిస్ట్ వకార్ జావెద్ ఖాన్ తెలిపారు. స్వల్పకాలానికి విదేశీ నిధుల ప్రవాహంలో తీవ్ర ఒడిదుడుకులు ఉండొచ్చని పేర్కొన్నారు. 2025లో ఇప్పటిదాకా రూ.79,322 కోట్లను ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకోవడం గమనార్హం.

ఒడిదుడుకుల మార్కెట్లో మల్టీ అసెట్ ఫండ్స్ దన్ను



కె. రాజస
వైస్ ప్రెసిడెంట్–పోర్ట్‌ఫోలియో మేనేజర్ (ఎమర్జింగ్ మార్కెట్స్ ఈక్విటీ–ఇండియా), ఫ్రాంక్లిన్ టెంపుల్టన్



అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో స్థూల ఆర్థిక పరిస్థితులు బలహీనంగా కనిపిస్తున్నాయి. వాణిజ్య ఉద్రిక్తతలు, పాలసీపరంగా అనిశ్చితి, వినియోగదారుల్లో విశ్వాసం సన్నగిల్లడం తదితర అంశాల కారణంగా 2025 గ్లోబల్ జీడీపీ వృద్ధి అంచనాలను అంతర్జాతీయ ద్రవ్య నిధి 2.8 శాతానికి కుదించింది. అయితే, ఇలాంటి అస్థిరత మధ్య కూడా భారత ఆర్థిక మూలాలు పటిష్టంగానే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఆర్థిక నియంత్రణకు కట్టుబడి ఉండటం, వృద్ధిని ప్రోత్సహించేలా ద్రవ్య విధానాలు ఉండటం వంటి అంశాలు దేశీయంగా స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో భారత ఎకానమీ 6.5% వృద్ధి సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. గ్రామీణ డిమాండ్ స్థిరంగా ఉండటం, పట్టణప్రాంతంలో వినియోగం మెరుగుపడటం, పెట్టుబడులు స్థిరంగా పుంజుకోవడం ఇందుకు దోహదపడనున్నాయి. మే 2025 నాటికి ద్రవ్యోల్బణం 2.8 శాతానికి తగ్గింది. 2019 ఫిబ్రవరి తర్వాత ఇది అత్యల్ప స్థాయి. ఆహారపదార్థాల ధరలు తగ్గడంతో పాటు సానుకూల రుతుపవనాల అంచనాలు కూడా ఇందుకు తోడ్పడ్డాయి. ఇవన్నీ సానుకూలమే అయినప్పటికీ మార్కెట్లో అస్థిరత పెరుగుతుండటంలాంటి అంశాల కారణంగా డైవర్సిఫికేషన్‌కి ప్రాధాన్యమిచ్చే మల్టీ అసెట్ ఫండ్స్ ఆవశ్యకత కనిపిస్తోంది.

ఎందుకంటే, 2024లో ఈక్విటీ మార్కెట్లో అన్ని విభాగాలు మెరుగ్గా రాణించడంతో డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు ఒక స్థాయికే పరిమితమైనట్లు కనిపించింది. కానీ, మార్కెట్ అస్థిరత మళ్లీ పెరుగుతుండటం, వివిధ రంగాల మధ్య పనితీరులో అంతరాలు కనిపిస్తుండటం వంటి పరిణామాల నేపథ్యంలో డైవర్సిఫికేషన్ వ్యూహాలకు మళ్లీ ప్రాధాన్యం పెరుగుతోంది. ఈక్విటీలకు దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణానికి మించి రాబడులు అందించే సామర్థ్యం ఉండగా, హైబ్రిడ్ ఫండ్లు స్థిరంగా, రిస్కులకు తగ్గ అనుకూల రాబడిని అందించగలవు. ఇవి ముఖ్యంగా పెట్టుబడికి భద్రత, పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు అనువైనవిగా ఉంటాయి.

ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో, మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్స్ లాంటి హైబ్రిడ్ ఫండ్లు మదుపరులకు మెరుగ్గా నిలుస్తున్నాయి. ఇవి సందర్భాన్ని బట్టి వివిధ సాధనాలకు వివిధ రకాలుగా కేటాయించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈక్విటీలు, ఫిక్స్‌డ్ ఇన్‌కం, కమోడిటీల మధ్య పెట్టుబడులను అటూ, ఇటూ మారుస్తూ, రిస్కులను సమర్థవంతంగా అధిగమిస్తూ, అవకాశాలను అందిపుచ్చుకోగలిగే వెసులుబాటు వీటికి ఉంటుంది. ఈక్విటీ వేల్యుయేషన్స్ అధిక స్థాయిలో, బాండ్లపై రాబడులు స్థిరంగా ఉండగా .. ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లు, మార్కెట్ హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కల్పించే కమోడిటీలకు – ముఖ్యంగా బంగారానికి కూడా పోర్ట్‌ఫోలియోలో చోటు కల్పించడం కీలకంగా మారింది. ఎందుకంటే, సంక్లిష్టమైన స్థూలఆర్థిక పరిస్థితుల్లో రిస్కులకు తగ్గ రాబడులను అందించే విషయంలో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

ఇలాంటి, అతి తక్కువ లేదా నెగిటివ్ కో–రిలేషన్ ఉన్న ఆర్థిక సాధనాలతో వైవిధ్యభరితంగా ఉండే పోర్ట్‌ఫోలియోలో ఇన్వెస్ట్ చేయడం వల్ల పెట్టుబడులు భారీగా పతనం కాకుండా కాస్త రక్షణ లభిస్తుంది. నెగటివ్ కో–రిలేషన్ అంటే, ఆర్థిక లేదా భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతల వల్ల ఈక్విటీ మార్కెట్ క్షీణించినప్పటికీ, సురక్షితమైన సాధనాలుగా పరిగణించే డెట్, పసిడిలాంటి సాధనాలు పెరుగుతాయి. ఇలా ఒడిదుడుకులు నెలకొన్నప్పుడు, పరస్పర విరుద్ధంగా వ్యవహరించే సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా, ఇన్వెస్టర్లకు రిస్కులను తగ్గించి, మెరుగైన రాబడినిచ్చే విధంగా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్స్ ఉంటాయి. ఇవి వివిధ సాధనాలవ్యాప్తంగా కేటాయింపులను సత్వరం మార్చగలిగే విధంగా పనిచేస్తాయి. అయితే, నిబంధనల ప్రకారం ఈక్విటీలకు తప్పనిసరిగా కనీసం 65 శాతమైన నిధులు కేటాయించాలి కాబట్టి, వీటిపై వచ్చే మూలధన లాభాలకు శ్లాబ్ రేట్ల వారీగా కాకుండా ఈక్విటీ ట్యాక్సేషన్ వర్తిస్తుంది. కాబట్టి, దీర్ఘకాలిక పెట్టుబడి లక్ష్యాల సాధన కోసం పన్నులు ఆదా అయ్యే మార్గాలను అన్వేషించే ఇన్వెస్టర్లు, ఈ ఫండ్స్‌ను పరిశీలించవచ్చు. ఇవి సమీప భవిష్యత్తులో క్షీణత నుంచి రక్షణ, అలాగే పన్నులపరంగా ప్రయోజనాలు కల్పిస్తూనే దీర్ఘకాలికంగా పెట్టుబడి వృద్ధి అవకాశాలను కూడా అందిస్తూ, ఇన్వెస్టర్లకు అనువుగా ఉంటాయి.

స్థిరమైన దీర్ఘకాలిక విధానాలు అవసరం

- అప్పుడే అందుకుతగ్గ వ్యాపార ప్రణాళికలు
- స్టెల్లాంటిస్ ఇండియా సీఈవో హజేలా



ప్యారిస్: భారత ఆటోమొబైల్ రంగానికి సంబంధించి స్థిరమైన, దీర్ఘకాల విధానాలు.. రాష్ట్రాల వ్యాప్తంగా ఏకరూపత అవసమని ఫ్రాన్స్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ స్టెల్లాంటిస్ ఇండియా సీఈవో శైలేష్ హజేలా అభిప్రాయపడ్డారు. అప్పుడే ఆటోమొబైల్ కంపెనీలు దీర్ఘకాల దృష్టితో వ్యాపార ప్రణాళికలను అమలు చేయగలవన్నారు. జీప్, సిట్రోయెన్ బ్రాండ్ల రూపంలో భారత మార్కెట్లో స్టెల్లాంటిస్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. భారత్‌కు పెట్టుబడులతో వచ్చే వారు విధానాల పరంగా దీర్ఘకాల దృష్టిని కోరుకుంటున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించింది ఏదైనా సరే, దేశవ్యాప్తంగా ఒకే మాదిరిగా, దీర్ఘకాలం పాటు అమలు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా ఈవీలకు సంబంధించి, పన్ను పరమైన ఏకీకృత విధానాలు ఉండాలన్నారు. అప్పుడే కంపెనీలు రాష్ట్రాల వారీగా కాకుండా మొత్తం దేశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించుకోగలవన్నారు. ఈవీలకు సంబంధించి రాష్ట్రాలు వేర్వేరు విధానాలు అమలును ప్రస్తావించారు.

సిట్రోయెన్ బ్రాండ్ విస్తరణ

గత కొన్ని సంవత్సరాలుగా స్టెల్లాంటిస్ గ్రూప్ భారత్‌లో కార్యకలాపాలకు అవసరమైన సదుపాయాల కల్పనపై దృష్టి సారించిందని శైలేష్ హజేలా తెలిపారు. ఇప్పుడు సిట్రోయెన్ బ్రాండ్ కార్యకలాపాలను విస్తరించే ప్రణాళికలతో ఉన్నట్టు చెప్పారు. సేల్స్, నెట్‌వర్క్ విస్తరణపై దృష్టి సారించినట్టు తెలిపారు. వచ్చే ఏడాదిలో విక్రయ కేంద్రాలను రెట్టింపు చేసుకోనున్నట్టు (80 నుంచి 150కు) ప్రకటించారు. చిన్న పట్టణాలు, సెమీ అర్బన్ ప్రాంతాలపై దృష్టి సారిస్తామన్నారు. టైర్4 పట్టణాల వరకు విస్తరిస్తామన్నారు. మార్కెట్ వాటాను వచ్చే 12 నెలల్లో రెట్టింపు చేసుకునే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్టు తెలిపారు. సిట్రోయెన్ బ్రాండ్‌పై రూ.2,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు స్టెల్లాంటిస్ ఈ ఏడాదిలో ప్రకటించడం గమనార్హం.

రిటర్నులు ఎవరు వేయక్కర్లేదంటే..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి, కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

2025 సంవత్సరం మొదలైందంటే 31.3.2025 నాటి కల్లా ప్లానింగ్, సేవింగ్స్, టీడీఎస్, టీసీఎస్, అడ్వాన్స్ టాక్స్ చెల్లింపులు... అలాగే 1.4.2025 దాటిదంటే రిటర్ను వేయడానికి సన్నద్ధం కావాలి. ఏ ఫారం వేయాలి. గడువు తేదీ ఏమిటి..? ఎంత పన్ను చెల్లించాలి..? ఇలా ఉంటాయి అందరి ఆలోచనలు. ఈ వారం టాక్స్ కాలంలో వ్యక్తులు ఏయే సందర్భాలలో రిటర్నులు వేయనక్కర్లేదో వివరంగా తెలుసుకుందాం.

టాక్సబుల్ ఇన్‌కం లిమిట్ దాటని వ్యక్తులు

నికర ఆదాయాన్ని టాక్సబుల్ ఇన్‌కం అంటారు. నికర ఆదాయం టాక్సబుల్ ఇన్‌కం లిమిట్ లోపల ఉంటే రిటర్నులు వేయాల్సిన పనిలేదు.

వయసులవారీ	కొత్త విధానం	పాత విధానం
60 ఏళ్లు లోబడి	రూ.3,00,000	రూ.2,50,000
60–80 ఏళ్లు (సీనియర్స్)	రూ.3,00,000	రూ.3,00,000
80 ఏళ్లు దాటిన	రూ.3,00,000	రూ.3,00,000

ఇది మీకు తెలిసిన విషయమే. కొత్త విధానంలో ఏ వయసువారికైనా బేసిక్ లిమిట్ రూ.3 లక్షలుగా ఉంటుంది. వయసు బట్టి మార్పు లేదు. కానీ పాత విధానంలో మార్పులు ఉన్నాయి. ఈ బేసిక్ లిమిట్ లోపల పన్నుభారం ఉండదు. అయితే కొత్త విధానంలో రిబేటుని ఇస్తారు. అంటే పన్ను భారంలోంచి తగ్గిస్తారు. ఆదాయంలోంచి కాదు. రిబేటుని రూ.60,000కు పెంచడం వలన రూ.12 లక్షల లోపల ఆదాయం ఉన్నవారికి పన్ను పడదు.

కేవలం బ్యాంకు వడ్డీ / పెన్షన్ ఉండి, ఎటువంటి టీడీఎస్ లేకపోతే...

మీ ఆదాయం కేవలం వడ్డీ అనుకొండి. సేవింగ్స్ అకౌంట్స్ కానీ ఎఫ్‌డీలు కానీ లేదా పెన్షన్ కానివ్వండి లేదా ఈ రెండు కలిపి కానివ్వండి. వెరసి మొత్తం టాక్సబుల్ ఇన్‌కం దాటకూడదు. అలాగే డివిడెండ్లు, టీడీఎస్ ఉండకూడదు. అటువంటి వారు నిశ్చింతగా ఉండొచ్చు. ఇదే ఉదాహరణలో టీడీఎస్ ఉంటే రిటర్ను వేయాలి.

వ్యవసాయం ... లిమిట్‌లోపల ఉంటే

మీకు కేవలం వ్యవసాయం ఉండి, రూ.5,000 లోపల ఉంటే రిటర్ను జోలికి వెళ్లక్కర్లేదు. కానీ వ్యవసాయం ఆదాయం రూ.5,000 దాటితే.., వ్యవసాయేతర ఆదాయం బేసిక్ లిమిట్ (1)వ పాయింటులో చెప్పిన విధంగా లోపల ఉన్నా రిటర్నులు వేయక్కర్లేదు. బేసిక్ లిమిట్... వ్యవసాయేతర ఆదాయం దాటి వ్యవసాయ ఆదాయం రూ.5,000 దాటకపోతే రిటర్ను వేయాలి. కానీ వ్యవసాయ ఆదాయాన్ని కలపనవసరం లేదు. వ్యవసాయేతర ఆదాయం బేసిక్ లిమిట్ దాటి, దానితో పాటు వ్యవసాయ ఆదాయం రూ.5,000 దాటితే రెండింటిని కలిపి పన్నుభారం లెక్కిస్తారు. కానీ పన్ను భారం తగ్గుతుంది. కేవలం వ్యవసాయం మీద ఆదాయం రూ.5,000 దాటి ఎంత ఉన్నా కూడా రిటర్ను వేయాల్సిన అవసరం లేదు. కానీ మిగితా రూల్స్ వర్తించే అవకాశం ఉంది.

గృహిణులు, విద్యార్థులు కూడా వేయనవసరం లేదు.

ఇంటి నిర్వహణ నిమిత్తం భర్త తన టాక్సబుల్ ఇన్‌కం నుంచి లేదా మిహాయింపు రశీదులో ఎంత ఇచ్చినా పన్ను పడదు. పోపుల డబ్బాలో మిగిలిన మొత్తానికి పన్ను ఉండదు. అలాగే పిల్లలకు ఇచ్చిన పాకెట్ మనీకి కూడా పన్ను పడదు.

- ఎన్నారైలకు ఇండియాలో టాక్సబుల్ ఇన్‌కం లిమిట్ రూ.2.50 లక్షల లోపల ఉంటే రిటర్ను వేయక్కర్లేదు.
- సీనియర్స్ సిటిజన్లు... కానీ షరతులకు లోబడి సెక్షన్ 194 ‌ ... ఇదొక వరం లాంటిది. కానీ అందరూ లబ్ధిదారులు కాదు. 75 సంవత్సరాలు దాటిన వారికి వర్తిస్తుంది.
  - రెసిడెంటు అవ్వాలి
  - 75 సంవత్సరాలు లేదా అంతకుపైబడి వారికి మాత్రమే
  - ఆదాయంలో కేవలం పెన్షన్, ఒకే బ్యాంకు అకౌంటులోని వడ్డీ ఉండాలి.
  - ఒకే బ్యాంక్ అకౌంటు ఉండాలి. అది కూడా నిర్దేశిత బ్యాంకు అయ్యి ఉండాలి.
  - అందులోనే పెన్షన్ జమ అవ్వాలి
  - పెన్షన్+వడ్డీ మీద టీడీఎస్... ఆ బ్యాంకు లెక్కించి రికవరీ చేయాలి
  - బ్యాంకు 80 ఇ, 80 ఈ మొదలైన డిడక్షన్లు పరిగణలోకి తీసుకుంటుంది.

ఈ వెసులుబాటు మాత్రం ఎంగిలి చేత్తో కాకిని తోలినట్లే కొద్ది మందికే ఉపయోగపడవచ్చు. దానిని వక్రీకరించి చాలామంది, 75 ఏళ్ల వారికి పన్ను లేదని పిడివాదన చేస్తుంటారు. అది నమ్మకండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

అధిక రాబడులకు మార్గం!

క్వాంట్ స్మాల్‌క్యాప్ ఫండ్



ఈక్విటీ పెట్టుబడుల్లో రిస్క్ ఉన్నా కానీ, దీర్ఘకాలంలో అధిక రాబడులు కోరుకునే వారు స్మాల్ క్యాప్ ఫండ్స్‌కు తప్పకుండా చోటు కల్పించుకోవాలి. పెట్టుబడులు అన్నింటినీ స్మాల్ క్యాప్స్‌లో కాకుండా.. తమ రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా కేటాయింపులను నిర్ణయించుకోవాలి. చిన్న కంపెనీల్లో అస్థిరతలు ఎక్కువ. కానీ, బలమైన ఆర్థిక మూలాలతో, మంచి వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునే చిన్న కంపెనీలు దీర్ఘకాలంలో మధ్య స్థాయి, బడా కంపెనీలుగా అవతరించగలవు. అటువంటి గొప్ప కంపెనీలను ముందుగా గుర్తించే నైపుణ్యాలు రిటైల్ ఇన్వెస్టర్లలో సాధారణంగా ఉండవు. కనుక ఇన్వెస్టర్లు స్మాల్‌క్యాప్ పెట్టుబడుల కోసం మ్యూచువల్ ఫండ్స్‌పై ఆధారపడడం మెరుగైన నిర్ణయం అవుతుంది. ఈ విభాగంలో క్వాంట్ స్మాల్‌క్యాప్ ఫండ్ మంచి రాబడులను అందిస్తోంది.

రాబడులు

ఈ పథకం గడిచిన ఏడాది కాలం మినహా మిగిలిన అన్ని కాలాల్లోనూ అద్భుతమైన రాబడులను అందించినట్టు గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. మూడేళ్ల కాలాన్ని పరిశీలిస్తే ఏటా 33 శాతం రాబడిని తెచ్చి పెట్టింది. ఐదేళ్లలో ఏటా 46 శాతం, ఏడేళ్లలో 27.60 శాతం, పదేళ్లలో 21 శాతం చొప్పున వార్షిక రాబడుల చరిత్ర ఈ పథకంలో నమోదైంది. ఇదే కాలంలో స్మాల్‌క్యాప్ ఫండ్స్ విభాగం సగటు రాబడి కంటే ఈ పథకంలోనే 10–12 శాతం వరకు వివిధ కాలాల్లో అధిక రాబడి వచ్చింది. ఈ పథకం 1996లో ప్రారంభమైంది. గతంలో క్వాంట్ ఇనకమ్ ఫండ్ పేరుతో కొనసాగింది. ఆరంభం నుంచి ఈ పథకంలో ప్రతి నెలా రూ.10,000 చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ వస్తే 14.43 శాతం ఎక్స్ఐఆర్ఆర్ రాబడి ఆధారంగా రూ.4.08 కోట్లు సమకూరేది.

పెట్టుబడుల విధానం..

‘‘క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ తాను అనుసరించే డైనమిక్ అస్సెట్ అలోకేషన్ విధానం కారణంగా అధిక ఆల్ఫాతో బలంగా నిలబడగలిగింది. అలాగే స్టాక్స్ ఎంపిక కోసం అనుసరించే చురుకైన విధానాలు, అదే సమయంలో సానుకూల మార్కెట్ పనితీరుతో మంచి పనితీరు చూపించింది. అధిక వృద్ధి అవకాశాలు కలిగిన కంపెనీలను ముందుగానే గుర్తించే సామర్థ్యం ఫండ్ మేనేజర్లలో ఉండడం అనుకూలించింది’’ అని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి తెలిపారు. అయినప్పటికీ చిన్న కంపెనీలు స్వల్ప కాలంలో దిద్దుబాట్లకు గురవుతుంటాయని.. లిక్విడిటీ సమస్య కూడా ఉంటుందన్నారు. కనీసం పదేళ్లు అంతకుమించిన కాలానికి స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు కొనసాగించిన వారికి మెరుగైన రాబడులు వస్తాయని సూచించారు. ప్రధానంగా అధిక వృద్ధి సామర్థ్యాలను, రంగాల వారీ సానుకూల సైకిల్స్‌ను ఫండ్ మేనేజర్లు ఆరంభ దశలో గుర్తించి ఆయా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా మెరుగైన రాబడుల దిశగా ప్రయత్నించడం ఈ పథకంలో గుర్తించొచ్చు. అధిక రిస్క్ ఉన్న వారికే ఈ తరహా స్మాల్‌క్యాప్ ఫండ్స్ అనుకూలమన్నది మర్చిపోవద్దు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
రిలయన్స్ ఇండస్ట్రీస్	9.85
జియో ఫైనాన్షియల్	5.69
ఏజిస్ లాజిస్టిక్స్	3.72
బికాజి ఫుడ్స్	3.05
ఆర్‌బీఎల్ బ్యాంక్	2.86
పాలీ మెడికేర్	2.56
హెచ్‌ఎఫ్‌సీఎల్	2.35
సన్ టీవీ నెట్‌వర్క్	2.30
వెంటివ్ హాస్పిటాలిటీ	2.29
అదానీ ఎంటర్‌ప్రైజెస్	2.21

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం రూ. 28,205 కోట్ల పెట్టుబడులు ఈ పథకం నిర్వహణలో ఉన్నాయి. ఇందులో 92.78 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, డెట్ సాధనాల్లో 1.44% పెట్టుబడులు ఉన్నాయి. 5.79% మేర నగదు నిల్వలు కలిగి ఉంది. పేరుకు స్మాల్ క్యాప్ ఫండ్ అయినప్పటికీ స్మాల్‌క్యాప్ కంపెనీల్లో పెట్టుబడులు ప్రస్తుతం 31% మేరే ఉన్నాయి. మిడ్ క్యాప్ కంపెనీల్లో 43% మేర ఇన్వెస్ట్ చేయగా, లార్జ్ క్యాప్ కంపెనీల్లో 24% మేర ఎక్స్‌పోజర్ కలిగి ఉంది. అయితే ప్రస్తుతం స్మాల్‌క్యాప్ కంపెనీల విలువలు గరిష్ఠ స్థాయిలకు చేరినందున ఎక్స్‌పోజర్ తగ్గించుకున్నట్టు తెలుస్తోంది. ఆయా విభాగాల వ్యాల్యూషన్ల ఆధారంగా ఈ పెట్టుబడులను మారుస్తుండడం గమనించొచ్చు. అత్యధికంగా 17.56% పెట్టుబడులను ఇంధన రంగ, యుటిలిటీ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. కన్స్యూమర్ డిస్క్రీషనరీ కంపెనీల్లో 16%, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో 15%, హెల్త్ కేర్ కంపెనీల్లో 14% చొప్పున పెట్టుబడులు కలిగి ఉంది.



ముల్డర్ 264 నాటౌట్

- దక్షిణాఫ్రికా 465/4
- జింబాబ్వేతో రెండో టెస్టు

బులవాయో: తొలి టెస్టులో శతక్కొట్టిన దక్షిణాఫ్రికా బ్యాటర్ వియాన్ ముల్డర్ (259 బంతుల్లో 264 బ్యాటింగ్; 34 ఫోర్లు, 3 సిక్స్‌లు) రెండో టెస్టులో బ్యాటింగ్ జోరును అమాంతం పెంచాడు. జింబాబ్వేతో ఆదివారం మొదలైన రెండో టెస్టులో తొలిరోజే అజేయ డబుల్ సెంచరీ సాధించాడు. దీంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 465 పరుగుల భారీస్కోరు చేసింది. ఈ మ్యాచ్‌లో జట్టుకు తొలిసారి సారథ్యం వహిస్తున్న ముల్డర్ వన్డేను తలపించే ఆట ఆడేశాడు. ఎదుర్కొన్న బంతులకంటే బాదిన పరుగులే ఎక్కువున్నాయి. బౌండరీలైతే మంచినీళ్ల ప్రాయంగా దంచేశాడు. జట్టు స్కోరు 11 వద్ద టోని డి జార్జి (10), 24 పరుగులకే సెనొక్వనే (3) ఇలా ఓపెనర్లు నిష్క్రమించిన వేళ... వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగి జింబాబ్వే బౌలర్ల భరతం పట్టాడు. బెడింగ్‌హామ్ (82; 7 ఫోర్లు)తో మూడో వికెట్‌కు 184 పరుగులు జోడించిన ముల్డర్ రెండో సెషన్‌లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మూడో సెషన్‌లో ప్రిటోరియస్ (78; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి నాలుగో వికెట్‌కు 217 పరుగులు జోడించాడు. దీంతో ఆఖరి సెషన్‌లో అతని డబుల్ సెంచరీ, జట్టు 400 పరుగుల మార్క్‌ను వేగంగా అందుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి ముల్డర్, బ్రెవిస్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తనక చివంగకు 2 వికెట్లు దక్కగా, మతిగిము, మసకద్జా చెరో వికెట్ తీశారు. ఇదే వేదికపై జరిగిన తొలి టెస్టులో సఫారీ 328 పరుగుల భారీ తేడాతో జయభేరి మోగించింది.

ఆస్ట్రేలియాదే సిరీస్

రెండో టెస్టులోనూ ఓడిన విండీస్



సెయింట్ జార్జెస్: మరోసారి బ్యాటర్ల వైఫల్యంతో... ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో వెస్టిండీస్ 133 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. మ్యాచ్ నాలుగో రోజు ఆస్ట్రేలియా నిర్దేశించిన 277 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 34.3 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌటైంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా మరో టెస్టు మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. విండీస్ జట్టులో కెప్టెన్ రోస్టన్ ఛేజ్ (34; 1 ఫోర్, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3 వికెట్లు, లయన్ 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 221/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 71.3 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (71; 7 ఫోర్లు, 1 సిక్స్), కామెరాన్ గ్రీన్ (52; 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. ఈ సిరీస్‌లో చివరిదైన మూడో టెస్టు ఈనెల 13 నుంచి కింగ్‌స్టన్‌లో జరుగుతుంది.

సబలెంకా జోరు

క్వార్టర్ ఫైనల్లోకి బెలారస్ స్టార్



లండన్: టైటిల్ ఫేవరెట్స్‌లో ఒక్కొక్కరూ వెనుదిరుగుతుండగా... మరోవైపు అంచనాలకు అనుగుణంగా రాణిస్తూ బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా ముందంజ వేసింది. ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో టాప్ సీడ్ సబలెంకా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సబలెంకా 6–4, 7–6 (7/4)తో ఎలీసా మెర్‌టెన్స్ (బెల్జియం)పై విజయం సాధించింది. 122 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకాకు రెండు సెట్‌లలో గట్టిపోటీ ఎదురైంది. అయితే కీలకదశలో సబలెంకా పైచేయి సాధించి వరుస సెట్‌లలో విజయాన్ని ఖరారు చేసుకుంది. అర డజను ఏస్‌లు సంధించిన సబలెంకా ఒక్కడబుల్ ఫాల్ట్ మాత్రమే చేసింది. నెట్ వద్దకు 15 సార్లు దూసుకొచ్చి 10 సార్లు పాయింట్లు గెలిచింది. తన సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. 36 విన్నర్స్ కొట్టిన సబలెంకా 18 అనవసర తప్పిదాలు చేసింది. ఆరోసారి వింబుల్డన్ టోర్నీలో ఆడుతున్న సబలెంకా 2021లో, 2023లో సెమీఫైనల్లో నిష్క్రమించింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో **అనస్తాసియా పావ్లీచెంకోవా** (రష్యా) **7–6 (7/3), 6–4తో** సోనె కర్తాల్ (బ్రిటన్)పై, **లౌరా సిగెముండ్** (జర్మనీ) **6–3, 6–2తో** సొలానా సియెరా (అర్జెంటీనా)పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

ఫ్రిట్జ్ మూడోసారి...

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ ఐదో ర్యాంకర్ టేలర్ **ఫ్రిట్జ్** (అమెరికా), కామెరాన్ **నోరి** (బ్రిటన్), కరెన్ **ఖచనోవ్** (రష్యా) క్వార్టర్ ఫైనల్లో**కి అడుగు** పెట్టారు. జోర్డాన్ థాంప్సన్ (**ఆస్ట్రేలియా**)తో జరిగిన ప్రిక్వార్టర్ **ఫైనల్లో ఫ్రిట్జ్ తొలి** సెట్‌ను 6–1తో నెగ్గి, రెండో సెట్‌లో 3–0తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో గాయం కారణంగా థాంప్సన్ వైదొలిగాడు. దాంతో ఈ టోర్నీలో ఫ్రిట్జ్ మూడోసారి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కామెరాన్ నోరి 4 గంటల 27 నిమిషాల్లో 6–3, 7–6 (7/4), 6–7 (7/9), 6–7 (5/7), 6–3తో నికోలస్ జారీ (చిలీ)పై, ఖచనోవ్ 6–4, 6–2, 6–3తో కామిల్ మజార్జక్ (పోలాండ్)పై గెలుపొందారు.

నోరిస్‌కు నాలుగో టైటిల్

బ్రిటిష్ గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్‌దే విజయం



సిల్వర్‌స్టోన్: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన బ్రిటిష్ గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేసులో బ్రిటన్ డ్రైవర్ లాండో నోరిస్ టైటిల్ సాధించాడు. ఆదివారం జరిగిన ఈ రేసులో మెక్‌లారెన్ జట్టుకు చెందిన నోరిస్ నిర్ణీత 52 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 37 నిమిషాల 15.735 సెకన్లలో ముగించి విజేతగా అవతరించాడు. సొంతగడ్డపై నోరిస్‌కిదే తొలి విజయం కాగా... ఈ సీజన్‌లో నాలుగోది. 'సొంతనగరంలో టైటిల్ నెగ్గాలని కలలు కన్నాను. నా స్వప్నం సాకరమైంది. ఈ చిరస్మరణీయ విజయాన్ని నా మనసులో ఎల్లవేళలా దాచుకుంటాను' అని విజయానంతరం నోరిస్ వ్యాఖ్యానించాడు. మెక్‌లారెన్ జట్టుకే చెందిన ఆస్కార్ పియాస్ట్రి రెండో స్థానంలో నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. వర్షం అంతరాయం కలిగించిన ఈ రేసులో ఏకంగా ఐదుగురు డ్రైవర్లు కిమీ ఆంటోనెలి (మెర్సిడెస్), ఐజాక్ హడ్జార్ (రేసింగ్ బుల్స్), బొర్టోలెటో (స్టేక్ ఎఫ్1), లియామ్ లాసన్ (రేసింగ్ బుల్స్), కొలాపింటో (అల్పైన్ టీమ్) రేసును పూర్తి చేయలేక పోయారు. 24 రేసుల సీజన్‌లో ఇప్పటికి 12 రేసులు ముగిశాయి. పియాస్ట్రి 234 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... 226 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 165 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు బెల్జియం గ్రాండ్‌ప్రి ఈనెల 27న జరుగుతుంది.

12 బ్రిటిష్ గ్రాండ్‌ప్రిలో బ్రిటన్ డ్రైవర్‌కే టైటిల్ లభించడం ఇది 12సారి కావడం విశేషం. గతంలో స్టిర్లింగ్ మోస్, పీటర్ కోలిన్స్, క్లార్క్, స్టీవార్ట్, హంట్, జాన్ వాట్సన్, మాన్సెల్, డామన్ హిల్, జానీ హెర్బర్ట్, డేవిడ్ కౌల్తార్డ్, హామిల్టన్ ఈ రేసులో గెలిచారు.

బ్రిటిష్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	నోరిస్	మెక్‌లారెన్	52	1:37:15.735 సెకన్లు	-	25
2	పియాస్ట్రి	మెక్‌లారెన్	52	1:37:22.547 సెకన్లు	6.812 సెకన్లు	18
3	హుల్కెన్‌బర్గ్	స్టేక్ ఎఫ్1	52	1:37:50.477 సెకన్లు	34.742 సెకన్లు	15
4	హామిల్టన్	ఫెరారీ	52	1:37:55.547 సెకన్లు	39.812 సెకన్లు	12
5	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	52	1:38:12.516 సెకన్లు	56.781 సెకన్లు	10
6	గాస్లీ	ఆల్పైన్	52	1:38:15.592 సెకన్లు	59.857 సెకన్లు	8
7	స్ట్రోల్	ఆస్టన్ మార్టిన్	52	1:38:16.338 సెకన్లు	60.603 సెకన్లు	6
8	అల్బాన్	విలియమ్స్ రేసింగ్	52	1:38:19.870 సెకన్లు	64.135 సెకన్లు	4
9	అలోన్సో	ఆస్టన్ మార్టిన్	52	1:38:21.593 సెకన్లు	65.858 సెకన్లు	2
10	రసెల్	మెర్సిడెస్	52	1:38:26.409 సెకన్లు	70.674 సెకన్లు	1

ఒకరు 1500 మీటర్లలో... మరొకరు 5000 మీటర్లలో

ఒకే రోజు రెండు ప్రపంచ రికార్డులు బద్దలు

- మెరిసిన కెన్యా మహిళా అథ్లెట్లు ఫెయిత్ కిపియేగాన్, బియట్రైస్ చెబెట్





యుజీన్ (అమెరికా): మిడిల్ డిస్టెన్స్ రన్నింగ్‌లో తమకు తిరుగులేదని కెన్యా మహిళా అథ్లెట్లు మరోసారి నిరూపించుకున్నారు. డైమండ్ లీగ్‌లో భాగంగా అమెరికాలోని యుజీన్‌లో జరిగిన ప్రిఫోంటెయిన్ క్లాసిక్ మీట్‌లో ఇద్దరు కెన్యా మహిళా అథ్లెట్లు రెండు ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టారు. మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ ఫెయిత్ కిపియేగాన్ 1500 మీటర్ల విభాగంలో... పారిస్ ఒలింపిక్స్‌లో రెండు స్వర్ణాలు గెలిచిన బియట్రైస్ చెబెట్ 5000 మీటర్లలో కొత్త ప్రపంచ రికార్డులు సృష్టించారు. 31 ఏళ్ల కిపియేగాన్ 1500 మీటర్ల దూరాన్ని 3 నిమిషాల 48.68 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో 3 నిమిషాల 49.04 సెకన్లతో తానే నెలకొల్పిన ప్రపంచ రికార్డును కిపియేగాన్ తిరగరాసింది. కిపియేగాన్ 2016 రియో, 2020 టోక్యో, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు గెలిచి 1500 మీటర్ల విభాగంలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మరోవైపు 5000 మీటర్ల దూరాన్ని 25 ఏళ్ల బియట్రైస్ చెబెట్ 13 నిమిషాల 58.06 సెకన్లలో ముగించి తన పేరిట కొత్త ప్రపంచ రికార్డును లిఖించుకుంది. 5000 మీటర్ల దూరాన్ని 14 నిమిషాల్లోపు పూర్తి చేసిన తొలి మహిళా అథ్లెట్‌గా గుర్తింపు పొందిన చెబెట్... రెండేళ్ల క్రితం ప్రిఫోంటెయిన్ క్లాసిక్ మీట్‌లో 14 నిమిషాల 00.21 సెకన్లతో గుడాఫ్ సెగె (ఇథియోపియా) సృష్టించిన ప్రపంచ రికార్డును సవరించింది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో చెబెట్ 5000, 10,000 మీటర్ల విభాగాల్లో స్వర్ణ పతకాలు నెగ్గి విశ్వ క్రీడల్లో అరుదైన 'డబుల్' సాధించిన మూడో అథ్లెట్‌గా గుర్తింపు పొందింది.

మహిళల ఫుట్‌బాల్ జట్టుకు నజరానా

రూ. 42.75 లక్షల నగదు పురస్కారం ప్రకటించిన ఏఐఎఫ్‌ఎఫ్



న్యూఢిల్లీ: ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) మహిళల ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో గెలుపు బావుటా ఎగరేసిన భారత జట్టుకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. ఆసియా కప్‌కు అర్హత సాధించిన మహిళల బృందానికి 50 వేల డాలర్లు (రూ.42.75 లక్షలు) నజరానా ఇస్తామని ఏఐఎఫ్‌ఎఫ్ ఆదివారం వెల్లడించింది. థాయ్‌లాండ్‌లో జరిగిన ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భారత్ ఎదురులేని విజయాలతో ప్రత్యర్థుల్ని వణికించింది. మొదట 13–0తో మంగోలియాపై, 4–0తో తిమోర్ లెస్టేపై, 5–0తో ఇరాక్‌పై గెలుపొందిన భారత అమ్మాయిల జట్టు ర్యాంకింగ్‌లో తమకన్నా ఎంతో మెరుగైన థాయ్‌లాండ్‌నూ వారి సొంతగడ్డపై 2–1తో కంగుతినిపించడం విశేషం. కీలకమైన ఆఖరి పోరులో ఒత్తిడిని తట్టుకొని జట్టు గెలిచిన విధానం అందరినీ ఆకట్టుకుంది. ఈ ఘనమైన విజయానికి, ప్రదర్శనకు అంతే ఘనమైన గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో ఏఐఎఫ్‌ఎఫ్ నజరానా ప్రకటించింది. కొన్నాళ్లుగా భారత ఫుట్‌బాల్ సమాఖ్య, స్పోర్ట్స్ అథారిటీ (సాయ్)తో కలిసి సమన్వయం చేసుకుంటూ ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేసింది. అండర్–13, 15, 17 స్థాయిలోనే ప్రతిభావంతుల్ని గుర్తించే కార్యక్రమాల్ని నిర్వహించింది. దీనివల్ల 2023–24 సీజన్‌లో 6305 మంది జూనియర్ ప్లేయర్లు పోటీపడగా... గత సీజన్ (2024–25)లో ఏకంగా ఆ సంఖ్య 8658 మందికి చేరింది. అంతేకాదు... ఏఎఫ్‌సీ క్వాలిఫయర్స్ లక్ష్యంగా జాతీయ జట్టు సన్నద్ధతకు ప్రణాళికబద్ధంగా కృషి చేసింది. 53 రోజుల సుదీర్ఘ శిక్షణ శిబిరం, మెరుగైన ఏర్పాట్లు ఎన్నో చేసి ఇప్పుడు ఆశించిన ఫలితాన్ని సాధించింది.

'మ్యాజిక్ స్కిల్' అవార్డు రేసులో దీపిక



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు ఫార్వర్డ్ ప్లేయర్ దీపిక అంతర్జాతీయ హాకీ అవార్డు రేసులో నిలిచింది. మైదానంలో అసాధారణ నైపుణ్యంతో ప్రత్యర్థి డిఫెండర్లను, గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి చేసే గోల్‌కు గుర్తింపుగా ఈ అవార్డు ఇస్తారు. 'పాలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్' పేరిట యేటా అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) అవార్డు ఇస్తుంది. ఈ అవార్డు రేసులో మన దీపిక చేసిన గోల్ నామినేట్ అయ్యింది. 2024–25 ప్రొ లీగ్ సీజన్ సందర్భంగా ప్రపంచ నంబర్‌వన్ నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంతో నేర్పుగా దీపిక చేసిన ఫీల్డ్ గోల్ ఎఫ్ఐహెచ్ జ్యూరీ కంటపడింది. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఫిబ్రవరిలో జరిగిన ఈ మ్యాచ్ నిర్ణీత సమయం ముగిసేసరికి 2–2తో 'డ్రా' కాగా... 'షూటౌట్'లో భారత్ గెలిచింది.



ఆత్మీయ సమ్మేళనం

- లండన్‌లోని భారత్ భవన్‌లో మహిళా క్రికెట్ జట్టుకు ఘనస్వాగతం
- భారీస్థాయిలో హైకమిషనర్ విందు
- ప్రవాస భారతీయులతో సరదాగా గడిపిన హర్మన్ బృందం

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో భారత క్రికెట్ జట్లన్నీ బిజీగా ఉన్నాయి. టెస్టు ఫార్మాట్‌లో పురుషుల జట్టు, యూత్ వన్డే సిరీస్‌లో అండర్–19 జట్టు, టి20లతో మహిళల జట్టు ఇంగ్లండ్‌ను 'ఢీ'కొంటున్నాయి. అయితే భారత మహిళల జట్టుకు ఆదివారం పోటీల నుంచి, ప్రాక్టీస్ నుంచి కాస్త తీరిక దొరకడంతో లండన్‌లోని భారత హై కమిషనర్ విందు ఏర్పాటు చేశారు. అక్కడి భారత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విందుకు ఈసారి ప్రవాస భారతీయుల్ని కూడా పెద్ద సంఖ్యలో ఆహ్వానించారు. దీంతో వీరంతా పెద్ద సంఖ్యలో భారత్ భవన్‌కు పోటెత్తారు. ప్రాంగణంలోనే సభాస్థలిని ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ సమ్మేళనం ప్రత్యేకంగా నిలిచింది. అక్కడి భారత హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామి క్రికెటర్లు భారత యువతకు స్ఫూర్తిప్రదాతలని కొనియాడారు. 'క్రికెటర్లు దేశంలో క్రీడావికాసం వెల్లివిరిసేలా చేశారు. మేం దేనికీ తీసిపోమని, ఎందులోనైనా పోటీపడేందుకు సిద్ధమనే విప్లవాత్మక మార్పును మన మహిళా క్రికెటర్లు తీసుకొచ్చారు. ఇప్పుడు మీరు, ఇంతకుముందు మీ మునుపటితరం క్రికెటర్లు ఏదైనా సాధించగలమనే స్ఫూర్తిని రగిల్చారు. మైదానంలో మీరు చూపించే తెగువ, మాయాజాలంతో మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నారు. హాకీ, అథ్లెటిక్స్, క్రికెట్ ఇలా ఏ క్రీడ అయినా జట్టుగా మీరు చూపించే స్థయిర్యం నిరుపమానం' అని దొరైస్వామి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జెమీమా రోడ్రిగ్స్ సహా పలువురు ఆటపాటలతో శ్రుతి కలిపారు. భారత సంతతి పౌరులతో ఉత్సాహంగా గడిపారు. ఇందులో సమానత్వం–వైవిధ్యం (ఈడీఐ) ఉన్నతాధికారి శివాని ఒబెరాయ్, యూకే ఇమ్మిగ్రేషన్ మంత్రి సీమా మల్హోత్రా తదితరులు పాల్గొన్నారు. ఐదు టి20ల సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 2–1తో ఆధిక్యంలో ఉంది. బుధవారం ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో నాలుగో మ్యాచ్ జరుగుతుంది.

నమో నమామి




అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో గాంధీ, రవీంద్రనాథ్ టాగూర్ విగ్రహాల వద్ద మోదీ నివాళులు

బుజ్జాయిల స్వాగతం




రియో డి జెనిరోలో మోదీకి స్వాగతం పలుకుతున్న భారత సంతతి చిన్నారులు

భారత్‌లో 81 కోట్ల మందికి ఉచిత ఆహారమే గతి!



ఆర్థిక ప్రగతి తాలూకు కీనీడలు ● అమలవని విధానాలు, చట్టాలు

భారత్.. ప్రపంచంలోని 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థని గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ సంపదలో ప్రజల మధ్య అంతరం మాత్రం నానాటికీ పెరుగుతోంది. ఇక పేదరిక నిర్మూలన అనేది సుదూర కల. ఎందుకంటే.. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభంగా చెప్పుకుంటున్న జీడీపీ వృద్ధిరేటు ఈ అసమానతలను తగ్గించడం లేదు. దీంతో ఆదాయ అసమానతలను రూపుమాపకుండా పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యం కాదని తేలిపోయింది. జీడీపీలో పెరుగుదల ఉన్నప్పటికీ నిరుద్యోగం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే ఉచిత ఆహార పథకం మీద 81 కోట్ల మంది ఆధారపడి ఉన్నారంటే.. దేశ ఆర్థిక పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే.. కార్మిక చట్టాల అమలుతోపాటు అనేక చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ధనిక దేశంలో పేద విధానాలు

దేశంలో విధానపరమైన లోపాలు పేద, ధనిక అంతరాన్ని మరింత పెంచుతున్నాయి. ఆర్థిక వృద్ధిలో అగ్రవాటా దేశంలోని కేవలం 5శాతం మందికి మాత్రమే ప్రయోజనం చేకూరుస్తోంది. ప్రపంచంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పుకొంటున్న భారత్‌లో.. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద.. 81.35 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు చెల్లించాల్సి వస్తుందంటే మన అభివృద్ధి నమూనా ఎలాంటిదో అర్థమవుతుంది.

అమలు కాని కనీస వేతన చట్టం..

కనీస వేతనాల గురించి మాట్లాడాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే ఇది బహిరంగ రహస్యం. ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) చట్టాల కింద యజమానులు సమర్పించిన రిటర్న్‌లు చూస్తే పరిస్థితి ఏంటో అర్థమవుతుంది. ఇంకా కొన్ని విభాగాల్లోని కార్మికులు ఈ రెండింటిలో నమోదే కాలేదు. 1970 కాంట్రాక్ట్ లేబర్ నియంత్రణ, రద్దు చట్టం వచ్చింది. కానీ.. ఐదు దశాబ్దాలైనా పరిశ్రమల్లో అమలు కాలేదు. అంతర్‌-రాష్ట్ర వలస కార్మికుల పరిస్థితి అత్యంత దుర్బలంగా ఉంది. సమాన పనికి సమాన వేతనం, ప్రయాణ చెల్లింపులు, వసతి, ఉచిత వైద్య సౌకర్యాలు వంటివి కాగితాలకే పరిమితమయ్యాయి.

చెల్లింపులో లింగ అంతరం..

వేతనాల్లో స్త్రీ, పురుషుల మధ్య అంతరం కొనసాగుతూనే ఉంది. జెండర్‌తో సంబంధం లేకుండా సమాన పనికి సమాన వేతనం అందించాలని 1976 సమాన వేతన చట్టం చెబుతున్నా... దేశంలోని అత్యున్నత న్యాయస్థానం తీర్పులున్నా.. వివక్ష కొనసాగుతూనే ఉంది. అన్ని రంగాలలో మహిళలు ఒకే పనికి పురుషుల కంటే తక్కువ సంపాదిస్తూనే ఉన్నారు. ఈ అంతరాలు పోవాలంటే.. విధానాలు, చట్టాల అమలులో కఠినంగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు.

అపరిమిత పని గంటలు..

దేశంలో జీడీపీ పెరుగుదల ఉన్నప్పటికీ నిరుద్యోగ యువత ఎక్కువగా ఉంది. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల వారిలో నిరుద్యోగిత రేటు పట్టణ ప్రాంతాల్లో 17.9%, గ్రామీణ ప్రాంతాల్లో 13.7% ఉందని గణాంకాల మంత్రిత్వ శాఖ ఈ సంవత్సరం మే నెలలో తెలిపింది. కార్మికులకు 8 పని గంటలకోసం ఎన్ని ఉద్యమాలు జరిగాయో తెలిసిందే. అయినా.. ఇప్పటికీ అసంఘటిత, అనధికారిక రంగాల్లోని కార్మికులు రోజుకు 10 నుంచి 12 గంటలు పని చేస్తారు. వీటికి అదనపు చెల్లింపులేమీ ఉండవు. చట్టం ప్రకారం రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల పని గంటలను రోజుకు 8 గంటలు, వారానికి 48 గంటలకు పరిమితం చేస్తే ఎక్కువ మందికి ఉపాధిని కల్పించవచ్చు.

పేదరికాన్ని తగ్గించాలంటే..

కనీస పెన్షన్‌ను పెంచాలంటున్నారు నిపుణులు. 2004లోనే స్టాండింగ్ కమిటీ ఆన్ లేబర్ దీనిని సిఫార్సు చేసింది. రెండు దశాబ్దాలు దాటినా.. పెన్షన్ రూ.1,000 దగ్గరే ఉంది. కొన్ని రాష్ట్రాలు సీనియర్ సిటిజన్లకు ఇస్తున్న సామాజిక పెన్షన్ రూ. 4,000 కంటే కూడా చాలా తక్కువ. ట్రేడ్ యూనియన్లు, పెన్షనర్లు డిమాండ్ చేసినట్లుగా రూ. 7,000కి పెంచడం వల్ల లక్షలాది మంది జీవిత చరమాంకంలో గౌరవంగా జీవించగలుగుతారు. ఉపాధి హామీ పథకం పని రోజులను 150కి పెంచాలని, వేతనాన్ని రూ.400కు పెంచాలంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన సిఫార్సులను అమలు చేయాలని సూచిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పనే చేయకుండా.. 12 ఏళ్లలో రూ.28 లక్షల జీతం

- మధ్యప్రదేశ్‌లో ఓ కానిస్టేబుల్ నిర్వాకం
- 12 ఏళ్ల తర్వాత వెలుగు చూసిన వైనం

భోపాల్: ఓ కానిస్టేబుల్ 12 ఏళ్లపాటు ఎన్నడూ డ్యూటీ చేయకుండానే ఏకంగా రూ.28 లక్షల మేర వేతనం అందుకున్నాడు. వ్యవస్థ వైఫల్యం, యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పట్టే ఈ విడ్డూరం మధ్యప్రదేశ్ రాష్ట్రం విదిశ జిల్లాలో తాజాగా వెలుగు చూసింది. 2011లో ఓ వ్యక్తి కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికయ్యాడు. భోపాల్ పోలీస్ లైన్స్‌లో పోస్టింగ్ సైతం ఇచ్చారు. కొన్ని రోజులకే ఆ బ్యాచ్‌లో మిగతా వారితో కలిపి అతడిని కూడా సాగర్ పోలీస్ ట్రెయినింగ్ సెంటర్‌కు ప్రాథమిక శిక్షణ కోసం పంపించారు అధికారులు. ట్రెయినింగ్ సెంటర్‌కు వెళ్లకుండా, నేరుగా విదిశలోని తన ఇంటికి వెళ్లిపోయాడు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సెలవు కోరడం వంటివేమీ లేకుండా ఇంట్లోనే ఉండిపోయాడు. స్పీడ్ పోస్ట్ ద్వారా సర్వీస్ రికార్డును పోస్టింగిచ్చిన భోపాల్ పోలీస్ లైన్స్ స్టేషన్‌కు పంపించాడు. వాటిని అందుకున్న అధికారులు అందులోని వివరాలను, అతడి హాజరీని, శిక్షణ స్టేటస్‌ను గురించిన వివరాలనుగానీ చూడనే లేదు. అది మొదలు అతడిని కొత్తగా రిక్రూటైన కానిస్టేబుల్‌గా పరిగణిస్తూ నెలనెలా ఠంచనుగా బ్యాంకు అకౌంట్‌లో వేతనం జమ చేస్తున్నారు. ట్రెయినింగ్ సెంటర్ అధికారులు గానీ, భోపాల్ పోలీస్ లైన్స్‌లో గానీ అతడిని ఎవరూ పట్టించుకోలేదు. ఇలా 12 ఏళ్లు గడిచాక 2023లో అసలు విషయం వెలుగు చూసింది. 2011వ బ్యాచ్ వారికి పే గ్రేడ్ ఎవాల్యుయేషన్ సమయంలో అతడిని గురించి వాకబు చేయగా తామెన్నడూ చూడలేదని, ఎక్కడ పనిచేస్తున్నాడో తెలియదని చెప్పడంతో అవాక్కవడం అధికారుల వంతయింది. ఈ వ్యవహారంపై ఏసీపీ అంకితా ఖటెర్కర్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. ఆ కానిస్టేబుల్‌కు నోటీసులు పంపారు. విచారణకు హాజరైన అతగాడు తనకు మానసిక సమస్యలున్నాయని చెప్పాడు. ఇందుకు ఆధారాలను సమర్పించాడు. ప్రస్తుతం భోపాల్ పోలీస్ లైన్స్‌లోనే పనిచేస్తున్న ఇతడు రూ.1.5 లక్షలను తిరిగిచ్చేశాడు. మిగతా మొత్తాన్ని శాలరీ నుంచి ఇచ్చేందుకు అంగీకరించాడని ఏసీపీ అంకిత వివరించారు.

రైల్వే స్టేషన్లో పురుడు!

మహిళకు ఆర్మీ వైద్యుని పునర్జన్మ

ఝాన్సీ: భారత ఆర్మీ.. సేవకు, త్యాగానికి మారు పేరు. ఆ పేరును మరోసారి నిలుపుకొన్నారీ ఆర్మీ వైద్యుడు. ఝాన్సీ స్టేషన్‌లో మహిళకు ప్రసవం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. పన్వేల్ నుంచి గోరఖ్‌పూర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్‌లో ఓ గర్భిణీ భర్త, బిడ్డతో ప్రయాణిస్తోంది. మార్గమధ్యంలో ఆమెకు ప్రసవ వేదన మొదలైంది. భర్త వెంటనే రైల్ మదద్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్మీలో వైద్యుడైన 31 ఏళ్ల మేజర్ రోహిత్ బచ్వాలా ఝాన్సీ రైల్వే స్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లే రైలు కోసం ఎదురుచూస్తున్నారు. పన్వేల్-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఝాన్సీకి చేరగానే ఆయనకు విషయం తెలిసింది. ఏమాత్రం ఆలోచించకుండా స్టేషన్‌లోని ఫుట్ ఓవర్ వంతెనను తాత్కాలిక ప్రసూతి వార్డుగా మార్చారు. చిన్న కత్తి, జుట్టుకు పెట్టుకునే క్లిప్పులు, ధోతీ ఉపయోగించి సురక్షితంగా ప్రసవం చేశారు. మహిళా రైల్వే సిబ్బంది సహకరించారు. ప్రసవం తర్వాత మహిళకు, పురిటి పాపాయికి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. అందుబాటులో ఉన్న అతి సాధారణ వనరులతోనే ప్రసవం చేసిన మేజర్‌ను సైనిధికారులు కొనియాడారు. సోషల్ మీడియాలోనూ ఆయనపై ప్రశంసల వర్షం కురుస్తోంది.



ఇక నన్నెవరూ చూడలేరు!

- చెరుకు తింటూ పట్టుబడి.. స్తంభం వెనుక దాక్కుని..
- థాయ్‌లాండ్‌లో ఏనుగు పిల్ల అమాయకత్వం

పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ తననెవరూ చూడటం లేదనుకుంటుందట. అలాంటి అమాయకత్వమే ఈ ఏనుగు పిల్లది. రాత్రిపూట ఓ చేలో చొరబడిన బుజ్జి ఏనుగు చెరుకు తింటూ ఉండిపోయింది. అంతలోనే ఎవరో వస్తున్నట్టు అలికిడి వినపడటంతో దాక్కోవాలనుకుంది. అదెదో పొదల్లోనో, చెట్టుమాటునో కాదు. దానికి సమీపంలో విద్యుత్ స్తంభం కనిపించింది. వెంటనే వెళ్లి దాని వెనుక దాక్కుంది. అంతేకాదు.. ఇక తానెవరికీ కనబడనని అనుకుంది. దాక్కునేందుకు జంబో కిడ్ చేసిన విఫల ప్రయత్నం వాహనంలో ఉన్న వారికి నవ్వు తెప్పించింది. వెంటనే క్లిక్ మనిపించి.. ఆ చిత్రాన్ని సోషల్ మీడియాలో పెట్టారు. జరిగిన విషయాన్నంతా జోడించారు. ఆ పిల్ల ఏనుగు అమాయక చర్య ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. ఫొటో చూసినవారు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతున్నారు. ఈ ఘటన థాయ్‌లాండ్‌లో జరిగింది.

థాయ్‌లాండ్‌లో కనిపించిన ఈ ఏనుగు భారతీయ సంతతికి చెందింది. ఆసియా ఏనుగుల ఉపజాతి. వాటికున్న చిన్న చెవులే.. ఆఫ్రికన్ ఏనుగుల నుంచి వీటిని వేరుగా చూపిస్తాయి. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో 4,422 అడవి ఏనుగులు ఉన్నాయని అంచనా. వాటిలో సగం ఐదు అటవీ ప్రాంతాలలో నివసిస్తున్నాయి. ఇటీవల కాలంలో వాటి జనాభా పెరగడం, అటవీ ప్రాంతాలు తరుగుతుండటంతో ప్రమాదకరంగా మారింది. గత సంవత్సరం, ఏనుగులకు సంబంధించిన 4,700 ప్రమాద సంఘటనలు నమోదయ్యాయి. వాటి కారణంగా 19 మంది మరణించారు. 22 మంది గాయపడ్డారు. వ్యవసాయ భూములు దెబ్బ తిన్నాయని 594, ఆస్తి నష్టం కలిగించాయని 67 కేసులు నమోదయ్యాయి. ఇక్కడ ఏనుగులను చంపడం కఠినమైన నేరం.



– సాక్షి, నేషనల్ డెస్క్

ఫైటర్ జెట్ మరమ్మతు కోసం యూకే నుంచి కేరళకు నిపుణుల బృందం

తిరువనంతపురం: కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయంలో దాదాపు నెల రోజులుగా నిలిచిపోయిన ఎఫ్-35బీ యుద్ధ విమానానికి మరమ్మతులు చేసేందుకు ఆదివారం యూకే నుంచి ఇంజనీర్ల బృందం వచ్చింది. ఎఫ్-35బీకి మరమ్మతులు చేపట్టేందుకు పరికరాలు, సామగ్రిని కూడా వీరు తీసుకువచ్చారని తెలిపింది. నిలిచిపోయిన యుద్ధ విమానాన్ని ముందుగా విమానాశ్రయంలోని మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్‌హాల్(ఎంఆర్‌వో) సెంటర్‌కు తరలించారు. సుమారు రూ.940 కోట్ల విలువైన ప్రపంచంలోనే అత్యంత అధునాతన యుద్ధ విమానం ఎఫ్-35బీ జూన్ 14వ తేదీన తిరువనంతపురం విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండయ్యింది. సాంకేతిక లోపంతో అప్పటి నుంచీ అక్కడే ఉండిపోయింది.

అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటా: చిరాగ్



పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు లోక్ జనశక్తి పార్టీ(ఎల్‌జేపీ) చీఫ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికులకే అవకాశమివ్వాలన్న విధానానికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. 'బిహార్ ఫస్ట్, బిహారీ ఫస్ట్'నినాదాన్ని కొనసాగిస్తానన్నారు. బిహార్ ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశానని తెలిపారు. ఆదివారం సారన్ జిల్లాలో జరిగిన పార్టీ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. అయితే, ఇలాంటి విధానం రాజ్యాంగానికే వ్యతిరేకమని సీఎం నితీశ్ అంటున్నారు.

యెమెన్ తీరంలో నౌకపై దాడి..మంటలు

దుబాయ్: ఎర్ర సముద్ర జలాల్లో ఆదివారం ఓ నౌకపై సాయుధులు దాడికి పాల్పడ్డారు. గుర్తు తెలియని ఆ నౌకను బాంబులు అమర్చిన పడవలు ఢీకొనడంతో మంటలు చెలరేగినట్లు సమాచారం. సాయుధులు ముందుగా తుపాకీలతో కాల్పులు జరిపి, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్లను ప్రయోగించారు. అనంతరం నాలుగు డ్రోన్ బోట్లు రాగా రెండింటిని నౌకలోని వారు పేల్చేశారని, మరో రెండు బోట్లు నౌకను ఢీకొనడటంతో మంటలు చెలరేగాయని తెలుస్తోంది. అయితే, ఈ ప్రాంతంలో డ్రోన్ బోట్ల ద్వారా వాణిజ్య నౌకలపై తరచూ దాడులకు పాల్పడుతున్న యెమెన్‌లోని హౌతీల పనే అయి ఉంటుందని అనుమానిస్తున్నారు.

దేశ నేర రాజధానిగా బిహార్

వ్యాపారవేత్త ఖెమ్కా హత్యపై రాహుల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: బిహార్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖెమ్కా పట్నాలోని ఆయన నివాసం వద్ద హత్యకు గురి కావడంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. బీజేపీ, సీఎం నితీశ్ కుమార్ కలిసి బిహార్‌ను దేశానికే నేర రాజధానిగా మార్చారన్న విషయం మరోసారి రుజువైందంటూ ధ్వజమెత్తారు. 'లూటీలు, తుపాకీ కాల్పులు, హత్యలతో బిహార్ అట్టుడుకుతోంది. నేరాలు కార్యకలాపాలు సాధారణమైపోయాయి. ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. సోదరసోదరీమణులారా, ఈ అన్యాయాన్ని ఇక ఏమాత్రం సహించొద్దు. మీ పిల్లలను కాపాడలేని ప్రభుత్వానికి మీ భవిష్యత్తును గురించిన బాధ్యతలను అప్పగించొద్దు'అని కోరారు. రాష్ట్రంలో చోటుచేసుకునే ప్రతి హత్య, ప్రతి లూటీ, ప్రతి బుల్లెట్ మార్పునకు నాంది కావాలన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని మార్చడానికే కాదు, రాష్ట్రాన్ని రక్షించేందుకు కూడా ఓటేయాలని కోరారు. శుక్రవారం పట్నాలోని గాంధీ మైదాన్ ప్రాంతంలోని నివాసం వద్ద గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో ఖెమ్కా ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా చోటుచేసుకున్న ఖెమ్కా హత్య ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.

ఇజ్రాయెల్ దాడుల్లో 38 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 38 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. గాజా నగరంలోని రెండు నివాస భవనాలపై జరిగిన దాడుల్లో 20 మంది చనిపోగా 25 మంది గాయపడ్డారని స్థానిక షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గాజా తీర ప్రాంతంలోని మువాసిలో శరణార్థులుండే టెంట్లపై జరిగిన దాడుల్లో రెండు కుటుంబాల్లోని 18 మంది ప్రాణాలు కోల్పోయారని నాస్సెర్ ఆస్పత్రి తెలిపింది. గడిచిన 24 గంటల వ్యవధిలో గాజాలోని హమాస్‌కు చెందిన 130 లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. దాడుల్లో ఆయుధ నిల్వ డిపోలు, కమాండ్ సెంటర్లు, ఆయుధ లాంచింగ్ వ్యవస్థలు ధ్వంసమయ్యాయని, పలువురు మిలిటెంట్లు చనిపోయారని తెలిపింది. ఇలా ఉండగా, శనివారం రాత్రి బెన్ గురియన్ విమానాశ్రయం లక్ష్యంగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించామని యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ప్రకటించగా వీటన్నిటినీ మధ్యలోనే కూల్చినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది.

పని సంస్కృతిలో సాంకేతికత, అవసరాలు భాగం కావాలి: అమిత్ షా

ఆనంద్: సహకార రంగం విజయవంతం కావాలంటే పారదర్శకత, సాంకేతికత వినియోగం, సభ్యుల అవసరాలను పని సంస్కృతిలో భాగంగా మార్చుకోవడం ఎంతో అవసరమని కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పారు. ప్రఖ్యాత అమూల్ డెయిరీ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటైన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సహకార సంస్థలు ఈ మూడు సూత్రాలను తమ పని సంస్కృతిలో విడదీయరాని భాగాలుగా చేసుకుని జమ్మూ కశ్మీర్ నుంచి అస్సాం వరకు, దేశంలోని ప్రతి గ్రామానికి వాటిని ప్రచారం చేయాలని సూచించారు. ప్రధాని మోదీ సారథ్యంలో దేశంలో 2 లక్షల ప్రాథమిక సహకారం పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు), మొట్టమొదటి జాతీయ సహకార యూనివర్సిటీ త్రిభువన్, డెయిరీ రంగంలో మూడు జాతీయ సహకార సంఘాలు ఏర్పాటు వంటి కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయన్నారు. సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటైన నాలుగేళ్లలోని 60కి పైగా కార్యక్రమాలను కొత్తగా ప్రారంభించామన్నారు. అమూల్ పాల సహకార వ్యవస్థ వార్షిక టర్నోవర్ ప్రస్తుతమున్న రూ.80వేల కోట్ల నుంచి వచ్చే ఏడాదికల్లా రూ.లక్ష కోట్లకు చేరుకోనుందని అమిత్ షా ప్రకటించారు. గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ సమాఖ్యకే అమూల్ అని పేరు. ఈ సంస్థ నిత్యం 36 లక్షల రైతుల నుంచి 3.20 కోట్ల లీటర్ల పాలను సేకరిస్తుంది.

అసాధారణ కేసుల్లోనే ముందస్తు బెయిల్

న్యూఢిల్లీ: ముందస్తు బెయిల్ ఇవ్వడం ప్రత్యేక అధికారమని, దీనిని అసాధారణ కేసుల్లోనే వినియోగించాలని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. ఢిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీ వాసి ఆశిష్ కుమార్ పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై జూలై ఒకటో తేదీన విచారణ సందర్భంగా జస్టిస్ రవీందర్ దుడేజా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆస్తి వివాదం నేపథ్యంలో ఆశిష్ కుమార్ తనకు సోదరుడి వరసైన వ్యక్తిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి..'చట్టానికి లోబడి ఉండే వారికే చట్టం సాయంగా ఉంటుంది'అని పేర్కొంటూ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. ఆశిష్ కుమార్ నుంచి దాడికి వాడిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోవాల్సి ఉంది, కస్టడీలో అధికారులు అయన్ను ప్రశ్నించాల్సిన అవసరముందన్నారు.

యుద్ధం అనంతరం తొలిసారి కనిపించిన ఖమేనీ

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా ఖమేనీ(86) శనివారం బహిరంగంగా కనిపించారు. ఇజ్రాయెల్‌తో యుద్ధం ముగిసిన తర్వాత మొట్టమొదటి సారిగా మొహర్రం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టెహ్రాన్‌లోని తన కార్యాలయం, నివాసం పక్కనున్న మసీదులోకి ప్రవేశించి కూర్చోగానే జనం లేచి నిలబడి అనుకూల నినాదాలు చేశారు. ప్రతిగా ఆయన చేయి, తల ఊపుతున్న దృశ్యాలను ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. ఈ కార్యక్రమంలో ఆయన ఎలాంటి ప్రకటనా చేయలేదని సమాచారం. జూన్ 13న మొదలైన పరస్పర దాడులు జూన్ 24వ తేదీన కాల్పుల విరమణతో ముగిశాయి. ఆ సమయంలో ఖమేనీ కనిపించకపోవడంతో మరింత భద్రత కోసం ఆయన బంకర్‌లోకి వెళ్లిపోయినట్లు వార్తలు వచ్చాయి.


అమెరికా అధ్యక్షుడి నిషిద్ధ ఫ్లై జోన్‌లో ఉల్లంఘన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు వారాంతపు సెలవు గడుపుతున్న ప్రాంతంలో నిషిద్ధ గగనతలంలోకి ఓ విమానం ప్రవేశించడం భద్రతాధికారులను కలవరానికి గురి చేసింది. శనివారం సాయంత్రం న్యూజెర్సీ రాష్ట్రంలోని బెడ్‌మినిస్టర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ట్రంప్ దంపతులు బెడ్‌మినిస్టర్ గోల్ఫ్ కోర్స్‌లో ఉండటంతో అక్కడి గగనతలాన్ని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్(నొరాడ్) టెంపరరీ ఫ్లైట్ రిస్ట్రిక్షన్(టీఎఫ్ఆర్) జోన్‌గా ప్రకటించింది. అయితే, ఓ విమానం ఆ జోన్‌లోకి ప్రవేశించడంతో అప్రమత్తమైన నొరాడ్ యంత్రాంగం యుద్ధ విమానం ద్వారా ఆ విమానాన్ని అక్కడి నుంచి పక్కకు మళ్లించారు. ఆ రోజు బెడ్‌మినిస్టర్ ప్రాంతంలో ఇలాంటి ఉల్లంఘటనలు మొత్తం ఐదు నమోదయ్యాయని నొరాడ్ తెలిపింది.



కేంద్ర మంత్రితో రైల్లో సెల్ఫీ

ఆదివారం మధ్యప్రదేశ్‌లో గంజ్‌బసోడా నుంచి భోపాల్‌కు ట్రైన్లో వెళ్తున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సెల్ఫీ తీసుకుంటున్న ఓ టీనేజర్



భక్తిశ్రద్ధలతో..

ఆదివారం ఢిల్లీలో భక్తిశ్రద్ధలతో మొహర్రం జరుపుకుంటున్న షియా ముస్లింలు

మండల పంచాయతీ వ్యవస్థను సిఫారసు చేసిన కమిటీ?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

స్థానిక ప్రభుత్వాలు

పంచాయతీరాజ్ సంస్కరణల అమలులో కేరళ మొదటి స్థానంలో ఉంది. కర్ణాటక, సిక్కిం రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. 73వ రాజ్యాంగ సవరణ చట్టంతో పంచాయతీరాజ్ వ్యవస్థను మూడు అంచెలుగా మార్చారు. ఈ చట్టం అమలు తీరును పరిశీలించడానికి బి.ఎస్. రమాదేవి అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. బిహార్ పంచాయతీరాజ్ వ్యవస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను అధ్యయనం చేయడానికి పలు కమిటీలు ఏర్పాటు చేశారు. అందులో ముఖ్యమైనవి..

పురుషోత్తం పాయి కమిటీ (1963), ఎం.టి రాజ్ కమిటీ (1968), జలగం వెంగళరావు కమిటీ (1968), నరసింహం కమిటీ (1971), బీపీఆర్ విఠల్ కమిటీ (1991), నాటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి డి.కె. సమరసింహారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ (1991). 'గ్రామ సర్పంచ్‌ను ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి, పంచాయతీ సమితీలకు పరోక్ష ఎన్నికలు జరగాలి, గ్రామ పంచాయతీలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి, రాష్ట్ర స్థాయిలో ఆర్థిక సంఘాన్ని' ఏర్పాటు చేయాలని సి. నరసింహం కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

పంచాయతీరాజ్‌లో కింది స్థాయి వ్యవస్థ గ్రామ పంచాయతీ. గ్రామ పంచాయతీ ఏర్పాటుకు కావాల్సిన కనీస జనాభా 500మంది. ఐటీడీఏ ప్రాంతాల్లో 250 మంది ఉంటే గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయొచ్చు.వార్షికాదాయం రూ. 60 వేలు ఉంటే నోటిఫైడ్ గ్రామ పంచాయతీ, అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న వాటిని నాన్-నోటిఫైడ్ గ్రామ పంచాయతీలుగా పేర్కొంటారు.243వ రాజ్యాంగ అధికరణం.. పంచాయతీరాజ్ వ్యవస్థను గ్రామం, గ్రామ పంచాయతీ, మాధ్యమిక స్థాయి, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ అని నిర్వచిస్తుంది.

గ్రామసభ

గ్రామసభలో గ్రామంలోని ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. ఈ సభ సంవత్సరానికి రెండుసార్లు సర్పంచ్ అధ్యక్షతన సమావేశమవుతుంది. గ్రామసభ స్విట్జర్లాండ్‌లోని 'ల్యాండ్స్ గమండ్'ను పోలి ఉంటుంది. ఏడాదికి రెండు సార్లు గ్రామ సభ నిర్వహించకుంటే సర్పంచ్ పదవి ఖాళీగా ఉందని ప్రకటించవచ్చు. గ్రామంలోని 50 శాతం మంది ఓటర్లు లేదా జనాభాలో పది శాతం ప్రజలు కోరితే గ్రామ సభ నిర్వహించాలి.

గ్రామసభ విధులు

- గ్రామపంచాయతీలో అభివృద్ధి పథకాలలబ్ధిదారుల గుర్తింపు.
- పంచాయతీ 'ఆడిట్' (తనిఖీ) నివేదికలను ఆమోదించడం.
- గ్రామీణాభివృద్ధికి నూతన ప్రణాళికల రూపకల్పన
- పన్ను బకాయిదారుల జాబితా ప్రకటించడం

కౌన్సిల్

గ్రామ పంచాయతీకి కౌన్సిల్ శాసనపరమైన విభాగం. కౌన్సిల్‌లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు సభ్యులుగా ఉంటారు. వార్డు సభ్యులు నెలకోసారి సమావేశం కావాలి. గరిష్ఠంగా 90 రోజుల్లో సమావేశం నిర్వహించాలి. సభ్యులు మూడు నెలల్లో ఒక్కసారైన హాజరు కాకుంటే సభ్యత్వం కోల్పోతారు. గ్రామ పంచాయతీలో కనిష్ఠ సభ్యుల సంఖ్య అయిదు. గరిష్ఠ సభ్యుల సంఖ్య 21. పంచాయతీ జనాభా ఆధారంగా వార్డు సభ్యుల సంఖ్యను నిర్ణయిస్తారు.

జనాభా	వార్డు సభ్యుల సంఖ్య
300	5
300-500	7
500-1500	9
1500- 3000	11
3000- 5000	13
5000 - 10,000	15
10,000-15000	17
15,000 పైనా	19 నుంచి 21

గ్రామ కార్యదర్శి

గ్రామ సచివాలయ వ్యవస్థను 2002 జనవరి 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించారు. గ్రామ పంచాయతీ పాలనా అధిపతిగా కార్యదర్శి వ్యవహరిస్తారు. గ్రామ పంచాయతీ సమావేశాల అజెండాను సర్పంచ్‌తో సంప్రదించి రూపొందిస్తాడు. గ్రామ పంచాయతీ వార్షిక బడ్జెట్‌ను రూపొందించి పంచాయతీ సభ్యుల పరిశీలనకు పంపుతాడు. గ్రామసభల సమావేశాల తీర్మానాల అమలుకు చర్యలు తీసుకుంటాడు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆస్తులపై అతడికి పూర్తి నియంత్రణ అధికారం ఉంటుంది.



గ్రామ పంచాయతీ విధులు

11వ షెడ్యూల్‌లో పొందుపర్చిన 29 అంశాలకు సంబంధించిన విధులను గ్రామ పంచాయతీ నిర్వహిస్తోంది. గ్రామ పంచాయతీ విధులు రెండు రకాలు.

అవి..

1.ఆవశ్యక విధులు, 2.వివేచానాత్మక విధులు.

ఆవశ్యక విధులు

- రహదారులు, భవనాలు, పబ్లిక్ టాయిలెట్లు, బావులు, చెరువుల నిర్మాణం, మరమ్మతులు.
- శ్మశాన వాటికల నిర్వహణ
- జనన మరణాల నమోదు
- అంటువ్యాధుల నివారణ, చికిత్స.
- కంపోస్ట్ ఎరువుల తయారీ
- పశుక్షేత్రాల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, మురుగు కాల్వల నిర్మాణం, నిర్వహణ, బందెల దొడ్ల నిర్మాణం, వివాహాల రిజిస్ట్రేషన్, రాష్ట్ర శాసనసభ సూచించిన ఇతర విధులు.

వివేచనాత్మక విధులు

- సమాజాభివృద్ధి పనుల కోసం స్వచ్ఛంద, శ్రమదాన శిబిరాల నిర్వహణ.
- విశ్రాంతి గృహాల నిర్మాణం, నిర్వహణ.
- ప్రాథమిక పాఠశాలలు, వైద్యశాలలు, గ్రంథాలయాలు, మందిరాలు, పార్కులు, మార్కెట్ స్థలాల నిర్మాణం, నిర్వహణ.
- ప్రసూతి, శిశు సంక్షేమ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ.
- భూ సంస్కరణల అమలు.
- ఆధునిక సేద్య పద్ధతులపై ప్రచారం.
- ధాన్యాగారాలు, గిడ్డంగుల నిర్మాణం.
- వికలాంగులు, అనాథలు, వ్యాధి గ్రస్తులకు చేయూతనివ్వడం
- వ్యాయామశాలల స్థాపన, ఆటస్థలాలు, సంతలు, జాతరలు, ఉత్సవాల నిర్వహణ, నిరుద్యోగ గణాంకాల నమోదు, విపత్తు సహాయక చర్యలు, రక్షణ ఏర్పాట్లు
- సహకార సంఘాలకు తోడ్పాటు.

గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులు

- కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసులపై కేంద్ర ప్రభుత్వం అందించే గ్రాంట్లు, రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసులపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు.
- పన్నుల ద్వారా వచ్చే ఆదాయం (ఇంటిపన్ను, ఆస్తుల బదిలీ పన్ను, ప్రకటనలపై పన్ను, వృత్తి పన్ను, జంతువులపై పన్ను, దుకాణాలపై పన్నులు మొదలైనవి)
- మూలధనంపై వచ్చే ఆదాయం (విశ్రాంతి భవనాలు, ఖాళీ స్థలాలు, మార్కెట్లపై వచ్చే అద్దె మొదలైనవి)

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు? (ఎస్ఐ - 2012)
ఎ) మార్చి-28 బి) అక్టోబర్ -24
సి) ఆగస్టు-24 డి) ఏప్రిల్ - 24
2. భారతదేశంలోని మొత్తం స్థానాల్లో మూడో వంతు స్థానాలను మహిళలకు ఏ ఎన్నికల్లో కేటాయించారు? (ఎక్సైజ్ కానిస్టేబుల్ - 2013)
ఎ) గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు
బి) విధానసభ సి) విధాన మండలి
డి) పైవన్నీ

సమాధానాలు: 1) డి 2) ఎ

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో నగర స్థానిక సంస్థలకు సంబంధించిన రాజ్యాంగ సవరణ?
ఎ) 64వ సవరణ బి) 72వ సవరణ
సి) 73వ సవరణ డి) 74వ సవరణ
2. పంచాయతీరాజ్ సంస్థలను పటిష్ఠం చేసినందుకు 2012 ఏప్రిల్ 24న ఏ రాష్ట్రం ఉత్తమ రాష్ట్ర అవార్డు పొందింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) సిక్కిం
సి) బిహార్ డి) గుజరాత్
3. గ్రామ సర్పంచ్‌ను ఎలా ఎన్నుకుంటారు?
ఎ) ప్రజలు ప్రత్యక్షంగా..
బి) వార్డు సభ్యులు కలిసి
సి) కలెక్టర్ నియమిస్తాడు
డి) ఏదీకాదు
4. జిల్లా పరిషత్‌లో ఉండే స్థాయీ సంఘాల సంఖ్య?
ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
5. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) రాజస్థాన్
సి) బిహార్ డి) ఆంధ్రప్రదేశ్
6. పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి వీటిలో దేన్ని 73వ రాజ్యాంగ సవరణ ప్రతిపాదించలేదు?
ఎ) పంచాయతీరాజ్ సంస్థల్లో 33.33 శాతం సీట్లు మహిళా అభ్యర్థులకు కేటాయించాలి
బి) పంచాయతీరాజ్ సంస్థల్లో వనరుల కోసం రాష్ట్రాలు ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తాయి
సి) పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే పదవులు కోల్పోతారు
డి) రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థను రద్దు చేస్తే తిరిగి ఆరు నెలల్లోపు ఎన్నికలు జరపాలి
7. గ్రామీణ సమాజానికి అత్యధిక అధికారాలు ఎవరి కాలంలో ఉండేవి?
ఎ) చోళులు బి) బ్రిటిష్
సి) పాండ్య డి) మొగలులు
8. భారతదేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించిన కమిటీ?
ఎ) అశోక్ మెహతా కమిటీ
బి) విఠల్ కమిటీ
సి) జి.వి.కె.రావు కమిటీ
డి) బల్వంతరాయ్ మెహతా కమిటీ
9. రాష్ట్ర ఆర్థిక (ఫైనాన్స్) సంఘాన్ని నియమించేది ఎవరు?
ఎ) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
బి) ప్రధానమంత్రి సి) రాష్ట్ర ప్రభుత్వం
డి) భారత ఆర్థిక (ఫైనాన్స్) సంఘం
10. భారత రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతీకి ఎన్ని కార్యాత్మక విధులుంటాయి?
ఎ) 27 బి) 28 సి) 29 డి) 30
11. గ్రామాధికారుల పదవులను ఎప్పుడు రద్దు చేశారు?
ఎ) 1983 డిసెంబర్ బి) 1984 మార్చి
సి) 1984 జనవరి డి) 1985 మార్చి
12. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పేర్కొన్నారు?
ఎ) మూడో భాగం బి) 21వ భాగం
సి) 9వ భాగం డి) 8వ భాగం
13. మండల పంచాయతీ వ్యవస్థను సిఫారసు చేసిన కమిటీ?
ఎ) అశోక్ మెహతా కమిటీ
బి) బల్వంతరాయ్ మెహతా కమిటీ
సి) నరసింహన్ కమిటీ
డి) వెంగళరావు కమిటీ
14. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేసిన మొదటి రాష్ట్రం?
ఎ) బిహార్ బి) హర్యానా
సి) ఢిల్లీ డి) ఆంధ్రప్రదేశ్
15. భారత రాజ్యాంగంలోని 243 అధికరణను ప్రభుత్వం సవరించడానికి ప్రయత్నిస్తుంది. ఈ అధికరణం ఏ అంశానికి సంబంధించింది?
ఎ) ప్రాథమిక విద్య
బి) గ్రామీణ ఉద్యోగ హామీ చట్టం
సి) పంచాయతీరాజ్ విధానం
డి) పార్లమెంట్‌లో మహిళలకు రిజర్వేషన్

సమాధానాలు

1) డి; 2) బి; 3) ఎ; 4) డి; 5) బి; 6) సి; 7) ఎ; 8) డి; 9) సి; 10) సి; 11) సి; 12) సి; 13) ఎ; 14) ఎ; 15) సి.

Pay special attention to structure words

Be sure your choice is both logical and grammatically correct. If you don't know some words, use elimination and educated guessing, which means you are able to eliminate one or more of the choices as definitely wrong. Don't eliminate a choice unless you are dictionary-sure of its definition. Two-blank sentence completions are harder than one-blank sentence completions only if you insist on trying to fill both blanks at the same time. Instead, tackle one blank at a time, beginning with the easier one.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇంగ్లిష్

Sentence Completion

Sentence completion is one of the most important tests designed to assess the vocabulary skills of candidates. In a sentence, one or two blanks are left out to be filled with one of the alternatives given below it. Read the entire sentence saying "blank" for the blank(s). This gives you an overall sense of the meaning of the sentence and helps you figure out how the parts of the sentence relate to each other. As you read each sentence, look for the word or phrase that captures the essence of the meaning of the sentence and thus holds the key to its solution. This is important. If an answer occurs to you before you even look at the choices, you may have a synonym for the answer or the answer itself. Pay special attention to structure words-but, although, however, yet, even though, therefore, while, etc., because they are key to forming the logical structure of the sentence.

There are several types of sentence completions:

- Restatement
- Comparison
- Contrast
- Cause and effect

Let us learn each of these types with an example to understand it further.

Restatement: Here is an example of a restatement question:



Example: The city council formed a committee to simplify several dozen ____ city ordinances that were unnecessarily complicated and out-of-date.

1) feckless 2) empirical
3) byzantine 4) pedantic

The answer is choice (3), byzantine, an adjective that means "highly complicated and intricate." Here, you are looking for a restatement of the clue words complicated and out-of-date, and for something that needs simplifying.

Comparison: likewise, similarly, and, just as, for example, as shown, as illustrated by

Example: Sheela was cleared of all charges; similarly, Sam was ____.

1) blamed 2) liable
3) prone 4) vindicated

The answer is (4) 'vindicated', as it compares to being "cleared of all charges," so perhaps Sam was vindicated.

Contrast: though, although, however, despite, but, yet; on the other hand, but, however, despite, or on the contrary.

Example: Although the tiger is a solitary beast, the king of the forest, the lion is a ____ animal.

1) lonely 2) retiring
3) gregarious 4) private

The answer is something that contrasts with 'solitary,' such as gregarious.

Cause and effect: These words indicate that one thing causes another to occur. Some of the most common cause and effect indicators are: Because, For, Thus, Hence, Therefore, If, Then.

Here is an example of a cause-and - effect sentence completion question:

Example: Because the House has the votes to override a presidential veto, the President has no choice but to ____.

1) object 2) abdicate
3) abstain 4) compromise

Since the House has the votes to pass the bill or motion, the President would be wise to compromise and make the best of the situation. The answer is (4) compromise.

PRACTICE TEST

Directions: Choose the correct answer choice from the four options given below each sentence to complete the meaning of the sentence.

1. Alexander Graham Bell ____ the telephone.
1) found 2) explored
3) invented 4) discovered
2. The mayor was miser but his son was a ____.
1) wreak 2) generous man
3) spend thrift 4) liberal man
3. While sending a telegram the words used should be ____.
1) lengthy 2) formal
3) ornamental 4) brief
4. The hard outer part of a loaf of bread is called ____.
1) salad 2) dessert
3) cuisine 4) crust
5. The cyclone did great ____ to the crops.
1) miracle 2) violence
3) destroy 4) damage
6. The television was ____ by John Baird.
1) discovered 2) invented
3) found 4) explored
7. The old woman lost her memory in an accident. She is ____.
1) blind 2) cripple
3) amnesiac 4) spastic
8. After a brief and violent ____ that ousted the president, General Monsanto declared himself the dictator of the country.
1) nuance 2) coup
3) solicitation 4) lament
9. Although the warring parties had settled a number of disputes, past experience made them ____ to express optimism that the talks would be a success.
1) rash 2) reticent
3) scornful 4) overjoyed
10. Crestfallen by having done poorly in the final exam, Sheetal began to question her abilities. Her self-confidence was ____.
1) destroyed 2) placated
3) elevated 4) sustained
11. She made an even ____ attempt to apologise.
1) clumsier 2) wide
3) cleaning 4) broader
12. Could you be more ____ about what you need?
1) accommodate 2) accurate
3) adapt 4) adoptable
13. The task ____ the students occupied for hours.
1) held 2) kept
3) stayed 4) aside
14. Are you lost? Would you like me to ____ you the way?
1) make 2) offer
3) do 4) show
15. People tell so many different stories, It's hard to get a true ____.
1) description 2) view
3) picture 4) imagination
16. The boss was very dismissive and treated his suggestion ____ contempt.
1) for 2) with 3) as 4) to
17. He has made a ____ deal of money.
1) very 2) huge
3) large 4) great
18. She's made herself ill with anxiety ____ her exams.
1) to 2) for 3) about 4) with
19. Do you mind if I ____ a question at this stage?
1) made 2) put 3) raise 4) set
20. Can you explain ____ you got there?
1) that 2) why 3) how 4) did
21. I think it shows ____ judgment to invest in training.
1) secure 2) right
3) sound 4) write
22. If I give you the camera, make sure you ____ it to good use.
1) put 2) do 3) get 4) enter
23. Their business plan makes sense - I think they're a ____ risk.
1) good 2) safe
3) well 4) better
24. The war had a damaging ____ on the economy.
1) effect 2) result
3) outcome 4) output
25. The Canary Islands get sunshine all year ____.
1) through 2) round
3) along 4) threw
26. You must do your best to ____ out of trouble.
1) keep 2) go 3) run 4) bring
27. My response varies ____ on the situation.
1) depending 2) relying
3) resting 4) taking
28. I was ____ amazed when he got the job!
1) deeply 2) absolutely
3) very 4) strength
29. We're trying to ____ money for the local hospital.
1) support 2) increase
3) raise 4) put
30. We all wish you ____ in your new career.
1) well 2) good 3) fine 4) very

Answers:

1) 3	2) 3	3) 4	4) 4
5) 4	6) 2	7) 3	8) 2
9) 2	10) 1	11) 1	12) 2
13) 2	14) 1	15) 3	16) 2
17) 4	18) 3	19) 3	20) 3
21) 3	22) 1	23) 1	24) 1
25) 2	26) 1	27) 1	28) 2
29) 3	30) 2		

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఒప్పంద ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కంప్యూటర్ అప్లికేషన్ /ఐటీ/కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.29,200.

» **వయసు:** 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **దరఖాస్తులకు చివరితేది:** 07.07.2025.

» **ఇంటర్వ్యూ తేది:** 2025 జూలై 2 నుంచి మూడో వారం

» **ఇంటర్వ్యూ వేదిక:** డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్, మెడిసిన్ కాలేజ్ బిల్డింగ్, ఎయిమ్స్ నాగ్‌పూర్.

» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in/

ఎస్ఎంఎఫ్‌సీఎల్, న్యూఢిల్లీలో వివిధ పోస్టులు

న్యూఢిల్లీలో సాగరమాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎస్ఎంఎఫ్‌సీఎల్) శాశ్వత ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.

» **పోస్టుల వివరాలు:** చీఫ్ మేనేజర్(ఐటీ)-01, చీఫ్ మేనేజర్(లీగల్)-01, మేనేజర్ (ప్రాజెక్ట్స్)-01, మేనేజర్(ఎఫ్-ఏ)-01, అసిస్టెంట్ మేనేజర్((ఎఫ్-ఏ)-02.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభా గంలో సీఏ, ఐసీడబ్ల్యూఏ, బీఈ/బీటెక్, ఎల్ఎల్‌బీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

» **గరిష్ఠ వయో పరిమితి:** 04.08.2025 నాటికి చీఫ్ మేనేజర్‌కు 47 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 35 ఏళ్లు ఉండాలి.

» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీనియర్ మేనేజర్(ప్రాజెక్ట్స్), సాగరమాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, ఫస్ట్ ఫ్లోర్, తాపర్ హౌస్, గేట్ నెం.2, 124, జనపథ్, న్యూఢిల్లీ-110001 చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 04.08.2025.

» **వెబ్‌సైట్:** https://sdclindia.com/

పర్యావరణ పరిరక్షణ చట్టాలు
ఉద్యమాలు-సదస్సులు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పర్యావరణం

- **వన్యప్రాణి సంరక్షణ చట్టం (1972):** ఈ చట్టం ప్రకారం ఏ రాష్ట్రమైనా వన్యప్రాణి సంస్థ అనుమతి లేకుండా పార్కులు, వన్యప్రాణి కేంద్రాలకు సంబంధించి హద్దులను మార్చకూడదు. దీనికి 2022లో సవరణలు చేశారు.
- **భూమి, సహజ వనరుల హక్కు సంరక్షణ చట్టం (1972):** స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో పర్యావరణంపై జరిగిన యూఎన్‌ఓ సదస్సులో భూమి, సహజ వనరులను రక్షించేందుకు ప్రతి దేశం చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.
- **కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (1974):** నీటి కాలుష్య నివారణ చట్టం ప్రకారం 1974లో కాలుష్య నియంత్రణ మండలిని ఏర్పాటు చేశారు. 1981లో చేసిన వాయు కాలుష్య నివారణ చట్టంలోని అధికారాలను కూడా ఈ సంస్థకే అప్పగించారు.
- **అడవుల సంరక్షణ చట్టం (1980):** ఈ చట్టం ప్రకారం ఏ రాష్ట్రమైనా కేంద్రం అనుమతి లేకుండా అటవీ భూములను ఇతర ప్రయోజనాలకు ఉపయోగించరాదు. అటవీ భూముల్లో ఏదైనా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని చేపడితే ముందుగా సంబంధిత శాఖల నుంచి అనుమతి పొందాలి.
- **అటవీ, పర్యావరణ శాఖ (1985):** కేంద్ర ప్రభుత్వం 1985లో పర్యావరణం,అటవీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది.పర్యావరణం,అడవులకు సంబంధించి కార్యక్రమాల అమలుకు అటవీ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.
- **ఎకోమార్క్ (1991):** దీన్ని భారత ప్రమాణాల సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) జారీ చేస్తుంది. 1991లో దీన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులకు ఎకోమార్క్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. పర్యావరణంపై ప్రభావం చూపే ఉత్పత్తులను అంగీకరించదు.
- **పర్యావరణ ట్రిబ్యునల్ చట్టం (1995):** పర్యావరణానికి నష్టం కలిగించే అంశాలపై, ప్రమాదకర పదార్థాల తయారీపై, వ్యక్తులు, ఆస్తులకు సంబంధించి సమస్యల పరిష్కారానికి ఈ చట్టం చేశారు.
- **జీవ వైవిధ్య చట్టం (2002):** 1992 జూన్ 5న యూఎన్‌ఓ ఆధ్వర్యంలో బ్రెజిల్‌లోని రియోడిజెనీరోలో జీవ వైవిధ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో 172 సభ్య దేశాలు పాల్గొన్నాయి. జీవ వైవిధ్య సంరక్షణకు అంతర్జాతీయ స్థాయిలో సంతకాలు జరిగాయి. ఇక్కడ జరిగిన ఒప్పందం ప్రకారం 2002లో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఈ చట్టాన్ని తెచ్చింది.

పర్యావరణ ఉద్యమాలు

- **బిష్ణోయి ఉద్యమం:** ఇది దేశంలో తొలి పర్యావరణ ఉద్యమంగా పేరుగాంచింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా ఖేజర్లీ గ్రామానికి చెందిన అమృతాదేవి నాయకత్వంలో ఈ ఉద్యమం జరిగింది. 1730లో ఖేజ్రి వృక్షాలను రక్షించేందుకు 363 మంది ఉద్యమం చేసి ప్రాణాలు కోల్పోయారు.
- **సైలెంట్ వ్యాలీ ఉద్యమం:** కేరళలోని పాలక్కడ్ జిల్లాలోని ఉష్ణమండల అటవీ ప్రాంతాన్ని సైలెంట్ వ్యాలీ అంటారు. పెరియార్ నదికి ఉప నది అయిన కుధిపుజ నదిపై జలవిద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల అడవులు, జంతువులు, జీవరాసులు అంతరించిపోతున్నాయని ఆందోళన చేస్తూ 1973లో ఉద్యమం ప్రారంభమైంది. తర్వాత 1985లో ఈ ప్రాంతాన్ని సైలెంట్ వ్యాలీ నేషనల్ పార్క్‌గా మార్చారు.
- **జంగిల్ బచావో ఆందోళన్:** బిహార్ ప్రభుత్వం అటవీ ప్రాంతంలో ఉన్న సాల్ చెట్లను నరికి, వాటి స్థానంలో టేకు వృక్షాలు పెంచాలని ప్రయత్నించడంతో 1980లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. సింగ్‌భం జిల్లా గిరిజన వాసులు సాల్ వృక్షాలను హత్తుకొని నిరసన వ్యక్తం చేశారు.
- **చిప్కో ఉద్యమం:** ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో అడవుల నరికివేతకు వ్యతిరేకంగా 1973లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. చిప్కో అంటే 'హత్తుకొను' అని అర్థం. చిప్కో ఉద్యమకారులు చెట్ల నరికివేతను వ్యతిరేకిస్తూ వాటిని హత్తుకొని ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. సుందర్‌లాల్ బహుగుణ, గౌరీ దేవి, చండీప్రసాద్ భట్ మొదలైనవారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.



- **నవధాన్య ఉద్యమం:** జీవ రాశులు అంతరిస్తున్నాయనే ఉద్దేశంతో జీవవైవిధ్య సంరక్షణకు, సేంద్రీయ వ్యవసాయానికి రక్షణ కల్పించేందుకు 1984లో వందనా శివ ఆధ్వర్యంలో ఈ ఉద్యమం జరిగింది.
- **అప్పికో ఉద్యమం:** చిప్కో ఉద్యమం తరహాలోనే అడవుల సంరక్షణ కోసం 1983 సెప్టెంబర్‌లో కర్ణాటకలో ఉత్తర కన్నడ జిల్లాలోని సల్కాని ప్రాంతంలో ఉద్యమం ప్రారంభమైంది. పాండురంగ హెగ్డే నాయకత్వంలో ఉద్యమం జరిగింది. కన్నడంలో అప్పికో అంటే 'కౌగిలించుకొను' అని అర్థం.
- **నర్మదా బచావో ఆందోళన్:** మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో నర్మదా నది ప్రవహిస్తోంది. పర్యావరణానికి హాని కలిగిస్తూ ఈ నదిపై చేపట్టే ప్రాజెక్ట్‌లకు వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాల్లో ఈ ఉద్యమం ప్రారంభమైంది. ముఖ్యంగా గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ డ్యాంకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగింది. ఈ ఉద్యమాన్ని 1989లో మేధా పాట్కర్ ప్రారంభించారు. బాబా ఆమ్టే, అరుంధతి రాయ్‌లాంటి వారు కూడా ఈ ఉద్యమాన్ని కొనసాగించారు.
- **గంగా పరిరక్షణ ఉద్యమం**
  గంగా నది దేశంలో అతిపెద్దది. స్వచ్ఛమైన గంగా నది కోసం, కాలుష్య నివారణ కోసం శ్రీమతి రమారౌట ఆధ్వర్యంలో 1988న కాన్పూర్‌లో ఒక సెమినార్ జరిగింది. అదే ఉద్యమంగా మొదలైంది. అనేక స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు, వైజ్ఞానిక సంస్థలు ఈ ఉద్యమానికి ప్రోత్సాహాన్ని అందించాయి.

మాదిరి ప్రశ్నలు

1. 2012లో జీవవైవిధ్య సదస్సు ఏ నగరంలో జరిగింది?
   1) వాషింగ్టన్ 2) హైదరాబాద్
   3) పారిస్ 4) న్యూయార్క్
2. క్యోటో ప్రోటోకాల్ జరిగిన సంవత్సరం?
   1) 2016 2) 2014
   3) 1988 4) 1997
3. దేశంలో తొలి పర్యావరణ ఉద్యమం?
   1) సైలెంట్ వ్యాలీ 2) చిప్కో ఉద్యమం
   3) నర్మదా బచావో 4) బిష్ణోయి ఉద్యమం
4. నర్మదా బచావో ఉద్యమాన్ని ఎవరు నిర్వహించారు?
   1) మేధా పాట్కర్ 2) బహుగుణ
   3) రామకృష్ణ హెగ్డే 4) అన్నా హజారే
5. నీటి కాలుష్య నివారణ చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
   1) 1981 2) 1986
   3) 1974 4) 1999
6. చిప్కో ఉద్యమం ఏ రాష్ట్రంలో జరిగింది?
   1) గుజరాత్ 2) బిహార్
   3) ఉత్తరాఖండ్ 4) రాజస్థాన్
7. ప్రపంచ మొదటి జీరో కార్బన్ పట్టణం?
   1) బీజింగ్ 2) మస్దర్
   3) ఢిల్లీ 4) దోహా
8. సైలెంట్ వ్యాలీ రక్షణ ఉద్యమం ఏ సంవత్సరంలో మొదలైంది?
   1) 1973 2) 1986
   3) 1989 4) 1983

సమాధానాలు

1) 2 2) 4 3) 4 4) 1
5) 3 6) 3 7) 2 8) 1

అంతర్జాతీయ సదస్సులు

- **క్యోటో ప్రోటోకాల్:** వివిధ కారణాల వల్ల భూగోళం వేడెక్కుతోంది. ముఖ్యంగా కార్బన్‌డై యాక్సైడ్ కారణంగా గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ జరిగి భూగోళం వేడెక్కుతోందనే ఉద్దేశంతో 1997, డిసెంబర్ 11న జపాన్‌లోని క్యోటో నగరంలో ప్రపంచ దేశాల మధ్య ఒప్పందం జరిగింది. ఇందుకు 192 దేశాలు అంగీకరించాయి. 2005, ఫిబ్రవరి 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావాన్ని 5 శాతానికి తగ్గించాలి. 2012లో కెనడా ఈ ఒప్పందం నుంచి తప్పుకుంది.
- **కార్టెజినా ప్రోటోకాల్:** జీవరాశుల భద్రత కోసం 1999లో కొలంబియాలోని కార్టెజినాలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్‌లో చర్చ జరిగింది. 2003 సెప్టెంబర్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. 2015 నాటికి 170 దేశాలు ఇందుకు అంగీకరించాయి. ఈ ఒప్పందాన్ని 'బయోసేఫ్టీ ప్రోటోకాల్' అంటారు
- **మొక్కల సంరక్షణ సదస్సు:** ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 1999లో అమెరికాలో మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నగరంలో జీవ వైవిధ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో అంతరించి పోతున్న మొక్కలను కాపాడాలని నిర్ణయించారు. 2020 నాటికి లక్ష్యాన్ని పూర్తిచేయాలని ప్రతినబూనారు.
- **రియోడిజెనీరో - ధరిత్రీ సదస్సు:** 1992, జూన్ 5న బ్రెజిల్‌లోని రియోడిజెనీరోలో జీవ వైవిధ్య సదస్సు జరిగింది. ఇందులో అంతర్జాతీయ స్థాయిలో సంతకాలు జరిగాయి. 1993, డిసెంబర్ 29న అమల్లోకి వచ్చింది. ఈ సదస్సులో జీవ వైవిధ్య సంరక్షణను మానవజాతి సమస్యగా గుర్తించారు.
- **నగోయా ప్రోటోకాల్:** జపాన్‌లోని నగోయాలో 2010 అక్టోబర్‌లో జీవ వైవిధ్య సదస్సు జరిగింది. ఇది 1992లో రియోడిజెనీరోలో జరిగిన సదస్సుకు అనుబంధంగా జరిగిన రెండో ఒప్పందం. 2014, అక్టోబర్ 12 నుంచి ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది.
- **మాంట్రియల్ ఒప్పందం:** సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారిన పడకుండా రక్షించే ఓజోన్ పొరకు జరుగుతున్న హానిని అరికట్టేందుకు 1987, సెప్టెంబర్ 16న కెనడాలోని మాంట్రియల్‌లో ప్రపంచ దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ఓజోన్ పొరకు నష్టాన్ని కల్గించే పదార్థాల ఉత్పత్తిని నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఇది 1989 జనవరిలో అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం అమలు ద్వారా అంటార్కిటికా ఖండం వద్ద ఓజోన్ పొరకు కలిగిన విఘాతాన్ని తగ్గిస్తున్నారు. 2050 నాటికి ఓజోన్ పొర యథాస్థితికి వస్తుందని భావిస్తున్నారు.
- **హైదరాబాద్ జీవవైవిధ్య సదస్సు:** ఐక్యరాజ్య సమితి జీవవైవిధ్య సదస్సు హైదరాబాద్‌లో 2012, అక్టోబర్ 1 నుంచి 9 వరకు జరిగింది. 194 సభ్యదేశాలకు చెందిన పర్యావరణ, అటవీశాఖ మంత్రులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సంస్థలు కూడా పాల్గొన్నాయి. ఈ సదస్సులో జీవవైవిధ్యం, జీవరాసుల సంరక్షణపై చర్చ జరిగింది.
- **పారిస్ ఒప్పందం:** వాతావరణ మార్పులపై పారిస్‌లో 2015, నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు పర్యావరణ సదస్సు జరిగింది. 196 సభ్య దేశాలు హాజరయ్యాయి.
- **ఎకో సిటీ/ జీరో కార్బన్ సిటీ:** ఎకో సిటీ అనే



భావనను 1975లో కాలిఫోర్నియాలో బెర్‌కలీ రిచర్డ్ ప్రతిపాదించారు. కాలుష్యం లేకుండా ఉండేందుకు ప్రతి నగరంలో వివిధ చర్యలు చేపట్టాలి. పునరుత్పాదక శక్తివనరుల వాడకం పెంచాలి. పేదరికం తగ్గి, ఆర్థిక వృద్ధి పెరిగితే కాలుష్య నివారణ జరుగుతుంది. భారతదేశంలో ఎకోసిటీ కాన్ఫరెన్స్ బెంగళూరులో జరిగింది. ప్రపంచంలో జీరో కార్బన్ పట్టణం – మస్దర్(అబుదాబి).

Spiral Model was developed by?

BANK EXAMS

COMPUTER AWARENESS

SDLC
(Software Development Life Cycle)

SDLC, Software Development Life Cycle is a process used by software industry to design, develop and test high quality softwares. It is also called as Software development process.

- ISO/IEC 12207 is an international standard for software life-cycle processes. It aims to be the standard that defines all the tasks required for developing and maintaining software.

A typical Software Development life cycle consists of the following stages:


Stage1: Planning and Requirement Analysis
Stage 2: Defining Requirements
Stage 3: Designing the product architecture
Stage 4: Building or Developing the Product
Stage 5: Testing the Product
Stage 6: Deployment in the Market and Maintenance

SDLC Models

- Waterfall Model
- Iterative Model
- Spiral Model
- V-Model
- Big Bang Model

The other related methodologies are Agile Model, RAD Model, Rapid Application Development and Prototyping Models.

SDLC Waterfall Model




The sequential phases in Waterfall model are:

- **Requirement Gathering and analysis:** All possible requirements of the system to be developed are captured in this phase and documented in a requirement specification doc.
- **System Design:** The requirement specifications from first phase are studied in this phase and system design is prepared. System Design helps in specifying hardware and system requirements and also helps in defining overall system architecture.
- **Implementation:** With inputs from system design, the system is first developed in small programs called units, which are integrated in the next phase. Each unit is developed and tested for its functionality which is referred to as Unit Testing.
- **Integration and Testing:** All the units developed in the implementation phase are integrated into a system after testing of each unit. Post integration the entire system is tested for any faults and failures.
- **Deployment of system:** Once the functional and non functional testing is done, the product is deployed in the customer environment or released into the market.
- **Maintenance:** There are some issues which come up in the client environment. To fix those issues patches are released. Also to enhance the product some better versions are released. Maintenance is done to deliver these changes in the customer environment.

All these phases are cascaded to each other in which progress is seen as flowing steadily downwards (like a waterfall) through the phases. The next phase is started only after the defined set of goals are achieved for previous phase and it is signed off, so the name "Waterfall Model". In this model phases do not overlap.


SDLC Iterative Model



This model is most often used in the following scenarios:

- Requirements of the complete system are clearly defined and understood.
- Major requirements must be defined; however, some functionalities or requested enhancements may evolve with time.
- A new technology is being used and is being learnt by the development team while working on the project.
- Resources with needed skill set are not available and are planned to be used on contract basis for specific iterations.
- There are some high risk features and goals which may change in the future.

SDLC Spiral Model



- **Identification:** This phase starts with gathering the business requirements in the baseline spiral. In the subsequent spirals as the product matures, identification of system requirements, subsystem requirements and unit requirements are all done in this phase.

At the end of the spiral the product is deployed in the identified market.

- **Design:** Design phase starts with the conceptual design in the baseline spiral and involves architectural design, logical design of modules, physical product design and final design in the subsequent spirals.
- **Construct or Build:** Construct phase refers to production of the actual software product at every spiral. In the baseline spiral when the product is just thought of and the design is being developed a POC (Proof of Concept) is developed in this phase to get customer feedback.
- **Evaluation and Risk Analysis:** Risk Analysis includes identifying, estimating, and monitoring technical feasibility and management risks, such as schedule slippage and cost overrun.

Summary

- Waterfall and V model are traditional SDLC models and are of sequential type. Sequential means that the next phase can start only after the completion of first phase. Such models are suitable for projects with very clear product requirements and where the requirements will not change dynamically during the course of project completion.
- Iterative and Spiral models are more accommodative in terms of change and are suitable for projects where the requirements are not so well defined, or the market requirements change quite frequently.
- Big Bang model is a random approach to Software development and is suitable for small or academic projects.
- Agile is the most popular model used in the industry. Agile introduces the concept of fast delivery to customers using prototype approach.

MODEL QUESTIONS

1. Spiral Model was developed by?
   1) Bev Littlewood
   2) Berry Bohem
   3) Roger Pressman
   4) Victor Bisili
   5) None of Above
2. Which model is popular for students small projects ?
   1) Waterfall Model
   2) Spiral Model
   3) Quick and Fix model
   4) Prototyping Model
   5) None of Above
3. Which is not a software life cycle model?
   1) Spiral Model
   2) Waterfall Model
   3) Iterative Model
   4) Capability maturity Model
   5) V-Shape Model
4. Project risk factor is considered in ?
   1) Spiral Model
   2) Waterfall Model
   3) Prototyping Model
   4) Iterative enhancement Model
   5) None of Above
5. SDLC stands for?
   1) Software design life cycle
   2) Software development life cycle
   3) System design life cycle
   4) System development life cycle
   5) None of Above
6. SPIRAL model has?
   1) 3 Phases 2) 1 Phase
   3) 2 Phases 4) 4 Phases
   5) None of Above
7. SRS stands for?
   1) Software requirement specification
   2) Software requirement solution
   3) System requirement specification
   4) System requirement ossification
   5) None of Above
8. Waterfall model is not suitable for?
   1) Small Projects
   2) Complex Projects
   3) Accommodating change
   4) Diminutive Projects
   5) None of Above
9. RAD stands for?
   1) Rapid Application Development
   2) Relative Application Development
   3) Ready Application Development
   4) Repeated Application Development
   5) None of Above
10. RAD Model was purposed by?
    1) IBM 2) Motorola
    3) Microsoft
    4) Lucent Technologies
    5) None of Above
11. Software engineering aims at developing?
    1) Reliable Software
    2) Cost Effective Software
    3) Reliable and cost effective Software
    4) All of above
    5) None of Above
12. A good specification should be?
    1) Unambiguous
    2) Distinctly Specific
    3) Functional 4) All of Above
    5) None of Above
13. Which of the following is a tool in design phase?
    1) Abstraction
    2) Refinement
    3) Information Hiding
    4) All of Above
    5) None of Above
14. Information hiding is to hide from user, details ?
    1) That are relevant to him
    2) That are not relevant to him
    3) That may be maliciously handled by him
    4) That are confidential
    5) None of Above
15. Which of the following is required to communicate between two computers?
    1) Communications software
    2) Protocol
    3) Communications hardware
    4) Access to transmission medium
    5) All of the above
16. Devices is used to connect two similar LAN with same protocols
    1) Bridges 2) Router
    3) Gateway 4) Switch
    5) None of these
17. DSL is an example of a (n) ______ connection.
    1) Network 2) Wireless
    3) Slow 4) Broadband
    5) None of these
18. FTP is______
    1) used to send email
    2) used to browse the Web
    3) is part of Netscape
    4) Is a protocol for the transfer of files between computers
    5) None of these
19. Telnet is-
    1) Used to send email
    2) Uses telephone lines
    3) Is part of Netscape
    4) Is a protocol that allows for remote login
    5) None of these
20. = sum(Bl:B8) is an example of a-
    1) Function 2) formula
    3) Cell address 4) value
    5) None of these

KEY

1) 2 2) 1 3) 4 4) 1 5) 2
6) 4 7) 1 8) 3 9) 1 10) 1
11) 3 12) 4 13) 4 14) 3 15) 5
16) 1 17) 4 18) 4 19) 4 20) 2